
గీతలు

వచన

ఉద్ధవ గీత-శ్రీ కృష్ణ సందేశం



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ లో eBOOK(PDF) అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంధాలయం ఉండాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - **సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)**

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

http://ebooks.tirumala.org



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!



ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఉద్ధవ గీత

శ్రీ కృష్ణ సందేశము

వేద వ్యాస విరచిత మహా భాగవతం
ఏకాదశ స్కంధం- ఆరవ అధ్యాయం
తెలుగు వ్యాఖ్య

"శాంతిశ్రీ"
జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి

UDDHAVA GEETA ©

by

Santisri

Jandhyala Venkateswara Sastry

ప్రథమ ముద్రణ : 23 - II - 1997

శ్రీ సాయి కృష్ణ భగవానుని పుట్టినరోజు

ప్రతులు : 1116

వెల : రు. 40

This book is Published with the financial assistance of Tirumula Tirupati Devasthanams under their scheme aid to publish Religious books

చిరునామా : " శాంతిశ్రీ "

జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి

EP II/2

ప్రశాంతి నిలయం - 515134

అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్

ముద్రణ: శ్రీ సత్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్

తాడేపల్లిగూడెం, ఫోన్ 23360

అంజలి

స్వామి ! ఆనంద నిలయ! ప్రశాంతి నిలయ!
తిరుపతి నివాస! పుటపర్తి పురి నివాస!
సప్తగిరి శాయి! వరదాయి! సత్యసాయి!
మానసాద్వైతమూర్తి! నమశ్శతమ్ము!

కమలమ్ము నీవైన భ్రమరమై జ్ఞాన మ
 కరందమ్ము గ్రోలెద రామసాయి !
నీరద మీవైన నెమిలినై నీ ముందు
 నాట్యమ్ము చేసెద నాగ సాయి !
వారిధి వీవైన వరనదీ కాంతనై
 చేరెద నీలోకి షిర్డిసాయి!
చంద్రుడ వీవైన చక్కని చుక్కనై
 సయ్యాట లాడెద సత్యసాయి!

నీవు గిరివైన సెలయేటి నెలతవోలె
నేమమున చుట్టి ప్రవహింతు ప్రేమసాయి!
నిన్ను విడనాడి ఈరాధ నిలువలేదు
పలుకో వలె నన్నింక కృష్ణ సాయి!

శ్రీ కృష్ణా! మురళీధరా! వికచరాజీవాక్ష! లోకేశ్వరా!
రాకా చంద్ర నిభాననా! జనమనః ప్రాణావనా! స్వామి! ఏ
కైకారాధ్య జగద్గురూ! హృదయవాసా! సాయిగోపాల దే
వా! కైవల్య పదంబుకై పదయుగం బర్చించి ప్రార్థించెదన్ !

నీ పావిత్ర్య కథా విశేషములె - నీ స్నేహ ప్రసంగంబులే -
నీ పారమ్య గుణ ప్రబోధములె నీ నిత్య ప్రభావంబులే -
రేపున్ మాపును వ్రాసి కూర్చగ ప్రభూ! " శ్రీ కృష్ణ సందేశమై"
నీ పాదంబులజేర వచ్చినది తండ్రీ! స్వీకరింపో ప్రభూ!

" ఉద్ధవగీత"గా నిది మహోజ్జ్వల కీర్తి గడించె - దానినే
బుద్ధికి తోచినట్లు పరిపూర్తిగ తెల్గున వ్యాఖ్య చేసితిన్;
ఇద్ధ చరిత్ర! సాయి పరమేశ్వర! నీ పద పంక జాలకున్
సిద్ధినిగోరి అంకితము చేసితి ఈపసి పూవునందుకో !

స్వామీ! సత్య పరాక్రమా! ప్రజలు నిఃస్వార్థమ్ముగా భక్తినీ
సామీప్యంబున సేవ చేసి తరియించన్ మార్గముల్ జూపుచున్
ప్రేమాశీస్సుల నిచ్చుచున్ సతతమున్ శ్రేయస్సు లందించుచున్
క్షేమంబుల్ సమకూర్చుమయ్య! భగవాన్ శ్రీ సత్యసాయీశ్వరా!

- శాంతిశ్రీ

ప్రవేశిక

ఉత్తర భారతదేశంలో యదువంశం వృష్ణి వంశం ప్రసిద్ధి చెందినవి. ఈ రెండు వంశాలవారు అత్యంత ఆత్మీయ సంబంధం కలిగి వర్ధిల్లసాగారు. యాదవులలో మహోత్తముడు వసుదేవుడు. ఆయన కుమారుడు శ్రీ కృష్ణుడు. శ్రీ కృష్ణుడు సర్వజ్ఞుడు. సర్వేశ్వరుడు. జగన్నాటక సూత్రధారి. భక్త మానస విహారి. మహా జ్ఞాన ఖని.

వృష్ణి వంశంలో ఉత్తమోత్తమ గుణవంతుడు దేవభాగుడు. ఆయన పుత్రుడు ఉద్ధవుడు. ఉద్ధవుడు ఉదాత్త చిత్తుడు. ఉత్తమభక్తుడు. జ్ఞాని. శ్రీ కృష్ణుడు ఉద్ధవుని కంటె వయసులో కొంచం పెద్దవాడు. కానీ ఇరువురు ప్రాణ స్నేహితులు. ఒకరిని విడిచి ఒకరు ఉండేవారు కాదు. ఉద్ధవుడు చిన్నప్పుడే శ్రీ కృష్ణపరబ్రహ్మ తత్త్వం గ్రహించాడు. ఒక్కొక్కసారి కృష్ణుడు దైహికంగా దూరంగా ఉన్నా ఉద్ధవుడు కృష్ణుణ్ణే స్మరిస్తూ ఆత్మలో అనుక్షణం కృష్ణదర్శనం చేసుకొంటూ తన్మయస్థితిలో ఉండిపోతూండేవాడు. తల్లి హెచ్చరిక చేస్తేనే గానీ అన్న పానీయాల ధ్యాస ఉండేదికాదు. బాల్యం నుంచీ ఉద్ధవుడికి కృష్ణుడంటే అంత అత్యంత ప్రీతి ఉండేది.

శ్రీ కృష్ణుడు కంససంహారం చేసిన తర్వాత చాలాకాలం మధురలోనే ఉండిపోయాడు. అపుడు ఉద్ధవుడు కృష్ణుడితోటే ఉండేవాడు. ఉద్ధవుడు అసలు సిద్ధ హృదయుడు. మిక్కిలి గంభీర స్వభావం గలవాడు. బుద్ధికి బృహస్పతి యంతటివాడు. కృష్ణుని దృష్టిలో కూడా ఉత్తమ ఆప్తమిత్రుడు. ఉద్ధవుడు వస్తుతః పరమ భక్తుడు కదా! అట్టి ఉద్ధవుని జూచి శ్రీకృష్ణుడు -

> " రమ్మా! ఉద్ధవ! గోపకామినులు నారాకన్ నిరీక్షించుచున్
> సమ్మోహంబున నమ్మియున్ మరచి యే చందంబునన్ గుందిరో!
> ' తమ్మున్ నమ్మిన వారి డిగ్గ విడువన్ ధర్మంబు గాదండ్రు' - వే
> పొమ్మా! ప్రాణము లెక్రియన్ నిలిపిరో! ప్రోద్య ద్వియోగాగ్నులన్ "

'ఉద్ధవా! నీవు ఒకసారి వ్రేపల్లె వెళ్ళి చూచిరా! అక్కడుండే వారు ఉత్త వెర్రిగొల్లలు. ఆ గొల్ల పడుచులు లోకం యెరుగని ఉత్త అమాయికలు. నేను రాలేదని తెగ దిగులు పడుతూంటారు. పాపం! నీవు కాస్త ధైర్యం చెప్పిరా! నమ్ముకొన్న వారిని చూడాలి కదా! వారి వద్దకు నేను కొద్ది రోజుల్లో తప్పక వస్తాననీ, మరువలేదనీ మరి మరీ చెప్పి వారికి ఊరట కలిగించిరా!"అని చేయిపట్టుకొని కొంత దూరం నడిచి వెళ్ళి అనేక సంగతులు చెప్పి పంపించాడు శ్రీ కృష్ణదేవుడు ఉద్ధవుణ్ణి.

ఉద్ధవుడు వ్రేపల్లె వెళ్ళాడు. కృష్ణ ఉద్ధవుల రంగు పోలికలు ఒకే రకంగా ఉంటాయి. గొల్లభామలు ఉద్ధవుణ్ణి దూరంగా చూచి కృష్ణుడే అనుకొన్నారు. తీరా దగ్గరకు వచ్చి చూస్తే కృష్ణుడు కాదు -

'రాజీవాక్షుడు - సుందరాస్యుడు - మహోరస్కుండు - పీతాంబరుం
డా జానుస్థిత బహు - డంబురుహ మాలాలం కృతుం - డుల్ల సత్
రా జత్కుండలు డొక్క వీరుడిచటన్ రాజిల్లుచున్నాడు మా
రాజీవాక్షుని భంగి' నంచు గనిరా రాజాన్వయున్ గోపికల్

వారు గొల్ల భామలైనా, ఉద్ధవుడికి అన్యాపదేశంగా భ్రమరంపై వంకపెట్టి తమ తమ మనోభావాలు వెల్లడించారు. విరహ బాధ ప్రకటించారు.

ఉద్ధవుడు తత్త్వజ్ఞుడు. సమయజ్ఞుడు ఉచితజ్ఞుడు కనుక వారిని ఒకచోట జేర్చి కృష్ణమహిమ ఇలా చెప్పాడు -

"కృష్ణభక్త శిరోమణులారా! కృష్ణుడు దేవుడు. దుర్మార్గులను శిక్షించటానికీ, సన్మార్గులను రక్షించటానికీ, వచ్చిన అవతారపురుషుడు.

ఆయన భక్తవత్సలుడు. మిమ్మల్ని మరువలేదు. మిమ్మల్ని గూర్చి నాకు అనేకసార్లు చెప్పాడు. త్వరలో మీ దగ్గరకు వస్తానన్నాడు. దిగులు పడకండి. స్వామికి మీరు గుర్తే. మీ మనసు వారికి తెలుసు.

"చెలువల్ దవ్వులనున్న వ్లభులపై చిత్తంబులం గూర్తు రు
త్కలికన్ - జేరువ వారి కంటె అధియున్ గా కెప్పడున్ నన్ను మీ
రలు చింతింపుచు నుండ్రు - కోరి యిటు దూరస్థత్వమున్ బొంది తం
చలకం బోలదు - నన్ను బొందెదరు నిత్య ధ్యాన పారీణలై "

అని కృష్ణ సందేశం వినిపించాడు. గోపికలు మిక్కిలి సంతోషించారు. వారు ఉద్ధవుణ్ణి ' మా కృష్ణ స్వామి ఏమేమి అన్నా'డని గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నించి సంగతులు రాబట్టుకొన్నారు.

' ఏ కాంతంబున నీదుపై ఒరిగి తానే మేమి భాషించునో
మా కాంతుండు........................

ఈ విధంగా సంగతులందించిన ఉద్ధవుణ్ణి ఉచితరీతిగా పూజించి పంపించారు గోపికలు. ఉద్ధవుడు గోపికలలోని నిశ్చల కృష్ణ భక్తి పరికించాడు. 'నన్ను కృష్ణుడు గోపికల భక్తి ఎంతటిదో చూచి తెలుసుకోమని పంపి ఉంటాడు' అని అనుకొన్నాడు. గోపికల గాఢ భక్తికి ముగ్ధుడై పోయాడు. తిరిగి కృష్ణమూర్తికి సర్వం నివేదించుకొన్నాడు.

ఈ తీరుగా ఉద్ధవుడు శ్రీ కృష్ణుడికి నర్మ సచివుడు. ప్రాణ స్నేహితుడు. ఉద్ధవుడు కృష్ణుడితో కలసి కుబ్జయింటికి వెళ్ళి పూజలందుకొన్నాడు. అక్రూరుని యింటికి వెళ్ళి కృష్ణుడు అక్రూరుని హస్తినాపురి పంపి పాండవుల క్షేమం కనుగొని రమ్మంటే ఆ సమయంలో కూడా ఉద్ధవుడు కృష్ణుడికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. ఈ విధంగా కృష్ణ ఉద్ధవుల మైత్రి అత్యంత గాఢమైనది. కృష్ణుడికి అర్జునుడెంత ఆత్మీయుడో ఉద్ధవుడు అంతే.

శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతను - ఉత్తర గీతను అర్జునుడికి బోధించాడు. ఉద్ధవుడు జ్ఞానం అర్థిస్తే తన చరమదశలో కృష్ణుడు జ్ఞానం బోధించాడు. అదే ఉద్ధవగీతగా ప్రసిద్ధి చెందింది.

శ్రీ కృష్ణ భగవానుడు ఉద్ధవుణ్ణి, నీవు నా తర్వాత మానవులకు జ్ఞానం బోధించటానికి చిరంజీవిగా ఉండుడని నరనారాయణ గుహలోని బదరికాశ్రమం పంపాడు.

ఇది భాగవతం ఏకాదశ స్కంధంలో విస్తారంగా ఉంది.

వ్యాసప్రణీతమైన ఈ సంస్కృత శ్లోకాలకు నా నేర్చిన భంగి సంగ్రహ వ్యాఖ్యానం తెలుగులో వ్రాశాను. తిరుమల తిరుపతి దేవస్థానల కార్య నిర్వహణాధికారి దయతో ఆర్థిక సహాయం అందించారు. సత్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్ కార్యవర్గం ముద్రణ చేశారు. ఇందుకు దేవస్థాన నిర్వహణాధికారికి వారి బృందానికి వందన చందనాలు.

ఈ కృతి ద్వారా నాకీ మహత్తర అవకాశం కల్పించి, మనోవాక్కాయ కర్మల నన్ను అనుక్షణం నడిపిస్తున్న నడయాడు దేవుడు శ్రీ సత్యసాయీశ్వరుడు. ఆ స్వామి వారి పాదపద్మాలకు శతకోటి ప్రణామాంజలులు !!!

దేవ! కృతికర్త కృతి భర్త వీవె! నేను
తగుదునే కేవలము నిమిత్తమ్ము కాక!

స్వామి నామానసోద్యానంలో పుష్పింప జేసిన ఈ పారిజాతమును స్వామివారి పాదపద్మాలపై భక్తితో సమర్పిస్తున్నాను.

'శుభం భవతు'

- శాంతిశ్రీ

శ్రీ కృష్ణ స్తోత్రము

నమః కృష్ణాయ శుద్ధాయ బ్రహ్మణే పరమాత్మనే।
యోగీశ్వరాయ యోగాయ త్వా మహం శరణం గతా॥

ఏ విభు వంద నార్చనములేవిభు చింతన నామ కీర్తనం
భే విభు లీల లద్భుతము లెవ్వని సంశ్రవణంబు సేయ దో
షా వళి బాసి లోకము శుభాయత వృత్తి చెలంగు నండ్రు నే
నా విభునాశ్రయించెద అఘౌఘు నివర్తను భద్ర కీర్తనున్"

ఏ పరమేశు పాదయుగ మెప్పడు కోరి భజించి నేర్పరుల్
లోపలి బుద్ధిలో నుభయ లోకము లందలి సక్తి బాసియే
తాపము లేక బ్రహ్మగతి దారుగత శ్రములై చరింతురే
నా పరమేశు మ్రొక్కెద అఘౌఘ నివర్తను భద్రకీర్తనున్॥

తపములు చేసియైన మరి దానము లెన్నియు చేసియైన ఏ
జపములు చేసియైన ఫలసంచయ మెవ్వని జేర్చకున్న హే
య పదములై దురంత విపదంచితరీతిగ నొప్పచుండు న
య్యు పరిమితున్ భజించెద అఘౌఘుని వర్తను భద్ర కీర్తనున్

\- భాగవతము

శ్రీశ్రీశ్రీ

సత్యసాయి మహాదేవుని

చరణ కమలాల పై ఈ పారిజాతము

ప్రేమతో భక్తితో సమర్పితము

- శాంతిశ్రీ

[illegible]

[illegible]

[illegible]

బాబా

కిరణాలు

ఉద్ధవ గీత

శ్రీ కృష్ణ సందేశము

బ్రహ్మాదులు శ్రీకృష్ణదేవుని ఆహ్వానించుట

శ్రీ శుక ఉవాచ -

అథ బ్రహ్మాత్మజైర్దేవైః ప్రజేశైరావృతో2 భ్యగాత్ ।
భవశ్చ భూత భవ్యేశో యయౌ భూతగణై ర్వృతః ॥

ఇంద్రో మరుద్భి ర్భగవా నాదిత్యా వసవో2 శ్వినౌ ।
ఋభవో2 ంగిరసో రుద్రో విశ్వేసాధ్యాశ్చ దేవతా ॥

గంధర్వాప్సరసో నాగాః సిద్ధ చారణ గుహ్యకాః ।
ఋషయః పితరశ్చైవ సవిద్యాధర కిన్నరాః ॥

ద్వారకా ముపసంజగ్ముః సర్వే కృష్ణ దిదృక్షవ ః ।
వపుషా యేన భగవా న్నర లోక మనో రమః ॥
యశోవితేన లోకేషు సర్వలోక మలాపహమ్ ॥

శ్రీ శుక మహర్షి పరీక్షిన్ మహారాజుకు మహా భాగవతం వినిపిస్తున్నారు -

ఓ రాజా! శ్రీకృష్ణ భగవానుడి లీలా విలాసాలు, అత్యంత అద్భుతాలు. అవిలోక కల్యాణ కారకాలు. ధర్మోద్ధరణాలు. లోక కంటక నిర్మూలనాలు. అవి మూడులోకాల లోనూ మారుమ్రోగ సాగాయి. ఆ యశశ్చంద్రికలు సర్వత్ర వ్యాపించాయి. నారదమహర్షి వసుదేవుడికి దివ్యమంత్రోపదేశం చేసి వెళ్ళిపోయాడు.

ఒకనాడు సనకాది ప్రజాపతులతో సురాసుర భూత గణాలతో బ్రహ్మదేవుణ్ణి అగ్ర భాగాన నిల్చుకొని మహాదేవ దేవేంద్రాదులు కృష్ణ దర్శనం కొరకు ద్వారకకు ప్రయాణమైనారు. వారితో మరుద్గణాలు, ద్వాదశాదిత్యులు, అష్టవసు ప్రముఖులు, అశ్వినీ దేవతలు, ఋభవులు, అంగిరసలు, ఏకాదశ రుద్రులు, మహా ఋషీశ్వరులు, విశ్వేదేవతలు, సిద్ధులు, సాధ్యులు, దేవతలు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, చారణులు, గుహ్యకులు, మునులు, పితృ దేవతలు విద్యాధరులు, కిన్నరులు, కింపురుషులు, మొదలైన వారందరూ వచ్చారు. ద్వారకలోని మహా మణిమయ మంజుల మందిరంలో ప్రవేశించారు.

మందిరం మధ్యలో మధుర మంగళ మానవమూర్తి దర్శనం ఇచ్చాడు. అది మానవరూపంలోని మనోహర విగ్రహం. సర్వ పాపహర సుందర స్వరూపం. మహా యశస్వి. మధుర మనస్వి అయిన శ్రీకృష్ణ భగవానుణ్ణి తిలకించి పులకించి పోయారు. దేవజాతి కన్నులు సార్థకమైనాయి. ఆరోజులలో ద్వారకా నగరం నానా విధ సంపదలతో వివిధ ఐశ్వర్యాలతో తులతూగుతుండేది. ఆ మహా పట్టణరాజం దివ్య వైభవాలతో దేదీప్యమానంగా ఉంది.

ఆ దేవతా ప్రముఖులు శ్రీకృష్ణ మూర్తి యొక్క అద్భుత దర్శనం చేసుకొని ఆశ్చర్య ఆనందాలతో తలమున్కలైనారు. వారికి కోరుకొన్న కల్పవృక్షం ప్రత్యక్షమయినట్లయింది. ఆ నిమిషంలో వారు నిజంగా అనిమేషులైనారు. కనురెప్ప వాల్చక కమలాక్షుణ్ణి దర్శింప సాగారు. ఆ ప్రముఖుల స్వర్గలోక మహోద్యాన పుష్పాలు నందన వన పారిజాతాలు తీసుకొని చైత్ర రథంలోని చిత్ర విచిత్ర పవిత్ర కుంద మందార పుష్పమాలికలతో శ్రీకృష్ణ దేవుణ్ణి అర్చించారు. వివిధ గద్య పద్య గీతా శ్లోక కదంబాలతో దేవ దేవుణ్ణి స్తోత్రం చేశారు. జగదీశ్వరునికి జయజయ నినాదాలు మధుర మంగళ మంగళా శాసనాలు పలికి బహువిధాల ఈ విధంగా ప్రస్తుతించసాగారు.

దేవతలు ఈ విధంగా స్తోత్రం చేయసాగారు-

" ఓ కృష్ణా! అనాథనాథా! శ్రీనాథా! నీ పాదారవిందాలకు శతకోటి ప్రణామాలు. స్వామీ ! మా యొక్క బుద్ధీంద్రియ ప్రాణ మనో వాక్కాయ త్రికరణ శుద్ధిగా ప్రణమిల్లు

తున్నాము. నీకు ఒక్కసారి ప్రణామం చేస్తే మేము భావయుక్తంగా మా హృదయంలో చింతించే ఆకాంక్షలన్నీ నెరవేరుతాయి. కర్మ బంధాలు వీడిపోతాయి. కోరుకొన్న వారికి మోక్ష సామ్రాజ్యం సిద్ధిస్తుంది. మోహం క్షయమైపోతుంది. స్వామి! నీకు సాష్టాంగ నమస్కారాలు.

అజిత! అప్రమేయా! అచ్యుతా! స్వామి! నీవు దుర్విభావ్యమైన త్రిగుణాత్మకమైన మాకు అధినాథుడవు. నీవు ఆత్మ స్వరూపుడవు. నీ లీలలు కొన్ని మాత్రమే మాకు అవగతం. సృష్టి స్థితి లయలు నీ కార్యక్రమాలు. నీవు గుణాతీతుడవు. గుణాత్మకుడవై సర్వకార్యాలు నిర్వహిస్తుంటావు. మాయా మయ త్రిగుణాలతో నిండి ఉన్నట్లు కనిపిస్తూ ఉంటావు. అచింత్య నామ రూపాత్మక ప్రపంచ మూర్తివి. త్రిగుణమయ మాయా మూర్తివి. మాయాతీతుడవు. నీ మాయా జాలంతో ఈ ప్రపంచాన్ని సృష్టిస్తున్నావు. పాలిస్తున్నావు. పరిహారం చేస్తున్నావు.

ఇన్ని చేసినా ఏవీ అంటని నిష్కళంక తేజోమూర్తివి నీవు. నీకు రాగ ద్వేషాలు లేవు. నిరావరణ నిశ్చల నిర్మల నిత్య శుద్ధ మూర్తివి నీవు. పరమానంద మగ్న మానస మహాదేవ విగ్రహుడవు. నీకు శత సహస్ర వందనాలు. నీవు స్థూల సూక్ష్మ కారణ స్వరూపుడవు. నీ స్వభావం మాకు అందదు. అది అనవద్యం. అవ్యవహితం. అభిరతం. నీకు అనేక అభివాదాలు.

దేవా! విద్యా వేదాధ్యయన దాన తపః క్రియల కంటె నరులకు నీ పాద పద్మ చింతనామృత పానం ద్వారా అసాధ్యమైన నిర్మలమైన నిశ్చల చిత్త శుద్ధి సత్వరం కలుగుతుంది. శ్రద్ధగా నీ నామ శ్రవణం చేసినంత మాత్రాన నీ కృపా బలం సంప్రాప్త మవుతుంది. నీవు దయామయుడవు. ఆనందమూర్తివి. నీయశోగానం వలన మానవులు మంచి మాణిక్యాలవుతారు.

కృష్ణా! నీ పాదారవిందాలు అశుభాలకు ధూమకేతువులు. శుభ కామనలకు వర ప్రసాదాలు. కనుకనే మునిగణాలు మోక్షాసక్తులై కూడా ఆర్ద్ర హృదయులై నీ పాదాలను పదే పదే ప్రార్థిస్తుంటారు. భక్తులు నీ విభూతి కోరి వాసుదేవ - సంకర్షణ - ప్రద్యుమ్న - అనిరుద్ధ చతుర్వ్యూహాలు భజిస్తారు. ఆత్మవేత్తలు జ్ఞానాభి వృద్ధికి నిన్ను ఆరాధిస్తారు. మహర్షులు యజ్ఞ యాగాలతో నిన్ను నిత్యం అర్చిస్తుంటారు.

స్వామి ! యోగిజనులు అయిన ప్రణత పాణులు నిగమ నిరుక్త మంత్ర యుక్తంగా అధ్వరాగ్నిలో పురోడాశం వేల్చి నిన్ను కొలుస్తారు. ముముక్షువులు అధ్యాత్మ యోగ విద్య ద్వారా నిన్ను ఆరాధిస్తారు. జిజ్ఞాసువులు నిన్ను సదా జపిస్తారు. పరమ

భాగవతులు హృదయ పద్మంలో నీ లీలా విలాసాలు నిత్యం భావన చేస్తుంటారు. ఆరాధనలో అపరిమితానందం అనుభవిస్తుంటారు. వివిధ పాపాలను విషయ వాసనలను ఆత్మ యజ్ఞంలో ఆహుతి చేసుకొంటారు. ఓ జగదేక విభో! మహా ప్రభో! నీ వెంత భక్త వత్సలుడవయ్యా! మునులు, భక్త జనులు, సాత్వతులు మొదలగు షడ్విధ వర్గంలోని పరమ భాగవతులంటే నీకు ఎంతో ప్రీతి.

లేకుంటే సాక్షాత్తు పట్టపుదేవి, మూడు లోకాలను పోషించే మహా లక్ష్మీదేవి ధర్మపత్ని భగవతి అయిన ఇందిరా సుందరీ మణికి ఆవాసమైన నీ వక్ష స్థలంపై భక్తులిచ్చే వాడి పోయే వనమాలలు ధరిస్తావా ! నీ పాదార విందాలు అమంగళ దుష్కార్య కలాపాలకు ధూమకేతువులే సుమా! స్వామీ! నీ చరణ కమలాలు భక్త జన పారిజాతాలు. పరమ పునీతాలు. అనేక ప్రణామాలు.

కేతు స్త్రి విక్రమ యుత స్త్రి పతత్ పతాకో
యస్తే భయా భయ కరో2 సుర దేవచం వోః ।

స్వర్గాయ సాధుషు ఖలే ష్వితరాయ భూమన్
పాదః పునాతు భగవన్ భజతా మఘం నః ॥

ప్రభూ! భగవాన్! నీవు వామన స్వామి వైవచ్చావు. బలిని మూడడుగులు యాచించావు. త్రివిక్రముడవై త్రిలోకాలు కొలిచావు. బలిని పాతాళానికి పంపించావు. సురలను రక్షించావు. అసురులను శిక్షించావు. సత్యం లోకంపై విజయ పతాకం ఎగుర వేశావు.

సాధు పురుషులను స్వర్గానికి- అసాధువులను నరకానికి పొందని సూచన చేస్తున్నట్లు నీ పాదాల నుండి గంగా తరంగాలను మూడు విధాలుగా మూడు లోకాలలో జయ పతాకాలుగా ప్రసారం చేశావు. నీపాదాలు అసురులకు భయంకరాలు. సురగణాలకు శుభంకరాలు. నీ చరణాలు మాకు కల్మష హరణాలు. నిత్య మంగళ శరణాలు. గంగ స్వర్గంలో మందాకినిగా భూమిపై భాగీరథిగా పాతళంలో భోగవతిగా వెలిసింది.

పురుషోత్తమా! కాల స్వరూపా! కాలాతీతా! బ్రహ్మాదులైన వివిధ దేవగణాలెల్లరు నానా శరీర ధారులే. వారందరూ సత్త్వ రజ స్తమో గుణాలతో పరస్పరం కొట్టు మిట్టాడుతుంటారు. పుడుతూ చస్తూంటారు. వారు సుఖ దుఃఖాలకు అతీతంగా లేరు. వారు బండికి కట్టిన ఎద్దుల వలె కాలానికి బద్ధులై ప్రవర్తిస్తుంటారు. స్వామీ! ప్రపంచం నీ

అధీనం. నీవు కాల స్వరూపుడవు. సర్వజీవుల ఆది మధ్య అంత్యాలు నీ స్వాధీనాలు. అంతే కాదు నీవు ప్రకృతి - పురుషులకు పరుడవు. పురుషోత్తమ ప్రభుడవు. నీ చరణ కమలాలు మాకు కల్యాణ కారకాలు.

ప్రభూ! నీవు ఈ విశ్వోత్పత్తి స్థితి ప్రళయాలకు కారణ స్వరూపుడవు. నీవు ఈ ప్రకృతికి - పురుషుడికి మహత్తత్వానికి నియంత్రణం కలుగజేసే కాలమూర్తివి. శీత గ్రీష్మ వర్షాకాల సంవత్సర మూర్తివి. ప్రతి పదార్థాన్ని ప్రళయంలోనికి తీసుకొని పోయే కాలాధిపతివి నీవు. నీ విధానం నిర్బాధం. నీగతి గంభీరం. నీ గమనం అనూహ్యం. నీవు స్వయంగా ఏకైక పురుషోత్తమ మూర్తివి. సర్వేశ్వరా! సర్వాధిపతీ! నీకు సాష్టాంగ ప్రణామ శత సహస్రాలు.

స్వామీ! తమ నుండి శక్తి పొంది ఈ పురుషుడు అమోఘ వీర్య వంతుడవుతున్నాడు. మాయను కలిసి ఆతడు విశ్వం యొక్క మహత్తత్త్వ గర్భ స్థాపనం చేస్తున్నాడు. ఆ మహత్తత్త్వం త్రిగుణాత్మకమై మాయను అనుసరించి భూమి జలం అగ్ని వాయువు ఆకాశం అహంకారం మనస్సు అనే సప్త ఆవరణాలతో కూడిన సువర్ణ వర్ణ బ్రహ్మాండం సృష్టించింది.

హృషీకేశా! త్రిలోకేశా! నీవు సమస్త జగదధిపతివి. మాయకు నాథుడవు. మాయ వలన విభిన్న పదార్థాలు వివిధ విషమ స్థానాలు పొంది వికృతంగా విజృంభిస్తుంటాయి. అయినా దాని ప్రభావం నీపై ఇసుమంత కూడా పనిచేయదు. నీవు అలిప్తుడవు. సాక్షీ భూతుడవు. నీవు మాయాతీతుడవు. మాయ నీ దాసి. నీవు కాక మరేదైనా మాయ అంటే మరీ గడ గడ లాడుతుంది. మాయా మేయం కదా జగత్తు సర్వం.

కామ జనకా! స్వామి! నీ చుట్టూ పదహారు వేల మంది నవ మన్మథ సుందరీ మణులు నృత్యం చేస్తున్నారు. వారు మధుర మంజుల మందహాసాలతో వాలు చూపులతో భ్రూ విన్యాసాలతో మదన బాణాలు విసరి విసరి వేసారి పోతున్నారు. కామకేళికి కలాపాలు ప్రదర్శించి అలసి సొలసి పోతున్నారు. నిన్ను తన వైపు ఆకర్షించు కోవటం కోసం యాతనలు పడుతున్నారు. అయిననూ నీవు ఒక్క క్షణం కూడా చలించటం లేదు. స్వామి! నిన్ను వశం చేసుకోలేక వారు అసఫలత్వం పొందుతున్నారు. నీ మనో నిగ్రహం అనుపమానం అద్వితీయం. నీకు అనేక అభివందనాలు.

స్వామి! నీవు మూడు లోకాల వారి పాపాలు పోద్రోలుటకై రెండు జల ప్రవాహాలు పారిస్తున్నావు. ఒకటి నీ లీలా కథా కమనీయ కల్లోలిని. మరొకటి నీ పాద ప్రక్షాళనా పవిత్ర గంగా తరంగిణి. సత్సంగ పూర్ణ భక్త మానసులు భవదీయ కథా కర్ణనా సుధా ప్రవాహంలో స్నానం చేసి మానసికంగానూ, విష్ణు పాదోద్భవి గంగా ప్రవాహంలో మునకలాడి శారీరకంగానూ

పునీతులవుతున్నారు. రెండు విధాల రెండు తీర్థాలలో మునిగి పాప తాపాలను పరిహారం చేసుకొంటున్నారు కృష్ణా! భక్త వత్సలా! శతసహస్ర వందనాలు

దేవతలు ఈ విధంగా స్తోత్రం చేయసాగారు-

పరీక్షిన్మహారాజా! సమస్త దేవ గణాలతోనూ మహా దేవునితోనూ గూడి స్తోత్రం చేసి గోవిందుడికి వందనం చేసి వెళ్ళబోతూ కృష్ణ భగవానుడితో బ్రహ్మదేవుడు ఇలా ప్రస్తావించాడు.

బ్రహ్మ ఉవాచ -

భూ మే ర్భా రావతారాయ పురా విజ్ఞాపితః ప్రభో !
త్వ మస్మాభిరశేషాత్మం స్తత్తథైవోప పాదితమ్ ॥

ప్రభూ! ప్రథమంలో మేము తమరిని అవతారం దాల్చి భూభారం దూరం చేయ వలసిందని ప్రార్థించాము. దయామయులై తమరు మా విన్నపం ఆలించి యథోచిత పద్ధతిలో మా కోరికను పూర్తిగా నెరవేర్చారు. స్వామీ! సత్యనారాయణా! తమరు సత్య పరాయణులై సమస్త సాధు పురుషుల క్షేమం కొరకై ధర్మ స్థాపన గావించారు. దశ దిశలా తమ కీర్తి చంద్రికలు వెల్లి విరిశాయి. తమ లీలా కథా వినోదాలు శ్రవణం చేసి జనులు తమ తమ మనః కల్మషాలను కడిగి వేసుకోసాగారు. ప్రభూ! తమరు సర్వోత్తమ భావంతో యదువంశంలో అవతరించారు. లోక హితం కోసం అవక్ర పరాక్రమం ప్రదర్శించి అనేకానేక అత్యద్భుత కార్యక్రమాలు నిర్వహించారు.

ఓ పరేమేశా! కలియుగంలో సాధు పురుషులు నీ లీలా విభూతులను శ్రద్ధగా శ్రవణం చేసి సులభంగా అజ్ఞానాంధ కార కూపాన్ని దాటి పరమ పదం పొందుతారు. అది నీ లీలా మహాత్మ్యం. ప్రభూ! తమరు యదువంశంలో కృష్ణావతారం దాల్చి నూట ఇరవైయైదు సంవత్సరాలు గడిచాయి. సర్వాధి పతీ! తమరు అవతరించి ఇక్కడ చేయవలసిన దేవకార్యాలన్నీ మా ప్రార్థన మన్నించి పూర్తిచేశారు. తమరు ఇంకా భూలోకంలో నివసింప నేల! వైకుంఠం దయచేయండి. బ్రాహ్మణ శాప కారణంగా యదు వంశం నశించే ఘడియలు సమీపించాయి.

ఓ వైకుంఠనాథా ! సర్వలోకనాథా! శ్రీనాథా! తమరు దయ వహించి పరమ ధామం దయచేయండి. అక్కడికి వచ్చి దేవగణ సమూహాలను, సేవక భృత్య పరిచారిక కోటిని అనుగ్రహించండి. మా విన్నపం ఆలకించండి. అనేక సాష్టాంగ ప్రణామ శతాలు.

శ్రీ కృష్ణ భగవానుడిలా పేర్కొన్నాడు -

బ్రహ్మదేవా! మీరు అర్థించినట్లే నేను మీ అన్ని పనులూ పూర్తి చేసి భూభారాన్ని తగ్గించాను. కానీ కమలజా! ఒక పని శేషించింది. యాదవ వంశీయులు బల పరాక్రమాలతో వీర శూరులై ధన సంపదలతో కన్నూ మిన్నూ గానక విర్రవీగుతున్నారు. వారు యావత్ భూలోకాన్ని ఆక్రమించేటట్లున్నారు. సముద్రాన్ని చెలియలికట్ట అడ్డినట్లు నేను వీళ్ళ ఔద్ధత్యాన్ని అడ్డుకోదలంచాను.

నేను ఈ మహా గర్విష్ఠులూ మహోద్ధతులూ అయిన యాదవులను నాశనం చేయకుండా పోతే వీరు హద్దులు తప్పి స్వేచ్ఛాచారులై లోకాలన్నింటినీ క్షణాలపై నాశనం చేస్తారు. అనఘా! అరవిందజా! ఇపుడే విప్రశాపంతో వంశ నాశనం ప్రారంభమయింది. ఇది పూర్తి కాగానే నేను పరంధామం జేరుకొంటాను.

శ్రీ కృష్ణుడు యాదవులను ప్రభాస తీర్థం పంపుట

శ్రీ శుకమహర్షి ఇలా ప్రవచనం చేస్తున్నాడు-

'రాజా! అఖిల లోక నాథుడైన శ్రీ కృష్ణ భగవానుడు ఇలా పలుకగా బ్రహ్మదేవుడు దేవగణాలతో తమ తమ నగరాలకు వెళ్ళారు. వారు అటువెళ్ళగానే ద్వారకా నగరంలో పెద్ద పెద్ద అపశకునాలు పొడచూపాయి. ఆ ఉత్పాతాలు చూచి యదువంశీయులైన వృద్ధులు పెద్దలు శ్రీకృష్ణ భగవానుణ్ణి సమీపించారు.

శ్రీకృష్ణ భగవానుడిలా ప్రస్తావించాడు-

ఓ గురుజనులారా! ప్రస్తుత కాలంలో ద్వారకలో ఎక్కడ చూస్తే అక్కడ అపశకునాలు అనేకం కుప్ప తిప్పలుగా కనిపిస్తున్నాయి. తమరెరుగుదురు కదా! బ్రాహ్మణులు మన వంశాన్ని శపించి పోయారు. ఆ శాపం శమింప చేయటం ఎవరికీ సాధ్యం కాదు. కనుక మన ప్రాణరక్షణకై ఎటన్నా వెళ్ళి పోవలసిందే. ఇపుడు ఆలస్యం చేయరాదు. ఆలోచించుకొని మనం నేడే ప్రభాసతీర్థం వెళ్ళటం చాల మంచిది. అది చాలా మహా పుణ్య ప్రదమైనది. ఆ తీర్థం వెళ్ళటం శ్రేయస్కరం. ప్రభాస తీర్థ మహత్యం జగత్ప్రసిద్ధం. పూర్వం దక్ష ప్రజాపతి శాపం వలన చంద్రుడికి రాజయక్ష్మ రోగం తగిలింది. అపుడు చంద్రుడు మహాత్ముల సలహా వలన ప్రభాస తీర్థంలో జలకమాడి రోగ నిర్ముక్తుడైనాడు. పాప పరిహారం జరిగింది. వెంటనే కళలు వృద్ధి చెంది షోడశకళా పూర్ణ శోభితుడయినాడు. కనుక మనం కూడ ప్రభాస తీర్థంలో స్నానం చేసి దేవతలకు, పితృ దేవులకు తర్పణలిద్దాము. బ్రాహ్మణులకు సంతర్పణలు

చేద్దాము. శ్రద్ధగా జేసే సత్పాత్ర దాన దక్షిణల వలన కఠిన కష్టాలు తొలగిపోతాయి. నావ ద్వారా సాగరాలను తరించినట్లు పుణ్య కార్యాల వలన పాప రాశి నధిగమించి ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి.

ఉద్ధవుడు జ్ఞానం అర్థించుట

శ్రీ శుకుడిలా ప్రవచించాడు -

రాజా! శ్రీకృష్ణ భగవానుడు ఇలా ప్రబోధం చేయగా యదువంశీయులెల్లరూ ఏకాభిప్రాయంతో ప్రభాస తీర్థం వెళ్ళటానికి నిశ్చయించుకొన్నారు. వెంటనే వారి వారి రథాలను అధిరోహించి ప్రయాణాలైనారు.

పరీక్షిన్మహారాజా! ఉద్ధవుడు శ్రీకృష్ణదేవుడి ఆప్తమిత్రుడు సేవకుడు. అతి సన్నిహితుడు. అతడు యాదవుల ప్రభాసం వెళ్ళటం చూచాడు. కృష్ణస్వామి ఆజ్ఞలు ఆలకించాడు. ఘోర అపశకునాలు చూచాడు. వెంటనే విలపిస్తూ ప్రేమమూర్తి ఆప్తసఖుడు అఖిలలోక అధిపతి అయిన శ్రీకృష్ణ భగవానుణ్ణి ఏకాంతంగా సమీపించాడు. ఆ ఈశ్వరేశ్వరుణ్ణి స్తోత్రం చేస్తూ పాద ప్రణామాలు గావించాడు. శిరస్సు మోడ్చి అభివందనం ఆచరించాడు. చేతులు జోడించి ప్రాంజలి ఘటించాడు. కన్నీళ్ళతో కాళ్ళు కడిగి ప్రార్థనలు చేయసాగాడు-

ఉద్ధవుడు ఉత్కంఠంతో ఇలా అన్నాడు -

దేవ దేవేశ! యోగేశ! నీ లీలా విభూతులు కీర్తించి ఒక్కసారి శ్రవణం చేసిన మాత్రం చేత మానవులు కల్మష విదూరులై పుణ్యవంతులవుతారు. ఓ సర్వశక్తి స్వరూపా! పరమేశ్వరా! తమరు తలచుకొంటే విప్రశాపం పని చేస్తుందా! అది హరించటం హరివైన నీ కెంత పని! తమరు తలంచలేదు. అంతే. నా కనిపిస్తోంది ఏమిటంటే తమరు యదువంశాన్ని నాశనం చేసి భూభారం హరించి ఈ లోకాన్ని తమరు వీడిపోవాలి అనే నిశ్చయించు కొన్నారు.

హే కేశవా! మహానుభావా! నేను అరనిముసం కూడా నీ పాద పద్మాలను విడిచి ఉండలేను. నే నీ తలంపే భరించలేను. నా జీవన సర్వస్వం నీవే. నీవు నా స్వామివి. నేను భృత్యుడను. నన్ను కూడా నీతో పాటు నీ పరంధామానికి తీసుకొని పొండి. కృష్ణా! నీ లీల మానవులకు మంగళకరం. శ్రవణాలకు అమృత రసాయనం. ఒకసారి ఆ ఆనందామృతం రుచిచూచిన వాడు మరో మధుర పదార్థం దేనినీ ఆపేక్షించడు. అందులో అంత మాధుర్యం అనుభూతమవుతుంది. ప్రభూ! మేము కూర్చున్నా నుంచున్నా ఆడుతున్నా పాడుతున్నా

నిద్రిస్తున్నా మెలుకువతో నున్నా తింటున్నా తిరుగుతున్నా నీతోనే కాలం గడిపాము. ఒక కంచానతిని ఒక మంచాన పడుకొనే వారం. స్నానం చేసినా పానం చేసినా నీతోనే ఉండే వారము కదా! ఒక్క క్షణమైనా నిన్ను విడిచి ఉండ కలిగే వారమా!

స్వామి! మీరు నాకు ఆత్మీయులు ప్రియతములు. మేమే మీరు - మీరే మేముగా ఉండే వారము. మీరు దరించిన మాలలు మేము ధరించే వారము. మీరలంకరించుకొనే గంధాదులు పూసుకొనే వారము. మీరు విడిచిన వస్త్రాలు దుస్తులు మాకు యోగ్యాలయ్యేవి. మీరు భుజించిన ఎంగిలి పదార్థాలు మాకు ప్రియాతి ప్రియంగా ఉండేవి. మీ మాయలు మంత్రాలు మమకారాలు మమతలు మాకు సుపరిచితాలే సుమా! మీ రంటే మాకు బెరుకేలేదు. క్రొత్తే లేదు. మీ దగ్గరి మా చనువు అంతింత అనరానిది. మీ చెంత మాకు భయమే ఉండేది కాదు.ఇపుడు మీ వియోగం అంటేనే మహా భయంగా ఉంది.

పరబ్రహ్మమూర్తీ! కృష్ణా! మాయను జయించట మనేది మహా కష్టం అవి మాకు తెలుసు పెద్ద పెద్ద మునీశ్వరులు యతీశ్వరులు గాలిని భుజించి పవిత్ర జీవనం గడిపే ఊర్ధ్వరే తస్కులు, శ్రమణకులు, జీవితాంతం నైష్ఠిక బ్రహ్మ చర్యం బూని చరించే మహాత్ములు నిరంతరం అధ్యాత్మిక జీవనం కొరకు శ్రమిస్తుంటారు. ఈ నియమ నిష్ఠలతో కఠిన సాధనలతో వారి హృదయ కమలం నిర్మలమై ప్రకాశిస్తుంది. అపుడు వారి వృత్తులు శాంతించి నైష్కర్మ్య అవస్థలో సుస్థిరమై బ్రహ్మ నామంతో పిలువబడే పరంధామానికి వారు చేర కలుగుతారు.

మహా యోగేశ్వరా! మేము కర్మ మార్గంలోనే భ్రమిస్తున్నాము. కానీ మా ధైర్యం ఏమంటే " మాస్వామి భక్తులతో కూర్చొని స్వామి కమనీయ కథా కలాప మధువును గ్రోలుతున్నాము. స్వామి మానవ లీలలలో పాల్గొంటున్నాము. స్వామి నామం స్మరిస్తున్నాము కదా అని మా నేస్తం మమ్ముద్ధరించడా"అని విశ్వాసం.

" స్వామి! మీ హావభావాలు మందహాసాలు పరిహాసాలు చూస్తూ తలచుకొని తల్లీనులమై ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అవుతుంటాము. ఈ సంస్మరణ మాత్రం చేత మేము దుస్తర మాయా జాలాన్ని అధిగమించి నీ శరణ్యం లోనికి జేరుతాము. మాయ అంటే భయం లేదు గానీ నీ ఎడబాటు అంటేనే మహా భయంగా ఉంది. మీరు మమ్ము వదలవద్దు మీ వెంట తీసుకు వెళ్ళండి. అనుగ్రహించండి మీకు మ్రొక్కుతాము."

శ్రీ శుక మహర్షి ఇలా ప్రవచించాడు - ఓ రాజా! ఉద్ధవుడు శ్రీకృష్ణ దేవుణ్ణి ప్రార్థించగా దేవకీ నందనుడు ప్రియమిత్రుడైన ఆప్తసఖుణ్ణి చేర బిలిచి ఇలా ఏకాంతంగా బోధించసాగాడు.

శ్రీ కృష్ణ ప్రబోధము

శ్రీ కృష్ణ భగవానుడిలా చెప్పాడు -

ఓ ఉద్ధవా! నీవు మహా భాగ్యశాలివి. నీ వన్నట్లే నేను చేయాలి అనుకొంటున్నాను. బ్రహ్మ రుద్ర మహేంద్రాదులు మొదలైన లోక పాలకులు వారి లోకాల మీదుగా నన్ను పరమధామం చేరమని కోరుతున్నారు.

పృథ్వి మీద దేవకార్యం అంతా నేను పూర్తి చేశాను. నేను ఈపని కోసం బ్రహ్మ ప్రార్థన విని బలరాముడితో పాటు అవతరించాను. ఇపుడీ యదువంశం శాప కారణంగా భస్మమైపోతుంది. వారు అన్యోన్యం కలహించుకొని నాశనమైపోతారు. నేటికి సరిగ్గా ఏడవ రోజున సముద్రం ద్వారకా నగరాన్ని మ్రింగి వేస్తుంది.

ప్రియమైన ఉద్ధవా! నేను ఏ క్షణంలో ఈ లోకాన్ని విడిచి వెళ్ళతానో ఆక్షణమే అమంగళాలు అరంభమవుతాయి అన్నీ నష్టాలు సంభవిస్తాయి. అప్పటి నుంచి కలియుగం విలయరూపం దాలుస్తుంది. నేను ఈ భూమిని వదలగానే నీవు కూడా ఇక్కడ ఉండ వద్దు. కలియుగంలో ఎక్కువ మంది ప్రజలు అధర్మం వైపు మొగ్గు చూపుతారు. నీవు ఇక ఆత్మీయులనీ న్వ బంధువులనీ పరులపై మమతా మమకారాలు పెట్టుకోబోకు. అనన్య ప్రేమ జూపి నా యందు నీ మనో వాక్కాయాలు లగ్నం చేసి సమ భావంతో పృథ్వీతలంపై స్వేచ్ఛగా సంచరించు.

ఉద్ధవా! ఈ ప్రపంచంలో మనస్సుతో ఆలోచించేవి, వాక్కుతో మాట్లేడేవి, కళ్ళతో చూచేవి శ్రవణాది ఇంద్రియాలతో అనుభవించేవి, అన్ని అశాశ్వతాలు. పగటి కలల వలె అన్నీ బూటకాలు పిచ్చి పిచ్చి విలాసాలు. కనుక ఇది వట్టి మాయా నాటకం. ఇదే మిథ్య అని భావించు.

పురుషుడి మనస్సు అశాంతిగా చికాకుగా ఉన్నపుడు అతనికి అన్ని వస్తువులు నిస్సారంగా కనిపిస్తాయి. నిజానికి అది వస్తు దోషం కాదు. చిత్త చాంచల్య ప్రభావమే. భ్రమ కలిగినప్పుడు ఇది గుణయుక్తం అనీ, ఇది దోషయుక్తం అనీ కల్పన చేయబడుతుంది. అతని బుద్ధిలో గుణదోషాలు స్థిరపడ్డాయి. భేద భావాలు వేళ్ళు పాదుకొన్నాయి. అతనిలో

'కర్మ' అనీ 'అకర్మ' అనీ 'వికర్మ' అనీ భేద దృష్టి పనిచేస్తోంది. 'కర్మ' అంటే విహిత కర్మ. 'వికర్మ' అంటే విహిత కర్మ యొక్క లోపం. 'అకర్మ' అంటే నిషిద్ధ కర్మ.

ఉద్ధవా! నీవు నీ ఇంద్రియాలను నీ వశంలో ఉంచుకో . వాటి ముక్కుత్రాళ్ళు నీ చేతిలో ఉంచుకో. ఇంద్రియాలనే కాదు నీ చిత్త వృత్తులు నిరోధించు. యావత్ప్రపంచం నీ ఆత్మలోనే వ్యాపించి యున్నట్లు చూచుకో. ఆత్మ అంటే సర్వాత్మనా ఇంద్రియాతీతమైన బ్రహ్మంగా గుర్తించు. ఆత్మ అభిన్న మైనది సుమా!

వేద తాత్పర్యం నిశ్చయ రూప జ్ఞానం. అనుభవ రూప విజ్ఞానం. నీవు నీ ఆత్మానుభవంతో ఆనంద మగ్నుడవుకమ్ము. సంపూర్ణ దేవత లెల్లరు శరీరధారులైన ఆత్మ స్వరూపులే. నీవు అట్టి దేవతా రూపం ధరించు. అపుడు నిన్ను ఏ విఘ్నాలు బాధించలేవు. విఘ్నాలను విఘ్నాలుచేయి. ఆత్మ కూడా నీవే అయి రాణిస్తావు. సర్వం నీవే అవుతావు.

ఉద్ధవా! గుణ దోష బుద్ధులకు అతీతమైనవాడు బాలకుడి వలె నిషిద్ధ కర్మలు అంటకుండా ఉంటాడు. అవి దోష భూయిష్ట కర్మలు అనికాదు. ఆ మహాత్ముడు అన్నిటికీ అతీతంగా ఏవీ అంటక ముట్టక ఉంటాడు. అన్నిటిలోనూ మునిగి ఉంటాడు. ఆ మహాత్ముడు వేదవేదాంత విజ్ఞాన వివేక పరిశీలనంలోనే కాదు వేదమాత సాక్షాత్కారం పొంది పరమానంద మగ్నుడై యుంటాడు. పరబ్రహ్మ తత్త్వ విషయంలో నిశ్చయ నిశ్చల నిర్మల జ్ఞానమూర్తియై తేజరిల్లుతుంటాడు.

అతడు సర్వ భూత హితుడై సుహృన్మిత్ర సత్తముడై యుంటాడు. అతని వృత్తులు సర్వథా శాంత మయమై యుంటాయి. అతడు సమస్త విశ్వాన్ని విష్ణుమయంగా పరికిస్తాడు. అంతటా అతడు నన్నే దర్శిస్తాడు. నా స్వరూపం అర్థం చేసుకొంటాడు. అంతా ఆత్మ స్వరూపమే అతనికి. ఇక అతడు ఎన్నటికీ జన్మ మృత్యు చక్రంలో తగుల్కోడు.

శ్రీ శుక మహర్షి వివరిస్తున్నాడు-

ఓ పరీక్షిన్ మహారాజా! శ్రీ కృష్ణ భగవానుడు ఇలా యోగి లక్షణాలు విశదం చేయుచుండగా భక్త సత్తముడైన ఉద్ధవ మహానుభావుడు కృష్ణ పాదారవిందాలు స్పృశించి ప్రణామ శతాలు సమర్పించి తత్త్వ జ్ఞాన ప్రాప్తికై మహత్వా కాంక్షతో ఇలా సంప్రశ్నం చేశాడు-

ఉద్ధవ ఉవాచ -

యోగేశ! యోగ విన్యాస! యోగాత్మన్! యోగ సంభవ !
నిః శ్రేయసాయ మే ప్రోక్త స్త్యాగః సన్న్యాస లక్షణః ॥

భగవాన్ శ్రీ కృష్ణ ప్రభూ! తమరు సమస్త యోగ రహస్యాలు తెలిసినవారు. యోగ

యోగీశ్వరులు. సర్వయోగాలకు తమరు ఆధారభూతులు. కార్య కారణ స్వభావులు మూల విరాట్పురుషులు. తమరు నాపై దయయుంచి పరమ కల్యాణ కరమైన త్యాగమయ సంన్యాస రూపం ఉపదేశించారు. ఒక సందేహం.

ఏమంటే విషయ వాసనలలో తలమున్కలైన వారికి విషయ జంజాటం విడిచి బయట పడటం మిక్కిలి కష్టం కదా! వారు నీవంటే విముఖంగా ఉంటారు. వారికి త్యాగం అన్నా, యోగం, అన్నా అసలు రుచించదు. వారు మంచి మార్గంలోకి రావటం అసంభవం అని నా నిశ్చితాభిప్రాయం.

ప్రభూ! నేనూ అంతే. వట్టి మూఢుడను. నామతి మంద "నేనూ - నాది" అనే భావంతో నీ మాయలోపడి తిరుగుతున్నాను. నేను దేహం దేహ సంబంధులైన స్త్రీలు, సంతానం ధన మాన మాయాజాలంలో మునిగియున్నాను. కనుక స్వామీ! తమేరుపదేశించే సంన్యాసతత్త్వం నేను అర్థం చేసుకొని ఆచరించేలా వివరంగా బోధించండి.

పరమేశా! నీవు భూత భవిష్యద్వర్తమాన త్రికాల త్రిసత్య నిత్య స్వరూపానివి. అబాధిత అచ్యుతమూర్తివి. ఏకరసమూర్తివి. నీవు స్వయం ప్రకాశజ్యోతివి. ఆత్మజ్యోతివి.

ప్రభూ! జగద్గురూ! నా వంటి వానికి దయామయుడవై ఆత్మ తత్త్వం అర్థం అయ్యేలా బోధించే సద్గురుమూర్తివి. నీవు కాక దేవతా కోటిలో కూడా ఏ ఒక్కరూ లేరు. బ్రహ్మాదులు కూడా శరీరాభిమాన దేవతలగుటచేసి నీమాయకు వారు మోహితులైనవారే. వారి బుద్ధులు నీ మాయలో పడి పోయినవే. నీ మాయలో మునిగిన వారగుటచే వారు ఇంద్రియానుభవ బాహ్య విషయాలను సత్యమని నమ్మియున్నారు. కనుక నాకు నీవే జ్ఞానం బోధించాలి.

భగవాన్! నేను నాల్గువైపుల గ్రమ్మిన దుఃఖ దావాగ్నిలో మాడిపోయి విరక్తి కలిగి నీ శరణాగతిలోకి చేరాను. నీవు నిర్దోషమూర్తివి. అవినాశివి, వైకుంఠ వాసివి. నరసఖుడివి. నారాయణమూర్తివి. కనుక నీవే నాకు ఉపదేశం చేయి. ప్రభూ!

శ్రీ కృష్ణదేవుడిలా బోధించాడు-

ఉద్ధవా! ఈ జగతిలో ఏ మనుష్యుడు "ఈజగత్తు ఏమిటి? దీనిలో ఏమి జరుగుతోంది"! అని విచారణ చేయటంలో ప్రవీణుడవుతాడో వాడు తన చిత్తంలోని అశుభ వాసనలను తమంతట తాము వివేక శక్తి ద్వారా తొలగించుకొని రక్షింపబడతాడు.

సమస్త ప్రాణులలో విశేషంగా మానవుడుకి ఆత్మయే తన హితమునకు అహితమునకు గురువు. ఆత్మ ప్రత్యక్ష ఉపదేశకుడు. మానవుడు ప్రత్యక్ష అనుభవం.

అనుమాన విచారణల ద్వారా తన హితాన్ని అహితాన్ని తాను నిర్ణయించు కొనుటలో సర్వ సమర్ధుడు సుమా! ఉద్ధవా! సాంఖ్య యోగ విశారదుడు ధీర పురుషుడు ఈ మానవ జన్మలోనే ఇంద్రియ శక్తులు మానసిక శక్తులు గల నన్ను ఆశ్రయించి ఆత్మ తత్వాన్ని పూర్తిగా సాక్షాత్కారం చేసుకోగలుగుతున్నాడు. సర్వ శక్తులకు ఆశ్రయ భూతుణ్ణి నన్నుగా గుర్తించి వర్తిస్తాడు. నేను విశ్వంలో ఏకపాద, ద్విపాద,త్రిపాద, చతుష్పాద, బహుపాద, పాదహీన, ఏకకణ జీవులను సృష్టించాను. ఈ జీవులలో నాకు అత్యంత ప్రియమైన జీవి మానవుడు. మనుష్య శరీరం ఒక విలక్షణమైనది.

ఈ మనుజ శరీరంలో ఏకాగ్రచిత్తం, తీక్ష్ణబుద్ధి పురుషశక్తి మొదలైనవి తీవ్రంగా పనిచేస్తుంటాయి. ఈ కారణం చేత అనుమానం అగ్రాహ్య అహంకారాది గుణాలకు అతీతంగాఉన్న నన్ను, సర్వ ప్రవర్తక స్వామిని, ఈశ్వరేశ్వరుణ్ణి సాక్షాత్తుగా అనుభవించ కల్గుతాడు. ఈ అనుసంధానం రెండు రకాలు. ఒకటి - స్వప్రకాశ తత్త్వం లేక బుద్ధ్యాది జడ పదార్థాలు ప్రకాశించలేవు. ఈ ప్రకారంమును అర్థాపత్తి అంటారు. మరొకటి - కొన్ని సహాయక పనిముట్లు. ఒక వ్యక్తి ద్వారా ప్రయోగింపబడతాయి. ఆ విధంగా బుద్ధ్యాదులు పనిముట్లు వలె కర్త ద్వారానే ఉపయోగింపబడతాయి. కానీ ఆత్మ అనుమానిక వస్తువు కాదు. ఇది దేహాదుల కంటె విలక్షణమైనది. ఇది త్వం పదార్థ శోధన యుక్తి మాత్రమైయున్నది.

యదురాజు అవధూత సంవాదం

ఈ విషయంలో మహాత్ములు ఒక ప్రాచీన ఇతిహాసం చెప్పుతున్నారు. పరమ తేజశ్శాలి అవధూత అయిన దత్తాత్రేయ స్వామికీ యదువంశ రాజుకీ ఒక సంవాదం జరిగింది విను.

ఒకసారి ధర్మ మర్మజ్ఞుడైన యదు మహారాజు త్రికాలజ్ఞుడు తరుణ వయస్కుడు అవధూత అయిన బ్రాహ్మణుడు దేశ పర్యటన చేస్తుండగా చూచి ఇలా సంప్రశ్న చేశాడు-

హే! బ్రాహ్మణోత్తమా! అవధూతాగ్రణీ! తమరు ఏవిధమైన కార్యమూ చేస్తున్నట్లు లేదు. కానీ తమకు గల అత్యంత నైపుణ్యమైన బుద్ధి విశేషాన్ని గమనించిన ఆశ్చర్యం కల్గుతుంది. ఇంత సూక్ష్మబుద్ధి తమకు ఎలా లభ్యమయిందో! ఇంత మహా విద్వాంసులై కూడా పసిబాలుడి వలె ప్రపంచంలో స్వేచ్ఛగా విలాసంగా విహరిస్తున్నారంటే దీనికి ఆధారం ఆశ్రయం ఏదైనా యుంటుందో కదా. లోకంలో సహజంగా ప్రతివాడు ఎక్కువ కాలం బ్రతకాలి అనో, కీర్తి సంపద పొందాలనో, మహా శ్రీమంతుడు కావాలి అనో, శరీర సౌందర్య కాంతులు మిక్కుటం కావాలి అనో, లేక మరో అభిలాషతోనో, ధర్మ అర్ధ కామ్య కర్మలు చేస్తుంటాడు.

తత్త్వ జిజ్ఞాస కూడా ఈ కోరికలతోనే మొదలుపెడతాడు. కారణం లేకుండా ఎవ్వాడునూ ఏ కార్యం చేయడు.

నేను నిన్ను పరికిస్తున్నాను. తమరు కార్య నిర్వాహణలో సర్వ సమర్థులు. తమరు మహా విద్వాంసులు. అన్నింటిలోనూ గొప్ప నైపుణ్యం గల మహా కవీశ్వరులు. తమ అదృష్టం భాగ్యరేఖలు సౌందర్య ప్రభలు ప్రశంసనీయంగా విరాజిల్లుతున్నాయి. తమ వాగ్విన్యాసం అమృత రసభరితంగా ఉంది. మరి ఇట్టివారు జడ ప్రాయంగానూ ఉన్మత్తుడి వలెనూ ఏదో సోకుడు తగిలినట్లు సంచరిస్తారు. ఏ పనీచేయరు. ఏదీ అపేక్షించరు.

లోకంలో ఎక్కువ మంది జనం కామలోభ దావాగ్నిలో పడి మాడి మసి అవున్నది. తమరిని చూడగా అక్షరాల ముక్త పురుషుల వలెయున్నారు. కామలోభ దావాగ్ని తాపం తమవైపుకే రాలేదు అనిపిస్తుంది. పెద్ద మదగజం వనంలో దావాగ్ని సోకంగానే పరుగున వెళ్ళి గంగాజలం మధ్యలో దిగిచల్లగా ఉన్నట్లుంది తమస్థితి.

బ్రాహ్మణ ప్రవరా! తమరు భార్యా పుత్ర సంపదలతోడి సంసార స్పర్శను ముట్టినట్లు లేదు. సంసార తాపరహితులు తమరు. తమరు సదా సర్వదా స్వ స్వరూపస్థిత ప్రజ్ఞావంతులు. తమకు ఇంతటి అనిర్వచనీయ ఆత్మానంద అనుభవస్థితి ఎలా కలిగిందా! అని అడిగి తెలుసుకొందామని జిజ్ఞాసగా ఉంది. దయచేసి నాపై కృపవహించి వివరించ వలసిందిగా ప్రార్థిస్తున్నాను. అనుగ్రహించండి.

యదురాజు బుద్ధి శుద్ధమైనది. ఆయనకు బ్రాహ్మణ భక్తి అధికం. ఆయన అవధూతను సత్కరించి ఈ ప్రశ్న అడిగి శిరస్సు వంచి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

అపుడు దత్తాత్రేయ బ్రాహ్మణ అవధూత ఇలా సెల విచ్చాడు-

అవధూత ఉవాచ -

సంతి మే గురవో రాజన్ బహవో బుద్ధ్యు పాశ్రితాః !
యతో బుద్ధి ము పాదాయ ముక్తో 2 టా మిహతాంచ్ఛ్రుణు ॥

అవధూత అయిన బ్రహ్మవేత్త ఇలా అన్నాడు- యదురాజా! నేను నా బుద్ధి బలం ద్వారా చాలా మంది గురువులను ఆశ్రయించాను. వారి వారి నుండి విద్యా బుద్ధులు గ్రహించాను. ఆ ఫలితంగా ఇపుడు ఈ జగత్తులో ముక్త భావంతో స్వచ్ఛందంగా విహరించ కల్గుతున్నాను. నా గురువుల పేర్లు వారు నేర్పిన జ్ఞానం వివేకం. చెప్తాను విను.

పృథివీ వాయు రాకాశ మాపోఽగ్ని శ్చంద్రమా రవి: ।
కపోతోఽ జగరః సింధుః పతంగో మధుకృత్ గజః ॥

శ్లో॥ మధుహా హరిణో మీనః పింగలా కురరోఽర్భకః ।
కుమారీ శరకృత్ సర్ప ఊర్ణనాభిః సుపేశ కృత్ ॥

శ్లో॥ ఏతే మే గురవో రాజన్! శ్చతుర్వింశతి రాశ్రితాః ।
శిక్షా వృత్తి భి రేతేషా మన్వ శిక్ష మిహాత్మనః ॥

నా గురువులు- పృథివి - వాయు - ఆకాశం - జలం - అగ్ని - చంద్రుడు - సూర్యుడు - పావురం - కొండచిలువ - కడలి - మిడుత - తుమ్మెద - హస్తి - తేనెటీగ - లేడి - చేప -పింగళ వేశ్య - చెకుమికిపిట్ట - బాలుడు - కుమారి - విలుకాడు - సర్పం - సాలె పురుగు - భ్రమర కీటకం రాజా! నేను ఈ ఇరువది నాలుగు గురువులను ఆశ్రయించి జ్ఞానం పొందాను. ఒక్కొక్కరి వద్ద ఒక్కొక్క విధమైన గుణపాఠం నేర్చుకొన్నాను. ఓ యయాతి నందనా! ఎవరి వద్ద ఏమి నేర్చుకొన్నానో చెప్తాను విను -

I. పృథివి -

నేను ఈ భూమాత నుండి ధైర్యం క్షమాగుణం నేర్చాను. జనులు భూమిపై బ్రతుకుతూ భూమికి ఎన్ని విఘాతాలు ఎన్ని ఉత్పాతాలు ఎన్ని గోతులు ఎన్ని నష్టాలు కష్టాలు కలిగిస్తున్నారో లెక్కించలేము. అయినా భూమాత జనాన్ని ఏ ఒక్క మాట అనదు. బదులు తీర్చు కోవాలి అనుకోదు. ఇంత జరిగినా కన్నీరు పెట్టుకోదు. లోకంలో గల ప్రాణులందరు తెలిసో తెలియకో ప్రారబ్ధం అనుసరించి భూమికి హాని చేస్తున్న వారే. అనుచితంగా ఆక్రమణలు చేస్తున్నవారే. ధీరులు ఎటువంటి స్థితిలోనూ తన ధీరత్వాన్ని కోలుపోరు. కోపగించరు. తమ మార్గం పై నిబ్బరంగా నిలకడగా నిర్మలంగా పయనిస్తుంటారు. ఇది నేర్చాను.

ఈ భూమిపై గల పర్వతాలు వృక్షాలు నాకు ఒక నీతి బోధించాయి. వృక్షాలు ఎప్పుడు ప్రజలకు మేలు చేస్తుంటాయి. జన్మించిన క్షణం నుండి ప్రాణవాయువులిచ్చి నీడనిచ్చి చచ్చి తనువు చీల్చి యిచ్చి ఉపకారం చేస్తుంటాయి. పర్వతాలు చలించని ధైర్యాన్ని ఓర్పును సహనాన్ని నేర్పుతుంటాయి. పరోపకృతికై అవి నిత్యవ్రతంగా జీవిస్తుంటారు. వీటిని చూచి పరోపకారంలో ఎంత గొప్పతనముందో పరులను సేవించటం ఎట్లో గ్రహించాను.ఈ విధంగా భూమాత నా ప్రధమ గురువు. నిజంగా పరోపకార పాఠం నేల తల్లి వద్దనే నేర్చుకొన్నాను.

2. వాయువు -

రాజా! వాయువు రెండు రకాలు. ప్రాణవాయువు. బాహ్య వాయువు. ప్రాణవాయువు జీవుల శరీరం లోపల ఉండి శరీర యంత్రాన్ని సరైన పద్ధతిలో నడుపుతుంది అది జీవరక్షణార్థం తగినంత శుద్ధ ఆహారాన్ని అపేక్షిస్తుంది. అది కాస్త లభిస్తే తృప్తిపడి రాత్రింబవళ్ళు ఎంతో పని చేసి శక్తినిస్తుంది.

ఈ ప్రాణ వాయువును చూచి పరిమిత ఆహారంతో అపరిమిత సేవ చేయవలె. జీవ రక్షణార్థ మాత్రమే భోజనం చేయాలి. ఇంద్రియ తృప్తికి కాక ఇంద్రియ కార్యక్రమార్థమే తగినంత ఆహారం స్వీకరించాలి. బుద్ధి వికృత వేషాలు, చిత్త చాంచల్యం పొందనంత వరకు తగినట్లుగా వాడుకోవాలి. వాక్కును తగినట్లు ఉపయోగపరచుకోవాలి. ఇది శుద్ధ వాయు సేవనం వలన కలుగు ప్రయోజనాలు. వాయువు విజృంభిస్తే విలయమే.

బాహ్య వాయువు అనేక ప్రదేశాలలో సంచరిస్తుంది. కానీ దేనియందు లగ్నమై అంటి పెట్టుకొని ఉండదు. ఏ వస్తువు గుణ దోషాలు స్వీకరించదు. అలానే సాధకుడు ఎందెందు తిరిగినా లక్ష్యం ఏకాగ్రంగా స్థిరంగా ఉంచుకోవాలి. దేనిపై మమతగానీ ద్వేషంగానీ ప్రదర్శింపరాదు.

గంధం వాయుగుణం కాదు. గంధం భూమిగుణం కానీ వాయువు గంధాన్ని వహించి చాలా దూరం తీసుకొని వెళ్ళుతుంది. గంధ సంపర్కం వలన వాయువు పరిశుద్ధమవుతుంది. గంధంతో వాయువుకు సంబంధం లేదు ఇది సూక్ష్మ విషయం.

యోగి శరీరంతో సంబంధం కలిగి ఉంటాడు. ఎంతవరకు అది? కొంత వరకు మాత్రమే. శరీర సంబంధం వ్యాధి, ఆకలి, బాధల వరకే. యోగి తాను శరీరం అనుకోడు. తాను ఆత్మను అనుకొంటాడు. అలానే శరీరాన్ని ఆశ్రయిస్తాడే కానీ శరీరంపై నిర్లిప్త భావంతోనే ఉంటాడు. ఈ గుణాలను నేను వాయువు నుండి గ్రహించాను.

3. ఆకాశం -

ఓ రాజా! వివిధ పదార్థాలు ఎన్ని రకాలుగా ఉన్నా చలాలు అచలాలు చరాచరాలు ఎన్ని ఆకారాలనో పోలి ఉంటాయి. అయినా వానిలో గల ఆకాశ పదార్థం ఒక్కటే. అది అపరిచ్ఛిన్నం. అట్లే చరాచర సూక్ష్మ స్థూల దేహధారులలో ఆత్మరూపంగా బ్రహ్మ పదార్థం సర్వత్ర వ్యాపించి ఉంటుంది. హారంలోని మణులలో దారం వ్యాపించి యున్నట్లు - ఆత్మ అఖండంగా సంగ రహితంగా సర్వుల యందు వ్యాప్తమై యున్నదని యోగులు గుర్తించారు. ఇది చాలా విస్తారమైనది. సర్వశక్తి కలది. దీనికి సాటి మరొకటి లేదు. ఆకాశానికి ఆకాశమే సాటి సాధనాపరుడు ఆత్మను ఆకాశముగా భావించాలి.

అగ్ని జ్వలించినా, వాన కురిసినా, పంటలు పండినా, పొలాలు ఎండి పోయినా, వాయు ప్రకంపనాలతో మేఘాలు వచ్చినా, పోయినా, ఏది ఏమయినా, ఆకాశం ఏమీ అంటనట్లే ఉంటుంది. ఆకాశం దృష్టిలో దేనికీ ప్రత్యేకత లేదు. ఈ విధంగానే భూత భవిష్యద్వర్తమాన చక్రంలో ఎన్నో రకరకాల పరిణామాలు ప్రళయాలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ ఆత్మను అవి ఏవీ స్పర్శించనే లేవు. అలా నిస్సంగంగా ఉండటం ఆకాశం నాకు బోధించింది.

4. జలం -

రాజా! జల స్వభావం స్వచ్ఛం. స్నిగ్ధం. మధురం. శుద్ధం. పవిత్రం చేయటం. కనుకనే తీర్థ దర్శనం, స్పర్శనం, నామ స్మరణం, మానవులను నిష్కల్మషులుగా పవిత్రీ భూతం చేస్తాయి. అలానే జలం వలె సాధువులు స్వచ్ఛంగా శుద్ధంగా ఉంటారు. స్నిగ్ధ హృదయంతో మధుర తరంగా భాషిస్తారు. లోకాన్ని పావనం చేస్తారు. ఇలా జలం నుండి పాఠం గ్రహించాను.

5. అగ్ని -

రాజా! అగ్ని తేజస్వి. జ్యోతిర్మయి. అగ్ని దీప్తిని ఎవరూ అణచలేరు. అది అజేయం. అగ్ని అన్నింటినీ భక్షించేస్తుంది. సర్వం భక్షించినా అన్నిటినీ హుతం చేసుకొంటుంది. ఏమీ దాని కంటదు. అది నిర్లప్తంగానే ఉంటుంది. అగ్ని వలెనే యోగి కూడా పరమ తేజస్వియై తపోబలంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. ఇంద్రియాలను జయిస్తాడు. అతడు భోజనం మాత్రం స్వీకరించి యధా మత్రంగా విషయాలను అనుభవిస్తున్నా అతని మనస్సు ఇంద్రియాదులు అతని వశంలోనే సంచరిస్తుంటాయి. ఏవిధమైన దోషం ఆ యోగికి ఇంత కూడా స్పర్శించదు.

అగ్ని కాష్టంలో కనుపించక ఉంటుంది. ఒక్కొక సారి కనిపించి అడవులను కాల్చివేస్తుంది. ఆ విధంగానే సాధకుడు గుప్తంగానూ బాహ్యంగాను ప్రవర్తిస్తాడు. కొందరు భక్తులు అగ్నిని ఉపాసించి అభీష్ట సిద్ధి పొందుతారు కూడా. వారు అగ్ని వలనెనే కాలాతీత అశుభ విపరీతాలను భస్మం చేస్తారు. సర్వ సమర్థులై కూడా అందరి వద్ద భిక్షగా మధూకరం స్వీకరిస్తారు. అగ్ని పెద్ద పెద్ద వంకరటింకర మొద్దులలో అంతర్గతంగా ఉండి కర్రల వలె కన్పిస్తుంది. కానీ అగ్ని స్వభావం అదికాదు. ఆ విధంగానే ఆత్మ శరీరధారులలో ఆ ఆకారంలో ఉన్నట్లు అనిపిస్తుంది. ఆత్మ అసలు రూపం సర్వ వ్యాపకం. ఆత్మ మాయా రచిత కార్యకారణ జగత్తులో సర్వత్ర సర్వ చరాచరాలలో వ్యాప్తమై ఉంటుంది. కానీ వస్తురూప నామ ఆకార ప్రకారాలతో సంబంధం లేకుండా ఉంటుంది. ఆయా రూపాలలో మాత్రం

పైకి భాసిస్తుంది. అగ్నిని చూచి సర్వత్ర ఉంటూ కూడా దేనినీ ముట్టకుండా నిర్లిప్తంగా స్వచ్ఛంగా తేజోవంతంగా ఉండటం నేర్చుకొన్నాను.

6. చందమామ

ఓ యయాతి కుమారా! చంద్రుని గతి విధానాలు ఎవరూ తెలుసుకో జాలరు. కాల ప్రభావంతో చంద్రుని కళలు వృద్ధి కావటం తరిగిపోవటం జరుగుతుంది. కానీ చంద్రుడు చంద్రుడే. ఆయన పెరగడు తరగడు. ఆ విధంగానే పుట్టిన నాటి నుండి చనిపోయే వరకు అవస్థలు వృద్ధిక్షయాలు వ్యాధులు బాధలు శరీరానికే కానీ ఆత్మకు కావు.

అగ్ని శిఖలు జ్యోతిః కాంతులు ఉల్కాపాతములు వెలుగులు క్షణం క్షణం ఉద్భవిస్తాయి. కొద్దిసేపటిలోనే అంతరిస్తుంటాయి. ఈ క్రమం నిరంతరం జరుగుతూనే ఉంటుంది. కానీ కనిపించదు. అదే విధంగా జల ప్రవాహం వలె అతి వేగంగా కాలం ద్వారా ప్రాణి కోటి శరీరాలు జనిస్తుంటాయి, నశిస్తుంటాయి. కానీ అజ్ఞాన వశంగా జనులు గుర్తించలేరు. చంద్రుని గమనించి స్థిరంగా ఉండటం నేర్చుకొన్నాను.

7. సూర్యుడు -

సూర్య భగవానుడు తన కిరణాల ద్వారా భూమిపై జలం స్వీకరించి అవసర మెరిగి వర్షం వర్షిస్తాడు. అందువల్ల భూమి ఫలవంతమై రాణిస్తుంది. పది మందికి ఉపయోగం కలుగుతుంది. ఆ తీరుగనే యోగి ఇంద్రియాల ద్వారా ధన వస్తువులు స్వీకరించి సమయానికి వాటిని త్యాగంచేసి దానంచేసి పరుల కుపకృతి గావిస్తుంటాడు. ఆయోగి ఎన్నడూ ఇంద్రియాలకు వశంకాడు. ఇంద్రియాలు యోగికి దాస్యం చేస్తుంటాయి. యోగి దేనిపై కూడా మమతా మమకారం ఆసక్తి చూపడు. విరక్తియే చూపుతాడు.

స్థూల బుద్ధులకు వివిధ జల పాత్రలలో, చిన్న చిన్న పెద్ద పెద్ద మడుగులలో సూర్యుడు ప్రతిబింబిస్తుంటాడు. కానీ సూర్యుడు ఒక్కడే. వివిధ తీరులలో కనిపాస్తాడు. సూర్యుడు వేర్వేరు కాదు. ఆవిధంగానే ఆత్మ వివిధ ఉపాధులలో వేరువేరుగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ ఆత్మ ఒక్కటే. మంద బుద్ధులకు ఆత్మ వేరు అనిపిస్తుంది. ఆత్మ సూర్యునివలె ఒక్కటే. వస్తుతః ఆత్మలో భేదంలేదు. అని సూర్యుని చూచి నేర్చుకొన్నాను.

" ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచు పో
లిక నే దేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్ నానా విధానూన రూ
పకుడై యొప్పుచునుండు నట్టి హరినే బ్రార్థింతు శుద్ధుండ నై"

- పోతన

8. పావురం -

ఓ యయాతి సుతా! ఎక్కడ ఎవరితోనూ మిక్కిలి మమత్వం మమకారం పెంచుకోవటం మంచిది కాదు. దీని వలన బుద్ధి తన స్వాతంత్ర్యం కోలుపోయి దీనయై భ్రంశమై భ్రష్టమై పోతుంది. దీనికి ఉదాహరణగా ఒక పావురం సంగతి వినిపిస్తాను. పాపం! పావురం ఎంత కష్టపడిందో చూడు-

రాజా ! ఒకానొక అడవిలో ఒక పావురం నివసిస్తుండేది. అది ఒక చెట్టు మీద గూడు కట్టుకొని ఉండసాగింది. అది తన చెలి పావురంతో చాలా సంవత్సరాలుగా ఒక గూటిలో కాపురం చేయసాగింది. ఆ రెండు పావురములు తమ హృదయాలలో ఒకదాని యెడల మరొకటి ప్రేమ వలపు పెంచుకోసాగాయి. రెండూ ప్రేమగా కాపురం చేయసాగాయి. అవి కనులలో కనులు శరీరంలో శరీరం బుద్ధిలో బుద్ధి జోడించి మిక్కిలి ప్రేమగా జీవించసాగాయి.

అవి రెండూ స్నేహంగా కలిసిమెలిసి ఆ వృక్షాలపై ఒకేచోట కూర్చుంటూ ఆడుతూ పాడుతూ తింటూ తిరుగుతూ నిద్రిస్తూ మేల్కొంటూ విహరిస్తూండసాగాయి.

రాజా! ఆడపావురం మీద మగ పావురానికి మితిలేని వలపు. అది ఏమి అడిగితే వెంటనే ఎంత కష్టమైనా తెచ్చిపెడుతుంది. ఆడ పావురం కూడా మగపావురం ఏది కోరితే అది నెరవేరుస్తూ ఉండేది. కొన్ని దినాలకు ఆడ పావురం గర్భం దాల్చింది. మరికొన్ని దినాలకు అది గుడ్లు పెట్టింది. భగవానుని సంకల్పం వలన గుడ్లు చిట్లి పిల్లలు బయటికి వచ్చాయి. ఆ పిల్లల శరీరం బుల్లి బుల్లి కాళ్ళు చిన్ని చిన్ని రెక్కలు ముక్కులు కళ్ళు చాలా అందంగా కోమలంగా సుతిమెత్తగా సుకుమారంగా మనోహరంగా ఉండి వృద్ధి పొందసాగాయి.

రాజా! పావురాల జంట పిల్లలను కన్నుల్లో వత్తులు వేసుకొని సాకుతున్నాయి. మిక్కిలి గారాబంగా అతిప్రేమగా పెంచుతున్నాయి. ఆ పిల్లల తియ్యతియ్యని మాటలు పలుకులు వింటూ పులకరించిపోతున్నాయి. కూనలు కేరింతలు కొడుతూ చాలా సంతోషంగా ఉంటున్నాయి. సదా సర్వదా ప్రసన్నంగా ఉంటున్నాయి. పిల్లలు తల్లి కడకు తండ్రి వద్దకు దూకి స్పర్శించి హర్షించి హర్షింపజేసి ఎగురుతూ వస్తూ పోతూంటే తల్లితండ్రి పావురాళ్ళు ఆనంద మగ్నం అవుతున్నాయి. ఆ పావురాళ్ళు విష్ణుమాయలోపడి పిల్లల మమకారంలో తల్లీనం కాసాగాయి. ఆ పారావతాల హృదయాలు వాత్సల్యంలో మునిగిఉన్నాయి. పిల్లలను పోషించటంలో ఆహార సంపాదనంలోపడి ఇహ పరలోక గతులనే మరచి సంచరిస్తున్నాయి. పిల్లలే లోకంగా బ్రతుకుతున్నాయి.

ఒక రోజు రెండు పారావతాలు పిల్లల ఆహారం కొరకు అడవిలో చాలా దూరం వెళ్ళాయి. ఆ అడవులన్నీ వాటికి సుపరిచితాలే. ఎక్కడా ఆహారం లభిస్తుందో తెలిసి చాలా దూర ప్రదేశాలకు వెళ్ళసాగాయి. పిల్లలు పెరిగి తిరిగి తిండి ఎక్కువ కావాలి అంటున్నాయి. ఏమి చేస్తాయి కనుక! అదే సమయంలో పక్షుల వేటకాడు బోయవాడు తిరిగి తిరిగి దైవ వశాత్తు ఆ గూటి వద్దకు వచ్చాడు. పావురాయి పిల్లలు గూటిముందు ఆడుకుంటున్నాయి. ఆ బోయ వెంటనే వలపన్నాడు. వలలో పిల్లలో పడిపోయాయి. పెద్ద పావురాళ్ళు పిల్లలకై మేలి ఆహారం తీసుకొని వచ్చేవి. రోజూ మాదిరి ఆరోజు కూడా ఆహారం తీసుకొని గూటికి వచ్చాయి. ఆడపావురం తన పసికూనలు తన వలపు కొండలు కుయి కుయి అంటూ వలలో చిక్కుపడి ఉండటం చూచింది. కన్నతల్లి కడుపు చెరువయింది. ఒక్కసారి బావురుమంటూ పిల్లల దగ్గరకు వాలింది. దైవ మాయా విధివ్రాత వలన తల్లిపావురం ప్రేమపాశంతో విలవిలలాడసాగింది. పిల్లలు వలలో పడిపోయాయని తెలియగానే మూర్ఛపోయింది. స్పృహ కోలుపోయింది. వళ్ళు తెలియక అదికూడా పిల్లల పైకి వెళ్ళితాను కూడా వలలో చిక్కిపోయింది. పోతు పావురం తన పిల్లలు వలలో చిక్కటం ప్రాణ ప్రియురాలై పెంటి పావురం స్పృహ కోలుపోయి ఆ వలలోనే చిక్కిపోవటం గమనించి మిక్కిలి దుఃఖించసాగింది. దానిదశ మిక్కిలి దయనీయంగా తయారయింది.

నేను అభాగ్యుడను. నా కుటుంబం సర్వం నాశనమయింది. అయ్యో! అయ్యో! నా దేముంది? నా బ్రతుకెందుకు? నా ఆశలన్నీ అడియాసలయినాయి. ధర్మార్థకామ సహితమైన నా గృహస్థ జీవనం కూలిపోయింది. నా ప్రియురాలు నాప్రాణసఖి నా యిష్ట దేవత నామాట మన్నించి గౌరవించేది. నే చెప్పినట్లు నడుచుకొనేది. అన్నివిధాల నాకు యోగ్యురాలు. అయ్యో! నా యిల్లు శూన్యం చేసి నన్ను ఈపాడు గూటిలో వదలి వెళ్లిపోయింది. పిల్లలతో పాటు సుఖంగా స్వర్గం వెళ్లింది.

నా పిల్లలు పోయారు. నా భార్య పోయింది. ఇంక ఈ ప్రపంచంతో నాకు పనేముంది? విధుర జీవనం - వియోగ జీవనం - విలాప జీవనం - వ్యథా జీవనం - నా కేల! నేనే ఆశతో జీవించేంది? జీవించి ఏమి సాధించేది! అని పరిపరి విధాల తలబాదుకొని ఏడ్వసాగింది. అంతట పిల్లలు వలలో కొట్టుకొంటూ గిలగిలలాడుతూనే ఉన్నాయి. అవి మృత్యు ముఖంలో ఉన్నాయి. అది చూస్తూనే పోతుపావురం బుద్ధి మొద్దుబారి వలలోకే వెళ్ళి పడిపోయింది.

ఆ కిరాతుడు ఆ పావురాళ్ళను సంతోషంగా మూట కట్టుకొని నేడు మంచి భోజనం దొరికింది అని తృప్తిగా గృహోన్ముఖుడైనాడు.

ఏవం కుటుంబ్యా శాంతాత్మా ద్వంద్వా రామ పతత్రివత్ ।
పుణ్యాన్ కుటుంబం కృపణః సాను బంధో2 వసీదతి ॥

రాజా! కుటుంబీకులు విషయాలలో భార్యా పుత్ర అనురాగాలలో సుఖముందని కుటుంబ పోషణలోనే సర్వం మరచి తన్మయులైన వారికి శాంతి లభించదు. అట్టివారు పావురం వలె కష్టాలలో చనిపోతారు. మనుష్య శరీరం ముక్తి ద్వారం వంటిది. అట్టిది పొంది పావురంవలె సంసారంలో పడిపోవటం దురదృష్టం. స్వర్గం నుండి జారిపోతున్నారు మూర్ఖులు. ఆ రూఢ చ్యుతులవుతున్నారు.

9. కొండ చిలువ -

దత్తాత్రేయ అంశంలోని అవధూత ఇలా బోధించసాగాడు -

ఓ నాహుషాత్మజా! ప్రాణులు తాము కోరుకొనక పోయినా, ఏమీ ప్రయత్నం చేయకపోయినా అపాలని ఎంత ప్రయత్నించినా కూడా ప్రారబ్ధ కర్మల ననుసరించి దుఃఖాలు అనుభవిస్తారు. ఆ ప్రాణులు స్వర్గంలో నున్నా నరకంలో నున్నా ఇవి తప్పవు. ఇంద్రియ సుఖాలు కూడా ఇలానే ప్రాప్తమవుతుంటాయి.

కనుక సుఖదుఃఖాల రహస్యం తెలుసుకోవాలి అనుకొనే బుద్ధిమంతుడు వీటిని గురించి ఏ విధమైన ప్రయత్నం చేయకుండా ఉండ కల్గటం నేర్చుకోవాలి. అడగకుండా, కోరకుండా, అనాయాసంగా ప్రాప్తించిన మాడిన రొట్టె ముక్క గానీ లేక మధురతర పదార్థం కానీ అధికంగానీ, అల్పంగానీ, మహాదేవ ప్రసాదం అని భావించి ధీరుడు అజగరం (కొండ చిలువ) వలె దానిని భుజించి జీవనం గడపటం మంచిది. లోకంపై ఉదాసీనంగా ఉండుట ఉత్తమం.

ఒకవేళ భోజనం ఒక దినం లభింకచక పోయినపుడు ప్రారబ్ధంగా భావించి ఏ విధమైన ప్రయత్నమూ చేయకుండ వలె. ఎన్ని రోజులైనా ఉపవాసాలుండాలి. అజగరం వలె యోగి ప్రారబ్ధానుసారం ప్రాప్తించిన పదార్థంతో తుష్టి చెందాలి. యోగి శరీరంలో మనోబలం ఇంద్రియ బలం దేహబలం మూడు ఉన్నా సరే చేష్టలేమీ చేయక ఉండాలి. నిద్ర లేకపోయినా కూడా పడుకొనే ఉండాలి. కర్మేంద్రియాలతో కూడా ఏపనీ చేయరాదు. ఇలా ఉండుట మంచిది అని కొండ చిలువ నుండి నేను పాఠం గ్రహించాను.

10. సముద్రం -

రాజా! నేను సముద్రం నుండి కొంత నేర్చుకొన్నాను. సముద్రం ఎంతప్రసన్నంగా ఎంత గంభీరంగా ఉంటుందో గమనించాను. దాని భావం ఎంతో లోతు! ఎంతో అంతు

చిక్కదు కదా! దానికి పరిమితం లేదు. అది ఏ విషయం గూర్చీ క్షోభపడదు. ఆటూ పోటూ లేక అది ఎంతో శాంతంగా గంభీరంగా ఉంటుంది. ఎన్ని సుగుణ రత్నాలు ! ఆ మహా సముద్రం వర్ష ఋతువులో నదులు వచ్చి వరదపెట్టినా పొంగదు. గ్రీష్మ కాలంలో ఎండిపోదు. క్రుంగిపోదు. ఆ విధంగానే భక్తుడు లౌకిక పదార్థాలు ప్రాప్తించిన పొంగి పోడు. లభించకపోయిన క్రుంగిపోడు. అది గ్రహించాను.

11. శలభం -

రాజా! శలభాన్ని చూచి ఒకనీతి నేర్చుకొన్నాను. శలభం అగ్నిరూపం చూచి పండు ఎర్రగా ఉంది అని అగ్నిలోపడి మాడి పోతుంది. అలానే బుద్ధిమంతుడు ఇంద్రియాలకు వశుడై రూపంపై మోహితుడై పతనమవుతున్నాడు. ఇది తగదని మిడత మనకు పాఠం చెప్తున్నది. పురుషుడు స్త్రీ రూప సౌందర్య హావభావాలకు లొంగిపోయి స్త్రీ వ్యసనం అనే ఘోర నరకంలో పడి సర్వ నాశనం అవుతున్నాడు. ఇది స్త్రీ దేవతా మాయ. ఈ మాయలోపడి పవిత్ర మానవజన్మ మోక్షార్హమైనది వ్యర్థమైపోతోంది.

మూఢులు కామినీ కాంచనాలు, వస్త్రాభరణాలు, ఆర్థిక అధికారాలు, వంటి అస్థిర భోగ భాగ్యాలు ఆశించి ఆ సంపాదన అనే ఊబిలో దిగబడి పోతున్నారు. తన మానవ నైజ స్థితి కోలుపోతున్నారు. మహత్తర మానవజన్మను మట్టిపాలు చేసుకొంటున్నారు. రూప భ్రమ ఎంత పతనానికి దారితీస్తుందో శలభం వలన మరీ తెలుసుకొన్నాను. ఈ రకంగా శలభం కూడా పాఠం నేర్పిన గురువేసుమా!

12. తుమ్మెద -

యదురాజా! సాధువులు సన్యాసులు గృహస్థులకు ఏ విధమైన కష్టమూ కలుగకుండా భృంగాలవలె జీవనం సాగించాలి. వారు తమ శరీర రక్షణకై ఉపయోగపడే పవిత్ర ఆహారాన్ని తుమ్మెదవలె అనేక గృహస్థుల నుండి స్వీకరిస్తుండాలి. తుమ్మెద వివిధ పుష్పాల నుండి కొంచం కొంచం సారాన్ని గ్రహిస్తుంటుంది. బుద్ధిమంతుడు శాస్త్ర ధర్మాన్ననుసరించి శాస్త్ర సారాన్ని గ్రహిస్తూ జీవనం చేయాలి. ఒకే కమలంపై ఆసక్తి గల భ్రమరం సమయం గుర్తించక రాత్రి పూట పూవులోనే బందీయై నశిస్తుంది. యతి ఒకే ఇంట ఉండి ఇష్ట పదార్థాలు భుజిస్తూ సంసారుల స్నేహ సంపర్కంలోపడి పతితుడు కారాదు.

రాజా! ముఖ్యంగా సన్యాసి సాయంకాలానికి ఆహారం కూడ బెట్టుకోరాదు. ఇది భ్రమరం నుండి గ్రహించాను. సన్యాసికి ఆహార స్వీకారానికి పాత్రయే ఉండకూడదు. ఆహారం చేతిలో పెట్టించుకొని తినిపోవాలి. ఆహారం ఉంచుకొనేది ఉదరమే సుమా!

సన్యాసి సంగ్రహం చేయటం దోషం. సంగ్రహం చేస్తే తేనెటీగ వలె అతని జీవనం దుర్భరమవుతుంది. సన్యాసి ఉదయం ఆహారం సాయంకాలానికి ఉంచుకోరాదు. ఉంచుకొంటే తేనెటీగవలె జీవనలక్ష్యం ఆశ్రమ ధర్మం కోలుపోతాడు.

13. ఏనుగు -

రాజా! సన్యాసి కొయ్యతో చేసిన ఆడబొమ్మను కాలితో కూడ ముట్టరాదు. అలా ముట్టినట్లైతే ఏనుగు శరీర స్పర్శకు బందీ అయినట్లు సన్యాసి అంతటి వాడునూ మాయలో పడి బందీ అవుతాడు. ఏనుగులను పట్టేవారు ఆడ ఏనుగు బొమ్మలను పెద్ద పెద్ద గోతులపై గడ్డితో నిల పెడతారు. పోతుటేనుగులు ఆడ ఏనుగులపై గల కామంతో చకచకా వెళ్ళి గోతిలోపడి బందీ అయిపోతాయి.

కనుక వివేకవంతుడు స్త్రీని భోగ్య వస్తువుగా స్వీకరించరాదు. వివేక శాలికి స్త్రీమూర్తి మృత్యుదేవత వంటిదే. స్త్రీని ఉంచుకొన్నట్లయితే ఎంత బలవంతుడైననూ ఏనుగువలనే ఇతరులచేత పట్టుబడతాడు. పతితుడవుతాడు.

14. తేనెపట్టులు పట్టుకొనువాడు -

రాజా! తేనె పట్టులు కొట్టుకొనే వారిని చూచి ఇది గ్రహించాను. లోకంలో కొందరు లోభగుణం గలవారై అక్రమంగా అధికంగా సంపాదించిన ధనాన్ని దానం చేయరు. తాము స్వయంగా అనుభవించరు. తేనె పట్టేవారు ధనం వలె తేనెనె సంపాదించి కూడ పెడతారు. వారిని మోసగించి ఆ తేనెను కడుపార త్రాగుతారు మరికొందరు.

మధుహారి తేనెటీగలు కూడబెట్టిన తేనెను అపహరిస్తారు. అ విధంగానే ధనం కూడబెట్టేది ఒకడు అనుభవించేది మరొకడు. ధన పదార్ధాదులను వివేకి లుబ్ధుల చేతిలోకి పోనీయక అనుభవించటమో దాన ధర్మాలు చేయటమో మంచిది. బ్రహ్మచారి, సంన్యాసి స్వయంగా అనుభవించాలి. గృహస్థులు, అతిథి అభ్యాగతులను సత్కరించి అనుభవించాలి.

15. హరిణం -

యయాతి కుమారా ! ఒక హరిణం వలన ఒక పాఠం గ్రహించాను. వనవాసులైన యోగులు ఎన్నడు విషయ సంబంధమై శృంగార గీతాలు వినరాదు. హరిణం మనకు పాఠం చెప్తుంది. కిరాతుని సంగీతంవిని మోహంచెంది బంది అయింది.

ఇది విన్నారా! హరిణ సుందరి గర్భం నుండి జనించాడు ఋష్యశృంగుడు. ఆ ఋష్య శృంగుడు స్త్రీల పాటలు ఆటలు విని చూచి ఆ స్త్రీలకు వశమైపోతాడు వారి చేతిలో

కీలుబొమ్మైనాడు. గ్రామ్యగీతాలు శీలవంతుణ్ణి భ్రష్టుణ్ణి చేసాయి. ఇది లేడి గూర్చి యోచించి తెలుసుకొన్నాను.

16. మీనం -

రాజా ! చేప గాలంలోని మాంసపు ముక్కకై ఆశపడి ప్రాణం వదులుతుంది. రుచికై జిహ్వా చాపల్యం వలన మూర్ఖ మనుష్యుడు మధనపడి చివరికి మరణిస్తాడు.

సుబుద్ధి భోజనం పరిమితం చేసుకొని ఉపవాసాభ్యాసం వలన ఇతర ఇంద్రియాలను సాధిస్తాడు. అయినా రసరేంద్రియం జయించటం మిక్కిలి కష్టం. భోజనం త్యజించినందు వలన జిహ్వా చాపల్యం అధికమవుతుంది. అన్ని ఇంద్రియాల కంటే ప్రబలమైన జిహ్వేంద్రియం వశం చేసుకొన్నవాడే జితేంద్రియుడు. రసనేంద్రియం వలన మీనం నశించింది.

17. పింగళ వేశ్య -

ఓ నృపకుమారా! పూర్వం ఒక కథ జరిగింది చెప్తాను విను. పింగళ అనే వేశ్యా మహిళ విదేహ నగరంలో ఉంటుండేది. ఆమె నుండి నేనొక నీతి గ్రహించాను. ఇది పూర్వం జరిగిన కథ. పింగళ రూపవతి. రూపాజీవ. వేశ్యావృత్తిలో జీవనం సాగిస్తోంది. ఆమె స్వేచ్ఛా చారిణి కనుక దనవంతులను ఆకర్షించే నిమిత్తం బాగా అలంకరించుకొని ఒక రాత్రి గుమ్మం ముందు నిలబడింది.

ఆమెకు పురుష వ్యామోహం కాదు. ధన సంపాదనపై మిక్కిలి అభిలాష. పురుషుడు ఎవరైనా ధనవంతుడైతే అతనిని తన పడకపైకి తీసుకొని వెళ్ళాలని చూస్తూండేది. యదు నృపా! పింగళ వీధి గుమ్మంలో ఉండగానే విటులు వచ్చేవారు. ఆమె వారిని తప్పుకొని మసలేది. ఆ తరువాత పెద్ద ధనికుడు నా దగ్గరకు రాకపోతాడా! అని వచ్చే ప్రతి ధనికుణ్ణి ఎగాదిగా చూడసాగింది. తన వద్దకు వచ్చి మోహించి రూపానికి మెచ్చి ధనమీయడా! అనుకొనేది కాని ఎవడూ రావటంలేదు. వచ్చేవాడు ధనహీనుడు.

ఆమె ధనికునికై ఎదురుచూచి చూచి అలసిపోసాగింది. ఆశలు సన్నగిల్లసాగాయి. ద్వారంలో నిలచింది నిలిచినట్లే ఉంది. లోపలకు బయటకు పచార్లు చేయసాగింది. అర్ధరాత్రి దాటింది.

రాజా! ధనాశ చాలా చెడ్డది. ఈ ధన కాంక్షతో ఆమె ముఖ కమలం వాడిపోయింది. మనస్సు వ్యాకులమయింది. ఆమెకు చివరకు వేశ్యావృత్తి అంటే అసహ్యమయింది. దుఃఖం విచారం ఎక్కువైనాయి. చింతలు దుఃఖాలే వైరాగ్యానికి మార్గాలు. ఆమెకు క్రమ క్రమంగా వైరాగ్యం అధికం కాజొచ్చింది. వైరాగ్యం సుఖహేతువు.

పింగళ చిత్తంలో ఒక వైరాగ్య భావం జాగృతమయింది. అది ఇలా సాగింది- విను- సాధారణంగా లోకంలో ప్రతి మనుష్యుడు ఆశా బంధనంలో చిక్కుకొని పోతాడు. ఈ బంధనాలను తెగకోసే కత్తి వైరాగ్యం ఒక్కటే. ప్రియ రాజా! వైరాగ్యం లేనట్లైతే మనుష్యుడు ఈ బంధాల నుండి విడుదల కాజాలడు. అజ్ఞానులకు ఈబంధాల నుండి విడిపోవాలనే కోరికే కలుగదు.

పింగళ ఇలా తలంచింది - అయ్యో! నేను ఇంద్రియ సుఖాలకు లొంగిపోయాను. నేను మోహంలో పడి దుష్ట పురుషులు హీనులు అయిన అధముల నుండి విషయ సుఖాలు ఆశించాను. ఎంత మూఢురాలను ! ఎంత దుఃఖకర విషయం ఇది.

నాహృదయ పీఠంపై నా దగ్గరనే నా ఆత్మబంధువైన భగవంతుడు విరాజిల్లుతుండగా గుర్తించక గ్రుడ్డిదాననైనాను. ఆ భగవానుడు ప్రేమా, సుఖమూ పరమార్థమూ , అర్థమూ ఈయగల దయామయుడు. శాశ్వతుడు. సచ్చిదానందుడు. సర్వేశ్వరుడు. అట్టి ప్రేమ మయుని వదలి అన్య పురుషులకై అల్పులకై అంగలార్చుతూ తిరిగాను. అనిత్యులను పట్టుకొని నిత్య పురుషుని వదిలాను. తుచ్ఛ మానవులను సేవించాను. వారి కామం తీర్చుతూ ధనం ప్రోగు చేసుకోసాగాను. ఈ ధనం ఎంత అస్థిరమైనది? ఎంత తుచ్ఛమైనది! ఈ ధనం వలన దుఃఖం కష్టం శోకం మోహం జనిస్తాయి. నా మూర్ఖత్వానికి హద్దే లేకపోయింది.

అయ్యో! నేను మిక్కిలి నిందనీయమైన వేశ్యా వృత్తిని ఆశ్రయించి విలువైన జీవితాన్ని వ్యర్థం చేసుకొన్నాను. ఈ వృత్తిలో శరీరాన్ని మనస్సును మలినం చేసుకొన్నాను. క్లేశాలు బాధలు నన్నాశ్రయించాయి. శరీరం అమ్ముకొని జీవించాను. ఎంత హేయమైన పనిచేశాను! ఈ శరీరం కొరకు కాముకులు వ్యసనపరులు హీనులు చరిత్రహీనులు వచ్చి ధనం వెదజల్లి నన్ను సర్వనాశనం చేశారు. ఎంత బుద్ధి తక్కువ దానినైనాను. ఈ శరీరంతో ధనం రతి సుఖం పొందుతూ నశించిపోయాను! ఛీ! ఛీ! ఎంత పని చేశాను.

ఈ శరీరం ఒక కొంప. దీనికి ఎముకలు స్తంభాలు వాసాలు. చర్మంపై కప్పు. రోమాలు కేశాలుపై అలంకారాలు. దీనికి తొమ్మిది వాకిళ్ళు. ఈ వాకిళ్ళ గుండా మలిన పదార్థాలు పోతుంటాయి. వ్యర్థ పదార్థాలు జేరుతుంటాయి. మల మూత్ర రక్తాదులు ఇందులో ఉంటాయి. నావంటి హీనురాలు కాక మరెవరు ఈ శరీరాన్ని, మలినాల కొంపను అతి ప్రియంగా చూచుకొనేది !

అయ్యో! ఈ నగరం ఎంత పవిత్రమైనది! విదేహ నగరం జీవన్ముక్తుల నగరం.

పరమ వేదాంతుల జ్ఞాన భాండాగారం. జ్ఞానఖని జనకరాజు రాజధాని. ఇంత మహా నగరంలో నేనే కులటను. మూర్ఖురాలను దుష్టురాలను. నేనొక్క దానినే ఆత్మజ్ఞాన ప్రదాతయగు పరమాత్మను విడిచి అన్య కాముక జనులను జేర్చుకొని సుఖాలు అనుకొని దుఃఖాలను కౌగలించు కొన్నాను. ఎంత పతితనైనాను.

ప్రభువు దయామయుడు. క్షమిస్తాడు. శరణువేడు కొంటాను. ప్రభువు పరమాత్మ నా హృదయంలో విరాజిల్లుతూ ఉన్నాడు. నాహృదయంలోని వానిని నేటికి కనుగొన కలిగాను. ఆ స్వామి సమస్త ప్రాణుల హితైభిలాషి. సుహృన్మణి. ప్రియతమ బంధువు. స్వామి సర్వాంతర్యామి. పరమాత్మ పరమ ఆప్తుడు. ఇపుడు స్వామికి నా సర్వస్వం సమర్పించి ఆత్మ సమర్పణంతో స్వామిని చేరుకొంటాను. స్వామి పాద సేవ చేసి చేసి లక్ష్మీదేవి వలె పదాల సరసన నిలుస్తాను. స్వామి నన్ను స్వీకరిస్తాడు.

ఎంత పొరపాటు చేశాను! లౌకిక భోగభాగ్యాలు ఆశించి ధనికులను జేరి ఏమి సుఖం పొందాను. వారిచ్చిన సుఖ సంపద ఎంత! వారు అల్పులు. అల్ప సుఖాలు చూపి నన్ను దోచుకొన్నారు. వారు జీవన్మరణ చక్రంలో పడి నలిగి పోయేవారు. వారి సుఖం వారు చూచుకోలేని అల్పులు ఇతరులనేమి సుఖపెట్ట గలరు. సుఖపెట్టువాడొక్క సర్వేశ్వరుడే సమర్థుడు. ఈ మనుష్యులే కాదు దేవతలు సయితం ఇంతే. దేవతలు కూడా భోగాలతో భార్యలను సుఖపెట్టలేకపోయారు. సర్వేశ్వరుని ముందు సర్వులు అల్పులే. కాల ప్రవాహంలో వీరందరు కొట్టుకుపోయేవారే. నా ఏ పూర్వ పుణ్య వశంచేతనో విష్ణు భగవానుడు నన్ను అనుగ్రహించాడు. నేటికి దురాశ దూరమై వైరాగ్య భాగ్యోదయం కల్గింది. ఇది నాకు శుభోదయం. నా వైరాగ్యం నాకు పరమ సుఖం ప్రసాదించు గాక! భగవానుడు కృపవహించు గాక! కరుణించుగాక!

నేనెంతో అదృష్టవంతురాలను. స్వామి కృపకు యోగ్యురాలను అయ్యాను. దుఃఖాలు కష్టాలు అనుభవించక వైరాగ్యం ఎలా ప్రాప్తిస్తుంది. వైరాగ్యం వల్లనే గృహ బంధాలు తొలిగిపోతాయి. శాంతి వీచికలు స్పృశిస్తాయి. భగవంతుని ఉపకారం నే మరవలేను. అందుకు శిరసు వంచి నమస్కరిస్తాను. విషయ భోగ లంపటాలు దురాశామయ జీవనదారుణ హేలలు మాని మహా విష్ణు పాదాలు ఆశ్రయిస్తాను. ఆనంద సామ్రాజ్యాలు అనుభవిస్తాను.

నాకు ప్రాప్తించినదే పదివేలుగా భావించి జీవితాన్ని మంచి మార్గంలో నడుపు కొనుచూ సంతృప్తిగా గడుపుతాను. శ్రద్ధగా భక్తిగా రామపాదం భజిస్తాను. అన్య పురుషుని చూడక లోకేశ్వరుడు నా హృదయేశ్వరుడు అయిన జగత్ ప్రభుపాదాలను స్మరిస్తాను.

ఈ జీవి సంసార కూపంలో మునిగి ఉంది. విషయ వాసనల ఊబిలో దిగబడిపోయి ఉంది. కాలం అనే అజగరం నన్ను మ్రింగబోతోంది. నన్ను నా వంటి పాపాత్మురాలిని ఎవరు కాపాడగలరు? ఆ కమలాకాంతుడే నాకు దిక్కు. ఆ ఒక్క దేవుడే నన్ను కాపాడ సర్వ సమర్థుడు. ఆ దేవుడే నాకు శరణం. విషయాలు వీడిన వానిని స్వామి రక్షిస్తాడు. కాలం అనే కాలనాగు గరళ కంఠుని కమనీయ హారం కదా! కరుణతో స్వామి నన్ను కాపాడతాడు."

బ్రాహ్మణ ఉవాచ -

> ఏవం వ్యవసిత మతిర్దురాశాం కాంత తర్షజామ్ ।
> ఛిత్త్వోపశమ మస్థాయ శయ్యా ముప వివేశ సా ॥
>
> ఆశా హి పరమం ధుఃఖం నైరాశ్యం పరమం సుఖమ్ ।
> యథా సచ్ఛిద్య కాంతాశాం సుఖం సుష్వాప పింగళా ॥

అవధూత ఇలా అన్నాడు - రాజా! పింగళా వేశ్యామణి ఇలా నిశ్చయించుకొని ధనవంతులపై ఆశలు వీడి, వారిని కలవాలనే కోరికలు లేకుండా శాంతంగా శయ్యపై శయనించింది. ఆశయే దుఃఖం. నిరాశయే సుఖం. పింగళ పురుష వాంఛ వదలి సుఖంగా నిద్రించింది.

18. వడ్రంగి పిట్ట -

అవధూత ఇలా వచించాడు - ఓ యయాతి కుమారా! మనుష్యులు మిక్కిలి ప్రియమైన వస్తువులు చూచినపుడు వాటిని సేకరించి ప్రోగు చేస్తారు. చివరకు అవే దుఃఖ కారణాలవుతాయి. బుద్ధిమంతుడైన పురుషుడు వస్త్వాకరణ గ్రహించి ఆ వస్తువుల వైపుకే వెళ్ళడు. ఆకర్షణకు లోనుగాడు. విలపించడు. చేతులతోనే కాదు మనస్సుతో కూడా దేనినీ వాంఛించడు. అట్టి బుద్ధిశాలికి అనంత సుఖ స్వరూపమైన పరమాత్మ అనుగ్రహం ప్రాప్తిస్తుంది.

ఒక కురరం ముక్కుతో మాంసం ముక్క పట్టుకొని వెళుతోంది. దానిని బలమైన పక్షి చూచి మాంసం ముక్క కోసం దాని మీద పడి గీచిరాచి రంపాన పెట్టింది. ఎప్పుడైతే ఆ కురరం మాంసం విడిచి పెట్టిందో దానికి ప్రాణగండం తప్పింది. సుఖాన మనకలిగింది.

19. బాలుడు -

రాజా ! నాకు మానావమాన చింతలేదు. ఇతర గృహస్థుల కుండే పట్టింపులు -

గౌరవమర్యాద హద్దులు లేవు. నేను నా ఆత్మలో రమిస్తుంటాను. నాలో నేను క్రీడిస్తుంటాను. దీనిని నేను బాలుర నుంచి నేర్చుకొన్నాను. కనుక బాలకుల వలె ఎప్పుడూ ఆనందంగా ఉంటాను. ఈలోకంలో రెండు రకాల వ్యక్తులు పరమానందం పొందుతుంటారు. ఒకరకం అమాయకులైన పసిబాలురు. రెండవ రకం గుణాతీతులైన మహాపురుషులు.

20. కుమారి -

ఒకసారి పెండ్లి చూపులకై ఒక అమ్మాయి ఇంటికి బంధుజనులు వచ్చారు. ఆ సమయానికి ఇంటిలోని పెద్దవారు పొరుగూరికి ఏదో పనుండి వెళ్ళారు. పెండ్లి కూతురొక్కతే ఇంట్లో ఉంది. వచ్చిన బంధువులకు మర్యాదలు చేసి భోజనం చేసి వెళ్ళండని వారి ప్రయాణం ఆపింది. రాజా ! ఆ యువతీరత్నం ఏకాంతంగా దొడ్డిలో వడ్లు దంచి బియ్యం చెరుగ సాగింది. అపుడు చేతికున్న గాజులు పెద్దగా ధ్వని చేయసాగాయి. బియ్యం చెయ్యాలి. గాజులు చప్పిడి చేస్తున్నాయి.

ఆ ధ్వనులు వియ్యానికి వచ్చినవారు వినిపోతారని ఆ అమ్మాయి సిగ్గుపడింది. 'ఏరోజు కారోజు బియ్యం చేసుకొనే బీదవారు వీరు అని తలపోస్తారేమో బిడియపడి ఎలానా! అని ఆలోచించింది. చేతి గాజులు రెండు రెండు మాత్రం ఉంచి మొత్తం గాజులు తీసి వేసింది. దంచుతుంటే లేక చెరుగుతుంటే అవి కూడ మ్రోగుతున్నాయి. ఒక్కొక్కటి మాత్రముంచి మొత్తం గాజులు తీసి వేసింది. ఇక నిశ్శబ్దంగా ఉంది. బియ్యం చేసింది వండిపెట్టింది. రాజా! అపుడు నేను లోకుల ఆచారాలు పరిశీలిస్తూ ఆయాగ్రామాలు తిరుగుతుండే వాణ్ణి. నా కప్పుడు ఆ బాలా మణిని చూచి ఒక నీతి పాఠం తోచింది. ఎక్కువ జనం ప్రోగయితే అల్లరి. ఇరువురే ఉంటే లోకాభిరామాయణం. కుమారీమణి హస్త కంకణం వలె ఒక్కటే ఉంటే ఆత్మ విచారం.

21. విల్లంబులు చేయువాడు -

రాజా ! నేను బాణాలు చేసే వానిని చూచి ఒకటి గ్రహించాను. ఆసనం వేసుకొని శ్వాసబిగించి వైరాగ్య అభ్యాసాల ద్వారా మనస్సును వశీభూతం చేసుకొని సావధానంగా లక్ష్యసిద్ధిజేరాలి. పరమానంద స్వరూపమైన పరమాత్మలో మనస్సును సుస్థిరం చేయాలి. అపుడు క్రమక్రమంగా కర్మవాసనలు కడిగివేయ బడతాయి. సత్త్వగుణ వృత్తి వలన రజస్తమ వృత్తులు హరించి మనస్సు శాంతిస్తుంది. కట్టెలు లేకపోతే అగ్నిహోత్రం చల్లారక ఏమి చేస్తుంది కనుక. ఈ విధంగా చిత్తాన్ని ఈశ్వరుని యందు అనగా ఆత్మయందు స్థిరం చేయాలి. అపుడు చిత్తం బాహ్య వస్తువుల పైకి పరువెత్తదు. కొలిమిలో ఇనుపబాణాలు తయారుచేసే కమ్మరీడు ఎంత ఏకాగ్ర భావంతో ఉంటాడో చూడు. ఆ వైపు రాజ సైన్యం

వెళ్ళుతున్నా అతనికి తెలియదు. ఆ విధంగా మనస్సు మాధవునిపై లగ్నమై పోవాలి. అది బాణాల వానిని చూచి గ్రహించాను.

22. సర్పం -

ఓ యదురాజా! సర్పాన్ని చూచి గ్రహించాను. ఏమంటే దాని జీవనం, ఏకాంత వాసం నాకు పాఠం నేర్పాయి. సన్యాసి సర్పం వలె ఏకాంతంగా సంచరిస్తుండాలి. పది మందితో కలసి జీవించరాదు. మఠాలు ఆశ్రమాలు వ్యర్థం. సన్యాసి ఒకే చోట వసించరాదు. ఒకరింట్లోనే ఉండి భుజిస్తూ కూర్చోరాదు. ఇల్లు లేక ఆశ్రమం కట్టుకొంటే బయట సంగతులే తెలుసుకొనే అవకాశ ముండదు. సన్యాసి ఎవరి సహాయం కోరరాదు. సన్యాసి మితభాషిగా ఉండాలి.

అనిత్య దేహం కొరకు ఇల్లు కట్టుకొని రొంపిలో పడటం మంచిది కాదు. గృహం దుఃఖానికి పాదు. సర్పం చూడు. ఇతరుల ఇళ్ళలోకి వెళ్ళి తన సమయం సుఖంగా వెళ్లబుచ్చుతుంది.

23.సాలె పురుగు :

యదురాజా ! సాలెపురుగు నుండి పాఠం గ్రహించాను. ఏకైక నారాయణ దేవుడు పూర్వం ఎవరి సహాయం లేకుండా తన మాయా బలంతో జగత్తును సృష్టించాడు. అది కల్పాంతంలో కాలానికి ఆహుతి అవుతుంటే ఆ జగత్తును శివుడు తన గర్భంలో లీనం చేసుకొన్నాడు. సజాతీయ విజాతీయ స్వగత భేదాలతో ఒక శూన్య స్థితికి జేరింది. ఈశ్వరుడు సర్వాధిష్ఠాన పురుషుడు కదా! ఆయనే అన్నిటికీ ఆశ్రయుడు ఆధారుడు. ఆయనకు మరొక ఆధారం ఆశ్రయం ఉండదు. స్వయం ప్రకాశ సర్వశక్తి స్వరూపుడు. సర్వాధిపతి. సర్వ నియామకుడు. ప్రకృతి పురుషులను నియమించేది ఆయనే. కార్య కారణాత్మకుడు ఆ స్వామి. జగత్తుకు ఆది కారణభూతుడు. పరమేశ్వరుడు. తన కాల శక్తి ప్రభావంతో సత్త్వ రజస్తమాది సమస్త శక్తులను క్రమంగా నడుపుతుంటాడు. కానీ ఆయనకు పట్టనట్లే ఉంటాడు. సర్వం జరిపిస్తుంటాడు. ఆయన కైవల్య రూపుడు. ఏకైకమూర్తి, అద్వితీయుడు. అనుభవ స్వరూపుడు ఆనంద స్వరూపుడు. ఏ ఉపాధులతోనూ స్వామికి సంబంధం లేదు. ఆయన కావాలనుకొంటే అన్నిటితోనూ సంబంధం పెట్టుకొంటాడు. ఉపాధులు కల్పిస్తాడు. విసర్జిస్తాడు. ప్రభువు తన త్రిగుణాత్మక మాయను క్షోభిల్ల జేస్తాడు.

ప్రధాన క్రియా శక్తి ద్వారా సూత్ర రచన చేస్తాడు. ఇదే సృష్టికి మూలకారణ సూత్రం. ఈ సూత్రంలోనే విశ్వం పడుగు పేకగా విస్తరించింది. ఈ కారణం చేతనే జీవికి జన్మ మృత్యు

చక్రం భ్రమిస్తున్నది. సాలె పురుగు తన మనస్సు నుండి నోటి ద్వారా వల వ్యాపింప చేస్తుంది. ఆ వలలోనే ఆనందంగా సంచరిస్తుంది. కొంత కాలానికి దానిని వెళ్ళ కక్కేసి లేక మ్రింగేసి పోతుంది. ఆ విధంగానే ఈశ్వరుడు కూడా జగత్తును తన శక్తి ద్వారా సృష్టిస్తాడు. జీవరూపం ధరించి విహారం చేస్తాడు. మరల అదే జగత్తును తనలోనే లయం చేసుకొంటాడు.

24. భ్రమరకీటం -

రాజా! నేను భ్రమరకీటం నుండి ఒక పాఠం గ్రహించాను. ప్రాణి ప్రేమ వలనగానీ, ద్వేషం వలనగానీ, భయం వలనగానీ, తెలిసి ఏకాగ్రనిష్ఠతో గానీ మనస్సును ఒకే వస్తుపై లగ్నం చేస్తే కొన్నాళ్లకు ఆ వస్తు రూపం తాను పొందుతుంది.

రాజా! భ్రమరకీటం అని పురుగు కథ చూడు. భ్రమరం ఒక పురుగును తెచ్చి గోడపై తన గూటిలో పెట్టి మార్గం మట్టితో కప్పివేస్తుంది. ఆ పురుగు భయంతో భ్రమరాన్ని చింతిస్తూ చింతిస్తూ తన రూపం వీడి భ్రమర రూపం దాల్చి గూటిని ఛేదించుకొని భ్రమరాలలో కలసిపోతుంది. పురుగు శరీరంతో చింతనం చేసి రూపం గ్రహించబడుతోంది. మనుష్యుడు అన్య రూప చింతన చేయక పరమాత్మను చింతిస్తే పరమాత్మ రూపం పొందవచ్చు కదా. యదురాజా! ఈ విధంగా అనేక మంది గురువుల నుండి నీతి పాఠాలు నేర్చుకొన్నాను. ఇంకనూ నేను నా శరీరం నుండి కొంత నీతి గ్రహించాను. చెప్తాను విను.

సంసార జంజాటము

రాజా ! ఈ శరీరం కూడా నాకు గురువే. ఇది నాకు వివేకం వైరాగ్యం నేర్పింది. తల్లి గర్భం నుంచి లోకం విడిచే వరకు నన్నే అంటి పెట్టుకొని ఉంటుంది. దీనితో కొన్ని దుఃఖాలున్నా కొన్ని లాభాలున్నాయి.

ఈ శరీరం ద్వారానే తత్త్వ విచారణ చేసే సదుపాయం ఉంది. ఈ శరీరం నాది అనుకోను. ఇది ఒకానొక దినం నన్ను వీడి పోయేదే. ఆ సంగతి తెలుసు. ఇది చివరకు ఏ కుక్కలకో నక్కలకో ఆహారం అయ్యేదే. కనుక నేను దీనిని మిక్కిలిగా ప్రేమించను- ముట్టీ ముట్టనట్లే ఉంటాను.

రాజా! ప్రజలు ఈ శరీరాన్ని మిక్కిలి ప్రేమిస్తూ దీని సౌందర్యానికి సంరక్షణానికి అనేక కృత్యాలు చేస్తుంటారు. స్త్రీ పుత్ర బంధు వర్గాలు భోగాలు భాగ్యాలు సంపదలు సేవకులు భృత్యులు పరిచారకులు మొదలైన వారిని ఏర్పాటు చేసుకొని పోషిస్తూ భరిస్తూంటారు. కష్టాలు సహించి ధనం కూడబెడతారు. గొడ్డూ గోదలతో వస్తు వాహనాలతో

మంది మార్పులంతో ప్రకాశించి ఆయుస్సు దీరగానే శరీరం నశిస్తుంది. వృక్షాలు తన బీజాలు భూమిపై చల్లి ఎండిపోయినట్లుగా ఈ శరీరాలు కూడా కొన్ని శరీరాలను సృష్టించి నిష్క్రమిస్తాయి. ఈ శరీర క్రమవ్యవస్థ నుండి దుఃఖ వ్యవస్థ జారీ అవుతూంటుంది.

బహు భార్యలను పెండ్లాడిన వానిని భార్యలు తమ తమ వైపుకు లాక్కుపోయి బాధించినట్లు గానీ ప్రాణిని జిహ్వేంద్రియం స్వాదు పదార్థాలకు, మధుర పానీయాలకు ఒక వైపు లాగితే జననేంద్రియం స్త్రీ సుఖం కోసం లాగుతుంది. చర్మం స్పర్శకు, ఉదరం భోజనానికి శ్రవణం మధుర శబ్దాలకు లాగుతుంటాయి. నాసిక సువాసనలకు చంచల నేత్రాలు రూప సౌందర్యం కొరకు ప్రాణిని వేధిస్తుంటాయి. ఈ విధంగానే జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు సపత్నులవలె జీవిని బాధిస్తుంటాయి.

ఈశ్వరుడు తన అచింత్య శక్తి గల మాయతో వృక్షాది సరీసృపాది సర్పాదులను పశువులను, పక్షులను, చేపలను అనేక జీవులను సృష్టించాడు. కానీ తృప్తిగా లేదు. చివరకు స్వామి మనుష్యుని శరీరంతో బుద్ధిగల వానిగా బ్రహ్మ సాక్షాత్కార యోగ్యునిగా సృజించి మహానందం జెందాడు. అయితే ఈ మనుష్య శరీరం అనిత్యం. మృత్యువు దీనిని వెంటాడుతూ ఉంటుంది. కాని ఈ శరీరం వలన పరమేశ్వర ప్రాప్తి లభిస్తుంది. అనేక జన్మల అనంతరం ఈ దుర్లభ శరీరం పొంది బుద్ధిమంతుడు మృత్యువు కంటె ముందు మోక్షం సాధిస్తాడు. ఈ జీవన చరమాకాంక్ష మోక్షప్రాప్తియే. విషయ భోగాలు ప్రతి జన్మలోనూ అనుభవిస్తూనే ఉన్నాము. కేవలం విషయ భోగాల కొరకు మనుష్య జన్మ యెత్త వలసిన అవసరం లేదు. దానికై విలువైన మనుష్య జన్మ వ్యయించవలసిన అవసరం లేదు.

ఏవం సంజాత వైరాగ్యో విజ్ఞానాలోక ఆత్మని ।
విచరామి మహీ మేతాం ముక్త సంగో నహం కృతిః ॥

రాజా ! ఈ విధంగా జగమంతా చూచి యోచించగా వైరాగ్యం కలిగింది. హృదయంలో జ్ఞాన విజ్ఞాన జ్యోతి ప్రకాశించసాగింది. నాకిక ఏ ఆసక్తీ లేదు. అహంకారం లేదు. ఇప్పుడు స్వచ్ఛందంగా భూమి నలువైపులా సంచరిస్తున్నాను.

నహ్యేకస్మాద్ గురోర్జ్ఞానం సుస్థిరం స్యాత్ సుపుష్కలమ్ ।
బ్రహ్మైత దద్వితీయం వై గీయతే బహుధర్షిభిః ॥

రాజా ! ఒంటరిగా గురువు వలననే యథేష్ట సుదృఢ జ్ఞానం కలుగదు. జ్ఞానం కొరకు నీ బుద్ధితో పరిశీలించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఋషీశ్వరులు ఏకైక బ్రహ్మాన్ని అనేక విధాల గానం చేస్తుంటారు. ఏకం సత్ బహుధా వదంతి. బ్రహ్మాన్ని నీవు ఒకడివే నిర్ణయించలేవు.

శ్రీ భగవాన్ ఉవాచ -

శ్లో॥ ఇత్యుక్త్వా స యదుం విప్రస్త మామంత్ర్య గభీరధీః ।
వందితో2 భ్యర్థితో రాజ్ఞా యయౌ ప్రీతో యథాగతమ్ ॥

శ్లో॥ అవధూత వచః శ్రుత్వా పూర్వేషాం నః స పూర్వజః ।
సర్వ సంగ వినుర్ముక్తః సమచిత్తో బభూవ హ ॥

శ్రీ కృష్ణ భగదవానుడిలా అన్నాడు - ఉద్ధవా ! గంభీర హృదయుడైన అవధూతాగ్రణి యదురాజుకు ఈ విధంగా ఉపదేశం చేశాడు. రాజు అవధూతను అర్చించి నమస్కరించాడు. అవధూత స్వామి రాజు నుండి అనుమతి తీసుకొని యధేచ్ఛ వెళ్ళి పోయారు.

మా యదువంశ పూర్వీకుడైన యయాతి సుతుడు అవధూత ఉపదేశం పొంది సమస్త విధాలైన ఆసక్తులు త్యజించి సమదర్శియై సమ బుద్ధి కలిగియున్నాడు. అట్లే సాధువు సమదర్శి కావాలి.

భోగాలు నిస్సారాలు

శ్రీ కృష్ణ భగవానుడిలా బోధించసాగాడు- ఉద్ధవా! భక్తులైన సాధకులు అన్నివిధాల నా శరణ్యంలో ఉండి నాచే చెప్పబడిన ధర్మాలను జాగ్రత్తగా పాలిస్తుండాలి. ధర్మాచరణలో వ్యతిరిక్తత లేనంత వరకు నిష్కామ భావంతో తమ తమ వర్ణ ఆశ్రమ కులాచారాలను అనుష్ఠిస్తుండాలి.

నిష్కామ భావం అనగా స్వధర్మపాలనం. శుద్ధ హృదయంతో విచారణ చేయాలి. లౌకిక ప్రాణి శబ్ద స్పర్శ రూపాది విషయాలను పొందుటకు ప్రయత్నించటంలో అతని ఉద్దేశ్యం సుఖం లభిస్తుంది! సుఖం అనుకోనే కదా!

విచారణ ఈ విధంగా సలపవలసియున్నది - స్వప్నావస్థలో మనోరథాలు భావన చేసే సమయంలోనూ జాగ్రదవస్థలో కూడా మానవుడు మానసికంగా అనేక విషయ సుఖాలు అనుభవిస్తుంటాడు. కానీ ఈ కల్పన అంతా వస్తు శూన్య కారణంగా సర్వం వ్యర్థమే. అలానే ఇంద్రియాల ద్వారాజరిగే భేద బుద్ధులు వ్యర్థములే అవుతాయి. ఇవి ఇంద్రియ జన్య నానా వస్తు విషయికాలు కనుక వెనుకటి వలెనే ఇవి కూడా అసత్యాలే.

ఉద్ధవా! నా శరణ్యం లోనికి వచ్చిన భక్తుడు సదా అంతర్ముఖుడై నిష్కామ భావంతో నిత్య కర్మలు నిర్వర్తిస్తుంటాడు. అతడు సకామ్య కర్మలు బాహ్యాడంబర కార్యాలు పరిత్యజిస్తాడు. అతనిలో ఆత్మజ్ఞాన కాంక్ష మిక్కిలి ఎక్కువై మేలు కొన్నట్లయితే కర్మ సంబంధ కార్య కలాపాలు పాటించ నవసరం లేదు.

అహింసాది యమ నిష్ఠలు శౌచాది నియమనిష్ఠలు భక్తుడు పాటించాలి. ఆత్మజ్ఞాన సోపాన క్రమానికి అడ్డు వచ్చినవి ఉపేక్షించిననూ దోషం రాదు. ఆత్మజ్ఞానం ముఖ్యం. జిజ్ఞాసువు యమ నియమ పాలనం కంటె గురూపదేశం కంటే మరియు నా యొక్క స్వరూప సాక్షాత్కారం పొందటం అవసరం. భక్తుడు సర్వదా శాంత స్వభావం కలిగియుండాలి. నా స్వరూప స్వభావ జ్ఞానం కలిగి నన్ను సేవిస్తుండాలి. నన్నే గురువుగా తల్లి తండ్రులుగా ఆత్మీయులుగా నమ్మి సేవచేయటం భక్తుడైన సాధకునకు ముఖ్యాతి ముఖ్యం.

ఉద్ధవా! శిష్యుడు కించిత్తు కూడా గర్వం అభిమానం వహించరాదు. మాత్సర్యం బూనరాదు. ఎవరిని గూర్చి చెడుగా భావించరాదు. ప్రతి కార్యంలో కౌశలత్వం కనబరచాలి. బద్ధకం అనేది పనికిరాదు. ఎక్కడా మమకారం చూపరాదు. గురుచరణాలపై దృఢమైన భక్తి కలిగి ఉండాలి. ఏ పనీ ఆడంబరంగా చేయరాదు. జాగ్రత్తగా పూర్తిగా బాగుగా నిర్వర్తించాలి. సదా పరమార్థ సంబంధ జ్ఞానం పొందాలనే అభిలాష కలిగి ఉండాలి. ఎవరిలోనూ దోషాలు వెతకరాదు. అనవసర సంభాషణలు చేయరాదు.

జిజ్ఞాసువుకు పరమధనం ఆత్మ ఒక్కటే. భార్యాపుత్రులపై గృహక్షేత్రాలపై స్వజనులపై ధన సంపదలపై సమస్త పదార్థాలపై సమభావం సమచిత్తం కలిగి పరమాత్మ దృష్టితో సంచరిస్తుండాలి. ఏ వస్తువుపై కానీ వ్యక్తి పై కానీ విశేష మమకార వాత్సల్యాలు చూపరాదు. అందరి యెడల ఉదాసీన వైఖరి బూని సమానమైన ఆత్మదృష్టి ప్రసరిస్తుండాలి. ఉద్ధవా ! కాలిపోయే కట్టెల కంటే కాల్చే అగ్ని వేరు. ఆ విధంగానే ఆలోచన చేయగా పంచ భూతాలతో నిర్మితమైన స్థూల శరీరం ఒకటి. మనస్సు బుద్ధి మొదలైన పది తత్త్వాలు గల సూక్ష్మశరీరం మరొకటి. రెండూ దృశ్యాలు. జడపదార్థాలు. ఈ శరీరాలను తెలుసుకొనేది ప్రకాశింపజేసేది ఆత్మ. ఆత్మ సర్వ సాక్షి. స్వయం ప్రకాశం. శరీరం జడం. అనిత్యం. ఆత్మ నిత్యం చైతన్యవంతం. ఈ విధంగా శరీరం కంటె విలక్షణమైనది ఆత్మ కనుక దేహం వేరు ఆత్మ వేరు.

కాష్ఠంలో అగ్ని ప్రజ్వలితమగునప్పుడు కాష్ఠం యొక్క ఉత్పత్తి రూపాది వివిధ గుణాలు అగ్ని గ్రహించి దహింపజేస్తుంది. కానీ అగ్నికి కఱ్ఱ యొక్క గుణాదులతో సంబంధంలేదు. అలానే ఆత్మ శరీరాన్ని తనదిగా తలంచినట్లు అనిపిస్తుంది కానీ శరీరం యొక్క జడత్వం, అనిత్యత్వం, స్థౌల్యం ఆది గుణాదులతో ఆత్మకు సంబంధం ఉండదు. కానీ శరీరంతో పాటు ఉంటూ ఉంటుంది.

ఈశ్వర ప్రేరిత మాయా గుణాలు స్థూల సూక్ష్మ శరీరాలను నిర్మిస్తాయి. జీవాన్ని శరీరంగానూ, శరీరాన్ని జీవంగానూ భావించటం వల్లనే స్థూల శరీర జన్మ మరణాలు సూక్ష్మ శరీర గమనాగమనాలు ఆత్మపై ఆరోపింప బడుతున్నాయి. జన్మ మృత్యు రూప సంసారం

ఈ భ్రమ లేక అభ్యాస కారణంగా ప్రాప్తిస్తూంది. ఆత్మస్వరూప జ్ఞానం కలుగగానే ఈ సంసారం కూకటి వేళ్ళు తెగిపోతాయి.

ఉద్ధవా ! జన్మమృత్యు సంసార చక్రానికి మరో కారణం లేదు. కేవలం అజ్ఞానమే. కాబట్టి ఆత్మజ్ఞానం తెలుసుకోవాలి. ఈ ఆత్మజ్ఞానం వాస్తవంగా సమస్త ప్రకృతికీ, ప్రాకృత జగత్తుకీ అతీతమైనది. ద్వైతం గంధ రహితమైనది. స్వయం ప్రకాశమైనది. తనలోతాను పరిపూర్ణమూ సుస్థిరమూ అయినది. ఇది మరొక దానిపై ఆధారపడినది కాదు. దీనిని ఈ రీతిగా తెలుసుకొని క్రమక్రమంగా స్థూల సూక్ష్మ శరీరాదులపై గల సత్యత్వ బుద్ధిని వదులుకోవాలి. ఆత్మయే అన్నిటికి ఆధారమని స్థిరబుద్ధి కలగాలి.

యజ్ఞయాగాదులలో అరణి మధనం చేసి అగ్నిని ఆవిర్భవింపజేస్తారు. దీనిలో పైన క్రింద రెండు సమిధలుంటాయి. మధ్యలో మథన కాష్ఠం ఉంటుంది. మథించటం వలన అగ్ని పుట్టుక వస్తుంది. అట్లే విద్యారూపమైన అగ్ని ఉత్పత్తికి ఆచార్యుడు శిష్యుడు ఇరువురు పైన క్రింద గల అరణి సమిధల వంటివారు. ఉపదేశమే మధన కాష్టం. దీనితో జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఆ జ్ఞానాగ్ని విలక్షణమైన సుఖానుభూతిని కలుగజేస్తుంది.

ఈ జ్ఞాన యజ్ఞంలో సుబుద్ధియైన శిష్య చూడామణి సద్గురువు ద్వారా అత్యంత విశుద్ధ జ్ఞానం పొందుతాడు. గుణాదులతో పొందిన మాయా విషయాలను భస్మం జేస్తాడు. ఆ తరువాత మాయనే భస్మం జేస్తాడు. మాయా సంసారం మాయమైపోతుంది. చివరకు ఆత్మ ఒక్కటే మిగిలి ప్రకాశమానం అవుతుంది. ఆ విధంగా జ్ఞానాగ్ని వాస్తవిక రూపంలో శాంతిని ప్రసాదిస్తుంది. సమిధలు లేకపోతే అగ్నిహుతమై పోయినట్లు అగ్ని చల్లారి పోయినట్లు సర్వమూ శాంతి వహిస్తుంది.

స్వయం ప్రకాశం, జ్ఞాన స్వరూపం, నిత్యమైనది ఆత్మ. కర్తృత్వ భోక్తృత్వాది ధర్మాలు దేహ కారణాలు. ఆత్మ లేకుండా ఉండేవి అనిత్యాలు. మాయాజాలాలు. కనుక ఆత్మజ్ఞానంతోనే సమస్త విపత్తులు తొలిగి విముక్తి లభిస్తుంది.

ఉద్ధవా! నీవు అజ్ఞాన వశం చేత కర్మలకు కర్తగా సుఖదుఃఖములకు భోక్త జీవులుగా, కాలవేద ఆత్మలుగా భావిస్తున్నావు. సమస్త పదార్థ స్థితిని ప్రవాహం వంటిదని ఇది నిత్య యధార్థమని తలంచుతున్నావు. ఘట పటాది బాహ్య కృతుల భేదాలను అనుసరించి జ్ఞానం ఉత్పన్నమవుతుందని ఇది అంతా మారుతుండుట సహజం అని ఊహిస్తున్నావు. కానీ ఇది అంతయు అర్థ రహితం. నీవు కర్త భోక్తవు అనుకొనుటే పొరపాటు.

జగత్తుకి కర్త నిత్య సత్తా గలది ఆత్మ. జన్మ మృత్యు చక్రానికి నివృత్తి లేదు. ఒకవేళ

నీవు ఇదే మతాన్ని అనుసరిస్తే సంవత్సరావయవ సంబంధితుడైన జీవికి జనన మరణాద్యవస్థలు తప్పవు. దేహాది పదార్థాలకు నీవు నిత్యత్వం సీకరించినట్లే అవుతుంది. కర్త భోక్త అయిన జీవి పరతంత్రుడైనట్లు తోస్తుంది. పరతంత్రుడు కాక స్వతంత్రుడు అయితే దుఃఖ ఫలాలనుభవించ వలసిన అవసరం ఏముంది ?

ఈ మతాన్ని అనుసరిస్తే జీవుడికి ముక్తీ లేదు. స్వతంత్ర్యమూ లేదు. జీవుడు సహజంగానే పరతంత్రుడు వివశుడు అయితే స్వార్థం కానీ పరమార్థంకానీ ఏమా అనుభవించలేడు. అపుడు రెండింటికీ వంచితుడై పోతాడు. క్షుణ్ణంగా కర్మ విధానం ఎరిగిన వారు సుఖిస్తున్నారు. వారు దుఃఖాలే ఎరుగరు అని చెప్పటం సరికాదు. లోకంలో చూస్తున్నాము. కర్మ విధానం తెలిసిన మహామహులు కూడా దుఃఖాల బారి పడక తప్పటం లేదు. ఏమీ తెలియని అజ్ఞులు దుఃఖం కొంచం కూడా పొందటంలేదు. కనుక విధి విధానాలు ఎరిగిన మహా విద్వాంసులమనే గర్వం పొందటం వ్యర్థం.

సుఖప్రాప్తికి దుఃఖ నివారరణకు సరియైన మార్గాలు మహా పండితులు ఎరుగుదురు అని చెప్పలేము. వారు కూడా వినయంగా ఇది సమ్మతించటమే మంచిది. వారికీ తెలియదు. మృత్యువు ఎపుడు కబళిస్తుందో! దేహ త్యాగమేక్షణానో ఎప్పుడు ఏమి జరుగుతుందో! విధి విధానం ఎట్లో! ఎవరికీ తెలియదు.

మృత్యుదేవత నెత్తిన నాట్యం చేస్తుంటే భోగాలు భాగ్యాలు మనిషికి సుఖం ఏమి కల్గిస్తాయి? మనిషిని ఉరిశిక్షకు వ్రేలాడదీసి నీకు ఫలహారాలు గౌరవాలతో పూజిస్తాను అంటే ఏమి సుఖం. పైన వివరించిన అభిమతాన్ని అనుసరించిన సుఖమూ లేదు. పురుషార్థమూలేదు. పుణ్యమూలేదు.

ఉద్ధవా ! లౌకిక సుఖాలు పార లౌకిక సుఖాలు రెండు దోష జన్యాలే సుమా! ఈ సుఖాలు పొందుటకు పోటీ పడుతుంటారు. అల్ప సుఖాలు పొందేవారు. అధిక సుఖాలు పొందే వారిని చూచి అసూయాద్వేషాలు వహిస్తుంటారు. అధిక సుఖాలు పొందేవారిలోని దోషాలు ఎంచబడుతుంటాయి. ద్వేషాలు ఈర్ష్యలు అసూయలు అధికంగానే అచట పనిచేస్తుంటాయి. పుణ్యం క్షయం కావటంతోటే సుఖాల దినాలు కృశిస్తుంటాయి. యజమాన ఋత్విజ పీఠాలపై గలవారి దోషాల వలన విఘ్నాలు సంభవిస్తుంటాయి. పచ్చని పంట పొలాలకు అతివృష్టి అనావృష్టి వలన నష్టం వాటిల్లినట్లు స్వర్గ సుఖాలు విఘ్నాల కారణంగా హరించిపోతుంటాయి. యజ్ఞయాగాది ధర్మకార్యాలు విఘ్నాలు లేకుండ పూర్తి చేసినపుడు స్వర్గలోకాలు ప్రాప్తిస్తాయి. ఆ ప్రాప్తం గూర్చి చెప్తాను విను.

యజ్ఞం చేసేవాడు యజ్ఞం ద్వారా దేవతలను ఆరాధించి స్వర్గం జేరతాడు. అక్కడ తాను పూర్వం సంపాదించుకొన్న పుణ్య ఫలం ఉన్నత వరకు దేవతా భోగాలు పొందుతాడు. అతనికి పుణ్యానుసారం విమానాలలో వైభవ ప్రయాణాలు చేస్తూ సుర సుందరీ మణులతో విహరిస్తుంటాడు. గంధర్వాంగనలు సంగీతాలు వినిపిస్తారు. అతడు ఆ దేవతా స్త్రీల రూపలావణ్యాలకు మోజుపడి ఇతరుల మనస్సులు అసూయ పడేంతగా భోగిస్తుంటాడు.

ఆపుణ్య పురుషుని విమానం అనుకొన్న చోటుకి వెళ్ళి వస్తుంటుంది. ఆ ఘంటికా ధ్వనులు దేవతలనే మోహపెడుతుంటాయి. వళ్ళుపై తెలియక భోగాలు అనుభవిస్తుంటాడు. ఇంతలో పుణ్యం అయిపోతుంది. అతడు ఒక్కసారి స్వర్గం నుండి త్రోయబడతాడు. పుణ్యఫలం ఉన్నంత వరకే స్వర్గ సుఖం. పుణ్యం క్షీణించగానే అతనికి తెలియకుండానే అతడు క్రిందకు నెట్టి వేయబడతాడు. ఇది కాల ప్రభావం.

ఉద్ధవా! లోకంలో మానవులు దుర్మార్గుల స్నేహంలో పడి అధర్మ పరాయణులై ఇష్టం వచ్చినట్లు విచ్చల విడిగా సంచరిస్తున్నారు. లోభ దృష్టి గలవారై గింజ గింజకు కొట్టుకు చస్తున్నారు. సంసార లంపటంలో పడి మంచీ చెడూ కానక ప్రాణులను బాధిస్తున్నారు. విధి విరుద్ధంగా పశువులను బలియిచ్చి భూత ప్రేతాలను ఉపాసిస్తున్నారు. చివరకు వారు పశువులకంటే హీనమైపోతున్నారు. నరకంలో పడిపోతున్నారు. ఘోర అంధకార నరక యాతనలు అనుభవిస్తూ స్వార్థులై పరమార్థ రహితులై అజ్ఞానంలో కొట్టుమిట్టాడు తుంటారు.

సకామ బాహ్య కర్మలన్నీ దుఃఖ ప్రదాలే సుమా! జీవి అహంకారం మమకారం కలిగి ఉన్నంత వరకు జన్మ మృత్యు చక్రంలో తిరుగాడక తప్పదు. మృత్యు ధర్మం గల జీవుడు సుఖం ఏ విధంగా పొంద కల్గుతాడు?

కొన్ని లోకాల యొక్క, లోకాపాలుర యొక్క ఆయువు ఒక కల్పమే ఉంటుంది. లోకాలు లోకపాలురు నేనంటే భయపడుతుంటారు. బ్రహ్మ కూడా నన్ను చూచి భయపడతాడు. బహ్మ వయస్సు కూడా కాల పరిమితమే. రెండు పరార్థాల కాలం మాత్రమే. ఉద్ధవా! సత్త్వ రజస్తమోగుణాలు ఇంద్రియాలను వాటి వాటి చేష్టలలో ప్రేరేపిస్తుంటాయి. ఇంద్రియాలు ఆ పనులు చేస్తుంటాయి. జీవుడు అజ్ఞాన వశంగా సత్త్వరజస్తమో గుణాలను ఇంద్రియాలను కూడా నా ప్రభావ స్వరూపాలని భావిస్తాడు. ఆయా కర్మ ఫలాలు భోగించటానికి పూనుకొంటాడు.

గుణాల విషమత్వం అంటే శరీరంలో నేను నా అభిమానం ఉన్నంత వరకు ఆత్మ

ఏకత్వ అనుభూతి ఉండదు. ఆత్మ అనేకత్వం వలె తోస్తుంది. ఆత్మయొక్క అనేకత్వానుభూతి కలిగినంత వరకు కాలానికీ, లేక కర్మకీ అధీనుడై ఉంటాడు. పారతంత్ర్యం ఉన్నంత వరకు ఈశ్వరుండంటే భయం కలుగుతుంది. నేను నా భావాలను మ్రింగి ఆత్మ అనేకత్వం యొక్క పారతంత్ర్యం యొక్క ప్రభావంగా భావిస్తాడు. వైరాగ్యం వైపు వెళ్ళక బాహ్య కర్మలను సేవిస్తుంటాడు. వాడికి శోక మోహాలు ప్రాప్తిస్తాయి.

ఓ ఉద్ధవా ! మాయా గుణాలలో క్షోభ కలుగు నపుడు ఆత్మకు కాలం జీవం వేదం లోకం స్వభావం ధర్మం ఈ మొదలైన అనేకనామాలు కలిగి నిరూపితమవుతుంటాయి. ఇవి మాయా మయ లక్షణాలు. వాస్తవంగా సత్యం ఆత్మ ఒక్కటే.

శ్రీ ఉద్ధవుడు ఇలా ప్రశ్నించాడు -

శ్రీ కృష్ణ దేవా ! అచ్యుతా ! ఈ జీవుడు దేహాది రూపగుణాలలో కలిసియున్నాడు. అట్టివాడు ఈ దేహంతో చేయబడిన కర్మలు పుణ్యాపాపాలు సుఖ దుఃఖాల వలన లభించే ఫలాలతో సంబంధం కలిగి ఉండకుండ ఉండుట ఎలా సంభవం? లేక ఈ ఆత్మ గుణ నిర్మితం - దేహాదుల సంపర్కం సర్వథా రహితం అంటే మరి దీనికి బంధనం ఎలా ప్రాప్తిస్తుంది? బద్ధ పురుషులు ముక్త పురుషులు ఎలా ప్రవర్తిస్తుంటారు ? వారు ఎలా విహరిస్తుంటారు? వారిని గుర్తించటానికి గల లక్షణాలు ఏమిటి? వారు ఎలా భుజిస్తుంటారు? మూత్ర మల విసర్జన ఎలా చేస్తుంటారు? ఎలా నిద్రిస్తారు? ఎలా కూర్చుంటారు? ఎలా నడుస్తారు?

అచ్యుతా! ప్రశ్నలోని మర్మం తెలిసిన వారిలో మీరు శ్రేష్ఠులు. కనుక ఈ ప్రశ్నకు సమాధానం ఈయగోరుతున్నాను. ఒకే ఆత్మ అనాది కాలం నుండి గుణ సంసర్గంతో నిత్య బద్ధమైనట్లు తెలుస్తోంది. అసంగత్వం వలన నిత్య ముక్తం కూడా ఇదే. ఈ విషయం గూర్చి నాకు భ్రమ కలుగుతోంది.

బద్ధ ముక్త భక్త లక్షణాలు

ఉద్ధవా ! ఆత్మ బద్ధమూ ముక్తము. అని వ్యవహరించటం నా అధీనంలో ఉండే సత్త్వ గుణాదులు గల ఉపాధి వారికి యుక్తమువుతుంది. తత్త్వ దృష్టితో కాక వస్తుతః అన్ని గుణాలు మాయా మూలకాలు. ఇంద్రజాలాలు. మాయా నాటాకాలు. కనుక మోక్షమూ లేదు బంధమూ లేదు. ఇది స్వప్నం. మిధ్య. లేనిది ఉన్నట్లు భాసిస్తుంది. అలానే శోక మోహాలు, సుఖదుఃఖాలు, శరీర జననం, శరీర మరణం అన్నీ ప్రపంచ మాయా కారణాలు. వాస్తవాలు కావు.

ఉద్ధవా ! శరీరధారులకు ముక్తి అనుభవం కలిగించే ఆత్మ విద్య - బంధనానుభవం కలిగించే - అవిద్య ఈ రెండునూ నా అనాది శక్తులు. ఇవి మాయతో ఏర్పాటు చేయబడినాయి. వీనికొక అస్తిత్వం అంటూ లేదు.

ఉద్ధవా! నీవు స్వయంగా మంచి బుద్ధి బలం గలవాడివి. ఆలోచించు. జీవం గలవాడవైతే ఒక్కడే. వాడు వ్యావహారికం కొరకు నా అంశంగా కల్పితమైనాడు. వాడు వస్తుతః నా స్వరూపమే. వాడు ఆత్మజ్ఞానం గలవాడైతే వాణ్ణి ముక్త పురుషుడు అంటారు. ఆత్మజ్ఞానం లేనివాణ్ణి బంధపురుషుడు అంటారు. అజ్ఞానం అనాది బంధనం కనుక వాణ్ణి అనాది వాడు అంటారు.

ఈ విధంగా నేను ఒక ధార్మికునిగా ఉండటం వలన నన్ను శోకం ఆనందం రెంటికీ విరుద్ధమైన వాడుగా భావిస్తారు. బద్ధుడు ముక్తుడు ఇరువురిలో భేదం ఇది. ఒకడు నిత్యముక్తుడు - ఈశ్వరాంశ రెండవ వాడు ముక్త బద్ధుడు - జీవాంశ. జీవుడు - ఈశ్వరుడు బద్ధ ముక్త పురుషులు వేరు వేరుగా ఉన్నప్పటికీ ఒకే శరీరంలో నియంత నియంత్రితుడై ఉంటాడు.

ఉద్ధవా! శరీరం ఒక వృక్షం అనుకో. వృక్షంపై గూడు హృదయం. ఆగూటిలో జీవుడు దేవుడు అనే రెండు పక్షలుంటున్నాయి. రెండూ చలాకీ చైతన్యం గలవి. రెండూ స్నేహితులు. నివాసం ఒకలీల. రెండూ అన్యోన్యంగా ప్రేమగా ఉంటున్నాయి. అయితే జీవుడు అనే పక్షి శరీర వృక్షంపై గల సుఖదుఃఖ ఫలాలారగిస్తుంటుంది. కానీ దేవుడు అనే పక్షి ఏ ఫలాలు ముట్టకుండా సంగరహితంగా కేవలం సాక్షీ భూతుడుగా ఉంటాడు. అభోక్తగా ఉండటం దైవలక్షణం. ఇది జ్ఞానంలోనూ, ఐశ్వర్యంలోనూ ఆనందంలోనూ, సామర్థ్యంలోనూ జీవపక్షి కంటె సర్వవిధాల శ్రేష్ఠంగా భాసిస్తుంటుంది. ఈ పక్షికి ప్రపంచం పుట్టు పూర్వోత్తరాలూ తనయొక్క స్వరూప స్వభావ తత్త్వాలు క్షుణ్ణంగా తెలుసు.

కానీ జీవుడు అనేపక్షి ఏమీ ఎరగదు. తన విషయమే తనకు తెలియక ప్రపంచం గూర్చి ఎరగక అవస్థలకు గురి అవుతూంటుంది. జీవపక్షి అవిద్యా నిత్యబద్ధుడు. దైవపక్షి విద్యా విదిత నిత్యముక్తుడు. ఇరు పక్షులలోని భేదం ఇది.

ఉద్ధవా! జ్ఞాని ముక్తుడు. దేహంతో ఉన్నట్లే ఉంటాడు కానీ దేహంతో ఉండడు. దేహంతో సంబంధం లేకుండానే దేహంలో ఉంటూ ఉంటాడు. స్వప్నం అయిపోయిన తర్వాత మేల్కొన్న వానికి స్వప్నంతో సంబంధం ఉండదు. అలానే జ్ఞాని సూక్ష్మ స్థూల శరీరాలలో సంచరిస్తున్నా ఈ శరీరాలతో అతనికి బంధం ఉండదు.

కానీ అజ్ఞాని తన అజ్ఞానం వలన శరీర బంధం కలిగి ఉండిపోతాడు. స్వప్నం వచ్చిన వాడు స్వాప్నిక శరీరంతో బంధితుడై ఉండిపోతాడు. వ్యవహారికంగా ఇంద్రియాలు శబ్ద స్పర్శాది విషయాలను గ్రహిస్తాయి. గుణాలు గుణాలను గ్రహించటం నియమం. ఆత్మగుణాలను గ్రహించదు. కనుక తనను నిర్వికార ఆత్మ స్వరూపుడని భావించిన వాడు విషయాలను స్వీకరించటం త్యాగం చేయటం మొదలైన వానిపై అభిమానం మమకారం చూపడు.

అతడు శరీరాన్ని ప్రారబ్ధంగా గ్రహిస్తాడు. దీని వలన శారీరిక మానసిక కర్మలన్నీ గుణప్రేరణ వలన జరిగిపోతుంటాయి. అజ్ఞాని ఈ పనులకు తానే కర్తగా భావిస్తాడు. ఈ అభిమానం ఈ కర్తృత్వ భావనయే అతనికి బంధ కారణమవుతున్నది.

ఉద్ధవా! పై చెప్పిన విషయాలు విచారణచేసి వివేకశాలి సమస్త లౌకిక విషయాల యెడల విరక్తుడైయుంటాడు. నిద్రించినా, మేల్కొన్నా, కూర్చున్నా, తిరుగుతున్నా, స్నానం చేస్తున్నా, పానంచేస్తున్నా, చూస్తున్నా, వాసన చూస్తున్నా, తాకినా, ప్రాకినా, వింటున్నా, కంటున్నా, మొదలైన పనులలో తనను కర్తగా భావించడు. గుణాలనే వీనికి కర్తలుగా తలుస్తాడు. గుణాలనే అన్ని కర్మలకు కర్తలుగా భోక్తలుగా తెలుసుకొని కర్మ వాసనా ఫలం నుండి విడిపోయి బంధింప బడక విద్వాంసుడు విముక్తుడవుతాడు. వారు ప్రకృతితో ఉండి కూడా అసంగులైయుంటారు. స్పర్శ ఆది గుణాల నుండి ఆకాశమున్నట్లు జలంయొక్క ఆర్ద్రతాది గుణాల నుండి సూర్యుడున్నట్లు, గంధాది గుణాలనుండి వాయువున్నట్లు జ్ఞాని లోకంలో ఉంటూ లౌకిక విషయాలను అంటీ అంటనట్లుంటాడు.

ఆ పండితుల బుద్ధి అనే ఖడ్గం అసంగ భావనా ధారా తీక్షత కంటె మరీ పదునుగా ఉంటుంది. వారు బుద్ధి బలంతో అన్ని సంశయ సందేహాలను తేటతెల్లం చేసివేస్తారు. స్వాప్నిక జగత్తు నుండి మేలుకొన్న వారు స్వాప్నిక భేద భ్రమల నుండి దూరమై స్వస్థత చెందినట్లుగా జ్ఞానులు లౌకిక భ్రమలను భస్మం చేసుకొని దివ్యజీవనం గడుపుతుంటారు. వారి ప్రాణేంద్రియ మనోబుద్ధి చేష్టలు సమస్తం సంకల్ప రహితంగా పనిచేస్తుంటాయి. అవి దేహంలో ఉన్నా గుణాలకు అతీతంగా ఉంటాయి.

అముక్త పురుషులను దుష్టులు హింసించినా, బాధించినా, వారికి దుఃఖం కలుగదు. పూజించినా సుఖం ఆనందం కలుగదు. వారు సమదర్శనం గలవారు. గుణదోషాలకు అతీతంగా ఉంటారు. వారు మంచి పనులు చేస్తున్న వారిని స్తుతించరు. చెడ్డపని చేసే వారిని నిందించరు. ఒకరిని పొగడరు. మరొకరిని తెగడరు.

జీవన్ముక్త పురుషులు ఒకరి కంటూ మేలు చేయరు. మరొకరికని కీడూ చేయరు ఒకరిని గూర్చి చెడుగానూ ఆలోచించరు. మంచిగానూ యోచించరు. వారు వారిలోనే ఆత్మానంద మగ్నులవుతారు. బాహ్యానికి వారు జడులువలె మూర్ఖుల వలె సంచరిస్తుంటారు.

ఉద్ధవా ! వేద వేదాంగాలు నేర్చిన మహా విద్వాంసుడైననూ పరబ్రహ్మ యెడల భక్తి జ్ఞాన శూన్యుడైనచో అతని జీవితం వ్యర్థమే. అతని పరిశ్రమకు ఫలితం శూన్యమే. అతడు పాలులేని ఆవు వంటి వాడే అవుతాడు. పాలు ఈయని ఆవు, వ్యభిచారిణి యైన భార్య, పరాధీనమైన శరీరం, దుష్ట సంతానం, సత్పాత్రుడికీయని ధనం, నాగుణాలు గానం చేయని వాణి పనికి రానివి. ఈ రకమైన వాటిని ఉంచుకొని పోషించు కొంటుంటే దుఃఖమే గానీ వ్యక్తికి స్థిమితం ఉండదు.

కనుక ఉద్ధవా! ఎవరి ప్రసంగంలో జగదుత్పత్తి స్థితి లయక్రమాలు, నా పావన లీలావతార వర్ణనలు లోక ప్రియమైన రామకృష్ణ కథా విశేషామృత గాథలు ఉండవో వారి ప్రసంగ భాషణాదులు వ్యర్థం. బుద్ధిమంతులు అట్టి వ్యర్థగాథలు కథలు ఉచ్చరించటం శ్రవణం చేయటం తగదు.

ఉద్ధవా! పైన చెప్పినట్లుగా ఆత్మజిజ్ఞాస లేక ఆత్మవిచారం ద్వారా ఆత్మలోగల అనేక భ్రమలను దూరం చేసుకోవాలి. సర్వవ్యాపిని పరమాత్మనైన నా యందు నిశ్చల నిర్మల భక్తిని మనస్సులో నిలుపుకోవాలి. సంసార వ్యవహారాలలో నిర్లిప్తంగా ఉండాలి.

ఒకేవేళ నీచిత్తం పరమాత్మ యందు లగ్నం కానిచో సర్వ కర్మలను నిరపేక్ష బుద్ధితో నాకే సమర్పణ చేసిపనులుచేయి. నా కథలు సమస్త లోకాలను పావనం చేసే కల్యాణ కారకాలు శ్రద్ధా భక్తులతో ఆ కల్యాణగాథలు వినటం, తడవ తడవ నా అవతార లీలా విశేషాలు గానం చేయటం స్మరించటం, అభినయం చేయటం చాలా మంచిది.

నన్ను ఆశ్రయించి నాకొరకై ధర్మార్థ కామ సేవనం చేయాలి. అలా చేసినవాడు నా శాశ్వత పురుషత్వంపై అనన్య భక్తిని పొందుతాడు. భక్తి ప్రాప్తించాలంటే సత్సంగం ద్వారానే లభిస్తుంది. అట్టి భక్తి పొందినవాడు నన్ను ఉపాసించ కల్గుతాడు. నా సాన్నిధ్యం చేరుకొంటాడు. ఈ విధంగా అతని అంతః కరణం శుద్ధమవుతుంది. నాభక్తుల ద్వారా నా పరమపదం అతి సహజంగా పొందుతాడు.

ఉద్ధవుడు ఇలా సందేహం వెలిబుచ్చాడు -

'భగవాన్ ! పెద్ద పెద్ద సాధు పురుషులు తమ కీర్తిని గానం చేస్తూ ప్రశంసిస్తుంటారు. మహా ఆనందంతో ఉంటుంటారు. తృప్తిగా నిత్య సంతుష్టులై ఉంటారు. వారిని చూచి

తమరూ ఆనందిస్తుంటారు. అసలు ఆ సాధు పురుషుల లక్షణం ఏమిటి? వారు సంతోషులై ఎలా విహరిస్తుంటారు? వారు తమ యెడల ఎట్టి భక్తి ప్రకటిస్తారు? ఏ విధంగా లోకంలో వారు గౌరవింపబడుతుంటారు? భగవాన్ ! తమరు పరబ్రహ్మ స్వరూపులు. సర్వదేవ నాథులు తమరు. సత్యలోకాది సర్వలోకాలకు చరాచర జగత్తుకు స్వామి తమరు. నేను తమ పద పద్మారాధకుడను. శరణాగత భక్తుడను, తమరు ప్రకృతికి పరులు. పురుషోత్తములు, సచ్చిదానందమూర్తులు. చిదా కాశ బ్రహ్మస్వరూరులు. తమకంటె వేరైన వస్తువేలేదు. లీలకై స్వేచ్ఛగా వేరుగా ఒక శరీరం ధరించి అవతరిస్తుంటారు. ఇది నాకు తెలుసు. కనుక తమరు తప్పక చెప్పండి. ఈ భక్తి యోగం చెప్పతగిన వారు తమరొక్కరే స్వామి! సాష్టాంగ నమస్కారం. కృప వహించండి."తమరు నాకు భక్తి భక్తుల రహస్య విధానాలు తెలియచెప్పండి.

శ్రీ కృష్ణుడు భక్తుల లక్షణాలు ఇలా చెప్పసాగాడు -

ఉద్ధవా! నా భక్తుల లక్షణాలు విను. నా భక్తుడు కృపాళువు. దయామయుడు. వాడు ఏ ప్రాణిని ద్వేషించడు. ఎవరితోనూ వైరం బూనడు. ఎంతటి కష్టాన్నైనా ప్రసన్నంగా సహిస్తాడు. అతని జీవనసారం సత్యం. అతని మనస్సులో పాపవాసన అనేదే ఉండదు. అతడు సమదర్శి. అందరి క్షేమం కోరతాడు.

నా భక్తుని బుద్ధి కామనా కలుషితంకాదు. అతడు సంయమి. పవిత్ర చరిత్రుడు. మధుర స్వభావం గలిగినవాడు. ధనం ప్రోగు చేసుకోవటంగాని పరిగ్రహణం గాని ఎన్నడూ చేయడు. ఎవరి వస్తువు గ్రహింపతలంచడు. పరిమితంగా భోజనం చేస్తాడు. శాంతంగా ఉంటాడు. అతని బుద్ధి సుస్థిరంగా ఉంటుంది. కేవలం నన్ను విశ్వసిస్తాడు. ఆత్మ తత్త్వ చింతనంలో సదా కాలం వెళ్ళబుచ్చుతాడు.

నా భక్తుడు ప్రమాదరహితుడు. గంభీర స్వభావుడు, ధైర్యవంతుడు, సుగుణవంతుడు, షడూర్మికలు - ఆకలి దప్పికలు, శోకమోహాలు, జననమరణాలు అతని స్వాధీనంలో ఉంటాయి. అతడు ఎవరి నుండి ఎటువంటి సన్మానము ఆశించడు. కానీ పరులకు సన్మానం చేస్తుంటాడు. నా లీలా విశేషాలు ఇతరులకు చెప్పటంలో మిక్కిలి కుశలుడు. అందరితోనూ ఆప్యాయంగా ఉంటాడు. మైత్రిగా ఉంటాడు. అతని హృదయం కరుణరస భరితం. తత్వాన్నిగూర్చి యధార్థ జ్ఞానం అతనిలో చాలినంత ఉంటుంది.

ఉద్ధవా! నేను వేద శాస్త్రాల ద్వారా మనుష్య ధర్మాలు విశదపరచాను. వాటిని ఉల్లంఘిస్తే నరకం దుఃఖ ప్రాప్తి యేసుమా! అయితే నా భక్తులు కొన్ని ధర్మాలను ఆత్మ క్షోభంగా తలంచి నన్నే ధ్యానిస్తూంటారు. వాడు నా నామస్మరణగాన సంకీర్తలందు తల్లీనత చెందుతుంటాడు. అట్టివాడు సాధుపురుషుడు.

'నేను ఎవరిని! ఎంతవాడను! ఎలా ఉంటాను' అని అతడు తనను గూర్చి తెలుసుకొన్నా తెలుసుకోక పోయినా నన్ను గూర్చి అనన్యభావంతో భావన చేస్తుంటాడు వాడే నా దృష్టిలో పరమపునీత భక్తుడు.

ఉద్ధవా! నా ప్రతిమల యొక్క, నా భక్తుల యొక్క దర్శనం స్పర్శనం పూజా శుశ్రూష స్తోత్ర ప్రణామాలు, నా గుణ కీర్తనలు ఈ సుజనులు గానం చేస్తుంటారు.వీరు నా కథలు వినటంలో శ్రద్ధకలిగి ఉంటారు. నిరంతరం నన్ను ధ్యానిస్తుంటారు. వీరు లభించిన దానిని నాకు సర్పణ చేస్తుంటారు. దాస్య భావంతో నాకు సర్వము ఆత్మ సమర్పణ, ఆత్మనివేదన చేస్తుంటారు.

వీరు నా జన్మ కర్మలను గూర్చి చర్చిస్తుంటారు. చర్చలో ఆనందం పొందుతుంటారు. వీరు కృష్ణాష్టమి శ్రీరామ నవమి వంటి పర్వదినోత్సవాలను ఉత్సాహంతో చేసుకొంటూంటారు. పురమందిరాలలో దేవమందిరాలలో ఉత్సవాలు ఊరేగింపులు జరుపుతుంటారు. వార్షికోత్సవాలు తీర్థయాత్రా పర్యటనలు మొదలైనవి జరుపుతుంటారు. వైదిక తాంత్రిక వ్రతాలు నిర్వహిస్తుంటారు. విగ్రహారాధన లందు విగ్రహ ప్రతిష్ఠ లందు వీశేష భక్తి కనిపిస్తారు. వనవిహారాలు వనమహోత్సవాలు పదుగురు కలిసికానీ ఒంటరిగా గానీ చేస్తుంటారు.

ఈ భక్తులు సేవకులు వలె శ్రద్ధా భక్తులతో నిష్కపటంగాను మందిరాలలో సేవ శుశ్రూషలు చేస్తుంటారు. మందిరంలో అనేకమైన చిన్న పెద్ద పనులు నిర్వహిస్తుంటారు. వీరు అభిమానం గానీ గర్వం కానీ కించిత్తు కూడా చూపరు.

వీరు నా కర్పించిన దీపాల కాంతులు స్వంత కార్యములకు ఉపయోగించుకోరు. ఒక దేవునికి పూజించిన వస్తువులను మరొక దేవుని కుపయోగించుకోరు. ప్రపంచంలో తనకు చాలా ఇష్టమైన వస్తువును నాకే అర్పిస్తారు. అలా చేయటం అనంత ఫలప్రదం. భక్తులు చరితార్థులవుతారు.

భద్రా ! ఉద్ధవా! సూర్యుడు, అగ్ని, బ్రహ్మణుడు, గోవు, వైష్ణవుడు, ఆకాశం, వాయువు, జలం, పృథ్వి, ఆత్మ, సమస్తప్రాణులు ఇవి అన్నీ కూడా నాయొక్క పూజనీయస్థానాలు.

ఋగ్వేదం యజుర్వేదం సామవేదం యొక్క మంత్రాల ద్వారా సూర్యునిలో నా పూజా విధానం జరుగుతుంది. హవనం ద్వారా అగ్నిలోనూ, ఆతిథ్యం ద్వారా విప్రశ్రేష్ఠులలోనూ, పచ్చని హరితం ద్వారా గోవులలోనూ నా పూజా విధి జరుగుతుంది.

బంధు సత్కారం ద్వారా వైష్ణవులలో, ధ్యాననిష్ఠ ద్వారా హృదయాకాశంలో, ముఖ్యప్రాణం ద్వారా వాయువులోనూ, పుష్ప ద్రవ్యాల ద్వారా జలంలోనూ నా ఆరాధన జరుగుతూంటుంది. గుప్త మంత్రం ద్వారా మృణ్మయ వేదికలలోనూ, తగిన భోగాలద్వారా ఆత్మలోనూ సమదృష్టి ద్వారా సంపూర్ణ ప్రాణులలోనూ నా ఆరాధన సాగిపోతుంటుంది. నేను ఈ పై చెప్పిన అన్ని వస్తువులలో క్షేత్రజ్ఞుడనై ఆత్మ స్వరూపుడనై విరాజిల్లుతుంటాను.

ఉద్ధవా! ఈపై చెప్పిన స్థానాలలో శంఖ చక్ర గదాంబుజాలతో శ్రీమూర్తి నాల్గు భుజాలతో శాంత సుందరంగా భగవాన్ శ్రీవిష్ణువై విరాజిల్లుతున్నాడని భావనచేస్తూ ఏకాగ్రచిత్తంతో నా పూజగావిస్తుండాలి. అట్లు పూజిస్తూ యజ్ఞయాగాలు ఇష్టా పూర్వ కార్య కలాపాలు చేసినవాడు నాశ్రేష్ఠతను భక్తిని పొందుతాడు. ఈభావంతో సాధు పురుషులను సేవించిన వాడు నా స్వరూప జ్ఞానం కూడా పూర్తిగా కలిగిఉంటాడు.

సద్భక్తి సత్సంగం ఈ రెంటిని భక్తుడు అనుష్టించటం మంచిది అని నానిశ్చయం. ఈ రెండే సంసార సాగరం దాటటానికి తారకాలు మరో ఉపాయం లేదు. సంతపురుషులు నన్ను తన ఆశ్రయంగా భావిస్తారు. కనుక నేను సర్వదా వారి వెంటనే ఉంటాను.

ఉద్ధవా! నేను ఇపుడు నీకు ఒక అత్యంత గోప్యమైన పరమ రహస్య విషయం చెప్తాను. నీవు నాకు ప్రియమైన సేవకుడవు. హితైషివి. సుహృదుడవు. ప్రియసఖుడవు. ఈ జ్ఞానం నేర్చుకోవాలని మిక్కిలి ఇష్టపడుతున్నావు. కనుక చెప్తాను విను.

సత్సంగం - కర్మ - కర్మత్యాగం -

భగవానుడిలా చెప్పాడు -

ఉద్ధవా! సత్సంగ మహిమ చెప్తాను. ఆలకించు. లోకంలోని లౌకిక ఆసక్తులు సత్సంగ మహత్వాన్ని సంకోచపరుస్తున్నాయి. కానీ నాకు సత్సంగం అంటే చాలా ఇష్టం. సత్సంగం నన్ను వశం చేసుకొన్నంత మరొక సుగుణం నన్ను ఆకర్షించలేదు. సాధనలు యోగాలు సాంఖ్యం ధర్మపాలనం స్వాధ్యాయం తపస్సు త్యాగం ఇష్టాపూర్త యజ్ఞయగాలు, సత్సంగమంతగా నన్ను ఆకర్షించ లేకపోయాయి. వ్రతాలు వేదకర్మలు తీర్థాలు యమ నియమాలు సత్సంగానికి సాటిరావోయి.

ఉద్ధవా! ఇది ఒకయుగంలోని మాటకాదు. అన్నియుగాలకీ ఇదే మాట. సత్సంగం ద్వారానే, దైత్యులు, రాక్షసులు, పశువులు, పక్షులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, సిద్ధులు, చారణులు,గుహ్యకులు,విద్యాధరులు, నాసాయుజ్యం పొంద కలిగారు.

మనుష్యులలో వైశ్యులు శూద్రులు స్త్రీలు అంత్యజులు రజోగుణ ప్రధానులు తామసులు ప్రకృతిలోని అనేక జీవులు నాపరమపదం పొందారు.

వృతాసురుడు, ప్రహ్లాదుడు, వృషపర్వుడు, బలిచక్రవర్తి, బాణాసురుడు, మయ దానవుడు , విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, గజేంద్రుడు, జటాయువు, తులాధార, వైశ్యుడు, ధర్మవ్యాధుడు, కుబ్జ, గోపికలు, యజ్ఞపత్నులు ఇంకా ఇతరులు చాలామంది సత్సంగ ప్రభావంతో నన్ను పొందగలిగారు.

ఉద్ధవా! వారు వేదాధ్యయనం చేయలేదు. విధి పూర్వకంగా ఉపాసనలు చేర్వలేదు. కృచ్ఛ చాంద్రాయణ వ్రతాలు బూనలేదు. వారు కేవలం సత్సంగ ప్రభావంతోనే నన్ను పొందారు.

గోపికలు గోవులు యమళార్జున వృక్షాలు వ్రజభూములలోని హరిణాలు పశువులు కాళియాదినాగులు సాధనలు ఏమీ ఎరుగని మూఢులు. నే చెప్పిన వారే కాక చెప్పని వారు అనేకమంది కేవలం ప్రేమభావంతో అనాయాసంగా నన్ను జేరారు.

అసలు పెద్ద పెద్ద సాధకులు సాంఖ్యం తెలిసిన వారు దానాలు వ్రతాలు తపస్సులు యజ్ఞాలు వేద వ్యాఖ్యానాలు సన్యాసాలు జపాలు చేసి నన్ను పొంద లేక పోయారు. కానీ సత్సంగం ద్వారా సులభంగానేను వశమవుతాను.

ఉద్ధవా! ఒక రహస్యం చెప్తాను చూడు. అక్రూరుడు బలరాముడుతో నన్ను మధురకు తీసుకొని వెళ్లినప్పుడు గోపికల హృదయాలు నా మీద గల గాడమైన ప్రేమ భావంతో తల్లీనమైపోయాయి. నా వియోగ బాధతో మిక్కిలి వ్యాకులం చెందారు. వారికి నేను తప్ప మరొక మహత్తర వస్తువు రుచించేది కాదు. సౌఖ్యం కూర్చ కలిగేది కాదు. నీకు తెలిసేవుంటుంది. వారికి నేనే ఏకైక అత్యంత ప్రియతమ మనోనాథుణ్ణి. నేను బృందావనంలో ఉన్నప్పుడు రాసక్రీడలు అనేక దీర్ఘ రాత్రులను అరక్షణాలుగా గడిపేవారు. నేను దూరమైన రాత్రులు కల్పాలవలె వెళ్ళ బుచ్చేవారు. గొప్ప మునీశ్వరులు సమాధిలో మునిగి సర్వం మరచినట్లు పెద్ద పెద్ద నదులు సముద్రంలో కలిసి తమ తమ రూపనామాలు పోగొట్టుకొన్న విధంగా గోపికామణులు నాయొక్క పరమ ప్రేమలో మునిగి తన్మయులైపోయేవారు. వారికి ఆ ప్రేమావస్థలో ఇహలోకం పరలోకం అనేచింత ఉండేదికాదు. నా ప్రేమలో శరీరాన్ని మరచేవారు. ఇల్లూ వాకిలి పతీ పుత్రులూ అనే స్పృహే ఉండేది కాదు.

ఉద్ధవా! ఆ గోపికలు ఉత్త అమాయికలు. వారిలో చాలామంది నా యొక్క వాస్తవిక స్వరూప స్వభావాలు ఎరుగరు. వారు నన్ను భగవంతుడుగా తెలిసినవారు కాదు. నన్ను వారుకేవలం తమప్రియుణ్ణి గానే తలంచేవారు. సాధనలు వ్రతాలు ఉపాసనలు

ఎరుగని వందలాది వేలాది అబలలు నా స్నేహం కాంక్షించి నా పరమాత్మ పరబ్రహ్మ మూర్తిని పొంద కలిగేవారు. కనుక ఉద్ధవా! నీవు శ్రుతి స్మృతులు విధినిషేధాలు ప్రవృత్తి నివృత్తులు ఆది శ్రవణయోగ్యాలు శ్రవణీయ విషయాలను వదలి సర్వత్ర నన్నే భావన చేస్తూ సమస్త ప్రాణుల ఆత్మ స్వరూపుణ్ణిగా నన్నే ఏకాగ్రభావంతో నిశ్చయించి సంపూర్ణ శరణాగతి పొందు. నా శరణ్యంలో నీవు నిర్భయంగా సర్వదా సర్వథా సుఖిస్తావు.

శ్రీ కృష్ణ భగవానునితో ఉద్ధవుడు ఒక సందేహం ఇలా వెలిబుచ్చాడు - స్వామీ ! యోగేశ్వరేశ్వరేశ్వరా! కృష్ణా ! తమరుపదేశించింది వింటున్నాను. బాగుంది కానీ ఒక సందేహం నివారణ కావటంలేదు - స్వ ధర్మం పాటించాలా! లేక అన్నీ విసర్జించి తమనే శరణు పొందవలెనా! నా మనస్సు ఈ సందిగ్ధంలో కొట్టు మిట్టాడుతోంది.

శ్రీ కృష్ణుడిలా వివరించాడు -

ఓ ఉద్ధవా! నేనే సర్వమూ. పరమాత్మ యొక్క పరోక్ష రూపం వర్ణించబడుతుంది. అది సాక్షాత్తు అపరోక్షమే. అంటే ప్రత్యక్షమైనదే. ఆ పరమాత్మయే నిఖిల వస్తువులకు సత్తా గల స్ఫూర్తి జీవనం ప్రసాదిస్తుంటాడు.

ఆ స్వామియే ప్రథమంలో అనాహత నాద స్వరూపులగు 'పరావాణి' నామకులుగా వారు ప్రాణంతో పాటు మూలాధార చక్రంలో ప్రవేశించి ఉంటాడు. ఆ తర్వాత నాభిస్థానంలో ఉండే మణి పూరక చక్రంలోనికి వచ్చి 'పశ్యంతీవాణి' అనే పేరుతో మనోమయ సూక్ష్మ రూపంగా వెల్లుతుంటాడు. ఆపైన కంఠ ప్రదేశంలో గల విశుద్ధ చక్రంలోనికి 'మధ్యమావాణి' నామంతో వ్యక్తమవుతుంటాడు. ఆ తరువాత ముఖ ప్రదేశంలో హ్రస్వ దీర్ఘ మాత్రా స్వరాలు, ఉదాత్త అనుదాత్త స్వరాలు, కకారాది వర్ణరూపాలు వ్యక్తం చేస్తూ 'స్థూల-వైఖరీ వాణి' గ్రహిస్తూ భాషకు ప్రబోధిస్తుంటాడు.

ఉద్ధవా! అగ్ని అనేక రూపాలలో అంతట వ్యాప్తమైయున్నది. అగ్ని ఆకాశంలో విద్యుత్ స్వరూపంలో అవ్యక్తంగా ఉంది. అదే కొయ్యలో ఉంది. కొయ్యలో ఉన్నదానిని బలంగా కొయ్యలతోనే మథనం చేయగా రవ్వలు రవ్వలుగా బయటపడుతుంది. ఆ రవ్వలకు ఆహుతి అందిన కొద్దీ ప్రచండ జ్వాలా రూపం దాలుస్తుంది ఆ విధంగానే ఈశ్వరుడనైనేను నాద రూపంగా ప్రారంభమై శబ్ద బ్రహ్మమై క్రమక్రమంగా పరా, పశ్యంతీ, మధ్యమా వైఖరీ వాణీ రూపాలు ధరించి భాషా స్వరూపంలో వ్యాప్తి చెందుతుంటాను.

ఉద్ధవా! ఈ విధంగా మాట్లాడటం, చేతులతో పనిచేయటం, కాళ్ళతో నడవటం, శిశ్న గుదముల ద్వారా మల మూత్ర విసర్జనలు చేయటం. వాసన చూడటం, రుచి చూడటం, తాకటం, వినటం, మనస్సు ద్వారా సంకల్ప వికల్పాలు చేయటం, బుద్ధితో

తెలుసుకోవటం, అహంకారం ద్వారా అభిమానం పొందటం, మహత్తత్త్వాలద్వారా అన్ని పడుగుపేకలుగా వేసి రజస్సత్త్వ తమోగుణ వికారాలుండటం అనేక కార్యాలకు కర్త కరణ కర్మలు అన్నీ నేనే.

ఈ మొత్తాన్ని బ్రతికించి పోషించే పరమేశ్వరుడే ఈ త్రిగుణమయ బ్రహ్మాండ కమలానికి కారణభూతుడు. ఈ ఆదిపురుషుడే ప్రథమంలో ఒక అవ్యక్త బీజ ప్రాయుడు. పదును చేసిన పొలంలో నాటిన బీజం మొక్క వృక్షమై శాఖోపశాఖలతో ఫల పుష్పాలతో మనోహర రూపం దాల్చినట్లుగా కాలప్రవాహ గతిలో మాయా బలంతో శక్తి విభజన జరుపుతూ పరమేశ్వరుడే వివిధ రూపాలలో ప్రతీయమానం అవుతుంటాడు.

ఉద్ధవా! వస్త్రం కనుక పడుగు పేకల అల్లకంతో నూలుతో తయారవుతున్నట్లుగా ఈ విశ్వం అనే వస్త్రాన్ని ఈశ్వరుడే తయారు చేస్తుంటాడు. ఈశ్వర సంకల్పంతో ఈశ్వరునిలోనే ఈ విశ్వం విరాడ్రూపం ధరిస్తుంది. నూలు లేక వస్త్రం యొక్క అస్తిత్వమే ఉండదు. కానీ వస్త్రం లేకపోయినా నూలు ఉంటుంది.

అదే విధంగా ఈ జగత్తు లేకపోయినా పరమేశ్వరుడు స్థిరంగా ఉంటాడు. కానీ పరమేశ్వరుడు లేకుండా ప్రపంచం ఉండజాలదు. ఈ జగత్తు పరమాత్ముని స్వరూపమే. పరమాత్మ లేక దీనికి అస్తిత్వం ఉండదు. ఈ సంసార వృక్షం అనాది ప్రవాహ రూపంగా నిత్యమై ఉంటున్నది. దీని స్వరూపమే కర్మ పరం పరల సమూహం. దీని ఫల పుష్పాలు మోక్ష భోగాలు. ఈ సంసారం వృక్ష స్వరూపం ఇది. విను ఉద్ధవా! ఈ సంసారానికి పాపం పుణ్యం అనేవి బీజాలు. అసంఖ్యాకమైన వాసనలు ఈ చెట్టుకు వేళ్ళు. సత్త్వ రజస్తమస్సులు అనే మూడు రెమ్మలు. దీనికి పెద్ద కొమ్మలు అయిదు. అవి అయిదుభూతాలు. శబ్దాది ఐదు విషయరసాలు. పదకొండు ఇంద్రియ శాఖలు అనేవి మరొక విధమైన రెమ్మలు.

శరీరం అనే ఈ చెట్టుపై జీవుడు దేవుడు అనే పక్షులు గూడుకట్టి నివాసం చేస్తున్నారు. ఈ చెట్టుకి వాత పిత్త శ్లేష్మాలు అనే మూడు పట్టలు అంటి పెట్టుకొని ఉన్నాయి. ఈ చెట్టు రెండు రకాల పళ్ళు ఇస్తుంది. సుఖం - దుఃఖం. ఈ వృక్షం యొక్క కొమ్మలు సూర్యమండలం వరకు వ్యాపించి ఉన్నాయి. ఈ చెట్టుపై నుండి సూర్య మండలం ఛేదించుకొని వెళ్ళే మహా పురుషులు - ముక్త పురుషులు. ఇక సంసారంలో వారు పడరు.

గ్రద్ద ఉన్నత పథంలో విహారం చేస్తుంది. కానీ సుతీక్షణంగా బహుదూరం వరకు దృష్టి సారించి జంతు శవాలపై వ్రాలి మాంసం భక్షిస్తుంది. గృహస్థుడు చదువు కొన్నవాడే. తెలిసిన వాడే. కానీ విషయ వాసనలకు దాసుడై కోర్కెల వలలో పడి చిక్కుకుపోతాడు. దుఃఖ ఫలం అనుభవిస్తుంటాడు. కనుక గృహస్థుడు క్షుద్రమైన గ్రద్దతో సమానం.

యోగి అరణ్య వాసియై పరమ సుఖం పొందుతుంటాడు. ఆ పరమ హంస అక్షరాల రాజ హంసయే. విరక్తుడై పవిత్ర వైరాగ్య జీవనం గడుపుతాడు. మంచి చెడ్డలను గుర్తించి మంచివైపు మాధవుని వైపు పయనిస్తాడు. ఆ విచక్షణా జ్ఞానం పరమహంస సొత్తు. వాస్తవంగా నేను ఒక్కణ్ణే. ఇవి అన్నీ నా అనేకరూపాలు. ఇవి అన్నీ మాయామయం. ఈ మాయను గూర్చి గురువుల ద్వారా వేదాల ద్వారా చక్కగా తెలుసుకోవచ్చు.

ప్రియమైన ఉద్ధవా! ఈ విధంగా గురూపాసన ద్వారా నిర్మల నిశ్చల భక్తి ద్వారా నీ జ్ఞాన పరశువుకు పదును పెట్టు. ఆ ఆయుధంతో ధైర్యంగా జీవభావాన్ని నరికివేయి. త్వరలో పరమాత్మ రూపం పొంది వృత్తి అస్త్రాన్ని విడిచిపెట్టు. అఖండ స్వరూపంలో నీవు విరాజిల్లు.

పరమాత్మ హంస రూపంలో వచ్చి సనకాదులకు ఉపదేశం

సత్త్వం , రజస్సు తమస్సు ఈ మూడు గుణాలు బుద్ధికి సంబంధించినవి. ప్రకృతి స్వభావాలు. ఆత్మవి మాత్రం కావు. మానవుడు సత్త్వ గుణం ద్వారా రజస్తమో గుణాలను జయించాలి. తదనంతరం తమస్సును సత్త్వ గుణాన్ని శాంతవృత్తి ద్వారా అంటే దయాదుల ద్వారా శాంత పరచుకోవాలి.

సత్త్వగుణం వృద్ధి అయిన తర్వాత జీవికి భగవద్భక్తి అనే స్వధర్మం ప్రాప్తిస్తుంది. సదా సత్త్వ ప్రధాన వస్తువులను సేవించటం ద్వారా సత్త్వంగుణం వృద్ధి అవుతుంది. అపుడు నా భక్తి రూపమైన స్వధర్మంలో ప్రవృత్తి అధికమవుతుంది.

ఉద్ధవా! ఆగమం - జలం - ప్రజలు - దేశం - కాలం - కర్మ - జన్మ - ధ్యానం - మంత్రం - సంస్కారం అనే ఈ పది సాత్త్వికునికి సత్త్వగుణాలు. రాజసికునికి రజోగుణాలు తామసికునికి తమోగుణాలు వృద్ధి చేస్తాయి. వీనిలో శాస్త్రజ్ఞులు పండితులు ప్రశంస చేయునవి సాత్త్వికాలు - వీరు ఉపేక్ష సేయునవి రాజసికాలు - వీరు నిందించునవి తామసికాలు.

మానవునకు ఆత్మ సాక్షాత్కారం కలిగి స్థూలసూక్ష్మ కారణ శరీర గుణ నివృత్తి జరిగేంత వరకూ సాత్త్వికుడై సత్త్వగుణాలు ఆశ్రయించి సాత్విక శాస్త్రజ్ఞానాన్ని వృద్ధి చేసుకొంటూండాలి. దీనివల్ల ధర్మవృద్ధి, ధర్మవృద్ధితో అంతఃకరణ శుద్ధి అవుతుంది. అంతఃకరణ శుద్ధితో ఆత్మ తత్త్వజ్ఞానం లభిస్తుంది.

అడవులలో చెట్ల కొమ్మలరాపిడితో అగ్నిపుట్టి వనాన్ని కాల్చి శాంత పరుస్తుంది. ఆ విధంగానే శరీరం గుణ వైషమ్యంతో జనిస్తుంది. విచార విమర్శ మధనం వలన జ్ఞానాగ్ని

జ్వలిస్తుంది. అదే శరీరాన్ని గుణ సమూహాన్ని శమింపజేస్తుంది. స్వయంగా శాంతించి శాంతి నిస్తుంది.

ఉద్ధవుడిలా ప్రశ్నించాడు - "కృష్ణదేవా ! సాధారణంగా మనుష్యులందరూ విషయ సుఖాలు భోగాలు ఆపదలకు ఆస్పదాలని తెలుసుకొనియున్నారు. ఈ భోగాలు కుక్కలు గాడిదలు, దున్నలు, కోతులు, గొర్రెలు పొందుతున్నాయి. మానవులు ఈరకమైన భోగాలు ఏల అనుభవిస్తున్నారు అంటావు?"

శ్రీ కృష్ణ భగవానుడిలా సమాధానం ఇచ్చాడు. " ఓ ప్రియ బంధూ! ఉద్ధవా! మానవజీవి అజ్ఞానంచేత హృది నుండి తన స్వరూపాన్ని మరచి, సూక్ష్మ స్థూలాది శరీరాలలో అహంకారబుద్ధి పొందుతాడు. అనగా భ్రమలో పడతాడు. అపుడు సత్త్వ ప్రధానమైన మనస్సు భయంకర రజోగుణం వైపు మొగ్గుతుంది. అపుడు రజస్సు వ్యాప్తి చెందుతుంది.

అక్కడ నుంచి మనస్సులో రజోగుణం ప్రాధాన్యత వహిస్తుంది. సంకల్ప వికల్పాలు అధికమవుతుంటాయి. దుర్బుద్ధి వలన కామ బంధాలలో చిక్కుకొని పోతాడు. కామం నుండి విడబడటం మిక్కిలి కష్టమవుతుంది. అపుడు కామం వలన అజ్ఞాని అనేక అనర్థ కార్యాలు చేయసాగుతాడు. ఇంద్రియాలకు వశుడై 'ఈకార్యాల పర్యవసానం దుఃఖం అని తెలిసికూడా' ఈ కార్యాలే చేస్తుంటాడు. ఆ సమయంలో అతనిలో రజోగుణం మిక్కిలి వేగంగా పనిచేస్తుంది. ఆ మోహం అతన్ని క్రమ్మి వేస్తుంది.

ఉద్ధవా! ఒక్కొక్కప్పుడు వివేకశాలి చిత్తం కూడా రజోగుణ తమోగుణ వేగం వలన విక్షిప్తం పొందుతుంది. అపుడు అతనికి కూడా విషయ దృష్టి సోకుతుంది. అయితే అతడు అతి జాగ్రత్తగా చిత్తాన్ని శుద్ధిచేయటానికి తీవ్ర పశ్చాత్తాపపడి తగిన విధి చేస్తాడు. అందువలన అతని విషయాసక్తి హరించిపోతుంది.

భక్తుడు సాధన ద్వారా అసనం స్థిరం చేసికొని ప్రాణవాయువుపై విజయం సాధించాలి. తదనంతరం తన శక్తినీ సమయ స్థితినీ అనుసరించి ఉపాసకుడు మనస్సును మాధవుణ్ణైన నా యందు లగ్నంచేయాలి. ఈ అభ్యాసకాలంలో అసఫలత్వం పొందవచ్చు. విసుగుదల వైఫల్యం చెందవచ్చు. ఈ పరిస్థితిలో మనస్సును నిబ్బరం చేసుకొన ప్రయత్నించాలి కాని విరమించరాదు. అధికమైన పట్టుదలతో అధిక ఉత్సాహంతో అభ్యాసం చేయాలి. శ్రమ అనుకోక ధ్యానం సాగించాలి.

ఉద్ధవా! సనకాది మహర్షులు కూడా ఇదే వక్కాణించారు. యోగం ఇలానే ఉంటుంది. సాధకుడు తన మనస్సును అన్నివైపుల నియత మార్గంపై నిష్ఠగా నడపాలి. నా విరాడ్రూపంపై కాక సాక్షాత్తు నా స్వరూపంపైనే కేవలం నాపై దృష్టి కేంద్రీకరించాలి.

ఉద్ధవుడు ఇలా అడిగాడు - " కేశవా! మహానుభావా! తమరు ఎప్పుడు ఏ రూపంలో సనకాది పరమ ఋషులకు ఈ యోగాన్ని ఆదేశించారు? వారికి చూపిన ఆ పావనమైన రూపం నేను తెలుసుకోవాలి అనుకొంటున్నాను. చెప్పండి."

శ్రీ కృష్ణ భగవానుడిలా చెప్పాడు. " ఉద్ధవా! సనకాది మహర్షులు బ్రహ్మ మానస పుత్రులు. వీరొకసారి తండ్రియైన బ్రహ్మను గూర్చి 'యోగంలోని సూక్ష్మ సారాంశంపై ఈ విధంగా ప్రశ్నించారు.

సనకాది మునులు బ్రహ్మదేవునిలా అడిగారు - " తండ్రీ! చిత్తం విషయగుణాల అడుగున బడి తన్నుకొంటోంది. గుణాలు కూడా ఒక్కొక్క వృత్తిలో ప్రవేశించియున్నాయి. చిత్తం గుణాలు కలిసిపోయాయి. ఈస్థితిలో ముక్తి కోరేవాడు సంసార సాగరాన్ని దాటటం ఎలా! చిత్తాన్ని గుణాలను వేరువేరుగా ఎలా విభజించి పరిశీలించగలడు ?"

శ్రీ కృష్ణ భగవానుడిలా వివరించాడు -

" ఉద్ధవా! బ్రహ్మ దేవతలందరిలో మహాదేవుడు. అగ్రేసరుడు, స్వయంభువు, సర్వప్రాణి కోటుల జన్మదాత. అట్టి బ్రహ్మను సనకాది మహర్షులు ప్రశ్నింపగా బ్రహ్మ ధ్యానం చేసి యోచించికూడా ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోయాడు. ఆయనబుద్ధి కర్మపై తీవ్రంగా లగ్నమైఉంది. ఉద్ధవా! అపుడు బ్రహ్మదేవుడు ఆలోచించి సనకాదుల ప్రశ్నకు సమాధానం ఇవ్వటానికి భక్తిని ఆశ్రయించి నన్ను చింతన చేశాడు. అపుడు నేను హంస రూపం ధరించి వారిముందు ప్రత్యక్షమైనాను.

నన్ను హంస రూపంలో చూచి సనకాదులు బ్రహ్మదేవుని ముందు పెట్టుకొని నా దగ్గరకు వాచ్చారు. వచ్చివారు నా పాద పద్మాలకు ప్రణామం చేశారు. భక్తితో వినయంగా నిలిచి "స్వామీ! తమరు ఎవరు" అని అడిగారు. ఉద్ధవా! సనకాదులు పరమార్థ తత్త్వ జిజ్ఞాసువులు. కనుక వారడిగిన సంప్రశ్నకు నేను చెప్పిన సమాధానం విను -

"విప్రులారా! పరమార్థ వస్తువు నానాతత్వ రహితం. ఆత్మ సంబంధమైన దానిని గూర్చి తమరు వేసిన ప్రశ్నయుక్తి సంగతమెంత వరకు? నేను సమాధానం చెప్పదలిస్తే ఏజాతి గుణక్రియా సంబంధంపై చెప్పాలి?

దేవతలు మానవులు పశువులు పక్షులు అన్నీ పంచభూతాత్మకాలే కదా! అభిన్నాలే కదా! పరమార్థ దృష్టితో కూడా అభిన్న స్వరూపాలే. ఇట్టి స్థితిలో తమ యొక్క "తమరెవరు?' ' అనే ప్రశ్న సాధారణ మాట తీరువలె ఉంది. విచారాత్మకంగా లేదు. కనుక నిరర్థకమైన ప్రశ్న అనే చెప్పాలి. మనస్సు ద్వారా వాక్కు ద్వారా దృక్కు ద్వారా అన్య ఇంద్రియాల ద్వారా ఏది

గ్రహించబడుతుందో అది నేనే. నా కంటే భిన్నమైనది మరియొకటి లేదు. ఈ సిద్ధాంతం తమరు తత్త్వ విచారణ ద్వారా గ్రహించండి.

ఈ చిత్తం చింతన చేయగా చేయగా ఏవిషయాన్ని చింతిస్తున్నదో ఆయాకారం ధరిస్తుంది. ఆ విషయం చిత్తంలో ప్రతిష్ఠితమవుతుంది. ఈ మాట సత్యం. విషయం చిత్తం ఈ రెండూ నా స్వరూప భూతాలే. ఇవే జీవుని దేహాలు. ఉపాధులు. విషయం అంటే గుణం. అంటే ఆత్మకు చిత్తంతోకానీ విషయంతోకానీ గుణంతోకానీ సంబంధం లేదు అని తెలుసుకో! కనుక తడవ తడవకు విషయ సేవనం చేయుటకు చిత్తం అధికమైన ఆసక్తి చూపుతుంది. చిత్తం చివరకు ఏ గుణంలోనో ప్రవేశిస్తుంది. కాబట్టి ఉపాసకుడైన భక్తుడు లోకంలో కనుపించే వాస్తవిక రూపాల కంటే అభిన్నంగా ఉండే నాయొక్క పరమాత్మ రూపం సాక్షాత్కారం చేసికొని చిత్తాన్ని గుణాలను త్యజించాలి.

జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థలు సత్త్వరజస్తమో గుణాలను అనుసరించి జరుగుతుంటాయి. ఇవి బుద్ధి వృత్తులు. సచ్చిదానందమూర్తి స్వభావాలు కావు. జీవుడు ఈ వృత్తులకు సాక్షి. కనుక ఈ వృత్తుల కంటే విలక్షణమైనవాడు జీవుడు. ఈ సిద్ధాంతం శ్రుతులతో యుక్తులతో అనుభూతులతో కూడినట్టిది.

బుద్ధి వృత్తుల ద్వారా ఉండే ఈ బంధనమే ఆత్మలో త్రిగుణ వృత్తులను దానం చేస్తున్నది. కనుక ఈ మూడు వృత్తుల కంటే విలక్షణమై వానిలో అనుగతమైన నా తురీయ తత్త్వంలో సుస్థిరంగా ఉండి ఈ బుద్ధి యొక్క బంధనం పరిత్యజించుము. అపుడు గుణ సహిత విషయం చిత్తం రెండూ వెంటనే వీడిపోతాయి.

ఈ బంధనం అహంకార కృతం. ఇదే ఆత్మయొక్క పూర్ణ తమ సత్యాన్నీ, అఖండ జ్ఞానాన్నీ, పరమానంద స్వరూపాన్నీ, కనుమరుగుచేస్తున్నది. ఇది తెలుసుకొని భక్తుడు విరక్తుడై ప్రవర్తించాలి. ఇంకనూ తన మూడు అవస్థలలో అనుసరణీయమై తురీయ స్థితికి జేరి సంసార చింతనం త్యజించాలి.

పురుషుని భిన్న భిన్న పదార్థాలలోని సత్యత్వ బుద్ధి, అహం బుద్ధి, నాది అనే మమబుద్ధి నివృత్తి అయేంత వరకు అజ్ఞాని మేలుకొన్ననూ నిద్రిస్తున్నట్లే. స్వప్నావస్థలో మేల్కొనియున్నాను అని తెలిసినట్లుగా. ఆత్మ వలన అన్యదేహాదులు ప్రతీయ మానమయ్యే నామ రూపాత్మక ప్రపంచం యొక్క అస్తిత్వం తెలియబడదు. వానికి కారణమైన వర్ణాశ్రమ భేదాలు స్వర్గాదిఫలాలు, కర్మలు ఈ మొదలైన వన్నీ ఆత్మకు స్వప్నంలో చూచిన పదార్థాల వలెనే మిథ్యా భూతాలు.

జాగ్రదవస్థలో సమస్త ఇంద్రియాల ద్వారా బాహ్యంగా కనుపించే క్షణ భంగుర ప్రపంచ పదార్థాలు అనుభవంలోకి వస్తుంటాయి. స్వప్నావస్థలో హృదయంలోపల జాగ్రదవస్థలో చూచిన పదార్థాల వాసనా మమ విషయానుభవమే జరుగుతుంటుంది. సుషుప్తిలో ఆయా విషయ వాసనలన్నీ కలిసి లయమైన అనుభవం కలుగుతుంటుంది. ఈ మూడు ఒక్కటే. అది దైవ రూపం. జాగ్రదవస్థలో ఇంద్రియాలు, స్వప్నావస్థలో మనస్సు, సుషుప్తిలో సంస్కార వంతమై బుద్ధి - పని చేస్తుంటాయి. వీనికి కూడానేనే మూలం. త్రిగుణ అవస్థలకు నేనే సాక్షీభూతుడను.

" ఎవడు ఏది స్వప్నంలో చూచాడో! ఎవడైతే నిద్రపోయాడో! వాడే నేనుగా మేల్కొంటున్నాను." ఈ స్మృతి బలం మీద ఒక్క ఆత్మయే అన్ని అవస్థలలో ద్యోతమాన మవుతోంది.

ఈ విధంగా విచారణచేసి మనస్సు యొక్క ఈ మూడు అవస్థలు గుణాల ద్వారా నా మాయావస్తువు వలన నా అంశ స్వరూపం జీవునిలో కల్పించబడినాయి. ఆత్మ దృష్టిలో ఈ మూడూ అసత్యం. ఇలా నిశ్చయం చేసికొని మీరు సందేహాలను సత్పురుషల ద్వారా, ఉపనిషత్తులు విని - తీక్షణమైన జ్ఞాన ఖడ్గం ద్వారా సకల సంశయాలకు ఆధారమైన అహంకారాన్ని ఛేదించవలసియున్నది. హృదయ కమలంలో గల నా పరమాత్మ రూపాన్ని భజించుము.

ఈ జగత్తు మనో విలాసం. చూస్తుండగనే నశించేది అలాత చక్రం వలె అతి చంచలమైనది. భ్రమ కలిగించేది. తెలుసుకో. జ్ఞాత జ్ఞేయ భేద రహితం ఇది. ఒక్క జ్ఞాన స్వరూపమైన ఆత్మయే అనేకంగా కనిపిస్తుంది. ఈ జీవి స్థూలశరీరం ఇంద్రియాలు అంతఃకరణం త్రి సంపుటియై మూడు వికల్పాలు గుణాలు గల పరిణామ స్వరూప రచన. స్వప్నతుల్య మాయా నాటకం ఇది. అజ్ఞాన కల్పితం.

కనుక ఈ దేహ రూప దృశ్య విలాసం నుండి దృష్టి మరల్చి తృష్ణా రహితుడవై ఇంద్రియ వ్యాపారాలు మానుకొని నిరీహ భావం కలిగి ఆత్మానందానుభవంలో మునిగి సుఖంపొందు. అప్పుడపుడు ఆహారాదులు తీసుకొనే సమయంలో ఈ దేహాదిక ప్రపంచం ప్రాధాన్యత వహిస్తుంటుంది. అంతకు ముందుగనే ఆత్మ వస్తువ కంటే మరొక వస్తువు మిథ్యగా నెరిగి విడువ వలసియున్నది. అపుడు అది మరల భ్రాంతి మూలక మోహాన్ని కలుగుజేయుటకు సమర్థనీయుము కాజాలదు. అది దేహ త్యాగం వరకు కేవలం సంస్కార

మాత్రంగా భాసిస్తూ ఉంటుంది.మత్తు పదార్థం సేవించిన ఉన్మత్తుడు తన శరీరంపై వస్త్రం కూడా ఉన్నదో లేదో ఎరుగడు. ఆ విధంగానే సిద్ధపురుషుడు తాను భగవత్సాక్షాత్కారం పొందిన దేహం ప్రారబ్ధమూలకంగా నిలిచి ఉందా! విశ్రమించిందా! దైవ వశంగా ఎటుపోయిందో! ఎటువెళ్ళి వచ్చిందో! ఎప్పటైనా రాలిపోయిందో! మొదలైన అశాశ్వత దైహిక విషాయాలపై దృష్టి ఉంచడు.

సనకాది కుమారులారా ! ప్రాణాలు, ఇంద్రియాలతో కూడిన మానవ శరీరాలు ,ప్రారబ్ధ కర్మలకు అధీనాలు. కనుక తనకు నిర్ణయించబడినవిధి వ్రాతలు ఎంతవరకు నియమితములో అంతవరకు కర్మ విధులకై ప్రతీక్ష చేస్తూ ఉండాలి. కానీ ఆత్మ సాక్షాత్కారం పొందువాడు సమాధిలో జీవిత అంతము వరకు యోగారూఢుడుగా ఉంటాడు. స్త్రీ పుత్ర ధన వస్తువులుతో కూడిన శరీరాన్ని ఆపేక్షించడు. స్వీకరించడు. తనకు లభించిన ఈ భౌతిక వస్తువులు తనవిగా తలంచడు. స్వప్న సంపదలు చూచి తనవి కాదు అనుకొన్నట్లుగానే భావిస్తాడు.

బ్రహ్మ మానస పుత్రులారా! విప్రవరేణ్యులారా! నేను ఇపుడు మీకు తెలిపినది సాంఖ్య యోగాలలోని అత్యంత రహస్యమైన గోపనీయ తత్త్వం. నేను శ్రీ మహా విష్ణుదేవుణ్ణి హంస రూపంలో మీకు తత్వ జ్ఞానం బోధచేయ తలంచి వచ్చాను. తెలుసుకొన్నారు గదా!

ఓ విప్ర శ్రేష్ఠులారా! నేను యోగాలకూ సాంఖ్య శాస్త్రానికీ, సత్య తత్త్వానికీ, ఋతానికీ మధుర వాక్సిద్ధికీ, తేజస్సుకీ, శ్రీకీ, కీర్తికీ, శమ దమాదులకీ, వీనికన్నిటికీ పరమ అధిష్ఠాన దేవతను సుగతిని పరమగతిని అన్ని నేనే.

నేను సర్వగుణ రహితుడను. దేనినీ ఉపేక్షించను. మరల సామ్యాది అసంగత గుణాలు నన్ను ఆశ్రయిస్తాయి. నన్ను సేవిస్తుంటాయి. అవి నాలో ప్రతిష్ఠితమైయున్నాయి. ఏలననగా అన్నటికీ నేనే హితైషిని. సుహృద్ప్రియతమ ఆత్మను నేనే. యధార్థంగా ఇవిగుణాలు కావు. సత్త్వాది గుణ పరిణామాలు కావు. ఇవి నిత్య సత్యాలు. ప్రియ ఉద్ధవా! నేను ఈ విధంగా సనకాదుల సందేహాలు నివారణం చేశాను. వారు పరమభక్తితో నన్ను పూజించారు. స్తుంతించారు. కీర్తించారు.

ఆ ఋషీశ్వరులు హంసరూపంగా వచ్చిన నన్ను అనేక రీతుల పూజించి స్తుతించగా. నేను వారిని ఆశీర్వదించి అదృశ్యమై స్వధామం వచ్చేశాను. బ్రహ్మాదులు తమతమ పట్టణాలకు వెళ్ళారు.

భక్తియోగం

ఉద్ధవుడు కృష్ణదేవుని ఇలా అర్థించాడు -

శ్రీ కృష్ణ దేవా! బ్రహ్మవాదులైన మహాత్ములు ఆత్మ కల్యాణం కొరకు వివిధ సాధనలు బోధిస్తున్నారు. అవి అన్నీ కూడా వారి వారి దృష్టిలో సర్వశ్రేష్ఠాలు. ఏదో ఒక్కటే శరణ్యం అని చెప్పలేము. కానీ నా ఆరాధనీయ, మహనీయా! ఓ నా ప్రియస్వామీ! సర్వాంతర్యామీ! తమరు అప్పుడప్పుడు భక్తియోగం ఒక్కటే నిరపేక్షం సర్వ స్వతంత్రం సాధన యోగ్యం అని సెలవిస్తుంటారు. నా మనస్సు అన్నియోగాలవైపు గల ఆసక్తిని వదలి తమ ఈ భక్తియోగంపై లగ్నమయింది. తన్మయం చెందింది. అని ఉద్ధవుడు శ్రీ కృష్ణ భగవానుని పాదాలు పట్టి ప్రార్థించాడు.

శ్రీ కృష్ణ దేవుడిలా ప్రబోధం చేశాడు - ఓ ఉద్ధవా! ఈ వేద వాణి కాల ప్రభావం వలన ప్రళయ వేళలుప్తమై పోయింది. నేను దీనినే సృష్టి ప్రారంభంలో సంకల్పించి బ్రహ్మకు ఉపదేశం చేశాను. దీనిలో భక్తుల భాగవత ధర్మాలు వర్ణిస్తూ వివరించాను.

ఈ భాగవత ధర్మాలు గలవేదవాణిని బ్రహ్మ తన పుత్రుడైన స్వాయంభువ మనువుకు ఉపదేశించాడు. స్వాయంభువు నుండి దీనిని భృగువు, అంగీరసుడు, మరీచుడు, పుహలుడు, అత్రి పుసస్త్యుడు క్రతువు అనే సప్త ప్రజాపతులు గ్రహించారు.

తదనంతరం ఈ బ్రహ్మర్షుల సంతానమైన దేవ దానవ గుహ్యక మనుష్య సిద్ధ గంధర్వ విద్యాధర చారణ కిందేవ కిన్నర నాగ రాక్షస కింపురుషాదులు తమ పెద్దల ద్వారా ఈ భాగవత ధర్మాలను గ్రహించారు. అన్ని జాతుల వ్యక్తుల స్వభావాలు వారి జన్మ వాసనలు సత్త్వ రజస్తమో గుణాలననుసరించి వేరు వేరుగా ఉంటాయి.

కనుక వారందరు తమ తమ స్వభావాన్ని అనుసరించే ఆ వేదవాణికి భిన్నభిన్న అర్థాలు తీసి వారి వారి భావాలకు అనుకూలంగా వ్యాఖ్యానించుకొన్నారు. వేదవాణి మహా అలౌకిక శక్తి కలది. ఎవరే అర్థం తీస్తే అట్లే వస్తుంది. అది దీని స్వాభావిక లక్షణం. ఇట్టి స్వాభావిక భేదం పరంపరాగత ఉపదేశ భేదాల వలన ముష్యుల బుద్ధిలో భిన్నత్వం వ్యాపించింది. కొందరు విచారించకుండానే వేద విరుద్ధ పాఖండులు కాజొచ్చినారు.

ప్రియ మిత్ర! అందరు నా మాయకు లొంగిపోయి ఉంటారు. దీని వలన వారు తమ తమ కర్మ సంస్కార విశేషాలు తమ తమ అభిరుచి అనుసరించి ఆత్మ కల్యాణ సాధనాలు ఒకటి కాదు అనేకం చెప్పబడినాయి.

పూర్వమీమాంసకులు ధర్మం, సాహిత్యాచార్యులు కీర్తి, కామశాస్త్రులు కామం, యోగాచార్యులు సత్య, శమదమాదులు దండ, నీతిజ్ఞులు ఐశ్వర్యం, త్యాగులు త్యాగం భోగులు భోగం ముఖ్యంమని చెప్పి మనుష్య జీవనం స్వార్థ పరమార్థ మిశ్రితంగా తేల్చారు.

కర్మయోగియైన మనుష్యుడు యజ్ఞం తపస్సు దానం వ్రతం యమం నియమం మొదలైన పురుషార్థాలు ఆచరిస్తూండాలి. కానీ ఇవి అన్నీ కర్మలు. వీని వలన వివిధ లోకాలు లభిస్తాయి. జన్మమరణాలున్నాయి. కర్మఫలం చివరకు దుఃఖమే. అంతిమగతి అజ్ఞానమే. వీని వల్ల లభించేది తుచ్ఛమైన ఫలమే. వారు లోక భోగ కాలంలో కూడా అసూయలతోను ద్వేష రోష కార్పణ్యాలతోనూ సంచరించి దోషులే అవుతుంటారు. శోకమే అనుభవిస్తుంటారు. కనుక ఈ వివిధ రకాల సాధనా జాలంలో పడకుండా నన్ను శరణుజొచ్చి జీవించటం మంచిది. నిరపేక్షను పొందు.

అన్ని విధాల ఏ అపేక్ష లేక ఏ వాంఛలు లేక ఆనందంగా ఉన్నవాడు ఏ కర్మలు చేయనక్కర లేదు. ఏ ఫలాలు పొంద నవసరం లేదు. వాడు అంతః కరణశుద్ధిగా సర్వం నాకే సమర్పిస్తాడు. పరమానంద రూపంగా ఉండే నేను అతని ఆత్మలో స్ఫురించి ఆనందం కలిగిస్తాను. అందువల్ల అతడు పరమ సుఖం పొందుతాడు. అతడు విషయ లాలసులను కలుసుకోడు.

నా భక్తుడు ఏదియూ కూడబెట్టడు. ఇతరుల నుండి ఏమీ స్వీకరించడు. అకించనుడు అంటే అతడే. అతడు ఇంద్రియాలపై విజయం పొంది శాంతుడై సమదర్శియై రాణిస్తాడు. నేను ప్రసాదించిన ప్రాప్తితో నా సాన్నిధ్య సుఖం అనుభవిస్తుంటాడు. పరమ సంతోషం సర్వదా పొందుతుంటాడు. నా భక్తునికై ఆకాశం వరకు ప్రతి ప్రదేశం ఆనందంతో నిండి తొణికిసలాడుతుంటుంది.

నాకు సర్వం సమర్పించుకొన్న నా భక్త వర్యుడు బ్రహ్మ పదవి ఇస్తామన్నా నన్ను విడిచి వెళ్ళడు. మరొక పదవిని కోరుకోడు. ఇంద్ర పదవి, సార్వ భౌమ పదవి, రసాధి పత్యం తుచ్ఛములని భావిస్తాడు. కేవలం అతడు నన్నే నా సామీప్య సుఖాన్నే వాంఛిస్తుంటాడు. అతడు యోగాలు సిద్ధుల వంటివే కాక చివరకు మోక్షం కూడా అభిలషించడు.

ఉద్ధవా! నీ వంటి ప్రియతమ భక్తుడంటే నాకు మిక్కిలి ఇష్టం. ఆ భక్తుడుతో సమానం ఎవరూ కారు. పుత్రుడు బ్రహ్మయైనా, ఆత్మజ్ఞాని శంకరుడైనా, తోబుట్టువు బలరాముడైనా అర్థాంగి లక్ష్మియైనా నాకు ఇష్టముండదు. చివరకు నా ఆత్మ కంటె కూడా నా భక్తుడంటే అత్యంత ప్రీతి.

దేనినీ అ పేక్షించక లౌకిక చింతలు వీడి నా చింతనం మననం భజనంలో తల్లీనమై యుండేవాడు రాగ ద్వేషాలు లేనివాడూ అందరి యెడల సమదృష్టి గలవాడూ ఎవడైతే ఉన్నాడో వాని వెనుక అడుగులలో అడుగులు వేసుకొంటూ తిరుగుతాను. వాడి పాద ధూళి నేను అపేక్షిస్తుంటాను. వాడి వలన, నేనూ సర్వులూ పావనమవుతారు. వాడి పాద ధూళి సోకిన సర్వమూ సర్వులూ పవిత్రులే సుమా! అ పాదధూళి రేణువులు అంతటి మహిమాన్వితాలు.

ఏవిధమైన సంగ్రహమూ పరిగ్రహమూ లేనివారూ, శరీరంలో అహంకార మమకారాలు లేనివారూ, నాప్రేమలో మునిగిన చిత్తం గలవారూ, సాంసారిక వాసనల నుండి శాంతి పొందిన వారూ, అందరి ప్రాణుల యెడల తన మహత్తర ఉదార స్వభావం చేత దయా దాక్షిణ్యాలు చూపేవారూ, ఏవిధమైన కామనలు లేని బుద్ధిగలవారూ, నా పరమానంద రూపానుభవం గలవారూ నాకు అత్యంత ప్రియ భక్తులు. అట్టి ఉత్తమ సాధు పురుషులను ఎవరూ గుర్తించ నవసరం లేదు. ఆ పరమానందరూపం నిరపేక్షం నిష్కామం. అట్టివానికి నా కృప ఎప్పుడూ ప్రాప్తిస్తుంది. అదే రక్షకమవుతుంది. అందరిచే మన్ననలు పొందుతుంది. వారి స్వభావమే సర్వత్ర వ్యక్తమవుతుంది. అది చిన్మయం.

ఉద్ధవా ! నా భక్తుడు జితేంద్రియుడు కాక అతనిని సాంసారిక విషయాలు తడవ తడవకు బాధిస్తున్నా, వాసనలు ఆకర్షిస్తున్నా కూడా అతడు క్షణ క్షణం పెరిగే నా భక్తి ప్రభావ ఉద్ధృతి వలన విషయ వాసనలకు పరాజితుడు కాడు. మండుతున్న అగ్ని జ్వాలలలో వృక్షాలు భస్మమైపోయినట్లు నా భక్తి సమస్త పాపరాశిని హరించి వేస్తుంది. నా భక్తి దావాగ్ని వలె మహా ప్రభావ వంతమైనది. జప పాఠాలూ, తప త్యాగాలూ ఏవి కూడా నన్ను పొంద జాలవు. అది ఒక్క ప్రేమ పూర్ణ భక్తి వలననే సాధ్యమవుతుంది. నా అనన్య భక్తి అతి బలం గలది సుమా!

నేను సాధుపురుషుల ఆత్మను. నేను అనన్య భక్తికీ, అనన్య శ్రద్ధకూ వశుడనవుతాను. నన్ను వశం చేసుకోటానికి భక్తియోగం ఒక్కటే ఏకైక మార్గం. నా అనన్య భక్తి యోగం నిమ్న జాతీయులను పవిత్రులను చేస్తుంది. జన్మతః చండాలురైన వారిని కూడా నా భక్తి యోగం మహా భక్తులను చేస్తుంది.

నా భక్తి నుండి వంచితులైన వారిని సత్య దయా ధర్మాలు తపో విద్యాదులు పునీతం చేయజాలవు. భక్తునికి నా గానాదులువిని శరీరం పులకరించాలి. కంఠం గద్గదం కావాలి. నేత్రాలు ఆనందాశ్రువులు విడవాలి. అంతరంగం బాహ్య అంగాలు భక్తి వరదలో మునకలెత్తాలి. అంతవరకు ఆ భక్తుడు పరిశుద్ధుడు అని భావించలేము. గద్గద స్వరంతో

ద్రవించిన చిత్తంతో విలపించక ఆనందించిన పారవశ్యంతో ఉచ్చ స్వరంతో భజనలతో నృత్య గానాలతో నన్ను సేవించే భక్తుడు తాను ఉద్ధరించబడటమే కాక లోకాన్ని ఉద్ధరిస్తున్నాడు. వాడు భువిని పావనం చేసిన వాడవుతాడు.

అగ్నిలో పుటం వేయటం వలన బంగారం తనమురికి పోగొట్టుకొని పరిశుద్ధమై స్వచ్ఛమైన కాంతితో తేజరిల్లుతుంది. ఆ విధంగానే నా భక్తియోగం ద్వారా ఆత్మ కర్మవాసనల నుండి విముక్తమై నన్ను చెందుతుంది. నేనే శుద్ధమైన ఆత్మస్వరూపాన్ని.

ఉద్ధవా ! నా యొక్క పరమపావన లీలా కథా శ్రవణం చేయటం వలన చిత్తంలోని మలినం కడిగి వేయబడుతుంది. ఆ వెంటనే సూక్ష్మ వస్తువైన తత్త్వం సాక్షాత్కారిస్తుంది. లోకంలో అంజనం వలన నేత్ర దోషాలు హరించి చూపు బాగా వచ్చి సూక్ష వస్తు దర్శనం కలిగినట్లు భక్తి వలన ఆత్మ దర్శనం సిద్ధిస్తుంది. ఉద్ధవా ! మానవుడు విషయ చింతనం చేస్తుంటే వాడి చిత్తం విషయభోగ లంపటాలలో దిగబడి పోతుంది. నా రూపధ్యాన లీలా స్మరణంలో ఉంటే వాడి చిత్తం నాలో తల్లీనత చెంది ఆనందం అనుభవిస్తుంటుంది. కాబట్టి నీవు ఇతర సాధనాలు చింతలు చింతనలు వదులు. నన్ను తప్పించి మరొకటి లేనే లేదు. మరొకటి ఉన్నట్లు తోస్తే అది స్వప్నంలో చూచిన మిథ్యా వస్తువు వంటింది. అది స్వప్న రాజ్యమే సుమా. కనుక నా ధ్యానంలో నా చింతనంలో నా స్మరణలో నీచిత్తాన్ని పరిశుద్ధంచేసికో. పూర్తిగా ఏకాగ్ర బుద్ధితో చిత్తం నా యందు లగ్నం చేయి. సంయమి స్త్రీలను, స్త్రీ ప్రేమికులనూ, దూరంగా ఉంచాలి. స్త్రీ సంబంధ ప్రసంగాలు చేయరాదు. అతడు పవిత్ర ఏకాంత స్థలంలో కూర్చొని నన్ను ధ్యానిస్తుండాలి.

ఓ ఉద్ధవా ! స్త్రీ స్నేహం - స్త్రీ ప్రేమికుల సేహ్నం లంపటం సుమా ! ఆ మోహంలో పడటం సంభవిస్తే మరల లేవలేడు. అంతటి క్లేశం మరొకటి లేదు. బుద్ధిమంతుడు స్త్రీ సాంగత్యం అవశ్యం వర్జించాలి..

ధ్యాన విధి

ఉద్ధవుడు అంతయు విని మరల ఇలా ప్రశ్నించాడు. " ఓ అరవిందాక్షా ! మోక్షా ధ్యక్షా ! కృష్ణా ! ముముక్షువులు తమరిని ఏ రూపంలో ధ్యానించాలి ? ఏ భావంతో చింతన చేయాలి ?" శ్రీ కృష్ణ భగవానుడు ధ్యాన విధానం ఇలా బోధిస్తున్నాడు. "ఓ ఉద్ధవా ! ధ్యాన సంకల్పం గలవాడు ఏకాంత పవిత్ర ప్రదేశంలో ఎత్తు పల్లాలు లేని సమతల ప్రదేశంలో ఆసనం ఏర్పాటు చేసుకోవాలి. ఆసనంపై శరీరాన్ని నిలిపి సుఖంగా విశ్రాంతిగా కూర్చోవాలి. కూర్చున్నపుడు చేతులు ఒడిలో పెట్టుకోవాలి. దృష్టిని నాసిక అగ్రభాగాన నిలపాలి.

ఆ తర్వాత పూరకం కుంభకం రేచకం అవలంబించి ప్రాణాయామం చేస్తూ నాడీ మండలాన్ని శోధనం చేయాలి. ప్రాణాయామ అభ్యాసం క్రమక్రమంగా అభివృద్ధి చేస్తూ రావాలి. దీనితో పాటు ఇంద్రియాలను జయించే అభ్యాసం చేయాలి. హృదయ కమల నాళంలోని దారమంత సన్నగా ఉండే ద్వారాల కుండా వచ్చేగాలి చప్పుడు వలె ఓంకారం మెల్లగా చింతనం చేయాలి. ఈ ఓంకారనాదాన్ని ప్రాణం ద్వారా పైకి తీసుకొని వెళ్ళి దానిలో ఘంటా నాదమంత ఉన్నతస్థాయిలో ప్రకాశితంచేసి స్వర్గం స్థిరంచేయాలి. ఆ ప్రణవ స్వర క్రమం భంగంకారాదు. ఈ విధంగా ప్రతిదినం మూడు పూటలందు పది పది పర్యాయాలు ఓంకార సహిత ప్రాణాయామం అభ్యాసం చేస్తుండాలి. ఇలాచేయగా ఒక నెలలోనే ప్రాణవాయువు వశంలోనికి వస్తుంది.

భక్తుడు ఆ తర్వాత ఇలా భావన చేయాలి. ఈ హృదయం ఒక కమలం. ఇది శరీరంలో ఉంది. కమలం కాడ పైకి ఉంది. కమలం ముఖం అధోముఖంగా ఉంది. 'ఆ కమల ముఖం పైకి తిరిగి వికసించాలి' అని ధ్యానించాలి. హృదయ కమలానికి ఎనిమిది దళాలున్నాయి. ఆ దళాల మధ్య అత్యంత సన్నని సుకుమార కర్ణికలున్నాయి. ఆ కర్ణికలపై వరుసగా సూర్యుడు చంద్రుడు అగ్నిదేవుడు ఉన్నట్లు భావించాలి. ఆ తర్వాత అగ్నిలోపల నాయొక్క రూపాన్ని స్మరించాలి. నా యీ స్వరూపం ధ్యానం చేయటానికి అనుకూలం మంగళకరం.

నా రూపం సుమనోహరం. సుందరం. నా అవయవ నిర్మాణం సర్వశ్రేష్ఠ లక్షణ లక్షితం. ప్రశాంతి దాయకం. ముఖ కమలం అత్యంత ప్రస్ఫుటం. ప్రఫుల్లితం. సుందరం. సుకుమారం. సుశోభితం. నా దీర్ఘ బాహువులు ఆజాను బాహువులు నాలుగూ నవశౌర్య విలసితాలు. నాగ్రీవం సుగ్రీవం నా కపోలాలు సుస్నిగ్ధాలు. మరకత మణిభాసురాలు. ముఖ కమలంపై మందహాసం మనోహరంగా ప్రకాశిస్తూంది. అందమైన కర్ణద్వయం. మణికుండల శోభితం. నా మేఘ శ్యామ సుందర శరీరం అత్యంత ఆకర్షణీయం. దానిపై పీతాంబరం మరీ శోభాయమానంగా ఉంటుంది. శ్రీ వత్సం శ్రీనికేతనం కుడి యెడమల విరాజిల్లుతుంటాయి. నాల్గు చేతులతో శంఖం చక్రం గద పద్మం ప్రాభవం చూపిస్తుంటాయి. కంఠంలో వనమాల సువాసనలు వెదజల్లుతుంటుంది. పాదపద్మాలకు నూపురాలు ధగధగ మెరుస్తుంటాయి. కౌస్తుభ మణి వక్షస్థలంపై సూర్యమణి వలె తేజస్సును విరజిమ్ముతుంది. నా ఉన్నత శిరస్సుపై మణిమయ మహా తేజో భాసిత కిరీటం చారు కంకణాలు మొల నూళ్ళు ముత్యాల తారహారాలు మణిహారాలు పుష్పమాలలు ఆయా యోగ్య స్థానాలలో శోభిస్తుంటాయి. నా అంగ ప్రత్యంగం కూడా ఆకర్షణీయం ఆదరణీయం ఆనందదాయకం.

అప్యాయత అనురాగం తొణికిసలాడే నా వదన సరోజం హృద్యం. ఇది అందరికి ప్రేక్షణీయంగా ఉంటుంది. చిరునవ్వులు చిన్నారివలపు చూపులు మరొకసారి చూడాలనిపిస్తుంది. నా కనులు కృపామృతం చిందిస్తుంటాయి. ఉద్ధవ ! ఇటువంటి నా సుందర సుకుమార సురూపం ధ్యానం చేయాలి. భక్తుడు నా అంగ ప్రత్యంగాలను భావనం చేయాలి. ఆ ధ్యానంలో మనస్సు లగ్నం కావాలి.

ఉద్ధవా ! బుద్ధిమంతుడైన పురుషుడు నాయొక్క అవయవం చూచి ధ్యానించి ఆకర్షించబడి మనస్సు ద్వారా ఇంద్రియాలను ఆయా విషయాల నుంచి మరలించాలి. బుద్ధిని సారధిగా చేసుకొని మనస్సు అనే అశ్వాన్ని నాకు అప్పగించి నా పనిలో వినియోగించాలి. నా సర్వ దేహం యొక్క అంగాలపై మనస్సుంచి ధ్యానించాలి. క్రమంగా మీ చింతనను ఒకే స్థానంపై కేంద్రీకరించాలి. అన్య అంగాలను చింతించక నా మందహాసామృత ముఖ చంద్రునిపై దృష్టిని నిలపాలి.

ఎపుడు నీ ధ్యాస నా ముఖారవిందంపై నిలబడుతుందో అపుడు ఆ ధ్యాసను ఆకాశంపై నిలపాలి. తదనంతరం ఆకాశ చింతనం కూడా మానివైచి నా స్వరూపం మీదకు దృష్టి సారించాలి. అపుడు సర్వత్ర సర్వంలోనూ నన్నే భావనచేస్తూ అన్నిటిలోనూ అన్ని రూపాలు నావిగా నన్నే ధ్యానించాలి.

అప్పుడు ఒక జ్యోతిని మరొక జ్యోతి వచ్చి కలిసినట్లుగా నీలో నన్ను చూచుకోవాలి. నీవు నన్ను సర్వాత్మలలో చూడ కల్గుతావు. ఇట్లు చిత్తం నాలో సమామితం కావాలి. యోగి ఇట్లా తీవ్ర ధ్యానయోగంలో నిలిచి నాలో తన చిత్తాన్ని ప్రవేశపెడతాడు. సమైక్యం చేస్తాడు. అపుడు అతని చిత్తంలో వస్తు అనేకత్వం, అనేక ఊహాపోహలు అనేక మోహాలు వ్యామోమాలు భ్రమలు నివృత్తి అవుతాయి.

విభిన్న సిద్ధాంతాలు - అణిమాది సిద్ధులు

శ్రీ కృష్ణ భగవానుడిలా బోధించసాగాడు - " ఉద్ధవా ! సాధకుడు ఇంద్రియాలనూ ప్రాణాల్ని మనస్సునూ తనవశం చేసుకొని తనచిత్తాన్ని నాలో ప్రవేశింపజేస్తాడు. నన్ను ధారణ చేస్తుంటాడు. అపుడు అతనికి అనేక సిద్ధులు కలుగుతాయి."

ఉద్ధవుడు ఇలా అడిగాడు " అచ్యుతా ! ఏ ఏ యోగాలు ధారణ చేస్తే ఎటువంటి సిద్ధులు ప్రాప్తిస్తాయి? వాటి సంఖ్య ఎంత! తమరు యోగులకు సిద్ధులు ప్రసాదించే వారు కనక తమరే నాకీ విషయం చెప్పాలి".

శ్రీ కృష్ణ భగవానుడీ విధంగా వివరించాడు - "ఉద్ధవా ! సౌమ్యా ! ధారణ యోగంలో సిద్ధులైన పండితులు పదునెనిమిది సిద్ధులు చెప్పారు. వీనిలో అష్టసిద్ధులు ప్రధానం మిగిలినవి తరువాతవి. అవి గుణహేతువులు. ఇవి సత్త్వ గుణ వికాసం కలిగిస్తాయి. అణిమ - మహిమ - లఘిమ - ప్రాప్తి - ప్రాకామ్యం - ఈశిత్వం - వశిత కామావసాయిత ఇవి అష్ట సిద్ధులు. వీనిలో మొదటి మూడు శరీర సంబధాలు. నాల్గవది ఇంద్రియ సంబంధం, ఐదవది వాంఛా సంబంధం, ఆరవది మాయా సంబంధం, ఏడవదివిషయ నిగ్రహం, ఎనిమిదవది సర్వ సుఖదాయకం.

శరీరం పదిలంగా దాచుకొని అనుకొన్న చోటికి వెళ్ళి వచ్చుట సుదూర ప్రదేశ వ్యక్తుల విషయాలు వినుట సుదూర దృశ్యాలను చూడకల్గుట మనస్సంత వేగంగా వెళ్ళివచ్చుట, అనుకొన్న రూపం ధరించుట, ఇతర మనుష్య జంతు పక్షి శరీరాలలో ప్రవేశించుట, అనుకొనగానే ప్రాణం విడువ కలుగుట, దేవతాదులతో క్రీడించుట, అనుకొన్న సంకల్పాలు పొందుట, ఎవరి అనుమతి లేనిదైనను ప్రవేశించ కల్గుట. ఇవి పది. ఈ సిద్ధులను శ్రీ కృష్ణ స్వామి యోగ్యులకు కృపలో ప్రసాదిస్తుంటాడు అని తెలుసుకో.

ఉద్ధవా ! భూత భవిష్య ద్వర్తమాన కాలాలు ఎరుగుట, శీతోష్ణాలకు సుఖ దుఃఖాలకు రాగ ద్వేషాలకు అతీతంగా ఉండుట, అగ్ని సూర్య జల ప్రళయాలను అణచివేయుట, పరులచే పరాజయం పొందకుండుట, పరుల మనోగత భావాలు తెలుసుకొనుట ఈ ఐదు యోగీంద్రులకు ప్రాప్తిస్తుంటాయి.

ఉద్ధవా ! యోగధారణ వలన లభించు సిద్ధులు పేరుపేరున వర్ణించి చెప్తాను. అవి ఎలా ప్రాప్తిస్తాయో చెప్తాను విను.

అణిమాసిద్ధి -

ప్రియ బాంధవా ! ఉద్ధవా ! పంచభూత సూక్ష్మ తమ మాత్రా మయం నా శరీరం. ఉపాసకుడు కేవలం నాయొక్క శరీరాన్నే ఉపాసన చేసినపుడు అతని మనస్సు నాయొక్క శరీరాకృతి పొందుతుంది. ఆ భక్తుడు నా తన్మాత్ర శరీరాన్ని ఉపాసిస్తున్నాడే కాని మరొకటి ఏమీకాదు. అందువల్ల అతనికి 'అణిమ' అనే సిద్ధి లభిస్తుంది. దీని వలన అతడు శిలా రూపాలలో కూడా ప్రవేశిస్తాడు. ఈ శక్తిని 'అణుత్వప్రాప్త శక్తి' అంటారు కూడా.

మహిమా సిద్ధి

మహత్తత్త్వ రూపంలో కూడా నేను విరాజిల్లుతుంటాను. ఆ రూపం సమస్త

వ్యవహారిక జ్ఞాన సమూహానికి కేంద్రంగా ఉంటుంది. ఆ రూపంలో నన్ను మనసుంచి ఉపాసన చేయగా మనస్సు తదాకారం వహిస్తుంది. అది మహత్తత్త్వాకారం పొందుతుంది. అతనికి మహిమాసిద్ధి లభిస్తుంది. ఆకాశాది పంచభూతాత్మక శక్తులలో నేనే ఉన్నాను కదా! కనుక అతనికి మహత్వ శక్తులు అన్నీ లభిస్తాయి.

లఘిమా సిద్ధి

భక్తుడు వాయువు మొదలైన నాల్గు భూతముల పరమాణువులు నా రూపంగా భావన చేయగా అతని మనస్సు తదాకారం పొందుతుంది. అతనికి లఘిమాసిద్ధి సిద్ధిస్తుంది. అతనికి పరమాణు రూపకాలంతో సమానమైన సూక్ష్మ వస్తు నిర్మాణ సామర్థ్యం ప్రాప్తిస్తుంది.

ప్రాప్తి సిద్ధి -

సాత్త్విక అహంకారం నా రూపమే. ఇది గుర్తించి నాయొక్క ఆ రూపాన్ని చిత్తంలో ధారణ చేసినపుడు అతడు సమస్త ఇంద్రియాలకు అధిపతి అవుతాడు. ఇలా నన్ను చింతనం చేయువాడు ప్రాప్తి సిద్ధి పొందుతాడు.

ప్రాకామ్య సిద్ధి

ఎవరైతే నన్ను మహత్త్వాభిమాన సూత్రాత్మలో ధ్యానించి తన చిత్తాన్ని ఇందులో స్థిరం చేసుకొని తదాకారం పొందుతారో, అతనికి అవ్యక్త జన్మ ప్రాకామ్య సిద్ధి లభిస్తుంది. దీనివలన కోరిన భోగాలన్నీ లభిస్తాయి.

ఈశిత్వ సిద్ధి

యోగి త్రిగుణమయీ మాయాధిపత్యము గల నాయొక్క కాల స్వరూపాన్ని విశ్వంగా ధరిస్తాడు. అతడు శరీరాలను జీవులను తన ఇచ్ఛానుసారంగా ప్రేరణ చేసే సామర్థ్యం కలిగి ఉంటాడు. ఈసిద్ధి పేరు ఈశిత్వ సిద్ధి. మాయను వశం చేసుకొన్న యోగికి ఈశిత్వసిద్ధి లభిస్తుంది. దీని వలన సర్వచరాచరాలను తన ఇష్టం వచ్చినట్లు నడుపుతాడు.

వశిత్వ సిద్ధి

నా నారాయణ రూపంలో తురీయంలో భగవత్తత్త్వం ఉంది. యోగి అట్టి భగవత్తత్త్వం మనస్సు లగ్నం చేస్తాడు. అపుడు నా స్వాభావిక గుణాలు అతనిలో ప్రతిబింబిస్తాయి. ఇది వశిత్వ సిద్ధివలన లభిస్తుంది. అట్టి భక్తుడే భగవానుడవుతాడు.

కామావసాయితా సిద్ధి

నిర్గుణ పరబ్రహ్మమూర్తిని నేనే. ఈ నా మూర్తిలో నిశ్చలంగా భక్తుడు తన

నిర్మలమైన బుద్ధినిలిపి ధ్యానించినపుడు అతనికి పరమానంద స్వరూపిణి ప్రత్యక్షమవుతుంది. దీనినే 'కామావసాయితా సిద్ధి' అంటారు. దీని వలన సర్వ కాంక్షలు సిద్ధిస్తాయి. అన్నీ పూర్ణం అవుతాయి. కనుక అట్టి యోగి పూర్ణ పురుషుడు. ఇవి అష్ట సిద్ధుల వివరాలు.

షడ్మూరికా విజయం -

ఉద్ధవా ! అత్యంత శుద్ధ ధర్మ స్వరూపంగలశ్వేత ద్వీపస్వామిని ధారణ చేసినట్లైతే క్షుత్పిపాసలు జన్మమరణాలు శోకమోహాలు ఉండవు. ఆ శుద్ధ స్వరూపం నాదే కనుక అట్టి నా భక్తుడు శుద్ధ రూపం పొందుతాడు.

దూర శ్రవణం -

నేను ఆకాశ ఆత్మగా ఉంటాను. కనుక ఆకాశ ఆత్మను ఉపాసించు భక్తుడు మానసంలోని అనాహత నాదాన్ని చింతన చేసినట్లైతే వివిధ ప్రాణుల భాషలు అర్థం చేసికొంటాడు. దీనినే దూరశ్రవణ విద్య అంటారు.

దూర దర్శనం-

నా భక్తుడు సూర్యుని చూస్తూ సూర్య శక్తి గ్రహిస్తాడు. నా ధ్యానం సూర్య శక్తి ఉపాసన వలన సూక్ష్మ దృష్టి కలిగి దూరదర్శన సిద్ధి పొందుతాడు. ప్రపంచంలోని ప్రతి అణువును కూడ చూడగల శక్తి పొందుతాడు.

మనోజవం -

మనో దేహాలను ప్రాణవాయువుతో కలిపి నన్ను ఉపాసించిన భక్తుడు మనోజవసిద్ధి పొందుతాడు. దీని వలన ఆ భక్తయోగి అనుకొన్న చోటికి క్షణాలపై వెళ్ళ గలుగుతాడు. ఇక్కడ మాయమై అక్కడ ప్రత్యక్షమవుతాడు.

సురరూప ధారణం -

నా భక్తుడు ఉపాదాన కారణంగా ఉపాదాన రూపం పొంది ఏ దేవత రూపం పొంద తలంచితే ఆ రూపం పొందుతాడు. దీనికి కారణం చిత్తం నాయత్తం చేసి ఉపాసిస్తాడు.

పరకాయ ప్రవేశం -

నా భక్తయోగి ఇతర శరీరాలలలో ప్రవేశించ తలంచినచో వెంటనే తుమ్మెద ఒక పూవును వదలి మరో పూవు జేరినంత సులువుగా పరకాయ ప్రవేశం చేయగలగుతాడు.

స్వచ్ఛంద మరణం -

నా భక్తయోగి శరీర త్యాగం కోరుకున్నట్లయితే గుదస్థానం మూసివేసి ప్రాణవాయువును క్రమంగా హృదయం, వక్షస్థలం, కంఠం, మస్తకం, నుండి బ్రహ్మ రంధ్రం ఛేదించుకొని బ్రహ్మంలో లీనమవుతాడు.

అప్సర క్రీడ -

యోగి సురస్త్రీలతో క్రీడించ కోరినట్లయితే నా శుద్ధ సత్త్వరూపం భావనం చేస్తాడు. సత్త్వ గుణ అంశ స్వరూపులు సురస్త్రీలు. కనుక యోగి వారితో విహరించ కలుగుతాడు.

సంకల్ప సిద్ధి -

ఏ పురుషుడు నా సత్సంకల్ప స్వరూపంలో చిత్తం లగ్నం చేసి నన్ను ధ్యానిస్తాడో అతడు సంకల్ప సిద్ధి పొందుతాడు.

ఆజ్ఞాపన సిది -

నేను ఈశిత్వ వశిత్వ సిద్ధులకు స్వామిని. కనుక అందరు అన్నిప్రాణులు నా ఆజ్ఞను పాలిస్తాయి. ఎవరూ వ్యతిరేకించలేరు. భక్తుడు నా యీ రూపాన్ని భావనం చేసి నన్ను ఉపాసించినట్లయితే నా యంతవాడు అవుతాడు. అందరిని శాసించ గలవాడవుతాడు.

సర్వేశ్వరత్వం

ఏయోగి చిత్తం నన్ను ధారణచేస్తూ చేస్తూ నా భక్తి ప్రభావం వలన పరిశుద్ధ మవుతుందో ఆ చిత్తం బౌద్ధిక జన్మమృత్యు సంబంధ విషయాలు ఇతర అదృష్ట విషయాలు అన్నీ తెలుసుకో కల్గుతుంది. ఆ యోగికి భూత భవిష్య ద్వర్తమానాధి సర్వ రహస్య విషయాలు తెలుస్తాయి. జలం ద్వారా - జలంలో నివసించే జంతువులకు భయం నాశనం ఉండదో అదే విధంగానే యోగి తన చిత్తాన్ని నాకు సమర్పణ చేసి చిత్తాన్ని అణచి తనయోగమయ శరీరాన్ని బలయుతం చేస్తాడు. అపుడు ఆ శరీరానికి అగ్ని, జలం హాని కలిగించలేవు. ఏ పురుషుడు శ్రీవత్సాది చిహ్నాత శంఖచక్ర గదా పద్మ విభూషితమైన నా రూపాన్ని ధ్యానించి నా అవతార తత్వం భజిస్తాడో వాడు అజేయుడై లోకంలో కీర్తి ప్రతిష్ఠలు పొందుతాడు. ఈ ప్రకారంగా ఎవడు నా తత్త్వం విచారం చేస్తూ, ఉపాసన చేస్తూ, యోగధారణ ద్వారా నన్ను చింతన చేస్తూ, పవిత్ర జీవనం గడుపుతుంటాడో అతడు సర్వ సిద్ధులు పొంది పూర్ణ పురుషుడై ప్రకాశిస్తుంటాడు. సిద్ధుల మాహాత్మ్యాలు అనంతాలు. చెప్పాను కదా !

ఉద్ధవా ! ప్రాణం మనస్సు ఇతర సమస్త ఇంద్రియాలను జయించినవాడు, సంయమనశక్తి గలవాడు, నా స్వరూపధారణం చేసేవాడు, అన్ని సిద్ధులు పొందియుంటాడు. దుర్లభం అనేది ఆ భక్తయోగికి లేనేలేదు. కానీ శ్రేష్ఠ పురుషుల కొందరి అభిప్రాయం ఏమంటే భక్తులు భక్తియోగం జ్ఞాన యోగాదులు బూని కృష్ణదేవునిలో తాదాత్మ్యం చెందుతున్నారు. దీనికై ఈ సిద్ధులు పొందయత్నించటం విఘ్న కారణం అవుతుంది. సాధువుల సమయం సిద్ధి సంపాదనలో వ్యర్థమవుతుంది. శక్తులు సమయాలు దురుపయోగం అవుతున్నాయి.

లోకంలో జన్మ ఔషధ తపస్సు మంత్రాదుల ద్వారా లభించే సిద్ధులు యోగాల ద్వారానే ప్రాప్తిస్తాయి. కానీ యోగం యొక్క అంతిమ లక్ష్యం నా సారూప్య సాయుజ్య సాలోక్యాదుల సంప్రాప్తి. చిత్తం దైవాధీనం చేయాలి. చిత్తం దైవాయత్తం చేయకుండా ఏ యోగం కానీ సిద్ధికానీ సిద్ధించదు అనేది సత్యం. బ్రహ్మావాదులు చాలా సాధనాలు చెప్పారు. వానిలో యోగం సాంఖ్యం ధర్మం మొదలైనవి ముఖ్యం. సమస్త యోగాలకు సిద్ధులకు నేనే మూలహేతువు. వాటి అన్నిటికి నేను స్వామిని. నేనే ప్రభువును.

స్థూల పంచ భూతాల లోపల బైట సర్వత్రా సూక్ష్మ పంచభూతాలున్నాయి. సూక్ష్మభూతాలు లేకుండా స్థూల పంచభూతాలకు అస్తిత్వమే లేదు. ఆ విధంగానే సర్వప్రాణుల అంత రంగాలలో ద్రష్ట రూపంగా బాహ్యంలో దృశ్య రూపంగా నేను విరాజిల్లుతున్నాను. నాలో బాహ్యాభ్యంతరాల భేదం లేదు. స్వామి నిరావరణ నిరంజన నిరాకార అద్వితీయ ఏకైకమూర్తి.

భగవ ద్విభూతులు

ఉద్ధవుడు శ్రీ కృష్ణ దేవునితో ఇలా ప్రశ్నించాడు. భగవాన్ ! తమరు స్వయంగా పరబ్రహ్మ స్వరూపులు. తమకు ఆది అంతములు లేవు తమరు ఆవరణ రహితులు నిరాకారులు అద్వితీయులు. తత్త్వవిదులు. సమస్త చరాచర ప్రాణి కోటుల ఉత్పత్తి స్థితి రక్షణ కార్యాలు చేసేది తమరే. మహా ప్రళయ సంకల్పమూ తమదే. తమరు చిన్న పెద్ద ప్రాణులలో విరాజిల్లుతుంటారు. మనో ఇంద్రియాలను వశం చేసుకొన్నవారు నిన్ను తెలుసుకోగలరు. మనో ఇంద్రియాలను జయించలేని అల్పులు నిన్ను చూడలేరు తమను గూర్చిన యథోచిత ఉపాసన బ్రహ్మ వేత్తకే సాధ్యం. మహా యోగీశ్వరులు తమ రూపాలను విభూతులను పరమభక్తితో ఉపాసించి సిద్ధి పొందుతుంటారు. ఆ విధానం నాకు చెప్ప వలసిందని అర్థిస్తున్నాను.

ప్రభూ ! తమరు జీవుల అంతరాత్మలు. అందరిలో హృదయవాసివై కనుపించకుండా రహస్యంగా ఉంటావు. తమరు అందరినీ చూస్తుంటారు. లోకంలో జీవులు నీ మాయ నెరుగక మోహంలో మునిగియుంటారు. ఇది తమ లీలా విశేషం. దీని వలన నిన్ను ఎవరూ దర్శింపలేక పోతున్నారు. నీ సంకల్పం యున్నచో నీవే దర్శనం ప్రసాదిస్తావు.

స్వామి ! తమరు అచింత్య ఐశ్వర్య సంపత్తి గలవారు. భూలోకంలో స్వర్గ లోకంలో పాతాళ లోకంలో దశ దిశలందు గల తమ ప్రభాపూర్ణ విభూతులు వర్ణించి చెప్ప వలసిందిగా వేడుకొంటున్నాను. దేవాధిదేవా! మహాదేవా! సర్వ తీర్థాలను పుణ్యతమం గావించు తీర్థపాదులు తమరు. తమ దివ్యాంఘ్రి పద్మాలకు శతకోటి వందనాలు.

" శ్రీ కృష్ణ భగవంతుడిలా అన్నాడు" - " ప్రియ ఉద్ధవా ! నీవు ప్రశ్నలు అడుగుటలో కడునేర్పరివి. ఉత్తరము తెలుసుకొనుటలో సూక్ష్మబుద్ధివి. పూర్వం కురుక్షేత్రంలో కురుపాండవ సంగ్రామ సమయంలో అర్జునుడు ఇలానే అడిగాడు. "అర్జునుని మనస్సులో ఈ సందేహం చెలరేగింది - మన కుటుంబంలోనే కలహం వచ్చింది. రాజ్యం కోసం బంధువులను చంపటం అధర్మం నిందనీయం కాదా!" సాధారణ మానవుడు వలె ఇలా యోచించాడు - "నేను చంపే వాణ్ణి. వీరందరు చనిపోయే వారు." అని యుద్ధం నుండి వైముఖ్యం చూపాడు. పురుష వరేణ్యుడైన క్రీడికి సవ్యసాచికి అపుడు నేను రణ భూమిలోనే అనేక ప్రమాణాలు చూపి యుక్తులు సూక్తులు అర్జునునికి తెలియజెప్పాను. అపుడు అర్జునుడు ఆశ్చర్యంగా నన్ను 'నీవే యుద్ధం చేస్తున్నావా!' అని అడిగాడు. అపుడు చెప్పాను కూడా.

ఉద్ధవా ! నేను సర్వ ప్రాణుల ఆత్మను. సర్వుల హితైషిని. సర్వుల సుహృన్మిత్రుడను. సర్వులకు అధిపతినైన ఈశ్వరుడను. సర్వులనియామకుడను. నేనే ఈ ప్రాణుల రూపంలోనూ పదార్థాల రూపంలోనూ ఉన్నాను. వీనియొక్క ఉత్పత్తికీ స్థితి లయాలకు కారణ భూతుడను నేనే. ఉద్ధవా ! చలనాత్మకమైన పదార్థాలలో చలన శక్తిని నేను. నేను కాలరూపుణ్ణి కాలశక్తిని. కాలా తీతుణ్ణి గుణాలలో మూలరూప సామ్యావస్థగల గుణమూర్తిని. గుణంగల వస్తువులలో స్వాభావిక గుణం నేనే. క్రియా శక్తిగల ప్రథమ ప్రధాన క్రియా సూత్రం నేనే. మహత్వ శక్తులలో జ్ఞాన శక్తిని నేనే. మహత్తత్త్వం నేనే. సూక్ష్మ వస్తువులలో జీవశక్తిని నేనే. కాఠిన్య వస్తువును స్వాధీన పరచుకొనే మనో శక్తులలో మనస్సును నేనే. వేదాలను అభివ్యక్తం చేసే హిరణ్య గర్భ తత్త్వం నేనే. మంత్రాక్షరాలలో ప్రణవం అయిన ఓంకారం నేనే. అక్షరమాలలో అకారాన్ని నేను. ఛందాలలో త్రిపాది అయిన గాయత్రిని నేను.

సర్వ దేవతలలో నేను ఇంద్రుణ్ణి. అష్ట వసువులలో అగ్నిదేవుణ్ణి. ఆదిత్యులు పన్నెండు మంది - వారిలో విష్ణువును, ఏకాదశ రుద్రులలో నీల లోహితుణ్ణి నేను. మహర్షులలో భృగుమహర్షిని నేనే. రాజఋషులలో మను మహారాజును నేనే. దేవ ఋషులలో నారదమునిని నేను. గోవులలో కామధేనువును నేను. నేను సిద్ధేశ్వరులలో కపిల దేవుణ్ణి. పక్షి రాజులలో గరుడమూర్తిని నేను. ప్రజాపతులలో దక్ష ప్రజాపతిని నేను. పితృదేవులందు అర్యముడను నేనే అని తెలుసుకో ఉద్ధవా !

ఓ ఉద్ధవా ! నా విభూతులు ఇంకా చెప్తాను విను. అర్థం చేసుకో. దైత్యులలో నేను ప్రహ్లాదుడను. నక్షత్రాలలో చంద్రుడను నేనే. ఓషధులలో సోమరసం నేను. యక్ష రాక్షసులలో కుబేరుడను నేను. గజేంద్రులలో ఐరావతాన్ని నేను. జల నివాసులలో వరుణ ప్రభువును నేను. తపనులలో సూర్యుణ్ణి. మనుష్యులలో రాజును. అశ్వాలలో ఉచ్చైశ్రవాన్ని. ధాతవులలో బంగారాన్ని. దండధారులలో యముణ్ణి నేను. సర్పాలలో వాసుకిని. అనఘా ! ఉద్ధవా ! నేను నాగరాజులలో శేషనాగాన్ని, మృగాలలో నేను సింహాన్ని, ఆశ్రమాలలో సన్యాస ఆశ్రమం నేనే. వర్ణాలలో బ్రాహ్మణ వర్ణం నేనే. నేను తీర్థాలలో గంగా తీర్థం, జలాశయాలలో సాగరాన్ని నేను. ఆయుధాలలో ధనుస్సును నేను. ధనుర్ధారులలో శంకరుణ్ణి నేను.

ఉద్ధవా ! నేను నివాస స్థానాలలో సమేరు పర్వత శిఖరాన్ని. దుర్గమ స్థానాలలో హిమాలయాన్ని. వనస్పతులైన వృక్షాలలో నేను అశ్వత్థాన్ని. ధాన్య రకాలలో యవ ధాన్యం నేను. పురోహితులలో వసిష్ఠ బ్రహ్మర్షిని. వేద వేత్తలలో బృహస్పతిని. సేనాపతులలో కార్తికేయుణ్ణి. సన్మార్గ ప్రవర్తకులలో భగవాన్ బ్రహ్మను నేను. పంచమహా యజ్ఞాలలో బ్రహ్మ యజ్ఞం అనగా స్వాధ్యాయ యజ్ఞం నేను. వ్రతాలలో అహింసా వ్రతాన్ని. శుద్ధి చేసే పదార్థాలలో శుద్ధవాయువు, అగ్ని, సూర్యుడు, జలంవాణి ఆత్మను నేనే.

అష్టయోగాలలో మనో నిరోధ సమాధి యోగం నేను. విజయేచ్ఛ గల వారిలో మంత్రబలం నేను. కౌశలములలో ఆత్మ అనాత్మ వివేకం చూపే కౌశలం నేను. ఖ్యాతి వాదులలో వికల్పం నేను. ఉద్ధవా! ఉత్మమ స్త్రీలలో నేను మనుపత్ని శతరూపను. పురుషులలో స్వాయం భువమనువును. మునీశ్వరులలో నారాయణమునిని. బ్రహ్మచారులలో సనత్కుమారుడును. ధర్మాలలో కర్మ సంన్యాసాన్ని అనగా ఈషణాత్రయ త్యాగం ద్వారా సర్వ ప్రాణులకు అభయాన్నిచ్చే సన్యాసం నేను. అభయ సాధనలైన క్షేమాలలో ఆత్మ స్వరూప అనుసంధానం నేనే. అభిప్రాయ గుప్త సాధనలలో సత్య వచనం మరి మౌనం నేను.

మిథునాలలో నేను ప్రజాపతిని. సర్వదా జాగరూకత కాలంలో సంవత్సరం నేను. ఋతువులలో మధుమాధవ మాసాలతోయున్న వసంత ఋతువు నేను. మాసాలలో మార్గ శీర్షం. నక్షత్రాలలో అభిజిత్ నేను.

నేను యుగాలలో సత్యయుగాన్ని. వివేకవంతులలో మహర్షులైన దేవల అసిత ఋషిని నేనే. వ్యాసులలో కృష్ణ ద్వైపాయనుణ్ణి నేను. కవులలలో మనస్వి శుక్రాచార్యుణ్ణి నేను. సృష్టి ఉత్పత్తి లయాలు, ప్రాణుల జనన మరణాలు, విద్య అవిద్యలు ఎరిగిన మహాత్ములలో నేను వాసుదేవుడను. నాప్రియ భక్తులలో నీవే నేను. కింపురుషులలో హనుమంతుణ్ణి. విద్యాధరులలో సుదర్శనుణ్ణి నేనే సుదర్శనుడనగా అజగర రూపంలో నందుని గ్రసింపగా, కృష్ణపాద స్పర్శతో ముక్తుడైనవాడు. ఆ అజగర స్వరూపుడే సుదర్శనుడు. ఉద్ధవా ! రత్నాలలో పద్మరాగాన్ని. సుందర వస్తువులలో తామర మొగ్గను నేను. తృణజాతిలో నేను దర్భను. హవిస్సులలో ఆవునేతిని నేను. ఇంకా చెప్తాను విను.

ఉద్ధవా ! వ్యాపారుల వద్ద వృద్ధి చెందే లక్ష్మి, ద్యూతం జూదం మోసాలతో ధనం ఆర్జించే వారి తెలివితేటలు, కష్ట సహిష్ణుత గలవారిలోని తితిక్ష, సాత్త్విక పురుషులలోని సత్త్వగుణం నేనే. బలవంతులలోని పరాక్రమోత్సాహాలు, భగవద్భక్తుల్లోని భక్తి నిష్కామకర్మ నేనే. వైష్ణవ పూజనీయులైన నవమూర్తులు వాసుదేవుడే - సంకర్షణుడు - ప్రద్యుమ్నుడు - అనిరుద్ధుడు - నారాయణుడు - హయగ్రీవుడు - వరాహమూర్తి - నృసింహమూర్తి - బ్రహ్మదేవులలో వాసుదేవుణ్ణి నేను.

గంధర్వులలో విశ్వావసు - అప్సరసలలో పూర్వచిత్తి - పర్వతాలలో స్థైర్యం - భూమిలో గంధం - నేనే. జలంలో రసం, తేజోమూర్తులలో పరమ తేజస్వి అగ్నిదేవుణ్ణి నేనే. సూర్యచంద్ర తారా కాంతులతో నిండిన ఆకాశంలో శబ్దగుణం నేనే. ఉద్ధవా ! బ్రాహ్మణ భక్తులలో బలిని నేనే. వీరవరులలో అర్జునుణ్ణి నేనే. ప్రాణుల ఉత్పత్తి స్థితి లయాలు నేనే.

నేనే పాదాలలోని గమన శక్తిని, వాక్కులోని భాషా శక్తిని, పాయువులోని మల విసర్జన శక్తిని, హస్తాలలోని గ్రహణ శక్తిని, జననేంద్రియంలోని ఆనందోపభోగ శక్తిని, చర్మంలోని స్పర్శ శక్తిని, నేత్రాలలోని దర్శన శక్తిని, జిహ్వలోని రుచిగ్రహణ శక్తిని, శ్రవణాలలోని శ్రవణ శక్తిని, నాసికలోని వాసనచూచు శక్తిని నేనే. అన్ని ఇంద్రియాల శక్తిని నేనే. భూమి వాయువు ఆకాశం జలం జ్యోతి అహంకారం మహత్తత్త్వం మహాభూత పంచకం జీవుడు అవ్యక్తం ప్రకృతి సత్త్వరజస్సు తమస్సు వీనికి పరంగా ఉండే బ్రహ్మం అన్నీ నేనే.

ఈ తత్వ గణ స్వరూపం లక్షణాల ద్వారా వ్యక్తమయ్యే జ్ఞాన సమూహం తత్త్వ జ్ఞాన రూపాలు వాటి ఫలాలు నేనే. నేనే ఈశ్వరుణ్ణి. నేనే జీవుణ్ణి. నేనే గుణాలు. గుణిని నేనే. నేను అన్నిటి ఆత్మను. నేనే అన్నీ. నేను కాని పదార్థం ఏ ఒక్కటీ లేదు. లెక్కించ దలిస్తే పరమాణువులను లెక్కించ వచ్చేమో కానీ నా విభూతులను ఎవరూ గణించలేరు. నేను నిర్మించిన కోటాను కోట్ల బ్రహ్మాండాలనే లెక్కపెట్టటం సాధ్యం కాని పని. ఇక నా విభూతులు లెక్కించటం సాధ్యమా! కాదు. ఎక్కడైతే తేజస్సు శ్రీ కీర్తి ఐశ్వర్యం లజ్జ త్యాగం సౌందర్యం సౌభాగ్యం పరాక్రమం తితిక్ష విజ్ఞానం మొదలైన శ్రేష్ఠ గుణాలు విరాజిల్లు తున్నాయో అవి అన్నీ నా అంశలుగా నీవు గుర్తించు.

ఏతాస్తే కీర్తితాః సర్వాః సంక్షేపేణ విభూతయః ।
మనోవికారా ఏ వైతే యథా వాచాభి ధీయతే ॥

వాచం యచ్ఛ మనో యచ్ఛ ప్రాణాన్ యచ్ఛేంద్రియాణి చ ।
ఆత్మా న మాత్మానా యచ్ఛ న భూయః కల్పసే2 ధ్వనే ॥

యోవై వాఙ్మనసీ సమ్య గసం యచ్ఛన్ ధియాయతిః ।
తస్యవ్రతం తపోదానం స్రవత్యామఘటాంబువత్ ॥

తస్మాన్ మనోవాచ : ప్రాణాన్ నియచ్ఛేన్ మత్పరాయణః ।
మద్భక్తి యుక్తయా బుద్ధ్యా తతః పరి సమాప్యతే ॥

ప్రియ ఉద్ధవా ! నీ ప్రశ్నకు నేను సంక్షేపంగా నా యొక్క విభూతులను వర్ణించి వివరించాను. ఇవి అన్నీ పరమార్థ వస్తువులు కావు మనో వికార మాత్రలు. మనస్సు యోచించేవీ వాక్కుతో పలికేవీ పరమార్థాలు కావు. కల్పనలు మాత్రంగానే గ్రహించు.

కనుక వాక్కును స్వేచ్ఛా భాషణల నుండి నిరోధించు. మనస్సును సంకల్ప వికల్పాల నుండి మరల్చు, పరమార్థం కొరకు ప్రాణాలను వశం చేసుకో. ఇంద్రియాలను దమించుము. సాత్విక బుద్ధి ద్వారా ప్రపంచాభిముఖమైన బుద్ధిని శాంతింపజేయి. అపుడు సంసారంలో జన్మ మృత్యు రూపమైన చక్రంలో పడి నలిగిపోటం తప్పిపోతుంది.

ఏ సాధకుడు బుద్ధి ద్వారా వాక్కును మనస్సును సంపూర్తిగా వశపరచుకోలేడో

వాడి వ్రతాలు తపాలు దానాలు ధర్మాలు అన్నీ క్షీణించిపోతాయి. పచ్చి మట్టి కుండలో నీళ్లు ఉండలేవు కదా!

కాబట్టి ఉద్ధవా! నా భక్తుడైనవాడు నన్ను ధ్యానిస్తూ జపిస్తూ భక్తితో కూడిన బుద్ధితో వాక్కును మనస్సును ప్రాణాన్ని వశంలో సంయమనంతో నిలుపుకోగలగాలి. అలా చేయగలిగినవాడు మరొక వ్రతం శేషించి ఉండదు. వాడు కృత కృత్యుడైనట్లు తెలుసుకో!

వర్ణాశ్రమ ధర్మాలు

ఉద్ధవ ఉవాచ -

యస్త్వ యామిహితః పూర్వం ధర్మస్త్వ ద్భక్తి లక్షణః ।
వర్ణాశ్రమాచారవతాం సర్వేషాం ద్వి పదామపి ॥

యథానుష్ఠీయ మానేన త్వయి భక్తి ర్నృణాం భవేత్ ।
స్వధర్మేణార విందాక్ష ! త త్సమాఖ్యాను మర్హసి ॥

పురాకిల మహా బాహో ! ధర్మం పరమకం ప్రభో !
యత్తేన హంస రూపేణ బ్రహ్మణే2 భ్యాత్థ మాధవ ॥

స ఇదానీం సుమహతా కాలేన మిత్ర కర్శనా ।
న ప్రాయో భవితా మర్త్య లోకే ప్రాగనుశాసితః ॥

వక్తా కర్తా వితా నాన్యో ధర్మస్యాచ్యుత తే భువి ।
సమాయా మపి వైరించ్యాం యత్ర మూర్తి ధరాః కలాః ॥

కర్త్రా వి(త్రా ప్రవక్త్రా చ భవతీ మధు సూదన ।
త్యక్తే మహీతలే దేవ వినష్టం కః ప్రవక్ష్యతి ॥

తత్త్వం నః సర్వధర్మజ్ఞ ధర్మస్త్వద్భక్తి లక్షణః ।
యథా యస్య విధీయేత్ తథా వర్ణాయ మే ప్రభో ॥

వర్ణాశ్రమ ధర్మాలు

ఉద్ధవుడు ఇలా ప్రార్థించాడు - ఓ మాధవా ! మధుసూదనా! మానవోద్ధారకా ! తమరు మొదట వర్ణాశ్రమ ధర్మ పాలకులకు సామాన్య మానవమాత్రులకు భక్తి సంప్రాప్తించు ఉపదేశాలు చేశారు. ఇక ఇప్పుడు మానవుడే విధంగా వర్ణ ఆశ్రమ దర్మాలు పాటిస్తూ పరమ పవిత్రమైన తమ చరణాలపై గాఢమైన భక్తి భావం ఎట్లు కలిగి ఉండాలో వివరించ ప్రార్థిస్తున్నాను. ప్రభూ! ప్రథమంలో హంసరూపం ధరించి బ్రహ్మాదులకు పరమదర్మం బోధించారు. కానీ బహుకాలం గడచిన కారణంగా ఇపుడు ఆ ధర్మాలు మనుష్యులలో లోపించినట్లే అనిపిస్తున్నాయి. ఎక్కడా లేనట్లే ఉన్నాయి.

అచ్యుతా! అనంతా! ఈ భూలోకంలో కానీ బ్రహ్మలోకంలో కానీ వేదాలు మూర్తిమంతంగా సర్వాంగ సంపూర్ణ సౌందర్యంగా వృద్ధి పొందాలంటే తమ కృపా కటాక్షం కర్తవ్య ప్రబోధం నిత్యం జరుగుతుండవలసిందే. ఈ మహత్కార్యం తమరు కాక ఎవరు నిర్వహింప సమర్థులు స్వామి! ప్రబోధాలు జరిగిన నిత్యాచరణంలో నిత్య అనుభవంలో విరాజిల్లాలంటే వేద పోషణ జరగాలంటే తమ సంకల్పం అత్యవసరం.

ఈ వేద ధర్మాలు నడిపే ప్రవర్తకులు ప్రబోధకులు సంరక్షకులు సందీపకులు తమరే ప్రభూ! పూర్వ మధు దైత్యులను సంహరించి వేద మాతను కాపాడారు. అట్లే ఈ కాలంలో ధర్మాలను రక్షించాలి. స్వయం జ్యోతి స్వరూపా! పరంజ్యోతీ ! పరమాత్మా! తమరు పృథ్వి నుండి నిష్క్రమించినట్లైతే ఇక సర్వ ధర్మాలు దారి తప్పుతాయి. భ్రష్టమవుతాయి. అపుడు ధర్మాలను గూర్చి బోధించే వాడే ఉండడు. అనుసరించే వాడు అసలే కనుపించడు.

తమరు సర్వ ధర్మ మర్మజులు. సర్వజ్ఞులు. కనుక కరుణించి తమ చరణార విందాలపై నిలకడ గల నిశ్చల భక్తి కలిగించే సుధర్మాలు సూక్ష్మాలు ధర్మ రహస్యాలు ఆచరణ యోగ్యాలు అనుభవానంద దాయకాలు నాకు వివరించండి. మరియు ఎవరికి ఏ విధానాలు తగినవో నిర్ధారించి తెలియజెప్పండి. తమకు అనేకానేక ప్రణామాంజలులు - అని ఉద్ధవుడు పలికినాడు.

శ్రీ శుక మహర్షి ఇలా పురాణ ప్రవచనం సాగించాడు -

" ఓ పరీక్షన్మహారాజా! భక్తశిరోమణి ఉద్ధవుడు ఇట్లు ప్రశ్నించగా సత్య సనాతన మూర్తి కృష్ణమూర్తి అత్యంత ప్రసన్న చిత్తంతో మానవులను సనాతన ధర్మాలతో పునీతం చేయదలంచి ఈ విధంగా ఉపదేశించసాగాడు.

రాజా! శ్రీకృష్ణ భగవానుడిలా ఉపదేశించసాగాడు ఉద్ధవా! నీ వడిగిన ప్రశ్న మిక్కిలి ధర్మయుక్తంగా ఉంది దీనివలన వర్ణాశ్రమ ధర్మ పరాయణులకు పరమ కల్యాణకరమైన మోక్ష సామ్రాజ్యం ప్రాప్తిస్తుంది కనుక సంతోషంతో ధర్మ స్వరూపం బోధిస్తాను సావధానంగా శ్రవణం చేయి

సృష్టిలో ప్రథమంగా సత్యయుగం నడుస్తుండేది అపుడు మనావులందరూ ఒకే హంస వర్ణ నామకులుగా పిలువ బడుతుండేవారు ఆ యుగంలొని వారందరూ జన్మ నుండి కృత కృత్యులే సుమా! కనుకనే ఆయుగానికి 'కృతయుగం' అనిపేరు వచ్చింది

ఆయుగంలొ కేవలం ప్రణవమే వేదం ప్రణవాన్ని హంస అనేవారు తపస్సు - శౌచం - దయం - సత్యం - అనే నాల్గు చరణాలుండే వృషభ రూపం నేను ధరించి నేనే ధర్మంగా సంచరించేవాణ్ణి ఆ కాలంలో నిష్పాపులు మహా తపస్వులు నా హంస స్వరూపాన్ని శుద్ధ పరమాత్మంగా ఉపాసన చేస్తూండేవారు

ఉద్ధవా! సత్యయుగం గడచి త్రేతాయుగం ప్రారంభంకాగానే నా హృదయంలోని శ్వాస ప్రశ్వాసల ద్వారా ఋగ్వేదం సామవేదం యజుర్వేదం మూడు ఉద్భవించాయి ఆత్రయి నుండి హోత - అధ్వర్యుడు - ఉద్గాత అనే కర్మ రూపమైన మూడు యజ్ఞ స్వరూపాలతో నేను ప్రకటించబడ్డాను

విరాట్పురుషుని ముఖం నుండి బ్రహ్మ, భుజాల నుండి క్షత్రియుడు, ఊరువుల నుండి వైశ్యుడు, చరణాల నుండి శూద్రుడు పుట్టుకొని వచ్చారు వారి స్వభావాను సారంగా ఆచార వృత్తులు నిర్ణయించబడ్డాయి

ఉద్ధవా! ఆవిరాట్పురుషుణ్ణి నేనే కనుక నా ఊరు స్థలం నుండి గృహ స్థాశ్రమం హృదయ స్థానం నుండి బ్రహ్మచర్య ఆశ్రమం, వక్షః స్థలం నుండి వాన ప్రస్థాశ్రమం, శీర్ష స్థానం నుడి సన్యాసాశ్రమం, నిర్ణయించ బడ్డాయి ఆయా ఆశ్రమ ధర్మాలు ఆయాస్థానాలలో ఉద్భవించాయి

ఈ వర్ణ ఆశ్రమాలలో జనించిన వారి స్వభావాలు సాధారణంగా జన్మస్థాన ప్రభావాలను అనుసరించి ఉంటాయి. వీరిలో ఉత్తములు మధ్యములు అధములున్నారు. ఉద్ధవా! శమం దమం తపస్సు శుచిత్వం సంతోషం క్షమం సరళత్వం కృష్ణ భక్తి దయ సత్యం ఇవి కలిగియుండటం బ్రాహ్మణజాతి సహజ లక్షణాలు

తేజస్సు బలం ధైర్యం శౌర్యం సహన శీలత ఉదారత ఉద్యమభావం స్థైర్యం బ్రాహ్మణభక్తి ఐశ్వర్యం ఇవి కల్గియుండుటం క్షత్రియ జాతి లక్షణాలు ఆస్తిక్యత దానశీలత

గర్వం లేకుండుట విప్రసేవ ధన సంచయా కాంక్ష ఇవి కల్గియుండుట వైశ్య స్వభావ గుణాలు.

విప్రులను గోవులను దేవతలను నిష్కపటంగా సేవించటం సేవా ఫలంగా లభించిన దానితో సంతృప్తి పడటం ఇవి శూద్ర లక్షణాలు. అపవిత్రంగా ఉండటం అబద్దాలాడటం దొంగతనం చేయటం నాస్తిక భావం కల్గియుండటం కోరికలకు ద్వేషరోషాలకు దురాశలకు వశుడైయుండటం. అంత్యజుల లక్షణాలు.

ఉద్ధవా ! నాల్గు వర్ణాల - వారికి నాల్గు ఆశ్రమాల వారికి సాధారణ ధర్మాలు కొన్ని ఉన్నాయి. అవి ఇవి - మనో వాక్కాయ కర్మల ద్వారా ఎవరికి హింస కల్గించరాదు. అంటే మనోభావాలు దుష్టమై ఉండరాదు. వాక్కులు పరుషంగా ఉండరాదు. చేతలు హానికరంగా ఉండరాదు. సత్యం పాటించటం అందరికీ అవసరమే. దొంగతనం చేయరాదు. కామక్రోధ లోభాలకు దూరంగా ఉండాలి. పదుగురూ మెచ్చుకొనేవి పదిమందికీ మంచి వైన పనులు చేస్తుండాలి. జనులుచేసే కార్యకలాపాలు పొరుగువారికి మేలు కలిగించేవిగా ఉండాలి. ఇట్టి సత్కార్యాలు చేస్తుండాలి. ఇవి సార్వజనీన ధర్మాలు.

ఉద్ధవా! బ్రహ్మచర్యాశ్రమ ధర్మాలు విను- బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు గర్భాదానం మొదలైన సంస్కార క్రమం నిర్వర్తించి యజ్ఞోపవీత ధారణ కర్మ చేయాలి. యజ్ఞోపవీత ధారణంతో ద్వితీయ జన్మ ప్రాప్తిస్తుంది. దీనితో ద్విజత్వం లభిస్తుంది. ద్విజత్వం పొంది గురుకుల ప్రవేశం చేయాలి. ఇంద్రియ విజయుడు కావాలి. ఆచార్య ఆదేశానుసారం వేదాధ్యయనం జరపవలసియుంది.

వటువు నడుముకు దర్భతో తయారుచేయబడిన త్రాడు కట్టుకోవాలి. లేడిచర్మం ధరించాలి. కుల ధర్మం అనుసరించి దండం రుద్రాక్ష మాల యజ్ఞోపవీతం కమండలం అలంకరించు కోవాలి. శిరస్సుపైన శిఖలు ధరించాలి. దంత ధావనం నియమంగా జరపాలి. వస్త్రాలు అలంకారానికి ఉపయోగించరాదు. రంగురంగులు గల అందమైన ఆసనాలు వాడరాదు. కుశాసనం పైననే కూర్చొనుట మంచిది.

స్నాన భోజన సమయాలలో మౌనం పాటించాలి. జపహోమ వేళల నియమాలు అనుసరించాలి. మల మూత్ర విసర్జన కాలంలో రహస్యం నిశ్శబ్దం అవసరం. అంగ క్షౌరం నిషిద్ధం. గోళ్ళుకూడా కత్తిరించుకోరాదు. వటువు పూర్ణ బ్రహ్మచర్యం పాటించాలి. రేత స్ఖలనం జరపటం మహాదోషం. స్వప్నావస్థలో ఒకవేళ రేత స్ఖలనం జరిగినట్లైతే స్నానం చేసి గాయత్రి జపించి తత్ప్రాయిశ్చిత్త కృత్యం చేసుకోవాలి.

బ్రహ్మచారి ఏకాగ్రచిత్తుడై అగ్నిని ఆదిత్యుని ఆరాధించాలి. ఆచార్యుని సేవించాలి. గోపూజ జరపాలి. బ్రాహ్మణ గురు బుధ జనులను గౌరవించాలి. దేవతాదులను అర్చించాలి. ఉదయ మధ్యాహ్న సాయం వేళల సంధ్యోపాసన నిర్వర్తించాలి. గాయత్రిని జపించాలి.

విద్యార్థి ఉదయ సాయం సంధ్యా వేళలందు నియమ క్రమానుసారం గురుకుల ధర్మాలు పాటిస్తూ గురువును సేవిస్తుండాలి. గురువు అనగా సాక్షాత్తు నా స్వరూపమే' అని విద్యార్థి గురువును దేవునిగా తలంచవలెను. గురువును ఎన్నడూ తిరస్కరింపరాదు. గురువును సాధారణ మనుష్యుడని దోష దృష్టితో చూడరాదు. గురువును దేవతామయుడుగా బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపుడుగా గౌరవించాలి. ఆరాధించాలి.

శిష్యుడు ఉభయవేళలందు తనకు లభించిన భిక్షలోని పదార్థాలను గురువు ముందుంచాలి. భోజన పదార్థాలేకాదు, ఇతర పదార్థాలు తనకు లభించిననూ గురువుకు ముందు నివేదించాలి. తదనంతరం గురువు ఆజ్ఞానుసారం మిక్కిలి సంయమనంతో భక్తి ప్రపత్తులతో వాటిని ప్రసాదంగా తీసుకోవాలి.

గురువుతో వెళ్ళునపుడు గురువు వెనుక నడువ వలసినది. గురువు నిద్రించిన తదుపరి గురువుకు కొద్ది దూరంలో పడుకోవాలి. గురువు గారికి పాద సేవ చేస్తుండాలి. గురువు కూర్చున్న తరువాత గురువు అనుమతితో వందనం చేసి కూర్చోవాలి. గురువు నిలబడి నపుడు తాను నిలబడే ఉండాలి. ఈ విధంగా తాను ఎంత గొప్పవాడైన గురువు వద్ద సేవకునివలె ప్రవర్తించవలెను.

విద్యాభ్యాసం పూర్తి అయ్యేంత వరకు అన్ని భోగాలు త్యజించి గురుకులంలో నియమపాలకుడై నివసించాలి. ఎన్నడూ బ్రహ్మచర్యాన్ని భంగ పరచరాదు. ఉద్ధవా ! బ్రహ్మచారి వేద పురుష స్థానమైన బ్రహ్మలోకం వెళ్ళాలని కోరుకొంటే ఆ జీవన నైష్ఠిక బ్రహ్మచర్య వ్రతం చేపట్టాలి. వేద స్వాధ్యాయం కొరకు తన జీవితాన్ని గురుపాద సన్నిధిలో గడపవలసియున్నది. ఇలా చేసిన బ్రహ్మచారి మిక్కిలి బ్రహ్మతేజస్సుతో ప్రాకాశిస్తాడు. అతని పాప సమూహం పటా పంచలై పోతుంది. అతడు అగ్నిలోనూ, గురువులోనూ, తన దేహంలోనూ, ఇతర ప్రాణులలోను నన్నే దర్శించి ఉపాసన చేస్తుండాలి. అతడు నాయొక్క హృదయంలోనూ సర్వుల హృదయాలలోనూ ఒకే పరమాత్మ విరాజిల్లుతున్నాడు' అని భావన చేయాలి.

బ్రహ్మచారి వానప్రస్థుడు సన్యాసి ముగ్గురూ స్త్రీల విషయంలో మిక్కిలి జాగరూకులై

ప్రవర్తించాలి. వీరు స్త్రీలతో భాషించటం తగదు. పరిహాసోక్తులు సలుపరాదు. వనితలను చూడటమే తప్పు. మైధున క్రియలోగల ఏ ప్రాణులను ఎన్నడూ చూడరాదు. ఎంతో నిగ్రహం కలిగి ఉండాలి. ఆడువారిని చూడవలసినది మాతృభావంతోనే.

ఉద్ధవా ! శౌచం ఆచమనం స్నానం సంధ్యోపాసనం సరళ స్వభావం తీర్ధ సేవనం జపం సర్వప్రాణులలో సర్వేశుని దర్శించటం మనోవాక్కాయ సంయమనం అనేవి అందరికీ సమాన ధర్మాలు. అస్పృశ్యులను తాక కుడదండుట - అభక్ష్య వస్తువులను భుజింపకుండుట - మాట్లాడ తగని వారితో మాట్లాడకుండుట అనే నియమాలు అందరికీ అవసరం.

నైష్ఠిక బ్రహ్మచారి ఈ నియమాలు పాటించినచో అతడు అగ్నిహోత్రుడంత తేజస్వి అవుతాడు. తీవ్ర తపస్సు వలన అతని కర్మ సంస్కారాలు భస్మమవుతాయి. అతని అంతః కరణం పరిశుద్ధమవుతుంది. అతడు నా భక్తుడై నా సన్నిధికి వచ్చి నన్ను పొందుతాడు.

ఉద్ధవా ! నైష్ఠిక బ్రహ్మచర్యం స్వీకరించటానికి ఇష్టం లేనప్పుడు అతడు గృహస్థాశ్రమంలో జేరదలచిన విధి పూర్వకంగా వేదా ధ్యయనం పూర్తి చేసిన తదుపరి గురుదేవులకు దక్షిణ సమర్పించి వారి అనుమతితో సమావర్తన సంస్కారం చేసికొని స్నాతక వ్రతం చేసికొని బ్రహ్మచర్యాశ్రమం వదలాలి.

బ్రహ్మచారి బ్రహ్మచర్యాశ్రమం తర్వాత గృహస్థాశ్రమం లేకుండానే, వాన ప్రస్థాశ్రమంలో చేరవచ్చు. బ్రాహ్మణుడైతే సన్యాసాశ్రమం కూడా స్వీకరించవచ్చు. కానీ క్రమంగా ఒకటి తర్వాత రెండవది స్వీకరించుట మంచిది. కానీ నా అజ్ఞ కాదని భక్తుడు వరుసగా ఆశ్రమాలు గ్రహించకుండా విపరీత క్రమంగా ఆశ్రమ పరివర్తనం చేస్తూ స్వేచ్ఛా చారుడై ఉండడు.

ఉద్ధవా ! బ్రహ్మచర్యాశ్రమం తదుపరి గృహస్థాశ్రమం స్వీకరించ కోరినట్లైతే తనకు తగిన దానిని శాస్త్రోక్తలక్షలు గలదానిని కులీన కన్యామణిని వివాహం చేసుకోవాలి. ఆ కన్య వయస్సులో తనకంటే తక్కువ వయస్సు గలదై ఉండాలి. తన కులకన్యయై ఉండాలి. ఒకవేళ కామవశుడై అన్య కులం బాలికను వివాహం చేసుకోవలసి వస్తే తన కులం కంటే తక్కువ కుల కన్యను వివాహం చేసుకోవచ్చు.

యజ్ఞయాగాది అధ్యయన దాన కర్మలు చేయు అధికారం గల బ్రాహ్మణుడు క్షత్రియ వైశ్య కన్యలను పెండ్లాడవచ్చు. కానీ దానం తీసుకోటానికి, వేదం చదివించ టానికి, యజ్ఞం చేయించటానికి అధికారం ఒక్క బ్రాహ్మణునకే కలదు.

విప్రులు ఈ మూడు వృత్తుల నుండి దానం గ్రహించరాదు. తేజస్సుకు యజ్ఞమునకు

అది నాశనహేతువు అని తలంచు అతడు అధ్యయనం యజ్ఞ కలాపాల వలననే జీవనం సాగించాలి ఈ ఉపాధ్యాయ వృత్తి యజ్ఞ కర్మ వృత్తి కూడా దోష సంకలితాలే పరావలంబనం దైన్యం అనిపిస్తే పంట కోసిన తదుపరి పొలాలలో రాలిన గింజలతో జీవనం గడుపుకోవాలి

ఉద్ధవా! బ్రాహ్మణ దేహం నాకు అత్యంత ఇష్టం బ్రాహ్మణ జన్మ దుర్లభం ఈ దేహం తుచ్ఛ విషయభోగాలు అనుభవించటం కొరకు కాదు. ఈదేహం జీవన పర్యంతం కష్టాలైనా సహించి తపస్సు చేసి చివరిలో ఆనంద స్వరూప ప్రాప్తి పొందుటకే లభించింది. అని గ్రహించాలి.

ఏ బ్రాహ్మణుడు గృహంలోనే ఉండి తన మహత్వ పూర్ణ ధర్మం నిష్కామ భావంతో నిర్వహిస్తూ పొలాలలోను వీధులలోనూ జారిన గింజలను ఏరుకొని సంతృప్తిగా జీవనం గడుపుతుంటాడో తన శరీరం ప్రాణం అంతః కరణం ఆత్మా నాకు సమర్పణగా అంకితం చేసి ఇతర పదార్థాలపై ఆసక్తి చూపకుండా ఉంటాడో- అతడు సన్యాసం పుచ్చుకోక పోయినా పరమశాంతి స్వరూపమైన నా పరమపదం పొందుతాడు.

విపత్తులలో పడి కష్టాలు పొందుతున్న నా భక్త విప్రులను ఎవరు ఆదుకొంటారో వారిని నేను శీఘ్రంగా కష్టాల నుండి రక్షిస్తాను సముద్రంలో పడిపోయిన వారిని నావల ఒడ్డుకు జేర్చినట్లుగా భగవంతుడు పరోపకార పరాయణులైన భక్తులను వెంట జంట నుండి ఆదుకొంటూ యోగక్షేమాలు చూస్తుంటాడు. రాజు ప్రజలను తండ్రివలె కాపాడుతూ కష్టకాలంలో సహాయపడుతుంటాడు. గజరాజు గజాలను రక్షిస్తున్నట్లుగా ప్రజలను రక్షిస్తూ తనుతాను ఉద్ధరించుకొంటూంటాడు ఇట్లు ప్రజా రక్షణ చేయు రాజు సకల పాపాల నుండి విముక్తి పొందుతాడు. చివరకు సూర్యునివలె తేజస్సు గలవాడై విమానం అధిరోహించి స్వర్గం వెళతాడు. ఇంద్రుని వలె సకల భోగాలు అనుభవిస్తూంటాడు.

బ్రాహ్మణుడు ఒకవేళ అధ్యాపకత్వం వలన యజ్ఞ యాగాల వలన జీవనం గడప తలంచితే వైశ్య వృత్తిని అనుసరించ వచ్చు. ఆపదగడిచే వరకే ఈ వృత్తి స్వీకారం. ఒక వేళ మరీ కష్టాలు ఆపదలు కలిగినట్లైతే కత్తి ధరించి రాజధర్మాన్ని స్వీకరించవచ్చు కానీ ఎన్నటికీ నీచమైన సేవ వృత్తి గైకొనడు. ఆ వృత్తిని శ్వాన వృత్తి అంటాడు.

క్షత్రియుడు ఒక వేళ ప్రజాపాలన రాజకీయాల వలన జీవనం జరుగకపోతే వైశ్య వృత్తియైన వ్యాపారం చేయవచ్చు. అపుడు కూడా పెద్ద ఆ పత్తి వస్తే వేట ద్వారా కానీ ఉపాధ్యాయ వృత్తి ద్వారా కానీ జీవనం గడపవచ్చు. కానీ నీచ వృత్తికి దిగడు. అది శ్వాన వృత్తి అంటాడు. వైశ్యుడు కూడా ఆపద వేళ శూద్ర వృత్తి బూని జీవనం గడపవచ్చు. చాపలల్లుట

గుడ్డలు నేయుట చేయవచ్చు. ఇవి అన్నీ ఆపద్ధర్మాలు. గడ్డుకాలం గడచిన తర్వాత తమ తమ కుల వృత్తులలోకి వారు వెళ్ళాలి. కానీ లోభంతో నిమ్న వృత్తులలో ఉండరాదు.

గృహస్తుడు వేదాధ్యయన రూపంలో బ్రహ్మయజ్ఞం, తర్పణరూపంలో పితృయజ్ఞం, హవన రూపంలో దేవ యజ్ఞం. కాక బలి వంటి భూతయజ్ఞం, అన్నదాన రూపంలో అతిథి యజ్ఞం, మొదలైన వాటి ద్వారా నా స్వరూపంలోని భూత ఋషి దేవత పితృదేవత మనుష్య అది సర్వప్రాణులను యథాశక్తి ఆరాధన గావిస్తుండాలి. గృహస్థుడు శాస్త్రోక్త ప్రకారంగా సంపాదించిన న్యాయార్జిత పవిత్ర ధనంతో తన భృత్యులను ఆశ్రితులను ప్రజలను న్యాయంగా తృప్తిపరుస్తూ యజ్ఞం చేస్తుండాలి. ప్రజలను నొప్పించరాదు.

ప్రియమైన ఉద్ధవా! విను- గృహస్థుడు కుటుంబం యెడల ఆసక్తి చూపరాదు. పెద్ద కుటుంబమైనా దిగులుతగదు. కుటుంబం పెద్దదైనా ప్రమాదం ఏమీలేదు. అందరినీ పోషించేవాడు భగవంతుడు. ఈ లోకంలో గల వస్తువులన్నీ నశించేవే. అలానే స్వర్గాది పరలోక భోగాలుకూడా క్షణభంగురాలే. అని బుద్ధిమంతుడు గ్రహించాలి.

ఈ భార్యా పుత్రులు, అన్నలూ తమ్ములూ, గురుజనులూ బంధుగణాలు అందరూ ఒక సత్రంలో కూడిన బాటసారుల వలె కలుస్తారు. కొద్ది రోజులుండి ఎవరి మార్గాన వారు వెళ్ళిపోతారు. స్వప్నం నిద్రాభంగం అయ్యే వరకే ఉంటుంది. అలానే ఈ జనుల సంబంధాలూ ప్రేమలూ శరీరాలలో ప్రాణం ఉన్నంత వరకే. తరువాత ఎవరికి వారే యమునాతీరే. ఒకరి జాడ మరొకరికి తెలియదు. కనుక ఇదిగ్రహించి గృహస్థుడు గృహ బంధంలో చిక్కుకొని పోరాదు. అతిథి సత్రంలో ఉండిపోయినట్లుగా మనిషి గృహస్థ జీవనంపై అనాసక్తి కలిగి ఉండాలి. మానవుడు శరీరంపై అహంకారం, గృహంపై మమకారం పెంచుకోరాదు. గృహంలో బందీకారాదు.

భక్తుడైన పురుషుడు గృహస్థోచిత శాస్త్ర పద్ధతుల ద్వారా నన్ను ఆరాధిస్తుండాలి. వనం వెళ్ళ నవసరంలేదు. భవనంలోనైనా భగవదారాధనా భావం ముఖ్యం. భక్తుడు పుత్రవంతుడైన, వాన ప్రస్థాశ్రమం కానీ సన్యాసాశ్రమం కానీ స్వీకరించుట మంచిది.

ప్రియ ఉద్ధవా! ఈ విధంగా గృహస్థ జీవనం సాగింగాలి. అహంకరా మమకార బంధాలు వదులుకో లేనివారు భార్య అనీ - పుత్రులనీ - సంపత్తులనీ - ఎడతెరిపిలేని ఆకాంక్షలనీ ఈ ఆశా వ్యామోహ బంధాలు తగిలించుకొని ఉరిబిగించుకొని విలవిలలాడతారే కానీ సుఖించలేరు. స్త్రీలంపటంలోనో లోభంలోనో పడి ఉరులు బిగించుకొంటారే కాని పరమార్థం తెలుసుకోలేరు.

ఈ మూర్ఖులు ఇలా ఆలోచిస్తుంటారు - అయ్యో! నాతల్లి దండ్రులు వృద్ధులైనారు. భార్య అమాయకురాలు లోకం రీతి తెలియనిది. పిల్లలు చిన్న చిన్న వాళ్ళు . నే లేకపోతే అనాథలై పోతారు. దిక్కులేని వారై దీనులై బాధలు పడిపోతారు. వారి జీవితాలకు నేను లేకపోతే ఎలా?

ఈ విధమైన సంసార లంపటంలో చిక్కి ఆ గృహస్థుల చిత్తాలు అలిసిపోతుంటాయి. విషయ భోగ వాసనలతో ఎన్నడూ అతడు తృప్తి చెందడు. అతడు తన అమూల్య జీవితాన్ని వ్యర్థం చేసుకొంటాడు. అతడు మరణించి ఘోర నరకాల పాలవుతాడు.

వానప్రస్థ సంన్యాస ధర్మాలు

శ్రీ కృష్ణ భగవానుడు వానప్రస్థ ధర్మాలు ఇలా బోధిస్తున్నాడు -

ప్రియ బాంధవా! ఉద్ధవా! ఈ వాన ప్రస్థ ఆశ్రమ ధర్మాలు విను. వానప్రస్థ ఆశ్రమ స్వీకారం చేసినవాడు తన భార్యను పుత్రుల వద్దకు పంపి తాను ఆశ్రమానికి వెళ్ళవచ్చు లేదా భార్యతోసహా వనానికి వెళ్ళవచ్చు. ఆశ్రమ స్వీకారం పొంది శాంత చిత్తంతో తన ఆయుషులోని మూడవ భాగం వనంలో గడపాలి. అతడు వనంలో పవిత్రంగా ఉంటూ కందమూలాదులతో దుంపలతో పండ్లతో శరీర క్షుద్బాధను తీర్చుకొంటుండాలి. అచట వస్త్రానికి బదులు వృక్ష చర్మాలు ధరించాలి. అంటే నారబట్టలతో కానీ మృగచర్మాలతో కానీ పని గడుపు కోవచ్చు.

వానప్రస్థ ఆశ్రమవాసి కొన్ని నియమాలు పాటించాలి. అతడు తలపని చేయించుకోరాదు. రోమాలను తొలగించుకోరాదు. గోళ్ళు తీసుకోరాదు. పళ్ళు తోముకోరాదు. మీసాలు కత్తిరించుకోరాదు. మూడు పూటల ప్రవాహ జలంలో స్నానం చేస్తుండాలి. భూశయనం చేయాలి. గ్రీష్మ ఋతువులో పంచాగ్ని మధ్య తపించాలి. వర్ష ఋతువులో ఆరుబయట ఉండి వర్షధారలను సహించాలి. శీత ఋతువులో కంఠం వరకు గల జలంలో నిలిచి తపస్సు చేయాలి. ఇట్లు తపోమయ జీవనం సాగించాలి.

కందమూలాదులను నిప్పులపై ఉడికించుకొని తినవచ్చు. లేదా పండిన పళ్ళుతిని జీవించవచ్చు. ఆహార పదార్థాలను దంచుకొని తినవలసివస్తే ఆ విధంగా నైనా చేసుకోవచ్చు. లేక నోటి పళ్ళతో నమిలి తినినా తినవచ్చు. శాకాహారాలు భుజించవచ్చు. ఆయోగి అనుకూలం అనుసరించి ఆహార విధానాలున్నాయి.

వానప్రస్థాశ్రమవాసి ఆహార పదార్థాలు గూర్చి పరిశీలించ వలసియున్నది. ఏ పదార్థాలు ఎక్కడ నుంచి వస్తున్నాయి? ఎప్పుడు ఏవి గ్రహించాలి.? ఏవి తనకు అనుకూలమైనవి? ఈ విషయాలను విచారించి తాను స్వీకరించాలి. కందమూలాదులు

తీసుకొనేప్పుడు కూడా ఇదే నియమం పాటించాలి. ఆ పదార్థాల గూర్చి దేశకాల పరిస్థితులు తెలియనప్పుడు, తెలియని వారి నుండి అకాలంలో వాటిని గ్రహించరాదు.

నీవారధాన్యాదుల నుండి అరణ్య ఆహార పదార్థాల నుండి చరు పురోడాశాది యజ్ఞ ప్రసాదాలను తయారుచేయవలె. వాటితో సమయోచిత అగ్రయణాది వైదిక కర్మలు చేయవలె. వాన ప్రస్థాశ్రమ స్వీకారం అయిన తర్వాత వేద విహితమైన పశుబలి యజ్ఞాలు చేయనవసరం లేదు. వేదవేత్తలు చెప్పిన అగ్నిహోత్రం ధర్మ పౌర్ణమాస చాతుర్మాస్య వ్రతాలు గృహస్థుల వలె చేస్తుండాలి.

ఈ ప్రకారం ఘోర తపస్సు చేస్తుండగా అతని మాంసాది శారీరక బలం క్షీణించిపోతుంది. వానప్రస్థాశ్రమవాసి కఠోర తపోనియమాలతో నన్ను ధ్యానిస్తూ ధ్యానిస్తూ ముందుగా ఋషిలోకం జేరుతాడు. ఆ తరువాత నా దగ్గరకు వస్తాడు. తపస్సు నా స్వరూపం కదా!

హే ఉద్ధవా! మిక్కిలి ఎక్కువగా కఠిన నియమాలతోడి ఘోరతపస్సును స్వర్గం కోసం ఇతర దేవలోకాలకు వ్యయం చేసేవాడు మూర్ఖాగ్రేసరుడు. ఘోర తపస్సుచేసి మోక్షమే సాధించాలి. మోక్షాన్నే కోరుకోవాలి. భక్తుడు అసలు నిష్కామ భావంతోనే తపస్సు చేయాలి. అదే ఉత్తమోత్తమ నిర్మలమైన తపస్సు.

ఉద్ధవా ! వానప్రస్థుడు ఆశ్రమ నియమాలు పాటించటంలో అశక్తుడైనపుడు, లేక వృద్ధాప్యం వలన నరాలు పట్టు వదలి వణుకు నపుడు అతడు యజ్ఞాగ్నిని భావనం చేసి తన అంతః కరణంలోనికి ఆరోపించుకోవాలి. తన మనస్సును నా యందే లగ్నంచేసి అగ్నిలో ప్రవేశించాలి. ఈ విధానం విరక్తులు కాని వారిని గూర్చి చెప్పినదే. ఈ కామ్య కర్మల ఫలంగా ప్రాప్తించే లోకాలు కేవలం నరకలోకాలతో సమానం. దుఃఖ భరితాలు అని తలంచినట్లైతే శాస్త్రోక్త పద్ధతిలో యజ్ఞాగ్నులను పరిత్యాగం చేసి సంన్యాస స్వీకారం పొందవచ్చు.

వానప్రస్థుడు సంన్యాసి కావాలని తలంచినట్లైతే ముందుగా వేద విధి అనుసరించి అష్ట విధాలైన శ్రాద్ధములు ప్రాజా పత్య యజ్ఞం ద్వారా నన్ను అర్చించాలి. తదుపరి తన సర్వస్వం ఋత్విజులకు సమర్పించాలి. యజ్ఞాగ్నిని తన ప్రాణంలో లీనం చేయాలి. ఆ తర్వాత ఏ భవన స్థానాలపై కానీ, వస్తువులపై కానీ వ్యక్తులను కానీ, అపేక్ష చూపక స్వేచ్ఛగా స్వచ్ఛంద విహారం చేయాలి.

ఉద్ధవా! మరొక రహస్యం చెప్తాను విను - బ్రాహ్మణులు సంన్యాసం తీసుకోవాలని సంకల్పించగానే దేవతలు అతని ఆప్త బంధువులుగానో స్త్రీ పుత్రాదులుగానో

వచ్చి సంన్యాస స్వీకారానికి విఘ్నాలు కలిగిస్తారు. మోహపాశాలు వానిపై విసిరి వానిని మాయా బద్ధుని చేస్తారు. ఆ సంబంధీకులు వీడు సంన్యాసం స్వీకరించి మేము పొందలేని పదవి పొందాలని చూస్తున్నాడు. మమ్ములను చిన్నతనం చేస్తున్నాడు. మమ్ముదాటి వీడేమిట్' పరమాత్మను జేరుకోవటమేమిటి' అని కుతంత్రాలు పన్నుతుంటారు. లేదా వీనిని అనేక కఠిన పరీక్షలకు గురిచేస్తుంటారు.

సంన్యాస ధర్మాలు -

ఉద్ధవా! సంన్యాసి వస్త్రం ధరించ తలంచి నట్లైతే లంగోటి మాత్రం ధరించాలి. ఇంకా కావలసివస్తే మరొక చిన్నతుండు గుడ్డ ధరించవచ్చు. అతడు ఆశ్రమోచిత దండం కమండలం మాత్రమే గ్రహించి మిగిలిన ఏ వస్తువు ధరించరాదు. ఈ నియమం కొన్ని కొన్ని గడ్డుకాలాలలో సడలించవచ్చు. సన్యాసి నేలను చూచి నడుస్తుండాలి. గుడ్డతో వడ కట్టుకొని నీరుత్రాగుతుండాలి. మాట్లాడే ప్రతి మాట సత్య సమ్మతంగా సర్వజన శ్రేయస్కరంగా ఉండాలి, ఏపని చేసినా బుద్ధితో ఆలోచించి బుద్ధి పూర్వకంగా చేస్తుండాలి. వాక్కుకు మౌనం, శరీరానికి స్థిమితం, మనస్సుకు ప్రాణాయామం అయుధాల వంటి దండములు. ఈ మూడు విధాల దండాలు లేనివాడు కేవలం కాష్ఠ దండం ధరించినంత మాత్రాన దండి కాజాలడు. స్వామీ కాజాలడు. మౌనదండం - స్థిమిత దండం ప్రాణాయామదండం గలవాడు త్రిదండి సన్యాసి జాతిహీనులు నుండి గోహత్యా పరుల నుండి భిక్ష గ్రహించరాదు కానీ మిగిలిన వారి నుండి స్వీకరించవచ్చు. సన్యాసి కేవలం ఏవో సప్త గృహస్థుల నుండి లభించిన భిక్ష మాత్రమే స్వీకరించి తృప్తి పడాలి.

ఈ విధంగా ఏడిండ్లలో భిక్ష తీసుకొని గ్రామానికి దూరంగా గల ఏ జలాశయం దగ్గరకో వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కొని భిక్షను మంత్రాలతో పవిత్రం చేసికొని భిక్షలో కొంతభాగం శాస్త్రంలో చెప్పినట్లు ఎవరికి పెట్టాలో వారికి పెట్టి మిగిలిన దానిని మౌనంగా భుజించాలి. ఎక్కువ పదార్థం పెట్టించుకోరాదు. తెచ్చిన దానిని మరొక పూటకని దాచి పెట్టుకోరాదు.

ఉద్ధవా ! సన్యాసి ప్రవర్తన విను - సన్యాసి తాను ఒక్కడే విహరిస్తుండాలి. దేనిపై కూడా ఆసక్తి పెట్టుకోరాదు. సర్వేంద్రియాలు తనవశంలో ఉంచుకోవాలి. తనలోతానే ఆత్మక్రీడాపరుడై ఆత్మరతి కలిగి ఆత్మవంతుడై ఉండాలి. ఆత్మావలోకనా తత్పరుడై ఆత్మానంద మగ్నుడై ఆత్మజ్ఞానియై సర్వత్రా సర్వుల యెడల సమదృష్టి గలవాడై ప్రవర్తించాలి. ఆత్మానుభవం అతిముఖ్యం. సుఖదుఃఖాలలో కష్ట నష్టాలలో ధైర్యవంతుడై పరమాత్మ యందు ప్రగాఢ విశ్వాసం గలవాడై ఆత్మానందం అనుభవిస్తుండాలి.

సన్యాసి ఎప్పుడూ నిర్జన ప్రదేశంలో నిర్భయంగా ఏకాంతంగా ఉంటుండాలి. అతడి హృదయం పరిశుద్ధంగా నిర్మలంగా నిశ్చల భక్తి రసంలో మునిగి ఉండాలి. అతడు నాతో అభిన్నంగా అద్వితీయంగా అఖండంగా అనన్య చింతన కలిగి ఉండాలి. నాతోడే లోకంగా నా ఆలోచనతో నా లీలా వినోదాలతో నన్నే స్మరిస్తూ భజిస్తూ పూజిస్తుండాలి.

సంన్యాసి తననుగూర్చి లౌకిక పారలౌకిక భోగాలు గూర్చిజ్ఞాన రాశిని ఉపయోగించటం బంధన కారణం. మోక్షాన్ని గూర్చి యోచించటమే సంపాదించిన జ్ఞానానికి సార్థకత. ఇంద్రియ భోగాలు గూర్చి ఆలోచించటం ఆవేదన పడటం ఆవేశ పడటం బంధన హేతువు లవుతాయి. ఇంద్రియాలు వశపరచుకొని సంయమనంతో వర్తించటమే మోక్షం.

సంన్యాసి మనస్సునూ పంచ జ్ఞానేంద్రియాలనూ జయించి తనవశంలో ఉంచుకోవాలి. సన్యాసి భోగాలను క్షుద్రంగా భావించాలి. వాటివైపు మనస్సు పోనీయరాదు. విరక్తి వహించటం విజ్ఞత. సన్యాసి సదా ఆత్మానందానుభవ సాగరంలో ఓలలాడుతుండాలి. సదా నాయొక్క చింతనంలో కార్యకలాపాలలో భావనా భూమిలో విహరిస్తుండాలి. ఉద్ధవా! సంన్యాసి సంచరించే దారిలోని పట్టణాలు పల్లెలు గొల్లపల్లెలు సత్రాలకు భిక్షకు వెళ్ళవచ్చు. సంపన్న దేశాలపై కానీ మనోహర నదీ తీరభూములపై కానీ పర్వత క్షేత్రాలపై కానీ విశాల ఉద్యానవనాలపై కానీ ఆశ్రమాలపై కానీ ఆసక్తి మమతా మమకారాలు లేకుండా విహరించి పోతూ ఉండవచ్చు.

సన్యాసి భిక్షకూడా ఎక్కువగా వనప్రస్థాశ్రమవాసుల నుంచి గ్రహించటమే మంచిది. నీవార ధాన్యంతో భుజించిన భిక్ష శీఘ్రంగా చిత్తాన్ని పవిత్రమూ పరిశుద్ధమూ చేస్తుంది. దీనివలన మనసులో ఏమూలైనా గల మోహాదాలు నశిస్తాయి. సిద్ధి సంప్రాప్తిస్తుంది.

ఉద్ధవా! విచార శీలుడైన సన్యాసి జగత్తును సత్య వస్తువు అని ఎన్నడు తలంచడు. జగత్తు ప్రత్యక్షంగానే నాశన శీలమైనది. కనుక జ్ఞాని జగద్విషయాలపై మనసుసను మరలనీయడు. లోక పరలోక సుఖాలపై విరక్తి కలిగి ఉంటాడు.విశాలమైన ఆత్మ యందు వాక్కు మనస్సు ప్రాణం కలబడి పోరాడు కొంటున్న జగత్తు ఇది. ఇది పూర్తిగా మాయ." అని సన్యాసి విచారించి నిశ్చయించుకొని ఈ భావంతో దీనిని త్యజించి తన స్వరూపంలో స్థిమిత పడి ఉండాలి. మరల ఈ మాయా జగత్తును గూర్చి తలంచరాదు.

ఉద్ధవా! నా భక్తుడు జ్ఞాననిష్ఠులు విరక్త ముముక్షువులు పొందే దాని కంటే గొప్ప దైన మోక్షం ఇస్తాము అన్నావెళ్ళడు. అట్టి భక్త సత్తముడు ఆశ్రమ మర్యాదలకు బద్ధుడై

ఉండడు. అతడు అనుకొంటే ఆశ్రమాలను ఆశ్రమ చిహ్నాలను వదిలేసి వేద విధులను కూడా ఉల్లంఘించి వీటికి అతీతంగా స్వేచ్ఛగా విహరిస్తాడు.

అతడు మహా బుద్ధి మంతుడు ధీశాలి అయినా బాలుని వలె ఆడు కొంటూంటాడు. నైపుణ్యంగల ప్రజ్ఞావంతుడయినా ఏమీ తెలియని జడునివలె సంచరిస్తాడు. విద్వాంసుడైనా పిచ్చివానివలె వ్యవహరిస్తాడు. వేద విధులెరిగిన మహాజ్ఞాని అయినా పశు వృత్తి ప్రదర్శిస్తుంటాడు. ఆ మహానుభావుడు అన్నీ తెలిసినా వేద చర్చల్లో పాల్గొనడు. పాఖండ మతం సమర్థించడు. తర్క వితర్కాలపైపుకు పోడు. వాద వివాదాల్లో ఏ పక్షమూ వహించడు.

ఆ ధీరోత్తముని మనస్సులో ఎవరియెడల ఉద్వేగ భావం జనించదు. స్వయంగా ఎవరినీ ఉద్విగ్న పరచడు. అతనిని ఎవరన్నా నిందించినా ప్రసన్నంగా ఉంటాడు. ఎవరినీ అవమానించడు. సంన్యాసి ఈ శరీరక వసతులకై ఎవరితోనూ వైరం పెట్టుకోడు. అట్టి సంన్యాసితో వైరం పెట్టుకోటానికి పశువులు కూడా సాహసించవు. వైరం పెట్టు కొన్నవాడు పశువు కంటె హీనాతి హీనుడు.

ఒకే చంద్రుడు వేరు వేరు జల పాత్రలలో వేరువేరుగా కనిపిస్తాడు కానీ ఆకాశంలో చంద్రుడు స్థిరంగా ఏకైకంగానే ప్రకాశిస్తుంటాడు. అలానే పరమాత్మ ఒక్కడైకూడా ప్రాణులకు వారి తలంపులకు తగినట్లు భాసిస్తుంటాడు. సర్వప్రాణుల ఆత్మఒక్కటే. పంచ భూతాత్మక శరీరం కూడా అందరిదీ ఒక్కటే. అన్నీ పాంచ భౌతిక నిర్మితాలే కదా! ఇటువంటి స్థితిలో మానవుడు తోటి మానవునితో వైరం బూనటం - తనతో తాను విరోధం బూనటమే అవుతుంది కానీ మరొకటి కాదు.

ప్రియమైన ఉద్ధవా ! సంన్యాసి చర్యలు ఇలా ఉంటాయి విను - సంన్యాసికి సమయానికి భిక్ష దొరకలేదని దుఃఖపడడు. ఆ రోజల్లా లభించకపోయినా విచారం పొందదు. రోజూ సమయానికి దొరుకుతోందని ఉప్పొంగిపోడు. రెండు వేరు వేరు పరిస్థితులలోనూ సంయమంగానే ఉంటాడు. దైవలీలగానే భావిస్తాడు. మనస్సులో హర్ష విషాద వికారాలు రానీయడు. భోజనం లభించటం లభించకపోవటం ప్రారబ్ధ కర్మయొక్క అధీనాలు. సంన్యాసి అడుగవలసిందే అతనికి వెంటనే భిక్ష తప్పకుండా లభించవలసిందే. అది మంచిదే. భిక్షతోనే ప్రాణరక్షణ. ప్రాణరక్షణ వలన కదా అతడు బాగా ఉండి తత్త్వ విచారం సాగించ గలిచేది. తత్త్వ విచారణ వలననే కదా ముక్తి ప్రాప్తించేది.

ప్రారబ్ధ కర్మను అనుసరించి సంన్యాసికి తక్కువో ఎక్కువో మంచిదో చెడ్డదో భిక్షలభిస్తూ ఉంటుంది. దానితో క్షుద్బాధ తీరుతూంటుంది. అంగీలు దుప్పట్లు వగైరాలు కూడా అలానే ప్రాప్తిస్తుంటాయి. పని జరుగుతూంటుంది. అతడు ఆ దుస్తులను గూర్చి కానీ ఆహారాన్ని గూర్చి గానీ పట్టించుకోడు. పట్టించుకోవటం సన్యాసి లక్షణం కాదు. ఎప్పుడు ఏది లభిస్తే దానితోనే తృప్తి చెందాలి.

నేను దేవుణ్ణైనా కూడా నా నియమం ప్రకారంగానే నేను శౌచాది కృత్యాలు జరుపుతు శాస్త్రోక్త నియమాలు పాటిస్తుంటాను. ఆ విధంగానే జ్ఞాన సంపన్నుడు కూడా శుచి శుభ్రం స్నానం ఆచమనం ఇతర నియమాలు ఆచరించవలసిందే. అయితే అతడు సామాన్యునివలె శాస్త్ర విధులకు విధికి కింకరుడై మాత్రంచేయడు. జ్ఞాన పురుషునికి భేద దృష్టి అసలు ఉండదు. పూర్వం ఉన్నాకూడా నా సాక్ష్యాత్కార భాగ్య ప్రభావం వలన అది నశించిపోతుంది. సర్వసమత్వం అతనికి సిద్ధిస్తుంది. ఒకవేళ మరణావసాన దశలో భేద దృష్టి కలిగినా అది దేహపాతం కాగానే భేదంపోయి అతడు నాలో లీనమవుతాడు. నేను అతడు ఒకటే అవుతాము.

ఉద్ధవా ! ఇంతవరకు జ్ఞానిని గూర్చి చెప్పాను. ఇక వైరాగ్యవంతుని గూర్చి చెప్పుతున్నాను. విను - జితేంద్రియుడు సంసార విషయభోగాల వలన దుఃఖమే నిశ్చయించు కొన్నపుడు విరక్తి పొందుతాడు. కానీ నన్ను పొందే మార్గం ఎరుగడు ఆ స్థితిలో అతడు సద్గురువును ఆశ్రయించ వలసియున్నది. ఆ యోగి గురువు యెడల దృఢ భక్తి కలిగి ఉండాలి. గురుబోధలో అధిక శ్రద్ధ వహించాలి. ఆ గురువులో దోషం ఏ మాత్రం వెతకరాదు. బ్రహ్మ జ్ఞానం కలిగేంత వరకు ఆ గురువును నన్నుగా తలంచి వారిని సేవిస్తుండాలి.

ఎవరైతే ఐదు ఇంద్రియాలను మనస్సును వశం చేసుకోలేడో ఇంద్రియాశ్వాలను వశపర్చుకోలేని సారధి అనే బుద్ధి వలె వీడు అసమర్థుడైపోతాడు. వాని హృదయంలో జ్ఞానం ఉండదు వైరాగ్యం ఉండదు. అతడు త్రిదండి అని సంన్యాస వేషం ధరించి పొట్ట పోసుకొంటూంటాడు. అతడు సంన్యాస ధర్మానికే తలవంపు. అతడు తన దేవతలకు తన మనస్సుకు అతని హృదయంలో ఉండేనాకు అపకీర్తి తెస్తుంటాడు. అట్టి సంన్యాస వేషధారి మదిలో వాంఛా సర్పాలు నశించవు. ఇంకా క్రూరంగా విజృంభిస్తాయి. అట్టి కపట సంన్యాసి ఇహలోక పరలోకాలయందు భ్రష్టుడై పతితుడవుతాడు. నరకంలో పడిపోతాడు.

ఉద్ధవా ! సంన్యాసి ముఖ్యధర్మాలు - శాంతి అహింస. వానప్రస్థుని ధర్మాలు - తపస్సు భగవద్భక్తి. గృహస్థుని ధర్మాలు - జీవపోషణం రక్షణం యజ్ఞయాగాలు. బ్రహ్మచారి ముఖ్య ధర్మాలు - ఆచార్య సేవ. గృహస్థుడు కూడా ఋతుకాలంలోనే భార్యతో

కలుస్తాడు అతనికిగాని ఇతర ఆశ్రమవాసులెల్లరకు బ్రహ్మచర్యం, తపస్సు, శౌచం, సంతోషం, సర్వప్రాణులపై ప్రేమ ప్రధాన ధర్మాలు నా యొక్క ఉపాసన చేయటం అందరికీ ముఖ్యధర్మం. ఈ విధంగా అనన్య భావంతో తమ తమ వర్ణాశ్రమ ధర్మాలు నిర్వహిస్తూ నాసేవలో నిమగ్నులై సమస్త ప్రాణులలో నా భావనను భక్తిని కలిగి ఎవరు ఉంటారో వారికి నాపై అచంచల భక్తి ప్రాప్తిస్తుంది.

ఉద్ధవా! నేనే సర్వలోకాలకు అధిపతిని. నేనే సర్వ సృష్టికీ పోషణకూ ప్రళయానికీ కారణ భూతుడైన బ్రహ్మదేవుణ్ణి. నిత్య నిరంతరం పెరుగుతున్న నిశ్చల భక్తి ద్వారా చేరుకోగలడు. ఈ విదంగా గృహస్థ ధర్మాలు పాటిస్తూ అంతఃకరణ శుద్ధి కలిగి ఉన్నట్లయితే నాఐశ్వర్యాన్ని నా స్వరూపాన్ని సాక్షాత్కరించుకో గలరు. జ్ఞాన విజ్ఞాన సంపన్నులై శీఘ్రంగా నన్ను చేరుకొంటారు. నేను ఇంతవరకు నీకు ముఖ్యమైన వర్ణాశ్రమ ధర్మాలు చెప్పాను. ఈ వర్ణాశ్రమ ధర్మపాలనతో నా భక్తి శ్రద్ధలు జోడించినట్లయితే అతడు అనాయాసంగా మోక్షం కూడా పొందకల్గుతాడు

ఓ సాధు స్వభావంగల ఉద్ధవా! నీ వడిగిన ప్రశ్నలకు సముచిత సమాధానాలు చెప్పాను తమతమ వర్ణాశ్రమ ధర్మాలు పాటిస్తూ భక్తి కలిగిన ఉత్తముడు నా పరబ్రహ్మ స్వరూపం దర్శించి పరమపదం నాపద సాన్నిధ్యం జేరగలడు.

జ్ఞాన భక్తి యమ నియమాలు

జ్ఞానకాంతులు -

శ్రీ కృష్ణ భగవానుడు బోధిస్తున్నాడు - ఓ ఉద్ధవా! భక్తిని గూర్చి చెప్తాను విను. ఉపనిషత్తులు శాస్త్రాలు శ్రవణ మననం చేసి ఆత్మ సాక్షాత్కారం పొందినవాడు, శోత్రియుడు, బహ్మనిష్ఠ గలవాడు, యుక్తులను అనుమానాలనునమ్మి దానిపై ఆధారపడనివాడు, కేవలం పరోక్ష జ్ఞాని కానివాడు, సంపూర్ణ ద్వైత భావ ప్రపంచం దీని నివృత్తి - సాధనలు - వృత్తి - జ్ఞానం - మాయామాత్రం అని యెరిగినవాడు, వీనినన్నిటిని నాకు అర్పించి జ్ఞానసిద్ధి పొందుతాడు. అతడే ఆత్మవంతుడు.

ఉద్ధవా! జ్ఞానికి అభీష్టమైన పదార్థం నేనే. అతని సాధనాలక్ష్యం స్వర్గం అపవర్గం కూడా నేనే. నన్ను వదలి అతనికే పదార్థం ఇష్టముండదు. ఏ వస్తువునూ అతడు ప్రేమించడు. జ్ఞాన విజ్ఞాన సంపన్నులైన మహాత్ములే నాయొక్క వాస్తవిక స్వరూపం తెలుసుకోగలరు. కనుక జ్ఞాన పురుషులంటే నాకు చాలాప్రియం. జ్ఞానులు జ్ఞానం ద్వారా నన్నునిరంతరం తన అంతఃకరణలో ధారణ చేసుకొంటుంటారు.

తత్త్వ జ్ఞానం లేశం లభిస్తే కలిగే సిద్ధి జపతప తీర్థాటనల వలనగానీ, దాన ధర్మాల వలనగానీ, అంతఃకరణ శుద్ధివలన గానీ కలుగదు. ఏ సాధనలునూ తత్త్వజ్ఞానానికి సాటిరావు. కాబట్టి నా ప్రియ ఉద్ధవా! నీ జ్ఞానంతో కూడిన ఆత్మ స్వరూపం తెలుసుకో. తదుపరి జ్ఞాన విజ్ఞాన సంపన్నుడవై భక్తి భావంతో నన్ను భజిస్తూండు.

ఋషీశ్వరులు మునీశ్వరులు యోగీశ్వరులు జ్ఞాన విజ్ఞాన యజ్ఞంచేసి అంతఃకరణంలో నన్ను అన్ని యజ్ఞాలకు అధిపతిగా నిశ్చయించుకొని ఆత్మారాధన గావించి పరమపదం పొందుతున్నారు. ఉద్ధవా ! ఆధ్యాత్మిక ఆదిభౌతిక ఆదిదైవిక అనే మూడింటి వికార సమిష్టియే శరీరం. ఈ శరీరం నిన్ను ఆశ్రయించి ఉంది. ఇది మొదటలేదు చివరలో ఉండేదు. కేవలం మధ్యకాలం కనిపిస్తుంది. కనుక దీనిని ఇంద్రజాలకుని గారడీ ఆటతో సమానంగా భావించు. ఇది మాయా నాటకం. దీనికి జన్మ స్థితి వృద్ధి పరిణతి కృశింపు నశింపు వికారాలు ఆరు. ఇవి భావ వికారాలు. ఈ వికారాలకు నీకు సంబంధం లేదు. ఇంతేకాదు ఈ వికారాలు నిలిచేవి కావు. ఇవి అసద్వికారాలు. ఈ అసత్ పదార్థం మొదటలేదు తరువాత ఉండేది కాదు. ఇది కేవలం మధ్యలో వచ్చి మధ్యలోనేపోయేది. కనుక దీనికి అస్తిత్వం లేదు.

ఉద్ధవుడు ఇలా అర్థిస్తున్నాడు - విశ్వరూపాః విశ్వేశ్వరాః పరమాత్మా! పర్బ్రహ్మమూర్తీ! నీవే విశ్వపతివి. అన్నిటికీ అందరికీ స్వామివి. తమరు బోధిస్తున్న ఈ వైరాగ్య విజ్ఞానయుత సనాతన విశుద్ధ జ్ఞానం మాలో సుదృఢంగా ఉండేది ఎలాగో దానిని నాకు స్పష్టంగా చెప్పండి. నాకు తమ యొక్క భక్తియోగం కూడా విశద పరచండి. దానిని బ్రహ్మాది మహాపురుషులు అన్వేషించి అన్వేషించి అలసిపోతున్నారట.

మరో అభ్యర్థన. స్వామీ! కొందరు మహాపురుషులు ఈ లోకంలోని త్రివిధ తాపాలయొక్క తాపులకు గురియై విలవిలలాడిపోతూ అంతరంగంలోనూ బాహ్యంగానూ ఉడికిపోతున్నారు అట్టి వారికి తమ పవిత్ర పాదారవింద ఛత్రఛాయ తప్ప మరొకటి శాంతి చేకూర్చలేదు. మరొక ఆశ్రయం ఆర్తులకు మరి ఎక్కడాలేదు.

హేమహానుభావా! దయాసాగరా ! భక్త మందారా! కృష్ణా ! నీ సేవకుడు చీకటి నూతిలో పడిపోయాడు. కాలరూపమైన కాలనాగు కాటువేసింది. విషయ తృష్ణ అనే విషం తలకెక్కింది. భక్తి జ్ఞాన స్పృహ కోలుపోయాడు. వీనిని నీవే రక్షించాలి. ఈదీనుణ్ణి ఉద్ధరించండి. వీణ్ణి కాపాడండి. నీ కృపా సుధా ధారాలు వీడిపై ప్రవహింపజేయండి. ఆ కృపా సుధాధార సరోవరమై అందులో వాడు కమలమై వికసించుగాక!

శ్రీ కృష్ణ భగవానుడు ఇలా వివరించసాగాడు -

ఉద్ధవా! నీవు ఇప్పుడు నన్ను అడిగినట్లే ధర్మరాజు భీష్మ పితామహుణ్ణి అడిగాడు. భీష్మ పితామహుడు ధార్మిక శిరోభూషణుడు కదా! ఆ సమయంలో మనం అక్కడే ఉన్నాము. మహా భారతయుద్ధం పూర్తి అయింది. ధర్మరాజు తన స్వజనులు చనిపోయారేయని శోక విహ్వాలుడైనాడు. అపుడు ధర్మరాజు భీష్మ పితామహుని ద్వారా అనేక ధర్మాలు విని తెలుసుకొన్నాడు. చివరకు మోక్ష సాధనలను గురించి ప్రశ్నించాడు. అపుడు భీష్మ పితామహుడు ధర్మరాజునకు చెప్పినవి అక్కడే ఉండి నేను విన్నవి ఇపుడు నీకు చెప్తాను విను - అవి జ్ఞాన వైరాగ్య విజ్ఞాన శ్రద్ధా భక్తి భావాలతో పరిపూర్ణమైనవి.

ఉద్ధవా ! ప్రకృతి - పురుషుడు - మహత్తత్త్వం అహంకారం పంచతన్మాత్రలు - ఈ తొమ్మిది; పంచ జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు ఒక మనస్సు ఈ పదకొండు, ఐదు మహాభూతాలు త్రిగుణాలు ఈ ఎనిమిది - మొత్తం ఇరవై ఎనిమిది తత్త్వాలను ఏ జ్ఞానం వలన బ్రహ్మ నుండి గ్రహించి తృణం వరకు గల సర్వకార్యాలలో చూడ బడుతున్నదో, ఈ తత్త్వాలన్నిటిలోనూ ఒక పరమాత్మ తత్త్వం వ్యాపించి లోపల పనిచేస్తున్నట్లు తెలిసికో బడుతోందో అదే పరోక్ష జ్ఞానం. ఇది నా నిశ్చయం.

ఉద్ధవా ! జ్ఞాన విషయం నిశితమైన బుద్ధితో పరిశీలించాలి. ఎప్పుడైతే ఒక్క తత్త్వం నుండి అనుగతమైన వివిధ త్రిగుణాత్మక తత్త్వాలను మొదట గమనించి ఆ తరువాత అది కాదని పరమ కారణభూతుడైన బ్రహ్మనే దర్శింపగలడో అపుడు అతనికి నిశ్చయమైన అపరోక్ష విజ్ఞానం లభించిందని చెప్పబడుతుంది. ఈ విజ్ఞాన ప్రాప్తికి యుక్తి ఏమంటే ఈ శరీరం మొదలైన త్రిగుణాత్మక సావయవ పదార్థాల ఉత్పత్తి స్థితి లయాలు ఆలోచించండి!

ఏ తత్త్వ వస్తువు సృష్టి ప్రారంభంలో ఉందో, మధ్యలో ఉందో, అంతంలో ఉందో, అది కారణరూపంలో స్థిమితంగా శాశ్వతంగా విరాజిల్లుతూంది. అదే ప్రతీయమాన కార్యం నుండి ప్రతీయమాన కార్యాంతరంలోనికి అనుగతమై పోతుంది. ఈ చరాచర ప్రాపంచ కార్యాల కన్నిటికీ సాక్షీ భూతంగా అధిష్ఠానంగా శేషభూతంగా ఉన్నదే సచ్చిదానంద శాశ్వత పరమార్థ వస్తువు. అని విశ్వసించు.

ఉద్ధవా! ప్రమాణాలలో శ్రుతి - ప్రత్యక్ష - ఐతిహ్య - అనుమాన ప్రమాణాలు నాలుగూ ముఖ్యమైనవి. ఈ ప్రమాణాల ద్వారా వేదాంత శాస్త్ర విషయాలు పరీక్షించి నిర్ధారణ చేయుదురు. వీటితో నిగ్గుతేల్చగా దృశ్య ప్రపంచం అస్థిరమూ, నాశనశీలమూ వికారమైనదీ సత్యసిద్ధమైనది కాదని తేలినది. కనుక వివేకవంతుడు ఈ వివిధ కల్పనా

యుతమమైనదీ శబ్దమాత్రమైనదీ అయిన ఈ ప్రపంచం యెడల విరక్తి భావం కలిగియుండవలెను. వివేక శీలి స్వర్గాదిభోగాలు చేకూర్చే యజ్ఞయాగాదులు నశ్వరాలు అనియే కాక బ్రహ్మలోక సుఖాలు కూడా అస్థిరాలుగా భావించి అదృష్ట ఫలాలు కూడా ప్రత్యక్ష ప్రపంచ సుఖాలవంటివని తలంచవలెను. ఇవి అమంగళకరాలు దుఃఖదాయకాలు అశాశ్వతాలు అని ఎరుగవలెను.

భక్తి -

ఉద్ధవా ! భక్తియోగ వర్ణనం నేను నీకు మొదటే చేశాను. కానీ నీకు దాని యెడల పరమ్ప్రీతి ఉన్నట్లు తెలిసింది. కనుకు నీకు మరల భక్తి ప్రాప్తికి శ్రేష్ఠ సాధనలు చెప్తాను. ఆలకించి ఆచరించు -

నా భక్తి సుస్థిరంగా ఉండాలంటే నా కథాసుధాలహరిలో శ్రవణాసక్తి కలిగిఉండాలి. నిరంతరం నాగుణ లీలా ప్రసంగాలు సంకీర్తనం చేస్తుండాలి. నా నామస్మరణం అతిముఖ్యం. నన్ను పూజిస్తుండాలి స్తుతిస్తుండాలి. దీనితో భక్తి పండుతుంది.

భగవత్సేవా శుశ్రూషలందు అత్యంతాదరం కలిగి నిరంతరం చేస్తుండాలి. దేవాలయంలో సాష్టాంగా నమస్కారాలు చేయాలి. నా పూజా పురస్కారేలే కాక నా భక్తులను మిక్కిలి అదరించి గౌరవించి సన్మానిస్తుండాలి. షడ్రసోపేత భోజన భాజనాదులతో వారిని సంతోషపెట్టు తుండాలి. అంతే కాక సమస్త ప్రాణులలో నన్నే చూస్తూ ప్రాణులందరినీ ప్రేమించాలి. భక్తుని ప్రతి అంగమూ నా సేవలో లగ్నం కావాలి. కాళ్ళున్నాయంటే దేవమందిర ప్రదక్షిణాలు దేవకార్య గమనం చేస్తుండాలి. చేతులతో దానాలు ధర్మాలు సేవ శుశ్రూషలు చేస్తుండాలి. నోటితో న్యాయం సత్యభాషణం సంకీర్తనం గానం నాలీలా వర్ణనం చేస్తుండాలి. కన్నులతో నన్నే సర్వత్ర చూస్తుండాలి. చెవులతో నా లీలలు వింటుండాలి. మనస్సు నాకే అర్పణం చేయాలి. అన్ని కోరికలు మాని నన్నే కోరుకొంటూ నావైభవం కోరుకొంటుండాలి.

నాకై భక్తుడు త్యాగం చేస్తూ త్యాగియై రాణించాలి. భక్తుడు సంపదలు భోగాలు సుఖాలు త్యాగంచేయాలి. త్యాగంలోని ఆనందం అనుభవించాలి. యజ్ఞాలు యాగాలు దానాలు ధర్మాలు హోమాలు క్రతువులు జపాలు తపాలు వ్రతాలు నోములు ఏమిచేసినా భగవత్కైం కర్యంగా చేస్తుండాలి.

ఉద్ధవ భక్తవర్యా! ఈ విధంగా మానవుడు చేస్తుంటే ధర్మమార్గంపై ప్రీతి నా పాదాలపై నిష్ఠ నాపై ఆత్మనివేదనా భావం వృద్ధి అవుతాయి. వారి హృదయాలలో నాయొక్క

ప్రేమమయమైన భక్తి రసామృత ధారలు ఉద్భవించి ప్రవహించసాగుతాయి. భక్తి లత పల్లవించి పుష్పించి ఫలిస్తుంది. ఎవరిలో నా భక్తి ఇలా వృద్ధి అవుతుందో అతనికి మరొక వస్తువుకి కొరత ఉండదు.

ఈ ప్రకారంగా ధర్మపాలనంచేయు సత్ భక్తుని చిత్తంలో జవసత్వాలు సుగుణాలు వృద్ధిపొందుతాయి. అతడు శాంతుడై ఆత్మజ్ఞాన తత్వాభిలాషి అవుతాడు. అపుడు ఆ సాధకుడికి ధర్మజ్ఞాన వైరాగ్య ఐశ్వర్యాలు స్వయంగా ప్రాప్తిస్తాయి. ఈ ప్రపంచం వివిధ కల్పనలతో నిండి ఉంది. దీని పేరే జగత్. రావటం పోవటమే దీని లక్షణం. ఏ వస్తువు సుస్థిరంగా ఉండదు. చిత్తం దీనియందు తగులుకొంది అంటే ఇంద్రియాల వెంటబడి అటూ ఇటూ తిరగటమే దాని పని. ఈ తీరున చిత్తంలో రజోగుణం ఉరకలెత్తుతుంది. అసత్ వస్తువులు ఆకర్షిస్తాయి. అసత్తులో పడి చిత్తం కొట్టు మిట్టాడుతూ ఉంటుంది. చిత్తంలో ధర్మ జ్ఞానాదులు లుప్తమైపోతాయి. అధర్మం అజ్ఞానం మదమోహ మాత్సర్యాలు విహారం చేస్తుంటాయి.

ఉద్ధవా ! అసలు సంగతి చెప్పున్నాను. విను. నా భక్తిని వృద్ధి పరచేదే ధర్మం. ఏకైక బ్రహ్మాత్మ సాక్షాత్కారం కలిగించేదే జ్ఞానం. విషయ భోగలంపట్ల విరక్తి కలిగిందే వైరాగ్యం. అణిమాది సిద్ధులే ఐశ్వర్యప్రదాలు.

యమ నియమాలు -

ఉద్ధవుడు కృష్ణ పరమాత్మ యొక్క భక్తి సాధనాక్రమం విని సంతోషం పొంది యమనియాదులను గూర్చి అడుగుతున్నాడు - ప్రభూ ! కేశవా! మహానుభావా! మధవా! యమ నియమాలు ఎన్ని విధాలు? శమం అంటే ఏమిటి? దమం ఏమి? తితిక్ష ధైర్యాలు అంటే ఏమిటి?

కృష్ణా! నాకు దానం తపస్సు శూరత్వం సత్యం ఋతం స్వరూప స్వభావాలు వివరించ ప్రార్థిస్తున్నాను. అభీష్ట ధనం ఏట్టిది? యజ్ఞం అని దేన్ని చెప్తారు? దక్షిణ అని ఏ వస్తువును అంటారు? పురుషునికి నిజమైన బలమేది? భంగం అంటే ఏది? లాభం ఏ వస్తువు? ఉత్తమ విద్య లజ్జ శ్రీ సుఖం దుఃఖం గూర్చి వివరంగా చెప్పండి.

పండితునికి మూర్ఖునికి గల లక్షణాలు ఏవి? స్వర్గం నరకం అంటారు ఏమిటి? సోదరులు బంధువులు ఎవరు? భవనం అంటే ఏది? ధనవంతుడెవరు? లోభి ఎవరు? నిర్ధనుడు ఎవరు? ఈశ్వరుడని ఎవరిని అంటారు?దయయుంచి నాకు వివరంగా వ్యాఖ్యానించండి. వీనికి విరోధ భావాలు కూడా తెలియజేయండి.

శ్రీ కృష్ణ ఉవాచ -

శ్రీకృష్ణ భగవానుడు సంతోషించి ఉద్ధవ ప్రశ్నలకు సదుత్తరాలు ఈయసాగాడు - ఓ ఉద్ధవా ! యమ గుణాలు పన్నెండు. 1. అహింస 2. సత్యం. 3. ఆస్తేయం (చౌర్యం చేయకుండుట) 4. అసంగత్వం 5. లజ్జ 6. అసంచయ 7. ఆస్తిక్యం 8. బ్రహ్మచర్యం 9. మౌనం 10. స్థిరత్వం 11. క్షమ 12. అభయం నియమాలు పన్నెండు. 1. శౌచం 2. జపం 3. తపం 4. హోమం 5. శ్రద్ధా 6. అతిథి సేవ 7. దైవపూజ 8. తీర్థయాత్ర 9. పరోపకారం 10. సంతోషం 11. గురుదేవ సేవ 12. స్వాధ్యాయనం ఇవి సకామ నిష్కామ సాధనాపరులకుపయోగాలు. ఈ యమ నియమాలు భోగదాయకాలు మోక్షకారకాలు ఉపయోగించుకొనే వారి కోరిక ననుసరించి ఫలాలిస్తాయి.

ఉద్ధవా ! యమ నియమాలు చెప్పాను. మరికొన్ని పదాలకు గల విశిష్ట అర్థాలు వివరిస్తాను శ్రద్ధగా విని ఆకళింపుచేసుకో. 'శమం' అంటే మనో ఇంద్రియ నిగ్రహం అని సామాన్యార్థం. కానీ విశిష్టార్థం మనస్సును పూర్తిగా నా యందు లగ్నం చేయుటయే. 'దమం' అంటే బాహ్యేంద్రియ విజయం. ఇద్రియాలను దమింపచేయాలి. అణచవలెనని అర్థం. వశంచేసుకోవాలి. ధైర్యం అంటే నిర్భయం అని కాక జిహ్వోపస్థలను వశపరచుకొనుటే ధైర్యం. ఎవరికీ ద్రోహం తలపెట్టవని సంఘానికి అభయం ఇచ్చుటే దానం. కోరికలను వదులటే 'తపస్సు'. వాంఛలు వాసనలను వదలుకొనటే 'శూరత్వం.' సర్వత్ర సమదృష్టితో సత్య స్వరూప సందర్శనమే సత్యం - అట్టి సత్య నిష్ఠ కలిగి ఉండాలి. 'ఋతం' అంటే సత్యమైన మధుర సంభాషణం 'శౌచం' అంతర్బాహ్య శుచితో లౌకిక వ్యాపార విముఖత్వమే సుమా. 'సంన్యాసం' వాంఛ పరిత్యాగం. 'అభీష్ట ధనం' ధర్మం. యజ్ఞం కృష్ణ భగవానుడే. 'దక్షిణ' జ్ఞానోపదేశం. బలం అంటే ప్రాణాయమమే.

ఉద్ధవా! 'భగం' అంటే నా ఐశ్వర్య సంపద్విభూతి సుమా. 'ఉత్తమ లాభం' ఏదో తెలుసువా నాపై గల శుద్ధమైన భక్తి. 'విద్య' అంటే బ్రహ్మకు ఆత్మకు భేదం లేదని తెలియజెప్పేది. 'లజ్జ' అంటే పాపకృత్యాలను అసహ్యించుకోవటమే. నిరపేక్షాది గుణాలు పోషించుకొనుటే శరీరానికి సౌందర్యం శోభ 'శ్రీ' అని అర్థం. సుఖాలనీ దుఃఖాలనీ ఆశపడకుండా ఉండటంలోనే 'సుఖం' అనేది ఉంది. విషయ భోగా వాంఛలే 'దుఃఖం' బంధన కారణాలు మోక్ష హేతువులు తెలిసినవాడే 'పండితుడు'.

ఈ శరీరం నాది అనుకోవటమే 'మూర్ఖత్వం' సంసారం వైపు కాక నావైపుకు నడిపించేదే 'సుమార్గం'. లౌకికం గూర్చి యోచించు పంథాయే 'కుమార్గం'. సత్త్వగుణ సమృద్ధియే 'స్వర్గం.' తమోగుణ వృద్ధియే 'నరకం'. నిజమైన బంధువు 'గురుదేవుడే.' ఆ

గురువును జగద్గురువును నేనే. మానవదేహమే 'మంచి గృహం. గుణ సంపదలు కలవాడే ధనికుడు. అసంతృప్తి గలవాడే 'దరిద్రుడు'. ఇంద్రియ సంయమం లేనివాడే 'కృపణుడు' సర్వ స్వతంత్రం కలిగి విషయాసక్తి లేక సామర్థ్యం గలవాడే - 'ఈశ్వరుడు.' విషయాభిలాష వివరీతంగా గలవాడే 'అసమర్థుడు'.

ఉద్ధవా! నీ వడిగిన ప్రశ్నలిన్నిటికీ సమాధానాలు తెలిపాను. నీవు సన్మార్గ గామివై పదుగురికి బోధించు. మరో విషయం. మిక్కిలిగా గుణదోషాలు చర్చించటం మంచిదికాదు. అదికూడా ఒకదోషమే. గుణదోషాలపై దృష్టి పెట్టకుండా శాంతుడవై నిస్సంకల్ప స్వరూపం పొంది పరమసుఖం అనుభవించు. అన్నిటి కంటే శ్రేష్ఠతమ గుణం ఇదే.

జ్ఞాన కర్మ భక్తి యోగాలు

ఉద్ధవుడు తన సందేహాలు చెప్పి అడిగాడు -

హే కృష్ణ భగవాన్ ! కమలాక్ష! నీవు సర్వశక్తి సంపన్నుడవు. నీ మాట వేదం. ఆ పలుకులలో కొన్ని కర్మలకు విధి ఉండవచ్చు మరి కొన్నింటికి నిషేధం ఉండవచ్చు. ఈ విధి నిషేధాలు కర్మల యొక్క గుణదోషాలు పరీక్షించే నిర్ణయించబడి ఉంటాయి.

వర్ణాశ్రమ భేధాలు ప్రతిలోమ అనులోమ రూపాలు వర్ణ సంకరాలు కర్మల ఉపయుక్తాలు అనుపయుక్తాలు ద్రవ్య దేశ వయః కాలాలు స్వర్గ నరక భేదాలు ఇవి తెలుసుకోవాలంటే వేదాల వలన మాత్రమే సాధ్యమవుతుంది.

స్వామీ ! నిస్సందేహంగా నీ వాక్కులే వేదాలు. ఐతే దానిలో విధి నిషేధాలు అడుగడుగునా నిండి ఉన్నాయి. గుణదోష విభజన చేయకపోతే వేదం మానవులకు కల్యాణకారి ఎలా అవుతుంది?

ఓ సర్వ శక్తి మంతుడా ! సర్వేశ్వరుడా! నీ వేదవాణి దేవతలకు పితృదేవతలకు మానవులకు అందరికి కల్యాణ మార్గం నిర్దేశిస్తుంది. దాని ద్వారా స్వర్గం మోక్షం మొదలైన అదృష్ట ఫలాలకు మార్గం బోధపడుతుంది. సాధ్య సాధనాలు నీ వేదవాణి నిర్ణయిస్తుంది. కొన్ని భ్రమలున్నాయి. ప్రభూ! నిస్సందేహంగా గుణదోష వివరణ నీ వాణిలోనే ఉంది. ఈ వేదవాణి ఎవరి కల్పనా కాదు. సందేహాలు భేదాలు రూపుమాపి నిర్దిష్ట మార్గం ప్రబోధించే శక్తి నీ వేదవాణికే ఉంది. నాకు భ్రమ కలుగుతోంది. సందేహ భ్రమలు దూరం చేసి కల్యాణ మార్గ ం ప్రబోధించు స్వామీ!

శ్రీ కృష్ణ భగవానుడు ఉద్ధవునికి ఇలా వివరించ సాగాడు - ఉద్ధవా! నేనే వేదాలలో

అక్కడక్కడ మానవ కల్యాణం కొరకు ఆయా అధికార భేదాలనుసరించి మూడు యోగాలు ఉపదేశించాను. అవే జ్ఞాన కర్మ భక్తి యోగాలు. మనుష్యులకు ఆత్మ కల్యాణ ప్రాప్తికి ఇంతకంటే ఉత్తమ మార్గాలు లేవు.

ఉద్ధవా! కర్మ మార్గంలో ఆ కార్య కలాపాల ఫలాలు అనుభవించి విరక్తులై అవి విడిచినచో జ్ఞానయోగానికి అర్హులవుతారు. అట్లుకాక వారి వారి చిత్తాలలో కర్మలు ఆ ఫలాలు ఆచరించటం అనుభవించటం జరుగుతూ వైరాగ్యం కలుగక విచారం కల్గక పోయినపుడు వారు స కామ వ్యక్తులుగాను కర్మయోగానికి అర్హులుగాను గుర్తించాలి.

ఎవడైతే అతి విరక్తుడు అతి ఆసక్తుడు కాక పూర్వజన్మ పుణ్య పరిపాక ఫలంగా నా లీలా కథా సుధారసంపై శ్రద్ధ జనించినవాడై తపన పడుతుంటాడో వాడు భక్తియోగానికి యోగ్యుడు. అంతవరకు కర్మ సంబంధమైన విధి నిషేధాలు చేస్తుండ వలసిందే. కర్మవలన లభించే స్వర్గ సుఖాలు కలిగి విరక్తి కలుగు వరకూ అవి తప్పవు. అంతదాకా నా కథా కలాపాలపై అతడికి శ్రద్ధ కలగటం కష్టం.

ఉద్ధవా! పైన చెప్పినట్లుగా తన వర్ణాశ్రమ ధర్మ వర్తనం కలిగి యజ్ఞయాగాలు చేస్తూ కోరికలు పెంచుకోక నన్నే ఆరాధించేవాడు ఉత్తమ భక్తుడు. అతడు నిషిద్ధ కర్మలు త్యజించి విహితమైన కర్మలు ఆచరిస్తూ నిష్ట కలిగి ఉంటాడు. అతడు స్వర్గానికి - నరకానికి వెళ్ళడు. అతడు నా పద సాన్నిధ్యం చేరుకొంటాడు.

తన వర్ణ ఆశ్రమ ధర్మాలపై నిష్ఠ కలిగినవాడు నిషిద్ధ కార్యాల జోలికిపోడు. రాగభోగాల మలం వాడికి అంటుకోదు. అతడు పవిత్రుడు పునీతుడవుతాడు. అతడు అనాయాసంగా ఆత్మ సాక్షాత్కారం పొంది విశుద్ధ తత్త్వజ్ఞానం అనుభవిస్తాడు. దృఢమైన ఆత్మబలంతో నా భక్తిని అలవరచుకొంటాడు. కర్మిష్టికి విధి నిషేధ శీలం గల శరీరం లభించటం చాలా దుర్లభం. స్వర్గనరకాలలో జీవులు ఈ దేహాలు కావాలని కోరుకొంటారు. ఈ దేహంతో ఉన్నట్లయితే అంతః కరణం పరిశుద్ధం చేసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతః కరణం శుద్ధమైతే జ్ఞానం భక్తి ప్రాప్తిస్తాయి. స్వర్గ నరక భోగాలు జీవులకు ప్రధానాలు కావు. ఇవి పొంది అనుభవించటానికా! శరీరం లభించింది. కాదుకాదు. బుద్ధి గలవాడెవడూ స్వర్గ భోగాలు కోరుకోడు. నరకం వంటిదే స్వర్గం కూడా. కాబట్టి ఆకాంక్షలు వాంఛలు మంచివి కావు. ప్రతి శరీరంలోనూ సుగుణాలు సుబుద్ధులున్నాయి. వాటిని శరీరధారి ఉపయోగించుకోవాలి. మానవుడు తన వాస్తవిక స్వరూపం తెలుసుకోవాలి. స్వర్గ భోగ కాంక్షలుంటే వాస్తవిక స్వరూప సాధనకు ఆటంకాలు అవరోధాలు కలుగుతాయి. కనుక మానవ జన్మకుగల లక్ష్యం తెలుసుకొని తత్ప్రాప్తికి సాధన చేయాలి.

ఈ సాధనలో లక్ష్యం ప్రాప్తించే లోపల శరీరం మృత్యుగ్రస్తం కావచ్చు. అయినా నీ సాధన ఆగదు. శరీరం అంటేనే జీర్ణమైపోయేదని అర్థం. శరీరం క్షణ భంగురమే. ఈ లోపలనే పరమార్థం అనే సత్య వస్తుకు ప్రయత్నించాలి. ఈ జన్మను సార్థకం చేసుకోవాలి. మరల జన్మ మృత్యు చక్రంలో పడకుండా సాధన ద్వారా ముక్తుడై ఈశ్వర సాయుజ్యం పొందాలి. ఈశ్వర ప్రీతికిపాత్రుడై ధన్యత్వం పొందటం మానవ జన్మకు లక్ష్యం.

ఉద్ధవా ! ఒకటి చెప్తాను చూడు. ఈ శరీరం వృక్షం. దీనిమీద ఒక గూడు ఏర్పాటు చేసుకొని మానవుడనే పక్షి నివసిస్తున్నాడు. ఈ చెట్టును యమధర్మరాజుయొక్క దూత నరుకుతున్నాడు. ఈ నరకబడుతున్న చెట్టను చూచి పక్షి ఎగిరిపోయింది. అలానే జీవుడు అనాసక్త భావం గలవాడై ఈ కృశించే శరీరం విడిచి మోక్ష రాజ్యంవైపు పారిపోవాలి. ఆసక్త భావం గలవాడైతే ఈ శరీర వ్యామోహంలో పడి దుఃఖాలు అనుభవిస్తుంటాడు.

ఉద్ధవా! ఈ రాత్రింబవళ్ళు క్షణక్షణం ఈ శరీర ఆయుర్బలాలను హరిస్తుంటాయి. కాలానికి కాయం ఫలహారం. ఇది తెలిసి భయంతో వణికి పోయేవాడు లౌకిక భోగానక్తులు వదలి పరమ తత్త్వ జ్ఞాన మార్గం ఆశ్రయిస్తాడు. మరణ పర్యంతం నిరపేక్ష నిష్కామ భావంతో ఆత్మరతుడై శాంతిని పొందుతాడు.

ఈ మనుష్య శరీరం మానవ పుణ్య ఫలం. ఇది అత్యంత దుర్లభం. జన్మ జన్మాంతర సుకృత విశేషం వలన అనాయాసంగా ఈ దేహం ప్రాప్తించింది. ఇది ఈ సంసార సాగరం దాటటానికి గొప్ప సాధనంగా లభించిన నవ్య నౌకా రాజం. దివ్య సందేశ వాహకం. ఈ నౌకను చక్కగా నడుపుటకు శరణు జొచ్చగానే కర్ణధారుడై వచ్చేవాడు గురుదేవుడు. నౌకా సంచాలన కళలో సర్వ సమర్థుడు సర్వేశ్వర ప్రతినిధి ఆయన. హరి నామం స్మరించినంత మాత్రాన అనుకూల వాతావరణ వాయుప్రసారం చేసేవాడు శ్రీ కృష్ణ పరమాత్మనైన నేను.

ఇన్ని సులభమైన అవకాశాలు లభించినా ఈ దేహం ద్వారా ఏ సంక్లేశం లేకుండా సత్వరంగా సంసార సాగరం దాట ప్రయత్నించని మూర్ఖుడు తన చేతులతోనే తన గొంతు పిసుక్కొని తనను తాను చంపుకొంటున్నాడు. ఉద్ధవా! పురుషుడు దోష దర్శన పూర్ణ కార్యకలాపాల కారణంగా ఉద్విగ్న మానసుడు లేక విరక్త చిత్తుడు అయినపుడు జితేంద్రియుడై యోగంలో స్థిమితం పొందాలి. ఈ అభ్యాసం ఆత్మానుసంధానం ద్వారా తనమనస్సును పరమాత్ముడునైన నాయందు నిశ్చల భావంతో లగ్నంచేసి నన్నే స్మరిస్తూ జపిస్తూ వేడుకొంటూండాలి. మనస్సును స్థిరంచేసే ప్రయత్నంలో మనస్సు చంచలమై అటూ ఇటూ పరుగులు తీస్తుంటే గట్టిగా ప్రయత్నించి పట్టుదలతో పట్టుకొని దానిని లాలించి బుజ్జగించి ఓదార్చి మాటలుచెప్పి మంచిగా తనవశంలోకి తెచ్చుకోవాలి.

సుమతి ఇంద్రియాలను ప్రాణాలనూ తనవశంలో ఉంచుకోవాలి. మనస్సును ఒక్కక్షణం కూడా స్వతంత్రంగా విడిచిపెట్టరాదు. మనో గమనాన్ని క్షణ క్షణం కనిపెడుతూనే ఉండాలి. ఇలా సత్త్వ సంపన్న బుద్ధి ద్వారా మనస్సును తనవశంలో జాగ్రత్తగా ఉంచుకోవటం అభ్యాసం చేసి విజయం సాధించాలి.

ఒక పొగరుబోతు గుర్రం వంటిది ఈ మనస్సు. గుర్రాన్ని స్వారికి ఉపయోగించేప్పుడు గుర్రం రైతు మాటవినదు. తన పోకడ తన ప్రవర్తన తన స్వతంత్ర ప్రవృత్తి ప్రదర్శిస్తూంటుంది. తన ఇష్టం వచ్చినట్లు నడవాలి అనుకొని యజమాని మాట టలాయిస్తుంది. బుకాయిస్తుంది. రౌతును క్రిందికి పడవేయ చూస్తుంది. యజమాని దానిని విడవకుండా అదిరించి బెదిరించి దువ్వి దువ్వి తన స్వాధీనంలోనికి తెచ్చుకొని దానిపై స్వారి చేస్తాడు. నలుగురిలో విజయం సాధిస్తాడు. అట్లే సుబుద్ధి మనస్సును మెల్లమెల్లగా అభ్యాసం ద్వారా స్వాధీనం చేసుకొని దానిపై విజయం సాధించాలి. ఇదే పరమయోగాభ్యాస ఫలం.

సాంఖ్య శాస్త్రంలో ప్రకృతి మొదలుకొని శరీరం వరకు గల సృష్టి క్రమం చెప్పబడింది. దానిని పదే పదే చింతనం చేయాలి. సృష్టిలోని శరీరం ఏక్రమంలో ప్రకృతిలో లయమైపోతున్నదో పర్యాలోచన చేస్తూ రావాలి. చింతనం మనస్సు శాంతి పొందే వరకూ సాగించాలి. సంసారంపై విరక్తి పుట్టి భోగాలు భాగ్యాలు దుఃఖ కారకాలు అని బుద్ధి ప్రబోధించిన తర్వాత గురుజనులమజేరి వారి పరమ ఉపదేశాలు పొంది తడవ తడవకు తన నిజ స్వరూప మనన చింతన ధ్యానంలో లగ్నం కావాలి. ఇలా చింతన చేయగా అతి శీఘ్రకాలంలో అతని మనస్సు చాంచల్య స్వభావం మానుకొని అనాత్మ భౌతిక భావాలు విడిచిపెట్టి స్థిరత్వం పొంద కలుగుతుంది. శాంతి వహిస్తుంది.

సాధకుడు క్రమంగా యమ-నియమ- ఆసన - ప్రాణాయామ - ప్రత్యాహార - ధారణ - ధ్యాన - సమాధి ఆది యోగమార్గాల ద్వారా వస్తుతత్త్వాన్ని తెలిపే ఆత్మవిద్యతో నన్ను ఉపాసించాలి. కర్మ జ్ఞాన భక్తియోగాల వలన మనస్సు పరమాత్మనైన నా చింతన సాగిస్తుంది. ఉద్ధవా! ఇంతకంటే ఉపాయంలేదోయి. ఉద్ధవా! సాధారణంగా యోగి ఎన్నడూ నిందనీయ కార్యం చేయడు. ఒకవేళ ప్రమాదవశాత్తు అలాంటిది సంభవిస్తే యోగం ద్వారానే ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసికొని దానిని భస్మీ భూతంగావిస్తాడు. కానీ కృచ్ఛ్రచాంద్రయణ వ్రతాల ద్వారా ప్రాయశ్చిత్తం అనేది చేసుకోడు.

సాధకునికి తన అధికారం అనుసరించిన నిష్ఠయే గుణదాయకం. ఈ గుణదోషాల విధి నిషేధ విధానాల తాత్పర్యం ఇదే. కర్మ జన్మనుండి వస్తుంది. అనర్థాలకు మూలం.

శాస్త్రం వాటిని నియంత్రణం చేస్తుంది. నియమిస్తుంది. అవసరం అయినపుడు ప్రవృత్తినే సంకోచింప చేయవలసి వస్తుంది.

ఉద్ధవా! ఒకటి చెప్తాచూడు - ఒక సాధకుడు సర్వ కర్మల నుండి విరక్తుడయినాడు. కానీ అతణ్ణి మాయా బంధాలు కొన్ని వెనుకకు ముందుకు లాగుతుంటాయి. బుద్ధి అటూ ఇటూ ఊగులాడుతుంది. ఒక్కోసారి దుఃఖిస్తుంది. మరల అతని నా లీలా విలాస వినోదాల వలన ఆనందం పొందుతూంటుంది. మరల మనస్సు దిగజారుతుంది. ఇదికూడా అతడు ఎరుగు - ఈ భోగ వాసనలు దుఃఖకారకాలు అని మదిలో లౌకికి భోగాలను నిందిస్తాడు. ఈ భోగ వాంఛ నాదౌర్భాగ్యం అనుకొంటాడు. కానీ వాటిని త్యజించలేడు. ఈ ద్వివిధా స్థితి ద్వంద్వ మనస్థితి తొలగాలంటే ఒకటే మార్గం. శ్రద్ధగా దృఢంగా నిశ్చయంగా ప్రేమతో నన్ను భజించు. నా పాటలు పాడు. నా కథలు చెప్పుకో. ఈ దీక్ష వలన నా భక్తి దృఢమై ధృఢ మనస్కుడవు అవుతావు.

ఈ విధంగా నా భక్తియోగంలో నిరంతర నామస్మరణ నామచింతనం వలన నేను హర్షించి నేనువాని హృదయంలా జేరి కూర్చుంటాను. నేను వారి హృదయాలలో ఉండటం వలన వాని వాసనలు అన్నీ నశించిపోతాయి.

ఈ విధంగా ఎప్పుడైతే అతనికి నాయొక్క సర్వాత్మ సాక్షాత్కార భాగ్యం లభిస్తుందో అతని అజ్ఞాన గ్రంథులు విడిపోతాయి. అతని సర్వ సంశయాలు దూరమైపోతాయి. కర్మ వాసనలన్నీ క్షీణించిపోతాయి. ఉద్ధవా! రహస్యం విను. నా భక్తితో జీవనం గడిపేయోగి నా కీర్తనంలో నా చింతనంలోనూ నిమగ్నమైయుంటాడు. కనుక అట్టివానికి జ్ఞానం వైరాగ్యం అవసరంలేదు. అతనికి శ్రేయోయోగ క్షేమాలు నా భక్తి ద్వారానే లభిస్తాయి.

కర్మ ధర్మ జ్ఞాన విజ్ఞాన వైరాగ్య యోగాభ్యాస తపోదాన వ్రతాలు మొదలైన వాటి వలన లభించే స్వర్గ అపవర్గ భోగాలు, అన్నీ నా భక్తి వల్లనే ప్రాప్తిస్తాయి. వాడు కోరుకొన్నదల్లా లభిస్తుంది. పరమ పదం పరమధామం పరమాత్మ సాయుజ్యం ప్రాప్తించేది నా భక్తియోగం సుమా. నా భక్తి యోగ ప్రభావం వలన కోరిన కొండైనా అనాయాసంగా లభిస్తుంది.

నా అనన్య భక్తులు నన్ను ప్రేమించే వారెవరూ ఏదీ కోరుకోరు. నా భక్తి రసామృత పానం చేస్తున్నవాడు ఏ మరొక మహానిధి దొరికినా త్యజిస్తాడే కానీ భజించడు. అతనికి కావలసింది నా భజన మాత్రమే. నేను దూరంగా కైవల్యం మోక్షం ఇస్తాను వెళ్ళమన్నా వెళ్ళడు. ఉద్ధవా! ఉత్తమోత్తమ నిశ్శ్రేయసం నిరపేక్షకు నిష్కామానికి మరోపేరు. కనుక నిష్కామ భక్తుడు నా భక్తియోగ శాస్త్రంలో ఉత్తముడై ప్రకాశిస్తాడు. నా అనన్య ప్రేమ పాత్రుడైన భక్తుడు సమదర్శియై బుద్ధికి అతీతమైన పరమతత్త్వాన్ని పొందుతాడు. అతనికి విధి నిషేధాలు లేవు. పుణ్య పాపాలతో సంబంధమే లేదు.

ఈ విధమైన నేను చెప్పిన భక్తియోగం నేర్చినవాడు - నా జ్ఞాన భక్తి కర్మ మార్గాలు ఆశ్రయించిన వాడు నా పరమ ధామం చేరుకొంటాడు. పరబ్రహ్మ తత్త్వం అతనికే బాగా తెలుసుకనుక అతనే నాకు ఉత్తమోత్తమ ప్రియభక్తుడు.

గుణదోష రహస్యాలు

శ్రీ కృష్ణ భగవానుడిలా బోధించసాగాడు -

ఉద్ధవా ! నన్ను జేరటానికి భక్తియోగం జ్ఞానం యోగం కర్మయోగం మూడుమార్గాలు. ఈ మూడింటిని విడిచిపెట్టి చంచలమైన ఇంద్రియ భోగాలలో మునిగి తేలుతుండేవాడు జన్మమరణ చక్రంలోపడి క్షణం క్షణం చస్తూ పుడుతుంటాడు. మానవుడు తన అధికారానన్నుసరించి ధర్మ పథంలో దృఢంగా ఉండేవాడు గుణవంతుడని పేరుపొందుతాడు. తనకు తగని పీఠానికి ఎగబ్రాకటం దోషం అవుతుంది. గుణదోష నిర్ణయం అధికారం అనుసరించి ఉంటుంది. వస్తువులన్నీ మంచివే. వస్తువును బట్టి ఇది గుణవంతమైనదనీ అది దోష భూయిష్టం అని అనరాదు. ఉపయోగించు వానిని బట్టి ఉంటుంది. వస్తు సేకరణ విధానంలో ఉంటుంది.

వస్తువులన్నీ సమానంగా ఉన్నా శుద్ధం - అశుద్ధం, ఉచ్చం-నీచం, గుణం - దోషం, శుభం - అశుభం, మంచి - చెడు అనేది వస్తు వినియోగ విధానంపై ఉంటుంది. వస్తు పరీక్ష కూడా అవసరమే కార్యాన్ని బట్టి. ఇది యోగ్యమా కాదా అనేది స్వాభావిక ప్రకృతిని నియంత్రిస్తుంది. వాటి ద్వారా ధర్మ నిర్ణయం చేయకలుగుతాము. సమాజ వ్యవస్థను చక్కగా నడప కలుగుతాము. దీనితో వ్యక్తిగత జీవనం సులభం సుఖమయం అవుతుంది. మరో లాభం ఉంది. ఏమంటే మనిషిలోని వాసనా మూలకమైన సహజ ప్రవృత్తుల వలలో పడకుండా శాస్త్రానుసారంగా తన జీవన సరళిని నిర్ణయించుకొని మనస్సును వశం చేసుకోవచ్చు. ఆ ఆచార విధానాలు ఆలోచించి నేను మను మహారాజుకు బోధసేయగా అతడు ధర్మ శాస్త్రం వ్రాసి కేవలం కర్మకాండ జిజ్ఞాసువులకు ఉపదేశించాడు.

భూమి జలం తేజస్సు వాయువు ఆకాశం అనే పంచభూతాలు బ్రహ్మమొదలు వృక్షాల వరకు గల అన్నిప్రాణి కోటులకు మూలకారణాలు. శరీరాలు అన్నిటికీ బాహ్యంగా ఒక్కటే, లోఆత్మ కూడా ఒక్కటే. అందరి శరీర పంచభూతాలు సమానమైనప్పటికీ వేదంలో వర్ణాశ్రమ ధర్మాలు విడివిడిగా నిర్ణయించబడినాయి. వారి వారి జన్మ కర్మ వాసనా మూల ప్రవృత్తులను బట్టి ఆశ్రమాలు నిర్ణయించి మానవోన్నతికి ధర్మార్థ కామ మోక్షాలు అనే నాలుగు పురుషార్థ ప్రణాళిక సిద్ధం చేయబడింది.

సాధుసత్తమా! దేశకాలాదులకు అధికారి అనధికారులకు ఫలధాన్యాదులకు వివిధ వస్తువులకు గుణదోష విధానాలు నా ద్వారానే నిర్ణయింపబడతాయి దీని వలన జనులలో ఉచ్ఛృంఖల ప్రవృత్తి అణిగిపోతుంది హద్దులు దాటకుండా ఉంటారు. లేకపోతే సృష్టి క్రమానికే ముప్పు వస్తుంది.

దేశాలలో కృష్ణసార మృగాలు బ్రాహ్మణ భక్తులు యుంటారు అవి లేనిదేశాలు అపవిత్రాలు. కృష్ణ సార మృగాలున్నా బ్రాహ్మణ భక్తులు, సంత పురుషులు లేకున్నచో ఆ ప్రదేశాలు పవిత్రాలుకావు. అవి సంస్కార రహిత ఊసర క్షేత్రాలు అపవిత్రాలే సుమా!

సత్కర్మ చేయటానికి సామగ్రి లభించి కర్మ యథావిధిగా జరుగు అనుకూల సమయమే పవిత్ర సమయం కర్మచేయటానికి సామాగ్రి లభించక లభించినా ఏవో అటంకాలు కలిగి పని జరగని గడ్డుకాలమే అశుభకాలం పదార్థాలు వచనాలు సంస్కారాలు వేళలు మహత్తులు అల్పంగా కనిపిస్తాయి అవి చిన్ని చిన్ని కారణాల వల్ల శుద్ధమూ అశుద్ధమూ అవుతాయి. పాత్రలున్నాయి అంటే నీళ్ళతో శుద్ధి అవుతాయి జంతువుల మూత్రం తగిలితే అపవిత్రం అవుతాయి ఏ వస్తులయినా శుద్ధి కావాలనిపిస్తే బ్రాహ్మణ వచనంతో శుద్ధి అవుతాయి. అనుమానం కలిగినపుడు అదే మార్గం లేక భగవన్నామంతో పవిత్రం చేయవచ్చు. పుష్పంతోనీళ్ళు చిలకిస్తే శుద్ధి అవుతాయి. వాసన చూచిన పుష్పాలు అపవిత్రాలు. అప్పటి కప్పుడు వండిన అన్నం పవిత్రం ఎక్కువ సేపు ఉంచితే అదే పాసి అపవిత్రమవుతుంది. పెద్దపెద్ద చెఱువులలో నీరు పవిత్రం. చిన్న చిన్న గోతుల్లో నీరు అపవిత్రం. దుర్వాసనవాయుతం - అన్నది అందరు గుర్తిస్తున్నదే.

శక్తి అశక్తి అనుసరించి పవిత్రం అపవిత్రం అనే పద్ధతి ఉంది. కొన్నింటి విషయంలో బుద్ధి నిర్ణయిస్తుంది. స్థానం సమయం వస్తుతత్వం చూచి దోషాదోషాలు నిర్ణయించాలి ధనవంతుడు - పేదవాడు, బలవంతుడు - బలహీనుడు, జ్ఞాని - అజ్ఞాని, బాలుడు - వృద్ధుడు, ఉపద్రవ కాలం - శాంతి కాలం ఈభేదాలనుసరించి శుద్ధ అశుద్ధ నిర్ణయాలు జరుగుతుంటాయి.

ధనం ధాన్యం, దంత సామాగ్రి, కొయ్యసామాగ్రి, తైలం, తేనె, ఉప్పు, పప్పు, నెయ్యి మరి రసద్రవ్యాలు బంగారం రాగి లోహాలు కుండలు మొదలైన మట్టి పాత్రలు ఈ మొదలైన పదార్థాలు రకరకాలుగా వస్తు స్వభావాన్ని అనుసరించి శుద్ధిచేస్తుండాలి. నీళ్ళతో కొన్ని నిప్పుతో కొన్ని గాలితో కొన్ని మట్టితో కొన్ని శుద్ధి అవుతుంటాయి. దేశకాల అవస్థను అనుసరించి శోధక సామాగ్రి కొన్నింటి మిశ్రమం చేత ఒక్కొక్క వస్తువు చేత తయారు అవుతుంటుంది.

ఉద్ధవా! నరులకు స్నానం దానం తపస్సు వయస్సు వీర్యం సంస్కారం కర్మ వలన నా నామస్మరణం వలన చిత్తశుద్ధి కలుగుతుంది. ఈ కర్మల ద్వారా పరిశుద్ధులై బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు విహితి కర్మలు చేస్తుండాలి.

గురుముఖత: విని ఆ సూక్తిని హృదయంగమం చేసుకొనిన మంత్ర బలం వస్తుంది. కర్మలు నాకు అర్పణచేసిన కర్మలు శుద్ధి అవుతాయి. దేశం కాలం పదార్థం కర్త మంత్రం కర్మ శుద్ధంగా ఉన్నప్పుడు ధర్మాలు అవుతాయి. దేశకాలాదులు అశుద్ధం అయినప్పుడు అధర్మాలు అవుతాయి

అప్పుడప్పుడు శాస్త్ర విధి అనుసరించి గుణం దోషమవుతుంది. దోషం గుణమవుతుంది. బ్రాహ్మణునికి సంధ్యా వందనం గాయత్రి జపాదులు గుణకారకాలు. శూద్రాదులకు దోష జనితాలు. ఆ విధంగానే పాల వ్యాపారం వైశ్యులకు విహితం. బ్రహ్మణాదులకు నిషిద్ధం. ఒకే వస్తువు విషయంలో ఒకనికి గుణవంతం అదే మరొకనికి దోషం. కొందరు ఇవి కల్పితాలు అంటారు కానీ ఇవి వాస్తవాలు. పతిత వర్గీయులకు ఏర్పరచబడిన కర్మలు వృత్తులు వారికి పాపకారణాలు కావు. వారికి పాపం తగలదు. అదే శ్రేష్ఠ వర్గీయులకు పూర్తిగా త్యాజ్యం. పాపం వస్తుంది. ఉదాహరణకు - గృహస్థునికి పత్నీ సంగమం దోషం కాదు. సన్యాసికి ఘోరపాపం. క్రింద పడుకొని నిద్రించేవాడు ఇక క్రింద పడేదే మున్నది. పెద్ద పందిరి మంచంపై పడుకొన్న వాడికి భయం. అలానే పతిత జనులు ఇంకా పతనమయేది ఏమున్నది.

ఏయే గుణదోషాల వలన మానవచిత్తం లగ్నమై రమిస్తుందో వాటిని విడుచుట మంచిది. అవి బంధనాలకుకారణాలు. వీటి నుండి ముక్తుడు కావటమే మనుజ లక్ష్యం. మానవులకు నివృత్తి ధర్మ మార్గం పరమ కల్యాణ కారణం. ఇదే శోక మోహాలు నశింప జేసేది.

ఉద్ధవా ! లోకంలో విషయ సుఖాలందు గుణం ఉన్నట్లు ఆరోపించ బడటం తటస్థిస్తుంది. అపుడు ఆ వస్తువు యెడల ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి వలన అ వస్తువును తనవద్దనే ఉంచుకొందామనే కోరిక కలుగుతుంది. ఈ కోరిక తీర్చుకొనే ఉత్సుకతతో ఆటంకాలను ఎదుర్కొనుటలో దగ్గర బంధువులను స్నేహితులను వ్యతిరేకించినా వ్యతిరేకించ వచ్చు. లేక కలహించవచ్చు. జనుల్లో ఈ కలహాల వలన క్రోధం వృద్ధి అవుతుంది. క్రోధం వలన హితం అహితం గూర్చి వివేచనా శక్తి నశిస్తుంది. అజ్ఞానం అహంకారం వ్యాపిస్తుంది. ఈ అజ్ఞానం వలన మనుష్యుడు కార్యాకార్య నిర్ణయ శక్తిని కోలుపోతాడు. వివేక నిర్ణయశక్తి అనే స్మృతిని కోలుపోవటం వలన మానవునిలో మానవత్వం హరించి పశుత్వం వృద్ధి

అవుతుంది. తన అస్తిత్వాన్ని అతడు విస్మరిస్తాడు. చివరకు వాడు మూర్ఛితుడు అవుతాడు. లేదా మృతప్రాయుడా తయారవుతాడు. ఆ స్థితిలో వానికి స్వార్థం తెలియదు. పరమార్థం తెలియదు. ఎందుకూ పనికిరాని వాడవుతాడు

విషయ సుఖ ధ్యాస వలన అతడు సుఖరోగిగా తయారవుతాడు. జడప్రాయమైన వృక్ష జీవనానికి అతని జీవనానికి భేదం కనిపించదు. మొద్దులాగా తయారై ఉంటాడు. చెట్టులో ప్రాణం ఉన్నట్లే వాడిలోనూ శ్వాస ఉంటుంది. కొలిమి తిత్తి వలె ఊపిరితిత్తులు గాలిపీలుస్తూ వదులుతుంటాయి. వాడు జ్ఞానశక్తిని విస్మరిస్తాడు. తనను గురించి పరుని గూర్చి అలోచించే శక్తి ఉండదు. అన్నివిధాల ఆత్మవంచితుడయి జీవంతో మాత్రం బ్రతుకుతుంటాడు.

ఓ ఉద్ధవా! స్వర్గ ఫలాలను వర్ణించే వేదం మనుష్యలకు ఆయా లోకాలలోని పరమ పురుషార్థాలను చెప్పలేదు. కానీ బాహ్యంగా పురుషులకు అంతఃకరణ శుద్ధి ద్వారా పరమ కల్యాణ ప్రదమైన మోక్షం యందు లక్ష్యం కుదురుటకుగాను ఆ పుణ్య కర్మలపై రుచి కలిగించుటకు మాత్రమే అలా వర్ణన చేయబడింది. చిన్న పిల్లలకు ఔషధం త్రాగించుటకు ఏవో ఆశ పెట్టినట్లు కథలు చెప్పినట్లు బాల్యంలో బాలకృష్ణకు యశోద చెప్పింది - కృష్ణా ! పాలు త్రావితే నీ జులపాలు బాగా సాగి బలే అందంగా ఉంటాయి చూడు - అన్నది.

సాంసారిక విషయ భోగాలలోనూ సంబంధీకులలోనూ తనప్రాణంపైనా మనిషికి పుట్టినప్పటి నుండి ఆసక్తి ఉంటుంది. ఈ ఆసక్తి ఆత్మోన్నతికి అవరోధం అనర్థ దాయకం అనటంలో సందేహం అణువంత లేదు. అని ఆత్మ విధులు అనవరతం బోధిస్తూ వచ్చారు.

పరమ పురుషార్థమైన మోక్ష ఫలం గుర్తించలేని పండితులు స్వర్గాదిభోగాలు నిత్యం అనుకొని ఆయా యజ్ఞాదులు చేసి, పలు జన్మల చక్రంలో భంగపడి తిరుగుతూ చివరకు వృక్షాది జన్మలు చక్రంలో భంగపడి తిరుగుతూ చివరకు వృక్షాది జన్మలు కూడా పొందుతుంటారు. పండితులు ఎందుకిలా విషయ భోగాలలో పడిపోతుంటారు?

అల్పబుద్ధులు కుబుద్ధులు వేదాలలో మహత్వ అభిప్రాయం తెలుసుకోలేక తెలుసుకొన్నా స్వార్థంతో విషయ భోగాభిలాషులై ఆకర్షితులై వాటి సంపాదనకై క్రిందకు పైకి పరుగులు తీస్తుంటారు. కానీ నిజమైన వేద వేత్తలెవరూ శ్రుతుల తాత్పర్యం ఇది యని బోధించరు. విషయ భోగ లంపటంలో చిక్కుకొన్న దీనహీన లోభులు రంగురంగుల స్వర్గ అలంకారాల లోకాలే 'మహాగొప్ప' అనుకొని దానికై తపిస్తుంటారు. అగ్ని ద్వారా లభించే యజ్ఞయాగాది కర్మలకే సంతోషిస్తుంటారు. ఈ కార్యాలు గావించి చివరకు దేవలోకాలు

పితృలోకాలు చేరుకోకల్గుతారు. ఈ జంజాటంలోపడి తిరిగి తిరిగి తనకు నిజధామమైన పరమ పదం - ఆత్మ పదం గుర్తించలేక వ్యథ చెందుతుంటారు.

ఉద్ధవా! కర్మిష్ఠుల వద్ద సాధనా బలం ఉంది. కానీ కర్మలు చేయటానికి, లేక తత్ఫలంగా ఇంద్రియ తృప్తికీ దానిని వినియోగిస్తున్నారు. వారికి కళ్లు బైర్లుకమ్మి భ్రమ చెంది పోతున్నారు. ఈ జగత్తు సృష్టించ బడింది ఎందుకు? ఈ జగత్స్వరూపంలో ఉన్నది ఎవరు ? జగన్నాథుడు జనుల హృదయాలలో సుస్థిరుడైయున్నాడు. కృష్ణ పరమాత్మ సన్నిధి జేరుటే ఆత్మలక్ష్యం. దానిని పొందాలి అనే విషయం తెలుసుకోలేక డాంబికులై పండితు బ్రువులై మెలగుతున్నారు.

ఉద్ధవా ! ఈ యజ్ఞ యగాలు చేసేవారు జితేంద్రియులు కానిచో ఫలమేమి? పశుహింస చేయటం మాంసం భక్షించటం రాగ వశంలో పడి చిందులు వేస్తుంటే ఎలా! యజ్ఞానికి త్యాగం మిక్కిలి ముఖ్యం. త్యాగం సంయమంలేని యజ్ఞం యాగం చేయటం నూరు యజ్ఞాలు చేశామని చెప్పుకోటానికే అవుతుంది. ఇది స్వాభావిక ప్రవృత్తిని సంకోచ పరుస్తుంది. ఈ యజ్ఞం సంధ్యా వందనాదుల కంటే అపూర్వ విధి కానేరదు. ఇట్టి నా అభిప్రాయం తెలుసుకోలేక విషయలోలులై హింసా వినోదాలు చేస్తున్నారు. దౌర్భాగ్య వశులై ఇంద్రియ తృప్తికై వధించిన పశుమాంసంతో యజ్ఞాలు చేసి దేవతలను పితృ దేవతలను భూతపతులను తృప్తి పరుస్తున్నామని పెద్ద మోసం చేస్తున్నారు.

ఉద్ధవా! స్వర్గాది పరలోక సుఖాలు స్వప్న దృశ్య సమానాలు. వాస్తవంగా అవి అసత్పదార్థాలు. అవి వినటానికి యింపుగా ఉంటాయి. కాముకులు స్వర్గ భోగాలకు ఉవ్విళ్ళూరి అనేక ఊహాసౌధాలు నిర్మించుకొని పగటి కలలు కంటుంటారు. వ్యాపారస్థుడు లాభాలకు ఆశపడి ఉన్నది అప్పుతెచ్చినది ధనం పెట్టుబడి పెట్టి చివరకు నెత్తికి చేతులు తెచ్చు కొన్నట్లుగా స్వర్గ భోగాభిలాషి యజ్ఞయాగాలు చేసి చేసి అలసిపోతాడు. సాధనా ధనం కోలుపోతాడు.

వారు కేవలం రజోగుణం సత్త్వగుణం తమోగుణంలోనే స్థిరంగా ఉంటారు. సత్త్వరజస్తమోగుణవంతులు ఇంద్రాది దేవతలను ఉపాసిస్తారు. ఆ పరిశ్రమతో ఆయా వస్తువులనే సంపాదించు కొనటంలోనే కాలం గడుపుతూ నా పూజా నాస్మరణ లేక నన్ను మరచి ప్రవర్తిస్తారు.

ఈ ప్రకారమైన కుసుమకోమల వాణీ మధుర భావ ప్రవాహంలో రంగురంగుల నౌకా విహారాలలో తేలిపోతుంటారు. ఊహిస్తారు - శ్రవణం చేస్తుంటారు. 'మేము ఈ లోకంలో యజ్ఞ యాగాలు మిక్కిలిగా చేస్తాము. దేవతాదులను పూజించి బాగా సంతోష

పెడతాము. తత్ఫలంగా స్వర్గం వెళతాము. అక్కడఅనేక భోగాలు అనుభవిస్తాము. అప్సరసలతో విహరిస్తాము. మరల జన్మంటూ వస్తే కులీన వంశంలో మహా ధనవంతుల గృహాలలో జన్మిస్తాము. పెద్ద పెద్ద అధికారుల రాజ భవనాలలో విహరిస్తాము. మహా సౌఖ్యాలు పొందుతుంటాము. మా వంశం శాశ్వతంగా వర్ధిల్లుతుంటుంది. ఇక మీదట ఈ ఆలోచనలతో అతని మనస్సు స్తబ్ధమై పోతుంది. నా స్మరణ ఉండదు. నా సంబంధిత ఆలోచనలే రుచించవు.

ఉద్ధవా! వేదంలో కర్మకాండ - ఉపాసనా కాండ - జ్ఞాన కాండ - అని మూడు కాండలున్నాయి. ఈ కాండల ద్వారా బ్రహ్మం ఆత్మ ఏకత్వం గూర్చి ప్రతిపాదించబడింది. అన్ని మంత్రాలు మంత్ర ద్రష్టలు ఋషులు ఈ విషయం బహిరంగం చేయక గుప్త భావంతో చెప్పుతు వచ్చారు. నాకు కూడా ఈ విషయం గుప్త పద్ధతిలో చెప్పటమే అభీష్టం. ఈ మహా విషయం అంతః కరణ శుద్ధి గలవారికే అర్ధమవుతుంది. అందరికీ అవగాహనం కాదు. వేదానికి మరో పేరు శబ్ద బ్రహ్మం అని ఉంది. వేదాలు నా స్వరూప స్వభావాలు. కనుక వాటి రహస్యాలు తెలుసుకోవటం చాల కష్టం. ఆ శబ్ద బ్రహ్మమైన వేదం పరా-పశ్యంతి మధ్యమ అనే వాణీ స్వరూపంలో ప్రాణ మన ఇంద్రియాలుగా విరాజిల్లుతోంది. వేదం సముద్రం వలె అపారం అగాధం అనంతం గంభీరం. దీని లోతు చూడటం ఎవరికీ సాధ్యం కాని విషయం. కనుకనే జైమిని వంటి పండితులు కూడా వేదార్ధం సరిగా నిర్ణయించి వ్రాయలేక పోయారు.

ఉద్ధవా ! నేను అనంత శక్తి సంపన్నుడను. స్వయంగా అనంత బ్రహ్మను. నేనే వేద వాణిని విస్తారం చేశాను. కమల నాళంలో మిక్కిలి సన్నని దారం వ్యాపించి యున్నట్లు ఈ వేద వాణి ప్రాణుల అంతః కరణంలోని అనాహత నాగ రూపంలో ప్రకటిత మవుతుంటుంది.

హిరణ్య గర్భుడైన భగవంతుడు స్వయంగా వేదమూర్తి. అమృతమయుడు. ఆయన ఉపాధి ప్రాణం. ఆయన స్వయంగా అనాహత శబ్దం ద్వారా అభివ్యక్తం అవుతుంటాడు. సాలెపురుగు తన హృదయం నుండి ముఖం ద్వారా దారం బయటికి విడుస్తుంది మరల లోపలకి తీసుకొంటుంది. ఆ విధంగానే వేదమూర్తి శబ్ద బ్రహ్మ స్పర్శాది వర్ణ సంకల్పం చేసి మనోరూప నిమిత్త కారణం ద్వారా హృదయాకాశం నుండి అనంత అపార అనేక మార్గాలు గల వైఖరీ రూప వేదవాణిని స్వయంగా ప్రకటిస్తాడు. మరల ఈ వాఙ్మయాన్ని తనలో లయంచేసి కొంటాడు. ఈ వాణి హృద్గత సూక్ష్మ ఓంకారం ద్వారా అభివ్యక్తమై అంటే స్పర్శలు 'క' నుండి 'మ' వరకు గల 25. స్వరాలు 'అ' నుండి 'ఔ' వరకు గల 9 ఉష్మాలు శషసహ 4. అంతస్థాలు యరలవ 4. వీనితో శోభిస్తుంది. దీనిలో ఛందోరీతులు తయారై వృద్ధిచెందాయి. ఛందస్సు ద్వారా బాష విస్తృతి చెందింది.

అతి ముఖ్యమైన ఛందస్సులలో - "గాయత్రి " ఉష్ణిక 'అనుష్టుప్ 'బృహతి' 'పంక్తి' 'జగతి' 'అతిచ్ఛంద' 'అత్యష్టి' 'అతిజగతి' 'విరాట్' శోభిస్తున్నాయి.

వేదవాణి కర్మకాండలో ఏ విధానం అనుసరిస్తుంది? ఉపాసనా కాండలో ఏ దేవతలను వర్ణిస్తుంది? జ్ఞాన కాండలో ఏ ప్రతీకలను గైకొని వ్యాఖ్యానిస్తుంది. అందులో ఏఏ సంకల్పాలు వికల్పాలు చేస్తుంది? అనే విషయాలు గూర్చిన వేద రహస్యాలు నేను కాక మరెవ్వరూ వివరించలేరు. వారికి తెలియవు. నేను నీకు స్పష్టంగా చెపుతున్నాను విను - వేదాలు అన్నీ కర్మకాండలో నా విధానాలే అనుసరిస్తాయి. ఉపాసకాండలో ఉపాస్య దేవతల రూపంలో నన్నే దర్శించి స్తోత్రం చేస్తారు. జ్ఞానకాండలో అకాశాది రూపాల నుండి అన్య రూపాలు ఆరోపణచేసి వాటిని నిషేధించి నాలోనే రమిస్తుంటాయి. శ్రుతి స్మృతులు నన్నే ఆశ్రయించి నాలోనే భేదాలు ఆరోపిస్తుంటాయి. ఇది మాయ అని అనువదిస్తుంటాయి. చివరకు అన్నీ కాదని నాలోనే శాంతిని పొందుతాయి. అంతంలో అధిష్ఠాన రూపంలో నేనే శేషిస్తాను.

తత్త్వ సంఖ్య - పురుష ప్రకృతి

ఉద్ధవుడు భగవానుని ప్రశ్న చేశాడు - కృష్ణా ! విశ్వేశ్వరా! ఋషి పుంగవులు తత్త్వ సంఖ్య ఎంత అంటారు? నీవు ఇప్పుడు తొమ్మిది + పదకొండు + ఐదు + మూడు = మొత్తం ఇరవై ఎనిమిది అని లెక్కించావు. ఇది మేము విన్నాము. కానీ మరికొందరు ఇరువది ఆరు తత్త్వాలు అంటారు. ఇంకొందరు ఇరువది ఐదు అంటారు. వేరొకరు ఏడు అని తొమ్మిది అని ఆరు అని నాల్గు అని పదకొండు అని ఒక్కొక్కరొక్కొక్క విధంగా చెప్పుతున్నారు. మరి కొందరు ఋషులు మునులు తమతమ అభిప్రాయం ప్రకారంగా పదిహేడు అని పదహారు అని పదమూడు అని చెప్పారు కూడా. ఓ సత్య సనాతన సారధీ ! శ్రీ కృష్ణా ! శేషతల్పశాయీ! ఋషులు ముని ఇట్లు వేరు వేరుగా ఎందుకు చెప్పుతున్నారు? వారిలోని అభిప్రాయం ఏమిటి? ఏ ఉద్దేశంతో అలా విభేదిస్తున్నారు?

నీవు సర్వజ్ఞుడవు. సత్య సనాతన మూర్తివి. పరబ్రహ్మ మూర్తివి. పరమాత్మవు. సర్వ జగన్నియామకుడవు. దయచేసి నాకు వివరించి బోధించండి.

శ్రీ కృష్ణుడు ఇలా వివరించాడు -

ఉద్ధవా ! ఈ విషయంలో వేదజ్ఞులు చెప్పింది నిజం. యథార్థం. అన్ని తత్త్వాలు అందరిలోనూ అంతర్భూతంగా ఉన్నాయి. నా మాయను స్వీకరించి ఏమి వక్కాణిస్తే అసంభవమవుతుంది? "నీవు చెప్పేది సరైనది కాదు. నే చెప్పేదే యథార్థం" అని జగత్తులో

వాద వివాదాలు చెలరేగుతున్నాయి. కానీ నా శక్తులు సత్త్వరజస్తమోగుణాలు వృత్తులు వాటి రహస్యాలు జనులు తెలుసుకోలేక పోతున్నారు. కనుక వారి వారి మనః ప్రవృత్తులపై ఆధారపడి పట్టుదలలు పూనుతున్నారు.

సత్త్వ గుణాల క్షోభం వలననే వివిధ కల్పనా ప్రపంచం నామాలపైననే నిలబడుతోంది. వస్తుతత్త్వ పరిశీలనా దృష్టిలోపించింది. కేవలం పేరులపైనే కలహాలు ప్రాకిపోతున్నాయి. ఇదే వాద వివాద విషయమయింది. ఇంద్రియాలు వశంలో ఉన్నపుడు చిత్తం శాంతంగా ఉన్నపుడు ఈ ప్రపంచం ప్రకృతి నివృత్తి అవుతుంది. నివృత్తి కాగానే వాద వివాదాలు సమసిపోతాయి.

ఓ ఉద్ధవా! పురుష శ్రేష్ఠా! తత్త్వం ఒకటి రెండవదానిలో కలుస్తుంటుంది. కనుక వక్త తత్వం గుర్చి ఎన్ని సంఖ్యలు విడదీయాలని కోరుకొంటాడో అన్ని సంఖ్యలు ఏర్పడతాయి. కారణాలు కార్యాలలోను కార్యాలు కారణాలలోను కలసి సంఖ్యా వాచకానికి బలం వస్తుంటుంది.

ఒకే తత్త్వంలో అనేక తత్త్వాల అంతర్భావాలు కలిసి ఉంటాయి. దేనిలో ఏది అంతర్భావంగా ఉండాలి అనే నిబంధన ఏదీ లేదు. ఘట పటాది కార్యది వస్తువలలో వాటికి కారణాలైన మట్టి దారం మొదలైన వాటిలో అప్పుడపుడు మట్టి దారం మొదలైన ఘటపటాది కార్యాలలో అంతర్భావాలు అంతర్భాగాలుగానో రూపుదాలుస్తుంటాయి. కాబట్టి వాది ప్రతివాదుల వాక్కులలో ఏ కార్యానికి ఏకారణంలో లేక ఏ కారణానికి ఏ కార్యంలో అంతర్భూతంచేసి తత్త్వ సంఖ్య ఎంతని నిర్ణయించాలని తలచాడో అంతగా ఒప్పించ కలుగుతాడు. ఈ ఉపపాదనలు అన్నీ యుక్తి సంగతాలు.

ఉద్ధవా! తత్త్వ సంఖ్య ఇరువది యారు అని స్వీకరించిన పెద్దలు ఇలా వివరిస్తారు- జీవుడు అనాది కాలం నుంచి అవిద్యా భూతం చేత మ్రింగబడినాడు. అతడు తనను తాను తెలుసుకోలేడు. అతనికి ఆత్మజ్ఞానం కలుగజేయటానికి మరొక సర్వజ్ఞుడైన పండితుడు అవసరమైయున్నాడు. కనుక ప్రకృతి యొక్క కార్యకారణ రూపాలు ఇరువది నాలుగు పురుషుడొకడు ఈశ్వరుడొకడు మొత్తం ఇరువది యారు తత్త్వాలు అని లెక్కకట్టారు. మొత్తం ఇరువది ఐదు తత్త్వాలు అని చెప్పేవారు ఇలా చెప్తారు- శరీరంలోని జీవునికి ఈశ్వరునికి కొంచంకూడా భేదంలేదు. భేదం కల్పించటం వ్యర్థం. జ్ఞానమే సత్త్వాత్మికమైన ప్రకృతి గుణం.

త్రిగుణాల సామ్యావస్థయే ప్రకృతి. కనుక సత్త్వరజస్తమో గుణాలు ఆత్మవి కావు.

అవి ప్రకృతి గుణాలు. ఈ గుణాల ద్వారా జగత్తు ఉత్పత్తి స్థితి లయం జరుగుతున్నాయి. కాబట్టి జ్ఞానం ఆత్మగుణం కాదు. ప్రకృతి యొక్క గుణమే.

ఈ ప్రకృతిలోని సత్త్వగుణమే జ్ఞానం. రజోగుణమే కర్మ. తమో గుణమే అజ్ఞానం. గుణాలలో క్షోభ కలిగించే ఈశ్వరుడే కాలం. లేక సూత్రం. మహత్తత్త్వమే స్వభావం. కనుక ఇరువది ఆరు - ఇరువది యైదు అనే వాదాలు యుక్తి సంగతాలు.

ఉద్ధవా! త్రిగుణాలను ప్రకృతి కంటే వేరువేరుగా భావిస్తే, ఉత్పత్తి లయాలను చూస్తూ తత్త్వ సంఖ్య ఇరువది ఎనిమిది అని తలంచాలి. త్రిగుణాలు కాక ఇవి ఇరువది యైదు. అవి పురుషుడు - ప్రకృతి - మహతత్త్వం - అహంకారం - ఆకాశం - వాయువు - తేజస్సు - జలం - భూమి. తొమ్మిది మొదట చెప్పాను.

శ్రోత్రం - నేత్రం - చర్మం - ముక్కు - నాలుక ఈ ఐదు జ్ఞానేంద్రియాలు. వాక్కు - పాణి - పాదం - పాయువు - ఉపస్థ ఈ ఐదు కర్మేంద్రియాలు మనస్సు జ్ఞానేంద్రియ కర్మేంద్రియం రెండూను. ఇవి పదకొండు. శబ్ద స్పర్శ రూప రసగంధాలు ఐదూ జ్ఞానేంద్రియ విషయాలు. ఇలా మూడు + తొమ్మిది + పదకొండు + ఐదు మొత్తం ఇరవై ఎనిమిది తత్త్వాలు. కర్మేంద్రియాల వలన జరుగు పనులు - మాట్లాడుట పనులుచేయుట నడుచుట మలత్యాగం మూత్ర త్యాగం. వీటి ద్వారా తత్త్వ సంఖ్య పెరగదు. ఇవి కర్మేంద్రియ కార్యాలు మాత్రమే.

సృష్టి ప్రారంభంలో కార్య కారణాలు కలిగి ప్రకృతి ఉంటోంది. ప్రకృతి సత్త్వ రజస్తమోగుణాల సహాయంతో జగత్తు యొక్క ఉత్పత్తి స్థితి లయాది కార్యక్రమం జరుగుతూ వచ్చాయి. అవ్యక్త పురుషుడు ప్రకృతి స్థితి గతులకు సాక్షీమాత్రుడుగా ఉంటూ వచ్చాడు.

మహత్త్వాధికారణ ధాతువులు వికారాలు పొందుతూ పురుషుడైన ఈశ్వరుని శక్తులు పొంది పరస్పరం మిశ్రమం అవుతూ వచ్చాయి. ఈశ్వరుడు ప్రకృతి ఆశ్రయం తీసికొని దాని బలంతో బ్రహ్మాండ సృష్టి చేస్తున్నాడు. ఉద్ధవా! తత్త్వ సంఖ్య అనేవారు ఆకాశం వాయువు అగ్ని జలం భూమి జీవాత్మ పరమాత్మ అని గణనం చేశారు. జీవుడు జగత్తు అధిష్ఠాన సాక్షీ సాక్ష్యాలు ఇవి తత్త్వాలు ఏడు. దేహేంద్రియ ప్రాణాదుల ఉత్పత్తులు పంచభూతాల వలన జరుగుతున్నాయి. కనుక వీనిని వేరుగా లెక్కించలేదు. కేవలం ఆరు తత్త్వాలు అని లెక్కించేవారు పంచభూతాలను పరమాత్మను స్వీకరించారు. పరమాత్మ తాను నిర్మించిన పంచభూతాలతో కలిసి దేహాదులను సృష్టిస్తున్నాడు. సృష్టిలో జీవుడు తయారు అవుతున్నాడు. ఈ మతం ప్రకారం జీవుడు పరమాత్మలోని శరీరాది పంచ భూతాలలో సమావేశమవుతున్నాడు.

కొందరు కారణ రూపంలో నాల్గు తత్త్వాలు మాత్రం స్వీకరిస్తారు. వారు - "ఆత్మ నుండి తేజస్సు జలం పృధ్వి ఉత్పత్తి అయ్యాయి. జగత్తులోని పదార్థాలన్నీ ఈ పదార్థాల నుండి జనిస్తున్నాయి. ఇవే అన్నింటిలోనూ కార్య రూపం దాలుస్తున్నాయి" అంటారు. తత్త్వ సంఖ్య పదిహేడడు అనేవారు - 'పంచ బూతాలు - పంచ తన్మాత్రలు - పంచ జ్ఞానేంద్రియాలు మనస్సు పరమాత్మ మొత్తం పదిహేడు తత్త్వాలు అంటారు.

తత్త్వ సంఖ్య పదహారు అనేవారు కూడా ఇలానే చెప్పి చివర మనస్సును - ఆత్మను కలిపి ఒకటిగా లెక్కించారు. ఇలా వీరు పదహారు అన్నారు. కొందరు పదమూడు అన్నారు. వారు 'ఆకాశాది పంచ భూతాలు శ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియాలు మనస్సు - జీవాత్మ - పరమాత్మ మొత్తం పదమూడు తత్త్వాలు మాత్రం అన్నారు. పదకొండు అనేవారు పంచభూతాలు పంచ జ్ఞానేంద్రియాలు పరమాత్మ మొత్తం పదకొండు అన్నారు. తొమ్మిది తత్త్వాలు అనేవారు పంచ భూతాలను మనస్సు బుద్ధి అహంకారం పురుషుడు మొత్తం తొమ్మిది అన్నారు.

ఉద్ధవా ! ఈ విధంగా ఋషీశ్వరులు తమ తమ అభిమతాలననుసరించి తత్త్వ సంఖ్యను గణిస్తూ వచ్చారు. అందరు చెప్పింది మంచిదే. అందరికి కూడా యుక్తి సంగతంగానే ఉన్నాయి. ఈ తత్త్వజ్ఞులు ఎవరూ అపమార్గంగా చెప్పలేదు. వారి వారి దృక్కోణంతో చూచినపుడు అన్నీ తగినట్లే యున్నవి.

ఉద్ధవుడు తత్త్వ సంఖ్య గూర్చి విని ఇలాప్రశ్నిస్తున్నాడు - కృష్ణా ! శ్యామసుందరా! పరాత్పరా! వస్తుతః ప్రకృతి పరమ పురుషుడైన పరమాత్మ పూర్తిగా భిన్నం కదా! ఆ ఇద్దరూ సామాన్యులు తెలుసుకోలేనంతగా ఒకరిలో ఒకరు కలిసిపోయి ఉంటారు. ప్రకృతిలో పురుషుడు పురుషుడిలో ప్రకృతి వేరులేనట్లే కలిసిపోతారు. వీరి భిన్న తత్త్వం స్పష్టంగా ఎలా తెలుస్తుంది. వారి భిన్నత్వం అభిన్నత్వంపై నా హృదయం సందేహాలతో సతమతమవుతోంది. తమరు సర్వజ్ఞులు కాబట్టి అడుగుతున్నాను. యుక్తి యుక్తంగా వివరించి నా సందేహం నివారణ చేయవలసింది.

భగవాన్ ! తమ కృపా విశేషం వలననే జీవికి జ్ఞానం కలుగుతోంది. తమ మాయచేత జ్ఞానం హరించిపోతోంది. తమ ఆత్మ స్వరూపిణియైన మాయావతి చిత్ర విచిత్రాలు. ఆమె ప్రవర్తనలు తమకే అవగతం. మరెవరూ ఏ కొంచమూ ఎరుగరు. కనుక దయయుంచి నా సందేహ నివారణం చేయండి. అన్నిటికీ తమరే సర్వ సమర్థులు. స్వామీ ! సర్వాంతర్యామీ ! నమామి!

భగవానుడిలా చెప్పాడు -

ఉద్ధవా! ప్రకృతి పురుషులకు, శరీర ఆత్మలకు గలభేదం చాలా వుంది. ఈ ప్రాకృత జగత్తులో జననమరణాలు వృద్ధి లయాలు మొదలైన వికారాలు జరుగుతూ ఉంటాయి. ఈ గుణ సంక్షోభకారణంగానే ఇలా జరుగుతుంది. ప్రియ సఖా! నా మాయ త్రిగుణాత్మకం. అదే సత్త్వ రజస్తమో గుణాల వలన అనేకానేక ప్రకార భేదాలు కలిగిస్తూంటుంది. దీని విహార భూమి బహు విస్తారం. అయినా ఈ వికారాత్మక సృష్టిని మూడు భాగాలలో విభజించి పరిశీలించ వచ్చు - అందులో ఒకటి అధ్యాత్మం రెండు అధి దైవం మూడు అధిభూతం.

ఉదాహరణార్థం ఇది చూడు - నేత్రేంద్రియం అధ్యాత్మం నేత్రేంద్రియ విషయ రూపం అధి భూతం. నేత్ర గోళంలోని సూర్యాంశ అధి దైవం. ఈ మూడూ ఒకటికి మరొకటి ఆశ్రయ భూతాలు. కనుక అధ్యాత్మ అధిదైవ అధి భూతాలు మూడూ పరస్పరసాపేక్షాలు. కానీ ఆకాశంలోని సూర్య మండలం ఈ మూటి కంటె విలక్షణం. విముక్తం. అది స్వయం సిద్ధం. స్వత స్సిద్ధం. ఈ విధంగానే ఆత్మ. ఆత్మ త్రివిధాలకు భేదాలకు మూలకారణం. దానికి సాక్షి వీనికి పరం. అదే తన స్వయం సిద్ధ ప్రకాశంతో సమస్త సిద్ధ పదార్థాలకు మూలసిద్ధమై ప్రకాశిస్తోంది. దీని ద్వారానే అన్నీ ప్రకాశిస్తున్నాయి. కన్నులలో గల భేదాలు మూడు చూపి చెప్పినట్లుగానే చర్మం, శ్రోత్రం, జిహ్వ, నాసిక, చిత్తం మొదలైన వన్నిటిని గూర్చి మూడు మూడు భేదాలు చెప్పవచ్చు. త్వక్కు అనగా చర్మం - ఈ చర్మ సంబంధాలు స్పర్శవాయువు. శ్రవణ సంబంధాలు శబ్దం.- జిహ్వ సంబంధాలు రసం వాక్కు నాసిక సంబంధాలు గంధాలు అశ్వినీ కుమారులు. చిత్త సంబంధాలు చింతన విషయం వాసుదేవుడు. మనస్సంబంధం చంద్రుడు, అహంకార సంబంధం రుద్రుడు, బుద్ధి బ్రహ్మ - ఈ మొదలైన త్రివిధ తత్త్వాలతో ఆత్మకు సంబంధంలేదు.

ప్రకృతి నుండి మహత్తత్త్వం తయారు అవుతుంది. అలానే మహత్తత్త్వం నుండి అహంకారం. ఇలానే అహంకార గుణక్షోభం వలన పుట్టిన ప్రాకృతిక వికారాలు. అహంకారంలో మూడు భేదాలు సాత్త్వికం తామసం రాజసం. ఈ హంకారమే అజ్ఞానం. ఇది సృష్టికి గల వైవిధ్య కారణం.

ఆత్మ జ్ఞాన స్వరూపం. ఆత్మకు దేనితోనూ సంబంధంలేదు - వివాదంలేదు. అస్తి - నాస్తి, సగుణం - నిర్గుణం భావం అభావం, సత్యం - మిథ్య ఈమొదలైన రూపాలు భేదాలు కనిపిస్తున్న అన్నిటికి మూలకారణం భేద దృష్టియే. ఈ వివాదాల వలన లాభం ఏమత్రం లేదనేది నిస్సందేహం. ఇదంతా వ్యర్థం. ఈ వాద వివాదాలలో పడి నా వాస్తవిక స్వరూప జ్ఞాన మార్గం నుండి విముఖులవుతున్నారు. ఈ వాదాల నుండి వీరికి ముక్తి లభించేటట్లుగాలేదు.

ఉద్ధవుడిలా అడిగాడు -

భగవాన్ ! ప్రభూ ! జీవులు తమకు వ్యతిరేకమైన పుణ్య పాపాలు చేసిన పలంగా ఉత్తమ జన్మలు నీచ జన్మలు పొందుతూ చక్రంలో తిరుగుతుంటారు కదా! మరి తమమహా వ్యాపక ఆత్మ ఒక శరీరం నుండి మరో జన్మకు వెళ్ళుతుంది అంటారు. అ కర్త యొక్క కర్మచేయటం, నిత్య సనాతన వస్తువైన ఆత్మ జన్మ మరణం పొందటం ఎలా సంభవం? గోవిందా! ఆత్మజ్ఞాన శూన్యులు ఈ విషయం ఆలోచించనేలేరు. విజ్ఞానులు ఈ లౌకిక విషయాలు పట్టించుకోరు. అందరూ నీ మాయలో పడిపోతారు. ఇది వివరించండి.

శ్రీ కృష్ణ భగవానుడు వివరిస్తున్నాడు -

ఉద్ధవా ! మనుష్యల మనస్సు కర్మ సంస్కార సమూహాల పుష్పగుచ్ఛం. ఆ సంస్కారాల ననుసరించి భోగాలు పొందటానికి దానితో ఐదు ఇంద్రియాలు సిద్ధమవుతాయి. ఈ మనో మయ శరీరమే లింగ శరీరం. ఇది కర్మానుసారం ఒక శరీరం నుండి మరో శరీరానికి ఒకలోకం నుండి మరో లోకం ప్రయాణిస్తూంటుంంది. ఆత్మ ఈ లింగ శరీరం కంటే పూర్తి భిన్నం. ఆత్మకు రావటం పోవటంలేదు. కానీ తనను లింగ శరీరం అనుకొన్నపుడు దానిలోకి అహంకారం ప్రవేశిస్తుంది. అపుడు ఆత్మ వస్తున్నట్లు పోతున్నట్లు భాసిస్తుంది.

మనస్సు కర్మాధీనం. ఈ మనస్సు విన్నవి కన్నవి చింతిస్తుంది. క్షణ కాలంలో విన్న వార్తలు చూచిన దృశ్యాల యొక్క ఆకారం దాలుస్తుంది. వాటిని గూర్చిన పూర్వ చింతన విషయాలలో మునుగుతూ తేలుతూంటుంది. ఇందులో మనిషికి క్రమక్రమంగా స్మృతి హరిస్తుంది దాని పూర్వాపర విస్మృతి కలుగుతుంది. దేవతాది శరీరాలలో ఈ విషయాలను గురించిన అభినివేశం తల్లీనత ఉంటుంది. జీవులలో ఆ జ్ఞాపకాలే ఉండవు. ఏదో కారణంగా శరీరాన్ని మరిచిపోవటమే మృత్యువు.

ఉద్ధవా ! ఈ శరీరానికి మరో శరీరానికి భేదం తెలియక నేను నాది అని ఆ శరీరాలలో ప్రవేశిస్తుంటాడో అపుడు అతనికి ఆ తలంచిన జన్మయే కలుగుతుంది. అలాంటి కలలే కంటుంటాడు. కోరికలలోపడి ఆయా శరీరాలపై అభిమానం పెరిగిపోతుంటుంది. దీనినే స్వప్న జగం అంటారు. వర్తమాన దేహంలో గల జీవుడు పూర్వ దేహ స్మరణ పొందనట్లుగా స్వప్నంలోని జీవుడు కూడా మొదటి స్వప్నాలు మనోరథాలు తలంచలేడు. వర్తమానంలో పూర్వ స్మృతులు స్వప్నాలు వచ్చినా తనకు నవీనం వలెనే తోస్తుంది.

ఉద్ధవా! ఇంద్రియాలకు ఆశ్రయం మనస్సు లేక శరీరం. మనస్సు ఇంద్రియాలకు రాజు అంటారు. సృష్ట్యాది నుండి ఆత్మ వస్తువు ఉత్తమ మధ్య అధమం అని త్రివిధంగా

భాసిస్తున్నది. దానిపై అభిమానం అధికం చూపుట వలన ఆత్మ బాహ్యం గానూ అంతరికంగానూ భేదం చూపుటకు హేతువై భాసిస్తుంటుంది. కు పుత్రుడికి తండ్రిలో శత్రు మిత్ర భేదాలు పొడచూపుతాయి కదా!

ఉద్ధవా ! కాలంగతి అతి సూక్ష్మం. అది తెసుకొనే వీలు దొరకదు. సాధారణంగా అర్థమేకాదు. కాలప్రభావం చేత ప్రతి క్షణం శరీరంలో వృద్ధి నాశనం జరుగుతూ వుంటుంది. సూక్ష్మ గతి కారణంగా క్షణ క్షణం జరిగే జన్మ మరణ క్రమం అవగతం కాదు. కాలప్రభావం వలన జ్యోతిలో జ్వాలలు, నదిలో ప్రవాహాలు వృక్షాలలో ఫల పరిణామాలు మారుతున్నట్లుగా సమస్త ప్రాణుల శరీరాలలోని అవస్థలు ఆయువులు మారుతుంటాయి.

ఈ జ్వాలల దీపం అదే, ప్రవాహాల జలం అదే, అనటం మిథ్యావాదం. కామ భోగ లాలసత్వంతో వ్యర్థంగా కాలం గడిపే అవివేకి ఈ పురుషుడు, మొదటి వాడే కదా అనుకోవటం మిథ్యా డంబరమే అవుతుంది. ఈ భ్రాంతి పురుషుడు తన కర్మ బీజం ద్వారా జనించడు. మరణించడు. వాడు ఆ జన్మంగా అమరుడే సుమా! వాడు భ్రాంతి నుండి జనిస్తాడు చనిపోతున్నట్లుంటాడు. ఉదాహరణకు - కొయ్యలో నిప్పు ఉంటుంది. కానీ నశించినట్లు నివురు కప్పి ఉంటుంది. ఉద్ధవా! గర్భాదానం - గర్భ వృద్ధి - జన్మ - బాల్యం - కౌమార్యం - యౌవ్వనం - మధ్య వయస్సు - వృద్ధాప్యం - మృత్యువు ఈ తొమ్మిది దశలు శరీరానివి.

ఈ శరీరం జీవుని కంటె భిన్నం. ఈ ఉచ్ఛ - నీచ దశలు జీవుని వాంఛలను అనుసరించి వస్తుంటాయి. కాని అజ్ఞాన వశంగా గుణ సంగదోషాల వలన తనవిగా తలంచి భ్రమిస్తుంటాడు. అప్పుడపుడు వివేకం కలిగినపుడు ఆ గుణాలను వదులు తుంటాడు. తండ్రికి పుత్రుని జన్మం వలన, పుత్రునికి తండ్రి మరణం వలన తమ జన్మ మరణాలు గూర్చి అనుమానాలు వస్తుంటాయి. అలా రావాలి. అది సహజం. జనన మరణాలతో కూడిన దేహాన్ని చూస్తున్న ద్రష్ట జననమరణాలుగల ఈ శరీరం కాదు.

రైతు పంటకై విత్తనాలు నాటతాడు. పెంచుతాడు. పండిస్తాడు కోసేస్తాడు. కానీ పంట వేరు రైతు వేరు. రైతు పంటకు సాక్షీ భూతుడు. అలానే జీవుడు శారీరక దశలు వేరు వేరు. పురుషుడు దేహ అవస్థలకు సాక్షీ భూతుడు మాత్రమే. అజ్ఞాని ప్రకృతి శరీరం నుండి ఆత్మను విలక్షణంగా చూడలేడు. అతడు తత్త్వతః శరీర ఆత్మలకు గల భేదాలను గురించి యోచించలేడు. విషయభోగాలను నిజమైన సౌఖ్య సంపదలుగా భావిస్తాడు. ఆ సుఖాలలోనే మోహితుడై చరిస్తుంటాడు. ఆమోహంలోపడి జనన మరణ చక్రంలో తిరుగుతుంటాడు.

ఉద్ధవా ! అవివేక పురుషులు తమతమ కర్మల ననుసరించి జన్మ మృత్యు చక్రంలో తిరుగుతుంటారు వారిలో సాత్త్వికగుణ సంపత్తి గలవారు సాత్త్విక కర్మాసక్తి వలన ఋషి లోకంలోనో దేవలోకంలోనో జన్మిస్తారు రాజసిక కార్మసక్తి గలవారు మానవలోకంలోనో, దానవలోకంలొనో ఉధ్భవిస్తారు తామసిక కార్మసక్తి గలవారు భూతప్రేతాల లోకంలోనో పశుపక్షి జాలంలోనో జన్మలెత్తుతారు మనుష్యుడు నృత్య గానాదు లందు అత్యంతా సక్తుడైతే అవి చూస్తున్నపుడు ఆ నృత్య గానాలను మానసికంగా, తనకు తెలియకనే అవయవాలు, కొంత అనుకరిస్తుంటాయి అట్లే జీవుడు బుద్ధినీ గుణాలనూ దర్శిస్తున్నపుడు స్వయంగా నిష్క్రియాత్ముడుగా ఉన్నను ఆ బుద్ధి గుణాలను అనుకరించటానికి మానసికంగా ప్రయత్నింస్తుంటాడు. అది బుద్ధి లక్షణం.

నదీ సరోవరాల జలం గాలికి కదులుతుంటే ఆ జలాలలో ప్రతిబింబించే ఒడ్డున గలచెట్లు కూడా నీళ్ళలో పడి కదులుతున్నట్లు అనిపిస్తుంది. కళ్ళు తిరుగుతున్నప్పుడు భూమి గిరగిర తిరిగి పోతున్నట్లు తోస్తుంది. మానసిక ఆలోచనలు గానీ, స్వప్నంలో చూచే భోగాదులుగానీ పూర్తిగా భ్రమలు మృషలు. అలానే ఆత్మయొక్క విషయానుభవ సంసారం అసత్యం. అబద్ధం. ఆత్మనిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావ ప్రభా పూర్ణం.

విషయ సుఖాలు సత్యం కానప్పటికి జీవుడు విషయ భోగాలను గూర్చి ఆలోచిస్తుంటాడు అట్టివాడు జన్మమృత్యు చక్ర బంధం నుండి విముక్తి పొందలేడు స్వప్నంలో అనర్థ దృశ్యానుభవాల నుండి ముక్తి మెలుకువ వచ్చినప్పుడే కదా!

ఉద్ధవా! 'తృప్తిలేని ఈ ఇంద్రియ భొగాలు భోగించరాదు. ఇవి అసద్భూతాలు. మంచివికావు పతన హేతువులు. ఇవి ఆత్మజ్ఞానం చూపని అజ్ఞానం వలన కప్పబడిన సాంసారిక భేద భావాలు, భ్రమ మూలకాలు ! అని తెలుసుకో.

అజ్ఞానులు అసాధువులు అవివేకంచేత నిన్ను నిందించినా, బైటకు గెంటినా, దూషించినా, అవమానించినా, కొట్టినా, తిట్టినా, కట్టినా, ముఖాన ఉమ్మేసినా, రకరకాల పలు బాధలు పెట్టినా నిన్ను నీ నిష్ఠనుండి తప్పించుటకు ముప్పుతిప్పలు పెట్టినా, వారిని సాధువులు పన్నెత్తి పలుకరాదు. వారిని ఏ విధంగానూ శపించరాదు. వారు తెలియని వారు. పాపం! వారు అజ్ఞానులు. మూర్ఖులు తరువాత వారే పశ్చాత్తాప పడతారు. వారికి పరమార్థం గురించి ఏమీ తెలియదు. కనుక కల్యాణ కాంక్ష గల పరోపకార పరాయణులు వారిని బాహ్యమైన కఠిన సాధనాల వల్ల కాక సాధువుల ఓర్పు నేర్పుల ద్వారా వారిలో ఆంతరంగిక మార్పులు తెచ్చి జ్ఞాన వంతులను చేయాలి ఈ విధంగా తమను తాము ఉద్ధరించుకోవాలి.

నిజంగా ఆత్మ దృష్టియే సమస్త ఆపదలను హరించే ఏకైక సాధనం. ఆత్మ దృష్టియే సమస్త ఆపదలను హరించే ఏకైక సాధనం. ఆత్మజ్ఞానంతో ఆత్మ దృష్టి అలవరచుకో. ఆత్మజ్ఞానమే ఆత్మను ఉద్ధరిస్తుంది.

ఉద్ధవుడు శ్రీకృష్ణ బోధ విని ఇలా అన్నాడు -

భగవాన్ ! తమరు సమస్త వక్తలలో శిరో భూషణులు. నేను ఈ దుర్జనులు చేసే తిరస్కార కృత్యాలను చూచి చాల అసహ్యించుకొంటున్నాను. తమ ఉపదేశాలు ఆలకించాను అవి నిత్యాచరణంలో అమలుపరుస్తాను. అర్థమైనవన్నీ ఆచరిస్తాను. చెప్పింది చెప్పినట్లుగా చేస్తాను. ఆ ఆత్మబలం అనుగ్రహించండి.

హే విశ్వాత్మా ! విశ్వ స్వరూపా! విశ్వనాథా! నీ భాగవత ధర్మాచరణలో ప్రేమతో సంలగ్న మానసవర్యులు నీ చరణారవింద ఆశ్రయం పొందిన వారు శాంత స్వభావులు మాత్రమే దుష్టుల ద్వారా చేయబడు తిరస్కార అవమానాదులు స్వీకరించ గలరు కానీ పెద్ద పెద్ద విద్వాంసులైనా వారి దుష్ట కృత్యాలను భరించలేరు సహించలేరు. దీనికి లోకంలోని ప్రకృతియే అట్టిది కదా!

ఒక బ్రాహ్మణుని చరిత్ర

శుక మహర్షి పురాణ ప్రవచనం ఇలా సాగిస్తున్నాడు. ఓ పరీక్షన్మహారాజా! వాస్తవంగా భగవత్కథలే వీనులకు విందులు. అవే ప్రేమ ప్రదాలు ముక్తి దాయకాలు. ఉద్ధవుని అభ్యర్థన విని భగవానుడు అతని సంప్రశ్నకు ఇలా సమాధానం చెప్పదొడగాడు-

శ్రీ కృష్ణ భగవానుడు ఈ విధంగా వివరిస్తున్నాడు - ఉద్ధవా! ఈ ప్రపంచంలో దుర్జనుల పరుషోక్తులు విని కూడా తమహృదయాలను ప్రశాంతంగా నిబ్బరంగా ఉంచుకో గల్గిన మహా సహన శీలురగు మహాత్ములు ఎక్కడో ఉంటారు. అసలు లేరనే చెప్పాలి. మనుష్య హృదయం మర్మభేద వచనాలతో కలుక్కు అనినా దుష్టులు దుర్మార్గులు పలికే మర్మాంతక వచనాలు, బాణాలు చేసే గాయాలంత బాధించి యుండవు. ఈ విషయం

ర్వులు ఒక ఇతిహాసం వెల్లడిస్తారు.

ఒకానొక భిక్షుకుణ్ణి దుష్టులు దుర్మార్గులు మిక్కిలి బాధించారు. అపుడు కూడా భిక్షుకుడు మిక్కిలి ఓర్పుతో ఉన్నాడు. ధైర్యం కోలుపోకుండా అన్నీ సహిస్తూ వచ్చాడు. తన పూర్వజన్మ కర్మ ఫలం ఇది అనుకొని మానసికంగా బాధపడుతుండేవాడు. అతని కథ వివరిస్తాను విను-

ప్రాచీన కాలం విషయం. అవంతి పట్టణంలో ఒక బ్రాహ్మణ గృహస్థుడుండేవాడు. అతడు వ్యవసాయం వ్యాపారం చేసి ధనం బాగా కూడ బెట్టుకొన్నాడు. పెద్ద ధనవంతు డైనాడు. ధన సంపాదనలో పడి బుద్ధులు బంధబారినాయి. వాడు చివరకు ఆశపోతుగా, లోభిగా, కఠినుడుగా తయారైనాడు. వాడికి మాట మాటకీ కోపం మరీ ఎక్కువైపోయింది. చీటికీ మాటికీ మండిపడటం పరిపాటి అయింది.

అతని బంధుమిత్రాదులు కూడా అతడంటే అసహ్యించుకోసాగారు. అతడు ఎవరితోనూ తీయగా మాట్లాడి ఎరగడు. అతిథులు అల్లంత దూరం నుంచే పోతారు. మాట మంచీ లేనపుడు ఆహారం ఏమిపెడతాడు? దానం ధర్మాలు సత్కర్మలు ఇంకేం చేస్తాడు? ధన సంపాదన సంరక్షణలో పడి పరులను ద్వేషిస్తే ద్వేషిస్తూ చిక్కి సగమైపోయాడు. కృశించి పోతున్న కొలది కోపం తాపం పాపం వాణ్ణి పట్టి పీడించసాగాయి.

వాడిలోభం చూచి భార్యా బిడ్డలు చుట్టాలు పక్కాలు పనివాళ్ళు అయినవాళ్ళు అందరూ విచారించసాగారు. చివరకు వీడి పీడ ఎప్పుడు విరగడై పోతుందా అనుకొనేవారు. ఎవరు ఏ పని చేసినా వాడి ఇంటిలో వాడికి నచ్చేదికాదు. అందరితోనూ తగవులూ పోట్లాటలు. ఊరికే ఉడికి పోతుండేవాడు. వాడు ఇహలోకంలోనూ పరలోకంలోనూ భ్రష్టుడైపోయాడు. కానీ కుబేరున కున్నంత ధనం ప్రోగు చేశాడు. ధనంతో దానంలేదు. ధర్మం లేదు. భోగం లేదు. యోగంలేదు. ఇలాంటి జీవనాన్ని చూచి పంచ భాగీయులగు దేవతలుకూడా ఆగ్రహించారు.

ఉద్ధవా! ఆ బ్రాహ్మణునిపై పంచ దేవతలు ఆగ్రహించటం చేట అతని పూర్వ పుణ్యం వలన లభించిన సంపదలు హరించుక పోసాగినవి. తాను ఎంతో కష్టపడి కూడబెట్టిన ధనరాశి అతని కళ్ళెదటే ఎక్కడి దక్కడ చేతికి రాకుండా పోయింది. ఆ లోభి దనం కాస్త బంధువులు కాజేశారు. దొంగలు దొంగిలించారు. దైవికంగా అగ్నికి ఆహుతి అయిపోయింది. గృహం జప్తయిపోయింది. పొలాలు పరాయత్తమైపోయాయి. సాధారణ మనుష్యులు తీసుకొన్న బాకీలు ఈయలేదు. కాస్త కూస్త మిగిలితే ప్రభుత్వం శిస్తుకని బకాయిల కని సర్వం మంగళం అయింది.

ఈ విధంగా ఆ పిసినారి తన డబ్బుతో ఒక ధర్మ కార్యమూ చేయలేదు. ఎవరికీ సహాయమూ చేయలేదు. భోగాలు భోగించనూ లేదు. పిసినిగొట్టు పేద అయినాడు. అయిన వాళ్ళెవరూ కన్నెత్తి చూడలేదు. అతనికి చివరికి దిగులు ఎక్కువయింది. ఏడుపు వస్తోంది. మానసిక గ్లాని పట్టి పీడించ సాగింది. ధన నాశనంతో వాడి మనస్సు మండిపో సాగింది. మనోవేదన మరీ ఎక్కువై ఉక్కిరిబిక్కిరి చేయసాగింది. కన్నీరు మున్నీరుగా

ప్రవహించసాగింది. ఈ విధంగా చింతాగ్నిలో వాడి మనస్సులో సంసారం అంటే అసహ్యం ఆవేదన విరక్తి కలిగింది. వైరాగ్యం ఉద్భవించింది.

ఉద్ధవా! ఆ లోభియైన బ్రాహ్మణుడు మనసులో ఇలా బాధపడసాగాడు- అయ్యో! ఇంతకాలం వ్యర్థంగా గడిపానే. ధన సంపాదనకు పడిన శ్రమలో నూరవవంతు ధర్మంకోసం పాటు పడలేక పోయానే. ఉన్నధనంతో భోగాలన్నా భోగించలేదే. దానధర్మం సుంతకూడా చేయలేదే. లోభికి ధనం వలన అణువంత సుఖం లేదని తెలిసింది. ఈ లోకంలో జనం ధన సంపాదనకు రక్షణకు తపించి పోతుంటారు. చచ్చిన తర్వాత నరకంలోపడి తపిస్తుంటారు. కుష్ఠు శరీరానికి పట్టిందంటే క్రమంగా అది శరీరాన్ని వికృతం చేస్తుంది. ఆ తీరుగా లోభం కొంచంగా జీవనంలో ప్రవేశించిందంటే మహాయశస్సు మహా సుగుణాలు మంచి తనం ఎన్నియున్నా నాశనం చేస్తుంది. మహారోగినిచేస్తుంది. పావనం కావలసిన జీవనం గహనం మహావనం అవుతుంది.

ధన సంపాదనకు - ధనం పెంచటానికి - ధనం రక్షంచటానికి ఖర్చు చేయటానికి ఎంత బాధపడతాడో, ఎన్ని ఇక్కట్లు ఎదుర్కొంటాడో అది హరించిపోతుంటే ఎంత దుఃఖిస్తాడో ఊహించలేము. సదా కష్టపడటం, భయపడటం, చింతించటం అతనికి అలవాటుపడి సుఖం అనేది ఎరగనే ఎరగకుండాపోతుంది. ఉద్ధవా! దొంగతనం, హింస, అబద్ధం, ధంభం, కామం, క్రోధం, గర్వం, అహంకారం, కపటం, వైరం, అవిశ్వాసం, స్పర్ధ, లంపటం, జూదం, త్రాగుడు, ఈ పదిహేను మనిషి ధనంకోసం అలవాటు చేసుకొంటాడు. కనుక శ్రేయోభిలాషి అయినవాడు ఈ దుర్గుణాలకు దూరంగా ఉండాలి.

ఉద్ధవా! అన్నాదమ్ములు, ఆలూమగలు, తల్లిదండ్రులు, అన్నాచెల్లెలు, బావా మరదలు కూడా ధనం కారణంగా విరోధులవుతారు. స్వల్ప ధనంకోసం ఒకరిపై ఒకరు స్పర్ధలు పెంచుకొంటారు. వ్యధలు పడతారు. కోపపడతారు. తిట్టుకొంటారు. కొట్టు కొంటారు. కోర్టుల కెక్కుతారు. ధనం ముందు బంధుత్వాలు స్నేహాలు సత్సంబంధాలు ఎగిరిపోతాయి. ప్రాణాలు తీసుకోటానికి కూడా వెనుకాడరు. స్పర్ధలు కార్పణ్యాలు పెరిగి సర్వనాశనం అవుతారు. ధనదాహం అంత చెడ్డది.

దేవతలు ఆపేక్షించే మనుష్య జన్మనెత్తి అందులో ఉత్తమ బ్రహ్మణుడుగా పుట్టి ఇట్టి మహత్తరమైన సదవకాశం విస్మరించి తన జన్మ సార్థక్యం చేసుకొనే పరమార్థం ఆలోచించక అమంగళ మార్గంలో పడిపోతున్నాడంటే ఏమి చెప్పాలి. ఈ మనుష్య శరీరం మోక్ష సాధనకు అత్యుత్తమ పరికరం. వైకుంఠ ద్వారంలోనికి వెళ్ళుటకు లభించిన గొప్ప సర్టిఫికెట్టు. అది యోగ్యతా పత్రం. ఇట్టిదానిని తుచ్ఛమైన ధనంకోసం వ్యయంచేసే

మూర్ఖుడెవడన్నా ఉంటాడా! ఎంత బుద్ధి హీనుడో కదా! జన్మవిలువ తెలిసిన వాడెవడూ అట్టి పనిచేయడు..

ధనం ప్రాప్తించినపుడు దానిని దేవతలకు ఋషులకు పితృదేవతలకు అతిథులకు బంధువులకు భార్యా పుత్రులకు తగువిధంగా పంచి సంతృప్తి పడాలి. అట్లు చేయనివాడు వాడు సుఖపడడు. సంబంధీకులను తృప్తి పరచనూ లేడు. కేవలం యక్ష రాక్షసుల వలె ధనాన్ని కాపలా కాస్తుంటాడు. పిసినారియై అధోగతి పొందుతాడు.

"నేను కర్తవ్యచ్యుతుడనైనాను. నేను ఆయువును బలాన్ని దనాన్ని పురుష ప్రయత్నాన్ని వ్యర్థం చేసుకొన్నాను. వివేకవంతులు ఈ జన్మలో సాధనలు సలిపి మోక్షం జేరుకొంటారు. నేను సాదనలను 'వ్యర్థం చేశాను. ధన సంపాదనకు చేసిన పరిశ్రమలో కొంచమైనా మోక్ష సంపాదనకు చేస్తే ఎంత బాగుండేది. ఈ వృద్ధాప్యంలో ధర్మసాధనలు ఏమి ఏచేయగలను. పెద్దపెద్ద పండితులు ధన సంపాదనా కాంక్షలోపడి వ్యర్థమైన తృష్ణకు లొంగిపోయి నిరంతరం ఎందుకు దుఃఖం పొందుతున్నారో అర్థం కాదు. ఏది ఏమైన సంసారమాయా చక్రం వ్యామోహంలో పడవేసి ఎట్టి వాణ్ణైనా బోల్తా కొట్టిస్తుంది కదా!

మనుష్య శరీరం కాలం యొక్క భయంకర వక్త్రంలో పడి నలిగి పోవలసిందే కదా! ఈ శరీరానికి ధనం వలన గానీ, ధనం ఇచ్చే దేవతల వలనగానీ, మానవుల వలన గానీ, భోగాల వలనగానీ, కోరికలు తీర్చే వారి వలన గానీ, ఏమీ ప్రయోజనం లేదు. ఈ శరీరం మరల మరల జన్మ మృత్యు చక్రాల్లోపడి నలుగుతుండ వలసిందే. సకామ కార్య కలాపాల వలన ఏమీ ప్రయోజనం, లేదు. భగవానుడు సర్వ దేవమయుడు కరుణామయుడు శ్రీహరి నిస్సందేహంగా నాపై ప్రసన్న దృష్టి మరల్చాడు. కనకనే నన్ను ఈ వైరాగ్య స్థితికి జేర్చాడు. మాయా మోహ జగద్భ్రాంతి తొలగించాడు. యథార్థంగా వైరాగ్యమే ఈ భయంకర సంసార సాగరాన్ని దాటించే నౌక.

నా ఈ శేష జీవితం ఆత్మజ్ఞాన లాభంలో సంతుష్టుడనై పరమార్ధ మార్గంలో నడుస్తాను. ఇప్పటి నుంచి ఈ శరీరాన్ని తపో దీక్షలో శుష్కింప జేస్తాను. త్రిలోకైక నాథుడు, దేవగణాలు ఋషిగణాలు నా యీ సంకల్పాన్ని సఫలం చేయుదురు గాక! ఇక దుఃఖమేల! ఖట్వాంగ మహారాజు రెండు క్షణాలు కాదు రెండు ఘడియల లోనే భగవద్ధామం చేరుకొన్నాడు కదా! ఆయనే నాకు మార్గ దర్శకం. ఈ క్షణం నుంచి మునివృత్తి బూనుతాను.

భగవానుడు ఆ బ్రాహ్మణుని గూర్చి చెప్పసాగాడు - ఉద్ధవా! ఆ ఉజ్జయనీ బ్రాహ్మణుడు తన మదిలో 'నేను - నాది' అనే మమతా బంధనం త్రెంచుకొన నిశ్చయించుకొన్నాడు. ఆ వెంటనే అతని మనస్సు శాంతి పొందింది. ఆ తర్వాత సంన్యాసం

స్వీకరించాడు. అతని మనస్సులో ఒక స్థానంపై గాని ఒక వ్యక్తిపైగానీ అభిమానం ఆసక్తి లేకుండా పోయింది. అతడు తన మనస్సును ఇంద్రియాలను ప్రాణవాయువులను వశం చేసుకొన్నాడు. స్వేచ్ఛాప్రాణి అయినాడు. స్వచ్ఛందంగా తిరగసాగాడు. భిక్షకు నగరంలోకిగాని గ్రామంలోకిగాని వెళ్ళి వస్తుంటాడు. ఏమీ ఎరగనట్లు పట్టనట్లు మమకారం లేకుండా సంచరించ సాగాడు. బంధాలు త్రెంచుకొన్న పక్షివలె విహరించసాగాడు.

ఉద్ధవా! ఆ సన్యాసి పెద్దవాడైనాడు. శరీరంలో పటుత్వం తగ్గిపోసాగింది. పిల్లలు ఆట పట్టించసాగారు. కొందరు దుండగులు బాధించసాగారు. అవధూతను చూడగానే ఏడిపించాలని పిల్లలు విరగబడుతున్నారు. సన్యాసి ముసలి తాత చేతిలోని కర్ర లాగేసే వాడొకడు. కమండలం లాక్కొనే వాడొకడు జింకాసనం దర్భాసనం పీకి రుద్రాక్షలు చంకలోని సంచీని త్రెంచటం చించటం చేసి సన్యాసిని తెగ బాధపెట్ట సాగారు పోకిరీ పిల్లలు.

మరో పోకిరీ లంగోటా లాగి గుడ్డలు లేకుండా చేసి పరిహాసం చేసేవాడు. మరికొందరు పోయిన వస్తువులు ఇస్తునట్లు నటించి ఆశపడి ముసలివాడు దగ్గరకు వెళ్ళగానే అవి దూరంగా విసిరేసే వాళ్ళు. అవధూత భిక్షతెచ్చుకొని నది ఒడ్డున భోజనానికి కూర్చుంటే దుండగులు దుర్మార్గులైన పిల్లలు అచటికి వచ్చి మూత్ర విసర్జన చేసేవారు. యొకడు ఉమ్మేసి వెళ్ళేవాడు. మౌనంగా ఉండే సన్యాసిని పలకరించి మాట్లాడకపోతే ఏడిపించే వారు. మట్టి గడ్డలు విసరేవారు. కర్రలు పెట్టి పొడిచే వారు. అనేక రకాలుగా విసిగించేవారు. ఆ అవధూతను కొందరు 'దొంగ' అని గద్దించేవారు. కొందరు 'ఇతన్ని కట్టి వేయండిరా!' అని త్రాళ్ళతో చెట్టుకు కట్టివేసేవారు.

మరొకడు సన్యాసిని అనుమానించి 'చూడు చూడూ! ఏవో మంత్రాలు చదువుతున్నట్లుగా నటిస్తున్నాడు. దొంగవేషాలు వేస్తున్నాడు. మహా లోభంతో ఆలు బిడ్డలను ఇంట్లో నుంచి తరిమివేసి ధనంపోగానే చిప్పపట్టి అడుక్కుంటున్నాడు. అడుక్కుతింటం ఇపుడు తేలికైన వృత్తి అయిందరా! వీడికి. ఎన్ని వేషాలు వేశాడు! బ్రతక నేర్చిన బిచ్చగాడు. ఏమి ధైర్యం! గుండు లాగున్నాడు. బండలా ఉన్నాడు. ఉలక్కా పలక్కా నోరుమూసుకొనే తన పని పూర్తి చేసుకొంటాడు. ఇదంతా కొంగ జపం. నటన. మొండి ఘటం, అని నానా దుర్భాషలు పలికేవారు. పరిహాసం చేస్తూ పరాభవిస్తూ చెడు అపాన వాయువులు విడుస్తూ పంజరాలలో పక్షులను బంధించినట్లు ఇళ్ళలో బంధిస్తూ నానా బాధలు పెట్టేవారు.

అవధూత అవి అన్నీ సహించేవాడు. అప్పుడప్పుడు జ్వరాదులతో బాధపడేవాడు.

దైహిక బాధలు భరించేవాడు. దైవికంగా ఇక్కట్లు ఎదుర్కొనే వాడు. కానీ ఎవరినీ నిందించేవాడు కాదు. 'ఇవి నా పూర్వ జన్మ కర్మ ఫలాలు అనుభవించాలి.' అనుకొనేవాడు.

ఎంతమంది ఆయన్ని అవమానించినా, పరిహసించినా, తన ధర్మ పథం నుండి కొంచమైనా, జారిపోయేవాడు కాదు. పరీక్షలకు ఆగి దృఢ పడేవాడు. సాత్త్వికుడై ధైర్యం వహించేవాడు. నిశ్చలంగా ధర్మం నిర్వహించేవాడు.

ఆ బ్రాహ్మణోత్తముడు పశ్చాత్తాపంతో ఇలా మదిలో సమాధానం చెప్పుకోసాగాడు- నా సుఖదుఃఖాలకు కారణం ఈ మనుష్యులు కాదు. దేవతలూ కాదు. ఈ శరీరమూ కాదు. గ్రహాలూకావు. కేవలం నా కర్మయే. ఈ కాలమే. నేను చేసుకొన్న కర్మల ఫలాలే శ్రుతులు స్మృతులు మహాత్ములు మహానుభావులు చెప్పినట్లు మనస్సే అన్నిటికి కారణం. మనస్సే ఈ అఖిల ప్రపంచాన్ని జీవరాసుల్ని ఆడిస్తోంది.

నిజంగా ఈ మనస్సు ఎంత బలమైనది! ఎంత విచిత్రమైనది! వివిధ విషయాలను ఆలోచిస్తుంది. కారణాలను కనుగొంటుంది. గుణాలను గోప్యంగా ప్రసారం చేస్తుంది. వివిధ వృత్తులను పసిగట్టుతుంది. లేని వాటిని సృష్టిస్తుంది. వృత్తులకు అనుకూలంగా సాత్త్విక రాజసిక తామసిక కర్మలు చేయిస్తుంది. కర్మలను అనుసరించి జీవులను ఆడిస్తుంది. మనమా! నీ వెంతటి దానివే! కనపడకుండా ఎంత పని చేస్తుంటావే!

ఆహా! మనస్సు చేయని పని లేదు కదా! మనస్సుతో యున్ననూ ఆత్మ నిష్క్రియ కదా! ఎంత విచిత్రం! ఆత్మ జ్ఞాన ప్రధానమైనది. ఆత్మ సనాతన సత్య సఖుడు నాకు. అలుప్త జ్ఞానంతో సర్వం తెలుసుకో కలుగుతున్నాను. అయితే మనస్సు ద్వారానే సర్వం చూడ గలుగుతున్నాను. ఆత్మ అభివ్యక్తం అవుతోంది. ఆత్మ మనస్సును గ్రహించి దాని ద్వారా విషయాలు అనుభవిస్తోంది. వెంటనే కర్మలపై ఆసక్తి చూపి ఆ కర్మలలో బందీ అయిపోతోంది.

దానం - ధర్మ పాలనం - నియమం - యమం - వేదాధ్యయనం - సత్కర్మ - బ్రహ్మ చర్యం శ్రేష్ఠవ్రతాలు. ఈ వ్రతాల ఫలాలు మనస్సు యొక్క ఏకాగ్రత - భగవదాసక్తి. మనస్సు యొక్క ఏకాగ్రత- సమాహితమే యోగం. మనస్సు సమాహితమై శాంతంగా ఉంటే దానాది సమస్త సత్కర్మల ఫలం సంప్రాప్తించినట్లే. ఇక సత్కర్మల ఫలం ఆశించ వలసిన అవసరం లేదు. మనస్సు చంచలంగా ఉంటే దానాది సత్కర్మలు వేలాదిగా చేసినా ఫలితం శూన్యం. ఇంద్రియాలన్నీ మనస్సు వశంలో ఉన్నాయి. మనస్సు ఇంద్రియాల వశంలో లేదు. మనస్సు మహా బలం గలది. బలమైనదే కాదు మహా భయంకరమైనది. మనస్సును వశం చేసుకొన్న వాడు దేవుడే కాదు దేవ దేవుడు, మహాదేవుడు. జితేంద్రియుడు అంటే దేవ విజేత.

మనస్సు మహా శత్రువు. దీని ఆక్రమణం అసహ్యం. బాహ్యాభ్యంతరాలను కూడా ఆక్రమిస్తుంది. హృదయ మర్మస్థానాన్ని వేధిస్తుంది, బాధిస్తుంది. దీనిని జయించటం కష్టమే. అయినను మానవుడు ప్రయత్నించి పట్టుపట్టి ఎట్లైనా సరే దీనిని వశం చేసుకొని విజయం పొందాలి. మోదటి శత్రువు మనస్సు కనుక మొదట మనస్సును జయించాలి. లోకంలో మూర్ఖులు దీనిని జయించటంమాని ఇతరులతో తగవులాడుతుంటారు. ఈ లౌకిక జీవులను శత్రువులనీ మిత్రులనీ భ్రమ చెందుతుంటారు.

సాధారణంగా మనుష్య బుద్ధి మందగిస్తోంది. ఈ అజ్ఞులు మనస్సు కల్పించిన ఈ శరీరాన్ని 'నేను - నాది' అని విశ్వసిస్తున్నారు. ఈ కలహంలోపడి' ఇతడు నా వాడు - వాడు పరాయివాడు' అని మమకారం వైరం పెంచుకొంటున్నారు. చివరకు ఈ అజ్ఞానాంధకారంలో పడి కొట్టుమిట్టాడు తుంటారు పాపం!

మనుష్యులే సుఖ దుఃఖాలకు హేతు భూతులను కొంటే వీరి వలన ఆత్మకు లాభం ఏమిటి? సుఖదుఃఖాలు కలుగ జేసేది ఈ మృణ్మయ శరీరమే. అనుభవించేది ఈ శరీరమే. భోజనం చేసేటపుడు పళ్ళలోపడి నాలుక నలిగిందనుకో ! బాధ కలిగింది. మనిషి ఎవరిమీద కోపగిస్తాడు? దేవతలే సుఖ దుఃఖాలకు కారణం అనుకొంటే ఈదుఃఖం వలన ఆత్మకు కలిగే హాని ఏమిటి? దుఃఖానికి కారణం దేవతలైతే ఇంద్రియాభిమానులైన దేవతల రూపంలో వారే భోక్తలవుతారు. అధిష్ఠాన దేవతలందరి శరీరంలోనూ ఒకటిగానే ఉంటారు. ఒక శరీరంలో ఉండే దేవతలు వారే ఇతర శరీరాలలోనూ ఉంటారు. అపుడు ఒకే శరీరంలోని ఒక అంగం వలన మరో అంగానికి దెబ్బ తగిలితే ఎవరిని ఏ అంగాన్ని కోపగిస్తారు?

ఆత్మయే సుఖదుఃఖాలకు కారణం అనుకొంటే ఆత్మ తనలో తానాయె. మరొక రెవరో కాదుకదా! ఆత్మకు భిన్నంగా మరొకటి లేదు కదా! మరొకటి ఉన్నది అనుకొంటే అది మిథ్య. కనుక సుఖంలేదు, దుఃఖంలేదు, క్రోధం ఎలా! ఎవరిమీద? సుఖ దుఃఖాలకు గ్రహాలు కారణం అనుకొందామంటే వాటివలన జన్మ అనేది లేనట్టి ఆత్మకు హాని ఏముంది? వాటి ప్రభావం చావుపుట్టకల శరీరం మీదనే పడుతుంది. గ్రహ పీడ వాటిని గ్రహించే శరీరానికే కలుగుతుంది. ఆత్మ గ్రహాలకూ శరీరానికీ సర్వథా భిన్నమైనదే. ఇక ఎవరిమీద ఆగ్రహిస్తావు?

కర్మలే ఈ సుఖ దుఃఖాలకుకారణం అనుకొందాం అంటే వీటి వలన ఆత్మకు ప్రయోజనం ఏముంది? అవి ఒక పదార్థం యొక్క జడం చేతనం రెండూ అవుతుంటాయి. వస్తువు మార్పు కలిగేది అయితేనే హితాహితం తెలిసింది అవుతుంది. అపుడే కర్మ

అవుతుంది. మార్పు స్వభావం అనుకొంటే అది జడ పదార్థమే కావాలి హితాహితం ఎరుగున్నదయితే చేతనం కావాలి. కానీ దేహం అచేతనం. దేహంలో పక్షి రూపంగా ఉన్న ఆత్మ నిర్వికారం. సాక్షీభూతం ఈ విధంగా కర్మకు ఏమీ సంబంధం లేదు. ఆధారం లేదు. ఇక కోపమేల?

ఒకపోతే కాలమే సుఖ దుఃఖాలకు కారణం అనుకొందామంటే ఆత్మమీద కాల ప్రభావం ఏముంటుంది? కాలం ఆత్మ స్వరూపమేకదా! నిప్పు నిప్పును కాల్చదు. మంచు మంచును కరిగించదు. అలానే ఆత్మ స్వరూపమైన కాలానికి తనకు తానుగా సుఖాలు దుఃఖాలు కలిగించదు. ఇక దేనిపై క్రోధం ! ఆత్మ శీతోష్ణాలకు సుఖ దుఃఖాలకు అతీతమైనది. ఆత్మ ప్రకృతి స్వరూపాలైన ధర్మ, కార్యలేశంతో సంబంధంకానీ గంధాదులతో గానీ సంబంధ రహితమైనది. ఎక్కడ ఎట్టి ద్వంద్వాలను స్పర్శించదు. అది దేనికీ భయపడదు. ప్రాచీన మహర్షులు పరమాత్మ యందు నిష్ఠ గలవారై ఆత్మయొక్క ఆశ్రయం గ్రహించారు. నేను కూడా వారివలె ఆత్మను ఆశ్రయిస్తాను. ముక్తిదాత ప్రేమదాత అయిన భగవంతుని సేవించి ఈ అజ్ఞాన అంధకార మహా సాగరాన్ని సులువుగా దాటతాను.

శ్రీ కృష్ణ భగవానుడు ఇలా వివరిస్తున్నాడు -

ఉద్ధవా! ఆ బ్రాహ్మణోత్తమునికి ధనంతో పాటు సర్వవిధ క్లేశాలు హరించాయి. అతడు విరక్తుడై ఈశ్వర సేవానురక్తుడైనాడు. సంన్యాసం స్వీకరించి స్వచ్ఛంద జీవనుడై జగత్తులో సర్వత్ర విహరిస్తున్నాడు. దుష్టులు భాధించినా అతడు తన ధర్మ పథం నుండి నిశ్చలంగా ప్రకాశించ సాగాడు - దృఢమనస్కుడై ఈశ్వరార్చాన సేయసాగాడు. మౌనియై అవధూతయై మదిలో గానం ఈ విధంగా మననం చేసుకోసాగాడు.

ఈ ప్రపంచంలో మానవులకు పరులెవరూ సుఖ దుఃఖాలు కల్పించేవారు లేరు. అలా భావించటం భ్రమమాత్రమే. ఈ విశ్వంలోపల ఉన్నవారంతా మన మిత్రులే. శత్రువులున్నారు అనుకోనటం అజ్ఞాన కల్పిత దృక్కోణం మాత్రమే. కనుక ఉద్ధవా! ఇది అసలు రహస్యం. మానవులు తమ తమ మనో వృత్తులను నాకు అర్పణం చేయాలి. తమ సర్వ శక్తిని వినియోగించి మనస్సును స్వాధీనం చేసుకోవాలి. మరియు నాలోనే నాతోనే నిత్యయుక్తులై స్థిరంగా ఉండాలి ఇది యోగ సాధనా సార సంగ్రహం. ఆ భిక్షుక సన్యాసి గీత సారమిదే. అది మూర్తివంతమైన బ్రహ్మ జ్ఞాన నిష్ఠ. ఏకాగ్ర చిత్తంతో దీనిని విన్నవారు, వినిపించినవారు, ధారాణచేసినవారు సుఖదుఃఖ ద్వంద్వాలకు ఎన్నటికీ లోనుగారు. ద్వంద్వ ప్రపంచంలో అతడు సింహం వలె గర్జిస్తూ విహరిస్తాడు.

సాంఖ్య యోగం

శ్రీ కృష్ణ భగవానుడు సాంఖ్యయోగం వివరించసాగాడు - ఉద్ధవా! సాంఖ్యం విను. ప్రాచీన కాలంలో మహర్షులు దీనిని ఇలా నిశ్చయం చేశారు. ఈ శాస్త్ర జ్ఞానం బాగా కలిగిందంటే భేద దృష్టికి మూలమైన సుఖదుఃఖ భ్రమ తొలిగిపోతుంది. పూర్వం ప్రళయకాలంలోనూ, ఆది సత్యయుగంలోనూ, మనుష్యుడు వివేకశాలి అయిన వరకూ గల అన్ని దశలలోనూ, సంపూర్ణ దృశ్య ద్రష్ట - జీవ జగత్తులలోనూ, వికల్ప శూన్యమైన భేద భావరహితమైన బ్రహ్మమే అయి ఉంటున్నాడు.

" బ్రహ్మంలో వికల్పం లేదు. ఆయన కేవలం అద్వితీయం. సత్యం. మనస్సు వాక్కుల్లో వలె ఆయనలో గతిలేదు" అనే వాక్యంలో సందేహం అవంతయును లేదు. ఆ బ్రహ్మమే మాయ. మాయలో కనిపించు జీవరూపంలో దృశ్యం ద్రష్ట అని రెండు భాగాలుగా కనిపిస్తుంటాయి. ఈ రెండింటిలో ఒక దానిని ప్రకృతి అంటారు. దీనిలోనే జగత్తులోని కార్యకారణ రూపాలుంటాయి. రెండవ వస్తువు జ్ఞాన స్వరూపుడైన పురుషుడు అని పిలుస్తుంటారు.

ఉద్ధవా! నేనే జీవుల శుభా శుభ కర్మలను బట్టి ప్రకృతిని చీకాకు పెడుతుంటాను. అపుడు ప్రకృతి నుండి సత్త్వ రజస్తమగుణాలు ఆవిర్భవించాయి. ఈ త్రిగుణాల నుండి క్రియాశక్తి ప్రధాన సూత్రం. జ్ఞాన శక్తి ప్రధాన మహత్తత్వం ప్రకటింపబడతాయి. ఈ రెండు శక్తులు కలిసే ఉంటాయి. మహత్తత్వంలో వికారాలు జనిస్తే అహంకారం వ్యక్తమవుతుంది. ఆ అహంకారమే జీవులను మోహంలో ముంచేస్తుంది.

అది త్రిగుణాత్మకం - సాత్త్వికం, రాజసం, తామసం, అహంకారం పంచతన్మాత్రలు ఇంద్రియాలు మనస్సుకు కారణాలు. మనస్సు ఉభయాత్మకం. ఇది జడమూ - చేతనమూ. తామస అహంకారం వలన పంచతన్మాత్రలు - వీని నుండి పంచభూతాలు ఉద్భవిస్తాయి. రాజస అహంకారం వలన ఇంద్రియాలు ఆవిర్భవిస్తాయి. సాత్త్విక అహంకారం వలన ఇంద్రియాధిష్ఠాన దేవతలు పదకొండు మంది ప్రత్యక్షమవుతారు. జ్ఞానేంద్రియాలు 5 కర్మేంద్రియాలు 5 మనస్సు 1 =11 ఇంద్రియాలకు పదకొండు అధిష్ఠాన దేవతలు.

ఉద్ధవా! ఈ పదార్థాలన్నీ నా ప్రేరణచేతనే ఒక్కటై కలిసి మెలిసి ఉంటాయి. ఇవి బ్రహ్మాండాన్ని సృజించాయి. దీనిలోని అండం నా నివాస స్థానం. ఈ అండం జలం ఉన్నపుడు నేనే నారాయణుడనై జలంలో విరాజిల్ల సాగాను. నా నాభిస్థానం నుండి విశ్వకమలం జన్మించింది. ఆ కమలం నుండి బ్రహ్మ పుట్టుకొని వచ్చాడు.

ఉద్ధవా ! బ్రహ్మ విశ్వం సృష్టించటానికి మహా తపస్సు చేశాడు. అపుడు నా అనుగ్రహం కలిగి నా ప్రసాదంగా శక్తి వచ్చి రజోగుణం ద్వారా భూలోకం, భువర్లోకం - స్వర్లోకం అంటే భూమి అంతరిక్షం స్వర్గం సృజించాడు. ఆ లోకపాలకులను అతడు సృష్టించాడు. దేవతల నివాసానికి స్వర్లోకం, భూత ప్రేతాదులకు భువర్లోకం, మనుష్యాదులకు భూలోకం ఏర్పాటు చేశాడు. ఈ మూడు లోకాలపైన మహర్లోకం తపోలోకం సిద్ధులకు నిర్ణయం చేశాడు.

అసురులకు నాగులకు భూలోకం క్రింద అతల వితల సుతలాది ఏడు పాతాళలోకాలు సృజించాడు. ఆ మూడు లోకవాసులకు త్రిగుణాత్మక కర్మలననుసరించి త్రి విధగతులు ఏర్పాటు చేయబడినాయి.

ఉద్ధవా! యోగం తపం సన్యాసం ద్వారా మహర్లోకం జనలోకం తపోలోకం సత్యలోకం ప్రాప్తిస్తాయి. భక్తి యోగం ద్వారా నా పరమపద ధామం ప్రాప్తిస్తుంది. ఇదంతా కర్మ సంస్కారయుక్తం. నేనే కాలరూపుణ్ణై కర్మానుసారంగా ఫలం ప్రసాదిస్తాను. జీవులు ఈ గుణ ప్రవాహంలోపడి మునిగిపోతారు.. మరోసారి పైకి తేలుతారు. అప్పుడపుడు అధోగతి పాలవుతారు. లేక ఉచ్ఛగతి పొందుతారు. జగత్తులో గల అణువులూ పర్వతాలూ సూక్ష్మాలు స్థూలాలూ అత్యల్పాలూ బృహద్రూపాలు అన్నీ ప్రకృతి పరమేశ్వరుల సంయోగం వలన సిద్ధిస్తున్నాయి.

ఆదిలోనూ అంత్యంలోనూ మధ్యలోనూ ఉన్నది సత్యం. సత్యం నిర్వికారం, వికారాలు కేవలం వ్యవహారికాలు. కల్పనా మాత్రలు. కంకణాలు ఆ భూషణాలు బంగారం యొక్క వికారాలు. కుండలు బానలు మట్టి వికారాలు. ఈ వస్తువుల పూర్వ రూపం మట్టి బంగారం. తరువాత పరిణమించేవి మట్టి బంగారాలే. కనుక మధ్యలో వచ్చినవే కంకణాలు భూషణాలు పాత్రలు. ఆ విధంగానే పూర్వవర్తి కారణం అదే మహత్తత్వం. ఈ కారణాన్ని ఉపాదానం చేసుకొని అహంకార కార్యం అంటే సృష్టి జరుగుతుంది. అదే కారణ కార్యాల కంటె ఉత్కృష్టమైన సత్యం. కార్యంయొక్క ఆది అంత్యములలో శాతంగా ప్రకాశిస్తూ స్థిరంగా ఉండేదే సత్యం.

ఈ ప్రపంచ ఉపాదాన కారణం ప్రకృతి. పరమాత్మ అధిష్ఠాన మూర్తి. దీనిని ప్రకటించేది కాలం. ఈ కాలమే బ్రహ్మం. నేను శుద్ధ పరబ్రహ్మ మూర్తిని. ఎంత వరకు పరమాత్మ యొక్క ఈశ్వర శక్తి తనపని చేస్తూంటుందో ఎంత వరకు ఆ స్వామి పాలనం ప్రకృతియై నడుస్తుంటుందో అంతవరకు జీవుల కర్మలు అనుభవించుటకై కారణ కార్య రూపాలుగా తండ్రీ కొడుకులుగా సృష్టిచక్రం పరిభ్రమిస్తుంటుంది.

ఉద్ధవా! ఈ విరాత్పురుషుడే వివిధ లోకాలు సృష్టించువాడు, పాలించువాడు, హరించువాడు అన్నిటికి భూమిక ఆ స్వామి కాల స్వరూపుణ్ణై నేనే సర్వత్ర వ్యాపించి యుంటాను. ప్రళయాన్ని నేనే సంకల్పిస్తాను. అపుడు భువనాలతో పాటు అన్నీ వినాశయోగ్యమై సృష్టి లయమవుతుంది.

ఉద్ధవా! ఇది లీనమయ్యే విధానం చెప్తా విను - ప్రాణుల శరీరాలు అన్నంలో, అన్నం విత్తనాలలో, విత్తనాలు భూమిలో, భూమి గంధ తన్మాత్రలో లీనమవుతుంటుంది. గంధం జలంలో, జలం తన గుణమైన రసంలో, రసం తేజస్సులో, తేజం రూపంలో లీనమవుతుంటుంది. రూపం వాయువులో, వాయువు స్పర్శలో, స్పర్శ ఆకాశంలో, ఆకాశం శబ్దతన్మాత్రలో లీనమవుతుంది. ఇంద్రియాలు తమ తమ కారణ దేవతలలో, చివరకు రజస్సు అహంకారంలో లీనమవుతుంటాయి. సౌమ్యా! రాజస అహంకారం తన నియంతయైన సాత్త్విక మనోరూపంలోనూ, శబ్ద తన్మాత్ర పంచభూత కారణంగా తామస అహంకారంలోను జగత్తును మోహంపజేసే త్రివిధ అహంకారాలు మహత్తత్వంలోనూ లీనమవుతుంది.

జ్ఞాన శక్తి క్రియాశక్తి గుణాలలో లీనమవుతాయి. గుణాలు అవ్యక్త ప్రకృతిలోనూ, ప్రకృతి అవినాశియైన కాలంలోనూ లీనమవుతుంది. కాలం మాయామయమైన జీవంలోనూ జీవం జన్మరహితమైన నా ఆత్మలో లీనమవుతుంది. ఆత్మ మాత్రం దేనిలోనూ లీనంకాదు. అది ఉపాధి రహిత నా స్వరూపంలో స్థిరంగా స్థిమితంగా ఉంటుంది. అది జగత్సృష్టికి లయానికి అధిష్ఠాన దేవత. అది పరమావధి.

ఉద్ధవా! వివేక దృష్టితో ప్రపంచ సృష్టిని పరిశీలించు వాడు ఈ ప్రపంచ భ్రమలకు లొంగిపోడు. అతని చిత్తం ఒకవేళ కించిత్ స్ఫూర్తి కలిగిన అది మరుక్షణంలో వివేకశీలమై జ్ఞాన పథంలోకి వచ్చి జేరుతుంది. అధిక సమయం భ్రమలో ఉండటం అసంభవం. సూర్యోదయం అయితే అంధకారం ఎలా ఉంటుంది? ఉద్ధవా నేను కార్యకారణ సాక్షీభూతుణ్ణి. నేను నీకు సృష్టినుండి ప్రళయం, ప్రళయం నుండి సృష్టి వరకు గల సాంఖ్య విధానం తెలియజెప్పాను. ఇందులో సందేహంలేదు. శంకా గ్రంధి విడిపోయింది. పురుషుడు స్వస్వరూపంలో సుస్థితుడై విరాజిల్లుతున్నాడు కదా! శుభం.

త్రిగుణాలు త్రివృత్తులు

శ్రీ కృష్ణ భగవానుడు ఇలా వివరించసాగాడు - ఉద్ధవా! ఉత్తమ పురుషా! ప్రతి వానిలోనూ వేర్వేరు గుణాలు ప్రకాశిస్తుంటాయి. ఆ గుణాల వలన పురుషుల స్వభావాలలో కూడా భేదాలుంటాయి. ఏ గుణం వలన స్వభావం ఎలా ఉంటుందో చెప్తాను. శ్రద్ధగా ఆలకించు.

సత్త్వగుణ వృత్తులు -

1. శమం అంటే మనస్సంయమం. 2. దమం ఇంద్రియ నిగ్రహం. 3. తితిక్ష సహిష్ణుత. 4. వివేకం. 5. తపం 6. సత్యం 7. సత్త్వం 8. దయ 9. స్మృతి 10. సంతోషం 11. త్యాగం 12. విషయ వైముఖ్యం 13. శ్రద్ధ 14 లజ్జ పాపం చేయుటకు సంకోచం 15. ఆత్మరతి 16. దానం 17. వినయం 18. సరళ స్వభావం మొదలైనవి.

రజోగుణ వృత్తులు-

1. కోరిక 2. ప్రయత్నం 3. గర్వం 4. తృష్ణ అసంతోషం 5. కాఠిన్యం 6. అధికులను యాచించుట 7. భేదబుద్ధి 8. విషయభోగాలు 9. రణోత్సాహం 10. యశోకాంక్ష 11. హాస్యం 12. పరాక్రమం 13 కఠిన పరిశ్రమ మొదలైనవి.

తమోగుణ వృత్తులు -

1. క్రోధం అసహిష్ణుత 2. లోభం 3. అనృత భాషణం 4. హింస 5. యాచన 6. పాషండవాదం 7. శ్రమ 8. కలహం 9. శోకం. 10. మోహం 11. విషాదం 12. దైన్యం 13. నిద్ర 14. ఆశ 15. భయం 16. సోమరితనం మొదలైనవి.

ఈ విధంగా క్రమంగా సత్వగుణ రజోగుణ తమోగుణాలు వృత్తులు వేరువేరుగా చెప్పాను కదా! గుణాల కలయిక వలన కలిగే వృత్తులను వివరిస్తా. విను. ఉద్ధవా ! 'నేనున్నాను. ఇది నాది' అనే ఇటువంటి బుద్ధిలో మూడు గుణాల మిశ్రమణం ఉంది. మనస్సు శబ్దాది విషయాలు ఇంద్రియాలు ప్రాణాలు కారణంగా వెనుక చెప్పిన వృత్తులు ఉదయిస్తాయి. అవి అన్నీ సాత్త్విక రాజసిక తామసిక యుక్తాలు.

మనుష్యుడు ధర్మ అర్థ కామ గుణాలందు మనస్సును లగ్నం చేస్తే అతనికి సత్త్వ గుణం వలన శ్రద్ధ, రజోగుణం వలన రతి, తమోగుణం వలన ధనం పొందుతాడు. ఇది కూడా గుణాల మిశ్రణమే. మానవుడు సకామ కర్మలు చేయునపుడు - గృహస్థాశ్రమంలోనూ స్వధర్మాచణంలోనూ అధిక ప్రీతి చూపునపుడు మూడు గుణాలు కలిసేయుంటాయి.

ఉద్ధవా! మానసిక శాంతి జితేంద్రియత్వం మొదలైన గుణాలు చూచి సత్త్వ పురుషునిగానూ, కామనాది గుణాలను బట్టి రజోగుణ పురుషునిగానూ, క్రోధం హింసా ప్రవృత్తులను చూచి తమోగుణ పురుషునిగానూ గుర్తించవచ్చు. పురుషుడు కానీ, స్త్రీకానీ నిష్కామ భావంతో నిత్య నైమిత్తిక కార్యాల ద్వారా నా పదారాధన చేయువారు సత్త్వగుణులు కాగలరు అని తెలుసుకొనుము.

సకామ భావంతో తన నిత్యకృత్యాల ద్వారా నన్ను ఆరోధించేవారు రజోగుణులుగా భావించు. శత్రువులను పరిమార్చుటకై నన్ను భజించువారు తమోగుణ ప్రధానులుగా యెరుగుము. సత్త్వరజస్తమో గుణాలకు కారణం జీవుల చిత్తమే. ఈ మార్పులకు నాకు సంబంధంలేదు. ఈ గుణాల ద్వారానే మానవులు శారీరక ఆర్థిక మోహాలకు దాసులవుతారు. బంధనంలో పడిపోతారు.

సత్త్వగుణ ప్రధానులు తేజోవంతులు. వారు. నిర్మల స్వభావులు శాంత చిత్తులుగా ఉంటారు. వారు రజోగుణాన్ని తమోగుణాన్ని అణచుకొని పెరుగుతారు. సుఖం ధర్మం జ్ఞానం ఆది సుగుణ ఫలాలు పొంది ప్రకాశిస్తారు. రజోగుణం భేద బుద్ధికి కారణం. రజోగుణ స్వభావులకు ఆసక్తి అధికం. వారి ప్రవృత్తి ఫలం కొరకుభజన. అపుడు రజోగుణం సత్త్వగుణాన్ని తమోగుణాన్ని అణగద్రొక్కి తానుపైకి ఉబుకుతుంది. ఆ సమయంలో ఆ మనుష్యుడు దుఃఖాలు కర్మలు కీర్తులు సంపదలు అనుభవిస్తుంటాడు.

తమోగుణం అజ్ఞానం. తమోగుణుల స్వభావం సోమరితనం. మూఢ బుద్ధి వారిది. తమోగుణం రజోగుణాన్ని సత్త్వగుణాన్ని అణిచి వేస్తుంది. తమోగుణుడురకరకాల ఆశలకు లోనవుతాడు. శోక మోహాలు పొందుతాడు. హింసలు చేస్తాడు. నిద్రకు మందకొడికి వశీభూతుడవుతాడు.

చిత్త ప్రసన్నంగా ఉండి ఇంద్రియాలు శాంతంగా ఉండి దేహం నిర్భయంగా ఉండి మనస్సులో ఆసక్తులు లేకుంటే సత్త్వ బుద్ధి అని తెలుసుకో. సత్త్వం నా ప్రాప్తికి సాధనం. ఎప్పుడైతే చిత్తం పనులు చేయటంలో ఆసక్తి చూపి చంచలం అవుతుందో, జ్ఞానేంద్రియాలైన నేత్ర శ్రవణాదులు అసంతుష్టి పొంది కర్మేంద్రియాలైన హస్తాలు పాదాలు వికారాలు పొంది మనస్సు భ్రాంతమై శరీరం అస్వస్థత పొందింది అంటే రజోగుణం పెరిగినట్లు గ్రహించు.

చిత్తం నేత్రం శ్రవణం మొదలైనవి శబ్దాదులు దృశ్యాదులు గ్రహించలేని అసమర్థ స్థితికి జేరాయి అంటే అజ్ఞానం క్రమ్ముకొని వస్తున్నట్లే. అపుడు బుద్ధి దుఃఖిస్తుంది. మనస్సు శూన్యమవుతుంది. వివాదం వృద్ధి అవుతుంది. ఇది పూర్ణతమోగుణ ప్రభావం.

ఉద్ధవా! సత్త్వగుణం పెరుగుట వలన దేవతా బలం, రజోగుణం పెరగట్టం వలన అసురబలం, తమోగుణం పెరగటం వలన రాక్షస బలం అధిక మవుతుంది. దేవతా బలం వలన నివృత్తి, అసుర బలం వలన ప్రవృత్తి, రాక్షసబలం వలన మోహం ప్రధానంగా వృద్ధి అవుతాయి. సత్త్వగుణంతో జాగ్రదవస్థ, రజోగుణంతో స్వప్నావస్థ, తమోగుణంతో సుషుప్తి అవస్థ కలుగుతాయి. తురీయం ఈమూటిలో వ్యాప్తమై ఉంటుంది. అదే శుద్ధమైన ఏకరసాత్మ రూపం.

వేదాభ్యాస తత్పర బ్రాహ్మణోత్తములు సత్త్వగుణం ద్వారా ఉత్తరోత్తర ఉత్తమ లోకాలు పొందుతారు. తమోగుణం ద్వారా జీవులకు వృక్షాది అధోగతులు ప్రాప్తిస్తాయి. రజోగుణం ద్వారా మనుష్య శరీరం ప్రాప్తిస్తుంది. మనుష్యులకు సత్త్వాభివృద్ధి సమయంలో మృత్యు సంప్రాప్తమైన స్వర్గ ప్రాప్తి, రజోగుణాభివృద్ధి సమయంలో మృత్యు ప్రాప్తియయిన మనుష్యలోకం, తమోగుణాభివృద్ధి వేళ మృత్యువు లభిస్తే నరకం ప్రాప్తిస్తుంది. త్రిగుణాతీత జీవులకు నా సాయుజ్యం లభిస్తుంది.

మనుష్యుడు తన ధర్మాచరణం నాకుసమర్పించి నిష్కామభావంతో ప్రవర్తించినపుడు సాత్త్వికుడై వన్నెకెక్కుతాడు. కర్మానుష్ఠానంలో ఫలంగా కోరికలు కోరుకొన్నవాడు రాజసికుడై ప్రవర్తిస్తాడు. కర్మకృత్యంలో పరులను బాధించి దేవతలకు బలులు చేస్తాడో వాడు తమోగుణ ప్రధానుడని తెలుసుకో.

ఉద్ధవా! శుద్ధమైన ఆత్మజ్ఞానమే సాత్త్వికం. ఆత్మనుకర్త భోక్త అని విభజన దృష్టి రాజస జ్ఞానం. ఆత్మను శరీరంగా భావించటం తామస జ్ఞానం. ఈ త్రిగుణాలకు విలక్షణంగా భావనకు తగింది నా స్వరూప వాస్తవ జ్ఞానం. అదే నిర్గుణ జ్ఞానం. వనంలో నివాసం సాత్త్విక వాసం. గ్రామంలో ఉండటం రాజసిక వాసం. జూద గృహాలలో ఉండటం తామసిక వాసం. ఇవి కాక వీటిని మించిన నా మందిరంలో నివసించటం నిర్గుణ నివాసం.

అనాసక్త కర్మాచరణం సాత్త్వికం. రాగాంధుడై కర్మచేయటం రాజసికం. పూర్వాపర, విచార శూన్యుడై కర్మలు చేయటం తామసికం. ఇవి కాక కేవలం నా సన్నిధిలో ఉండి అహంకార రహితుడై కర్మలు ఆచరించువాడు నిర్గుణ కర్త. ఆత్మ జ్ఞాన విషయక శ్రద్ధ సాత్త్విక శ్రద్ధ. కర్మ విషయక శ్రద్ధ రాజసం. అధర్మ కార్య శ్రద్ధ తామసం. నా సేవలో శ్రద్ధ కలిగి ఉండుట నిర్గుణ శ్రద్ధ.

ఆరోగ్య దాయకమైన పవిత్ర అనాయాస ప్రాప్త భోజనం సాత్త్వికం. నాలుకకు రుచియైన ఆహారం రాజసం. దుఃఖకరమైన అపవిత్ర ఆహారం తామసం. అంతర్గత ఆత్మ చింతన వలన ప్రాప్తించే సుఖం సాత్త్వికం. బహిర్గత విషయాల వలన లభించే సుఖం రాజసికం. అజ్ఞాన దైన్యం వలన లభించే సుఖం తామసికం. నా వలన లభించే సుఖం గుణాతీతం అప్రాకృతం. నిర్గుణం. నిరంజనం.

ఉద్ధవా! ద్రవ్యాలు స్థానాలు ఫలాలు కాలాలు జ్ఞానాలు కర్మలు కర్తలు శ్రద్ధలు దశలు దేవ మనుష్య తిర్యగాది శరీరాలు నిష్ఠలు అన్నీ ఆలోచించినచో త్రిగుణాత్మికాలు. నేత్రాదులైన ఇంద్రియాల వలన అనుభవించేవి, శాస్త్రాదుల ద్వారా శ్రవణం చేసేవి, బుద్ధి

ద్వారా లోక లోకాంతర సంబంధీత అంశాలు గూర్చి విచార విమర్శలు చేసేవి, ప్రకృతి ప్రకృతి ఆశ్రిత భావాలు అన్నీ గుణమయాలు. జీవులకు కలిగే జన్మలు గతి విధానాలు వారి వారి గుణ కర్మల ననుసరించి జరుగుతుంటాయి. అన్ని గుణాలు చిత్తానికి సంబంధించినవే. కనుక మానవుడు అనాయాసంగా వశం చేసికోవచ్చు. ఈ గుణాలను కర్మలను వశం చేసుకొన్నవాడు భక్తి యోగంలో పండిపోయి నా సాక్షాత్కారం పొంది మోక్షం అందుకొనవచ్చు.

ఈ మానవ శరీరం ప్రాప్తించటం కడు దుర్లభం. ఈ శరీరంతోనే తత్త్వజ్ఞానం అభ్యసించి సిద్ధి పొంది నిష్మారూపమైన విజ్ఞానం బడయవచ్చు. కనుక బుద్ధి కలిగినవారు గుణాలపై ఆసక్తిని వదలిపెట్టి నన్ను భజించటం విధిగా ఆచరించాలి. విచార శీలురైన మహానుభావులు జాగరూకులై సత్త్వగుణాన్ని సేవించి రజస్తమో గుణాలను జయించాలి. ఇంద్రియాలను వశంలో ఉంచుకోవాలి. నా స్వరూపాన్ని గుర్తించి నా భజనలో లగ్నం కావాలి. ఇతర ఆసక్తులను పూర్తిగా వదిలి పెట్టాలి. యోగాభ్యాసం ద్వారా శాస్త్రవిధానాలను అనుసరించి చిత్త వృత్తులను శాంతింపజేసి నిరపేక్ష నిష్కామం ద్వారా సత్త్వగుణాన్నీ కూడా జయించాలి. ఈ విధంగా త్రిగుణాలను త్యజించి జీవుడు తన జీవభావాన్ని పరిత్యజించాలి. అపుడు అతడు నాలో ఐక్యమైపోతాడు.

జీవుడు - లింగ శరీర ఉపాధి జీవత్వం ద్వారా అంతః కరణంలో ఉదయించే సత్త్వాది వృత్తుల నుండి ముక్తుడవుతాడు. నా పరబ్రహ్మ తత్త్వానుభూతి ద్వారా ఏ కత్వ దర్శనంతో పూర్ణ పురుషుడవుతాడు. ఆ తురువాత మరల బాహ్యాభ్యంతర విషయాలలోనికి వెళ్ళనే వెళ్ళడు. ఇది సారాంశం.

పూరూరవ వైరాగ్య బోధ

శ్రీ కృష్ణ భగవానుడు ప్రేమతో ఉద్ధవుని చేరదీసి ఈ విధంగా బోధించసాగాడు -

" హే ఉద్ధవా! ఈ మనుష్య శరీరం చాలా విలువైనది సుమా! దీని ద్వారానే నా స్వరూప జ్ఞానం లభ్యమవుతుంది. నా ప్రాప్తికిది ముఖ్య సాధనం. ఈ శరీరంతో నన్ను ప్రేమతో భక్తితో భజించినవాడు నా ప్రేమకు పాత్రుడవుతాడు. నా ఆనంద స్వరూపం అంతఃకరణంలో ధ్యానించిన, నా పరమాత్మ పదం ప్రాప్తిస్తుంది.

జీవులకు అన్ని జన్మలు అన్ని గతులు త్రిగుణాల మిశ్రమమే. జీవులు జ్ఞానమార్గం ద్వారా జన్మలనుండి విముక్తి పొందవచ్చు. జీవులు సత్త్వ రజస్తమోగుణధారుల వలె కనిపించునది వాస్తవం కాదు. అది మాయా మాత్రం. జ్ఞానం పొందినా, జ్ఞానులు మైత్రి కల్గినా, జ్ఞానులను సేవించినా, జ్ఞానానికి సంబంధం గట్టిగా కలిగి జీవించలేరు. ఏలననగా వారిలో వాస్తవికమైన సత్తా లేదు.

సాధారణ జ్ఞానాభిలాషులు విషయాభిలాషులతో సంబంధం పెట్టుకోరాదు. విషయ భోగాలతో కొందరు పొట్టపోసుకొంటుంటారు. వారు అసత్పురుషులు. వారి సాంగత్యం వలన వారిని సమీపించిన వారు కూడా చెడిపోయి దుర్దశపాలవుతారు. గ్రుడ్డి వారిని ఆధారం చేసుకొని వెళ్ళే గ్రుడ్డివారు మంచి మార్గం ఎలా ఆశ్రయించగలరు? విషయాభిలాషుల వెంట వెళ్ళేవారి గతి కూడా ఇంతే. ఘోర అంధకార కూపంలో పడతారు.

ఉద్ధవా! విషయాసక్తులు పతనమై పశ్చాత్తాపంతో వైరాగ్యం పొంది కొందరు బాగుపడతారు అట్టివారిలో ఇలా నందనుడు పురూరవుడొకడు. పురూరవుడు మహారాజాది , రాజు. పరమయశస్వి. ఊర్వశీ విరహంలోపడి వళ్ళు మరచిపోయాడు. ఉన్మత్తుడైనాడు. శోకించాడు. నగ్నంగా తిరగసాగాడు. పూర్తిగా మతి భ్రమించినవాడైనాడు. చివరకు దైవ కృప వలన వైరాగ్యం పొందాడు. తన గాథను ఇలా గానంచేసి లోకానికి జ్ఞానం కలిగించాడు. పురూరవ మహారాజు ఊర్వశీ విరహంలో పిచ్చివాడై ఒంటిమీద వస్త్రం కూడా ఎరుగక తన వ్యక్తిత్వం మరచి ఊర్వశి వెంట పడ్డాడు. ఆమె కనిపించకపోయినా కొండలు అడవులు పట్టిపోయాడు - ఓ ఊర్వశీ ! నాదేవీ! నా ప్రేయసీ! నా ప్రాణ ప్రియా! పారిపోకు! ఆగు! ఆగు! కొంచం ఉండు! ఇంత కఠినంగా ప్రవర్తించకు' అని కేకలు వేస్తూ ఏడుస్తూ పరివెత్తుతూ! రాళ్ళను గుట్టలను ప్రశ్నిస్తూ! పోసాగాడు.

ఊర్వశి రాజు మనస్సును ఆకర్షించింది. కొన్ని యేండ్లు ఆమెతో భోగాలు అనుభవించినా అతనికి తృప్తి కలుగలేదు. అతనికి ఉదయాస్తమానాలు ఎప్పుడు వస్తున్నాయో ఎప్పుడు తిరిగిపోతున్నాయో తెలియటం లేదు. కొంత కాలం గడచిన గడువు అయిపోగానే ఆమె: వెళ్ళిపోయింది. మరికొంత కాలానికి పురూరవుడు ఆమెకై శోకించి శోకించి విరక్తుడై ఇలా విలపించ సాగాడు. అయ్యో! నా మూఢబుద్ధి చూచారా! ఎంతపని చేసిందో! కామ వాసన నా చిత్తాన్ని ఎంత కలుషితం చేసింది! ఊర్వశి తన రెండు బాహువులతో నా కంఠం కౌగిలించుకొని నా అనల్పమైన ఆయువును ఎంత హరించిది! ఎన్ని సంవత్సరాలు అలా వ్యర్థబుచ్చానో తెలియదు కదా! దేనికైనా మితముండాలి. విస్మృతికి కూడా హద్దు లేకుండా జరిగిందే! అయ్యయ్యో! నేను పూర్తిగా దోపిడియై పోయాను. సర్వం కోలుపోయాను. వ్యక్తిత్వం లేని అడవి మృగం అయినాను. చివరకు ప్రొద్దు పొడిచేదీ - ప్రొంద్దు క్రుంకేదీ కూడా నాకు తెలియనేలేదు. ఇలా ఒక రోజూ , రెండు రోజులూ కాదు. కొన్ని సంవత్సరాలే దొర్లిపోయాయి. ఎంత మోసపోయాను! ఎంతపని చేశాను! అహా! ఆశ్చర్యం! నా ప్రవర్తన నాకే ఆశ్చర్యంగా ఉందే! నా మనస్సులో ఇంత మోహం పెరిగి పెనుకొండగా ఉందా! మానవ మహారాజ శిఖామణిని చక్రవర్తిని . సామ్రాట్టును. పురూరవ రాజమార్తాండుడను. ఒక అబల చేతి ఆటబొమ్మనైనానే. ప్రజలకు ఆదర్శ ప్రాయుడనై సామ్రాజ్యాధి పతినైన

నన్ను నా సామ్రాజ్యాన్ని ఒక గడ్డిపోచగా త్యజించి వెళ్ళిపోయింది. నేను పిచ్చివాడినై ఉన్మత్తుడనై దిగంబరినై అరుస్తూ కేకలేస్తూ ఒక అబల వెంటపడి పోయానా! ఇక మర్యాద ఏముంటుంది! ఇది కూడా ఒక బ్రతుకేనా! నేను ఒక గాడిదవలె ఆమె చీరలు మోస్తూ ఆకామిని వెంట వెంట వెళ్ళానా! ఇక నాలో అభిమానం, గౌరం, ఆధిపత్యం ఎలా ఉంటాయి!

ఒక ఒయ్యారి మనస్సు దోచింది అంటే ఆ పురుషుని విద్యా శౌర్యాదులు వివేకాలు వ్యర్థం. అతని తపోనియామాలేల! త్యాగ జీవనం ఏమిటి? శాస్త్రాభ్యాసం ఏమయింది? ఎన్నినేర్చి ఏమిలాభం? అతని ఏకాంత సేవనం. విద్య మౌనం శ్రమ నిష్ఫలం అనటంలో సందేహంలేదు. నా లాభాలాభాలు నాకే తెలియలేదు. నాకు నేను మహా కోవిదుణ్ణి అనుకొన్నాను. నా వంటి మూర్ఖుడెవడుంటాడు! ఛీ! నాదీ ఒక జీవితమేనా! చక్రవర్తినై కూడా గ్రుడ్డి ఎద్దు వలె ఒక ఆడదాని వలలో పడిపోయాను.

నేను సంవత్సరాల కొలది ఊర్వశి అధర పానం చేశాను. కానీ నా కామవాసన తృప్తి చెందలేదు. అగ్నిలో ఎన్ని ఆహుతులు వేసినా వహ్ని తృప్తి చెందుతుంది కనుకనా! నా పని అంతే అయింది. ఆ కులట, ఆ టిక్కులాడి, ఆ ఒయ్యారి, నా చిత్తందోచేసింది. నన్ను వ్యర్థుణ్ణి చేసింది. నేను మహారాజును వివేక ధనుణ్ణై కూడా ఆ కులుకులాడి వెంటపడి పోయాను. నా స్వామిని, ఆత్మారాముణ్ణి భగవంతుణ్ణి ఇంద్రియాతీతుణ్ణి మహామహితాత్ముణ్ణి, జీవన్ముక్తుణ్ణి విశ్వేశ్వరుణ్ణి వదులుకొని ఆవేశ్య వెంట పడ్డాను. నన్ను ఈ ఉరికంబం నుండి ఎవరు కాపాడగలరు? నిజంగా ఊర్వశి నాకు తగిన బుద్ధి చెప్పింది. మంచి పాఠం చెప్పింది. నేను దుర్మతినై గ్రహించలేకపోయాను. నాబుద్ధి మందగించింది. మనస్సులోని మోహం అప్పటికి గానీ హరించకపోయింది. ఇంద్రియాలు నా చేతులు దాటిపోయాయి. ఇంకేమి చేసేది? ఎలా తెలుసుకొంటాను. అసలు నా కర్మ ఫలం ఇది. ఇది త్రాడే. త్రాటిని గుర్తించుకో లేక పాముగా తలంచి చాలా భయపడ్డాను. పాము కాదు త్రాడు అని తెలిసి ఆనందించినట్లు అయింది. త్రాడే ఏమి చేయదుకదా! అట్లే ఊర్వశి దోషం మాత్రం ఏముంది! నాదే దోషం అంతా. నేను ఇంద్రియాలను వశపరచుకోలేక అపరాధిని అయినాను. నా కర్మకు నేనే కర్తను. పరులను అననేల! ఆమె దోషం ఏమీలేదు. నా అశక్తత అల్పజ్ఞతయే, దీనికి కారణం! నేను ఎంత భ్రమలో పడ్డాను. ఈ కళేబరం మలినాల కొంప. కంపుకొట్టే మురికి గుంట. రాకాసి ముళ్ళతో నిండిన కంప. విషయాల దుంప, దీనిని సుకుమార సుమం అనీ, సౌందర్య రాశి అనీ, పరమపవిత్ర వస్తువనీ, సుగంధ వాటిక అనీ, పారిజాత పరిమళ మంజరి అని పోల్చాను. ఆ పునీత గుణాలెక్కడ! దుర్గంధ భరిత శరీరమెక్కడ! ఆ గుణాలెక్కడ! ఈ రణాలెక్కడ! నేను అజ్ఞానంలోపడి, మోహంలోపడి అసుందర పదార్థంలో సుందరతను

ఆరోపించాను.

ఈశరీరం నా తల్లిదండ్రుల జీవ ఫలమా! నిష్ఫలమా! ఈ దేహం భార్య ధనమా! దేవుని కనుగొనే సాధనమా! లేక అగ్నికి ఇంధనమా! లేక కుక్కల నక్కల భోజనమా! లేక భార్యా పుత్ర బాంధవ భాజనమా! విచారణ చేయగా ఇంతకాలం అమూల్యకాలం వ్యర్థంచేశాను కదా! ఎందుకిలా జరిగిందో అర్థం కావటంలేదు. ఇపుడేమి చేయాలో తోచటం లేదే! ఈ దేహం మల మూత్రాలతో నిండిన అత్యంత అపవిత్ర గృహం. చివరకీ శరీరం పక్షులు కాహారం అయ్యేదే. రోగాలతో కుళ్ళిపోయేదే. వ్రణాలపై పురుగులు వాలితే తోలుకొనే శక్తి కూడా లేనిది. ఇది శవం అయితే కాల్చబడేదే.కాలిస్తే బూడిదై ఎగిరిపోతుంది.

ఇటువంటి హీనమైన శరీరంపై అజ్ఞానులు ఎంత వ్యామోహం చెందుతున్నారు? స్త్రీ శరీరం చూచి - 'ఓహో ! దీని ముఖ కమలం ఎంత సౌందర్య భరితం! ఈ నాసిక ఎంత సోయగంగా ఉంది! ఈ తరుణీమణి వాలుచూపులు ఎంత మనోహరాలు! అహా! అనుకొంటాడు. ఈ శరీరంపై చర్మం, లోపలి మజ్జా మాంసం రక్తం నరాలు స్నాయువులు మేధస్సు అస్థికలు అన్నీ నెత్తురు చీముల్లో మునిగి ఉంటాయి. ఛీ- ఛీ, మనుష్యుడు దీనితో రమిస్తాడు. ఈ మలంలోని పురుగుకీ వీడికీ తేడా ఏమిటి?

కనుక వివేకవంతులైన మానవులారా! మీరు విజ్ఞాన పథంలో పయనించి పరమేశ్వర సన్నిధి కోరుకొంటే స్త్రీలతో కానీ స్త్రీ వాంఛాలంపటులతో కూడకండి. విషయేంద్రియ వికారల వలననే మనస్సు కల్మషమవుతుంది. ఇంతకంటే విషయ విషంలో పడటానికి వేరే కారణం లేదు. విష వికారాల వలయంలో చిక్కుకొనకండి. ఒక వస్తువును గూర్చి వినక చూడకుండిన దానిని గూర్చి మనస్సు వికారం చెందదు. విషయ లంపటులను, ఇంద్రియలోలురను కలియకున్నచో మనస్సులో వికారం జనించదు. వారిని కలవని వారిమనస్సు సదా శాంతంగానూ సుఖంగానూ ఉంటుంది. కాబట్టి వాక్కు శ్రవణం మనస్సు మొదలగు ఇంద్రియాలు స్త్రీలను స్త్రీలోలురను గూర్చి యోచించ కుండుట మంచిది. నేను అనుభవించి చెప్పటమే కాదు మహాత్ములు కూడా మనస్సును ఇంద్రియాలను వశంచేసుకోండి కానీ వాటికి వశం కావద్దు. కావద్దు' అని చెప్పుతుంటారు.

శ్రీకృష్ణ భగవానుడు ఈ విధంగా పురూరవ కథ చెప్పి చివరికిలా చెప్పసాగాడు- ఉద్ధవా! రాజాధిరాజైన పురూరవుని మనస్సులో ఇలా వైరాగ్యం రూఢి అయింది. ఊర్వశి తలంపే విసర్జించాడు. జ్ఞాన భాస్కర ఉదయంతో మోహాంధకారం విచ్చిపోయింది. క్రమంగా దృఢచిత్తుడై నన్ను ధ్యానించి హృదయంలో నా సాక్షాత్కారం పొందాడు. తదుపరి శాంత స్వభావుడై విరాజిల్లసాగాడు.

కనుక బుద్ధిమంతులైన పురుషవరేణ్యులు ఏ వస్తువునూ ఎన్నడూ మిక్కిలి ఆశించరాదు. పురూరవుని వలె విషయ వాసనా పరుల సాంగత్యం త్యజించి సత్సాంగత్యంతో భక్తిమార్గంలో జీవనం పావనం చేసుకోవాలి. సాధుపురుషుల సదుపదేశాలు ఆలకించి ఆచరించి అనుభవించి మనో వికారాలను వినాశనం చేసుకోవాలి. విరక్తి కలిగి నాపై రక్తి కలిగి జీవించాలి.

ఉద్ధవా! సంత సాధు పురుషులను గురించి చెప్తాను విను -

సాధు పురుష లక్షణాలు ఆలకించు వారి చరిత్రలు పవిత్రమైనవి మదిలో కూడా సాధు పుంగవులు ఏ వస్తువులను ఆపేక్షించరు. వారి మనస్సు నాపైనే ఉంటుంది. వారి హృదయంలో శాంత సముద్రం తొణికిసలాడుతూంటుంది. వారు సర్వదా సర్వప్రదేశాలలో సర్వజీవులలోనూ సర్వ రూపాలలో గల నన్ను దర్శించి సేవించి తరిస్తారు. వారిలో అహంకారం అణువంత కూడా ఉండదు. మమకారం మచ్చుకైనా ఉండదు. వారు సదా సర్వేశ్వర చింతనలో ఉంటారు. వీరు శీతోష్ణాలు సుఖదుఃఖాలు కష్టనష్టాలు ఆది ద్వంద్వాలను సమభావంతో అనుభవిస్తారు. బౌద్ధిక మానసిక శారీరక అవసరాలకు పరులనుండి పదార్థాలు పరిగ్రహించరు. సంతోషాలకు పొంగరు. దుఃఖాలకు క్రుంగరు. వారు సమస్వభావులు. వారు మహా మహిమాన్వితులు.

ఉద్ధవా! నీవు చాలా అదృష్టవంతుడవోయి. సాధు పుంగవులు సదా నా లీలా విశేష అద్భుత దృశ్యాలు తిలకిస్తుంటారు. పులకిస్తుంటారు. నా కథా కథనాలు గాథలు విని తన్మయులైపోతారు. నీ చరిత్రల వలన మానవుల పూర్వ జన్మార్జిత పాపాలు పటాపంచలవుతాయి. కల్మషాలను కడిగివేస్తాయి. హితవు కలిగిస్తాయి. కల్యాణ ప్రదాలై వారి జీవితాలను పునీతం చేస్తాయి. ఆదరంగా శ్రద్ధగా నా లీలా విలాసాలు వినోదాలు వినేవారు గానం చేసేవారు ఆనందించేవారు నాకు అత్యంత ప్రియభక్తులై రాణిస్తారు. నా అమూల్యమైన అనన్య భక్తిని పొంది పవిత్రులౌతారు.

ఉద్ధవా! నన్ను గురించి చెప్పాను. తెలుసుకొని మసులుకో. నేను అనంత స్వామిని. అచింత్య కల్యాణమయుణ్ణి. సర్వ సుగుణాలు నన్నే ఆశ్రయించి యుంటాయి. నా స్వరూపం ఆనందం పరమ అనుభవం. సచ్చిదానందం చిన్మయం. భగవన్మయం. నేను పరబ్రహ్మమూర్తిని. నాపై భక్తి కుదిరినవాడు సాధు పుంగవుడవుతాడు. భక్తి దొరికిన వానికి అన్నీలభిస్తాయి. లభించని పదార్థం అనేదీ ఉండదు. భక్తి అంతగొప్పది. వారు నాయంతవారు. భక్తులకీ భగవంతుడికీ భేదం ఉండదు.

నా భక్తులు పవిత్రులగుటే కాదు వారిని ఆశ్రయించిన వారిని కూడా పరమ పవిత్రులుగా తయారు జేస్తారు. నా భక్తులను శరణు పొందిన వారు కర్మ బంధాలు సంసార భయాలు అజ్ఞానాంధకారాలు బాసి పుణ్య జీవనలవుతారు. నివృత్తి మార్గంలో పయనిస్తారు. అగ్ని వద్ద కూర్చున్న వారికి శీత అంధకార భయాలు పోయినట్లుగా నన్ను నా భక్తులను జేరిన వారికి భవ దుఃఖం దూరమైపోతుంది.

ఈ సంసార సాగరంలో మునిగి కొట్టు మిట్టాడే వారికి బ్రహ్మవేత్తలు సాధుపురుషులు శాంత స్వభావులు సౌ కల వంటివారు. అన్నం వలన ప్రాణాలు రక్షించబడినట్లుగా, నా వలన దీన దుఃఖితులు కాపాడబడినట్లుగా, మనుష్యులకు పరలోకంలో ధర్మం శరణమైనట్లుగా సంసార సాగర మగ్న మానవులకు సాధు పురుషులు పరమ ఆశ్రయదాతలు.

సూర్య భగవానుడు అనంత ఆకాశమండలంలో ఉదయించి సర్వజీవులు తనను తాము చూచుకొనుటకు జగత్తును కనుగొనుటకు నేత్రాలలో మహా శక్తి ప్రసారం చేసినట్లు సాధుపురుషులు తనలోని తత్వాన్ని పరబ్రహ్మాన్ని దర్శించేందుకు అంతర్దృష్టి ప్రసాదిస్తారు. సాధు పుంగవులు అనుగ్రహ దేవతలు. వారు పరుల హితము కోరు సుహృన్మణులు. సాధువులు ఆత్మ స్వరూపులు. నిజానికి నేనే సాధు పురుషుడుగా సంచరిస్తుంటాను.

ప్రియమైన ఉద్ధవా! ఆత్మసాక్షాత్కారం జరగగానే పురూరవుడికి ఊర్వశి స్పృహ పోయింది. అతని ఐహిక వాంఛలన్నీ అంతరిచాయి. అతడు ఆత్మారాముడై, స్వచ్ఛంద పురుషుడై పృథ్వీతలంపై విహరించసాగాడు.

క్రియాయోగం - పూజాయోగం

ఉద్ధవుడు ఈ విధంగా ప్రార్థించాడు -

హే విశ్వేశ్వరేశ్వరా! కృష్ణా! కమలపత్రాక్ష! క్రియాయోగాన్ని అవలంబించి భక్తవర్యులు ఏ ఉద్దేశ్యతంతో తమని అర్పించినారో ఆ విధానం ఆ ఆరాధనా విశేష క్రియా యోగాన్ని వివరించ వలసిందిగా ప్రార్థిస్తున్నాను. దేవర్షి నారదుడు భగవాన్ వ్యాసదేవుడు ఆచార్య బృహస్పతి మొదలైనవారు క్రియా యోగం ద్వారా తమ పాదారాధన చేయటం మానవులకు కల్యాణ కారకం అంటారే అది యేమిటి?

ఈ యోగం మునుముందుగా తమనోటి నుండి వెలువడిందట కదా! ఆ తరువాత దానిని బ్రహ్మదేవుడు తమ పుత్రులైన భృగు మొదలైన వారికి శంకరుడు పార్వతికి ఉపదేశించనట్లు పేర్కొంటారు. కృష్ణప్రభో! ఈ క్రియాయోగం బ్రాహ్మణ క్షత్రియ వైశ్యాదులకు

బ్రహ్మచర్యాది నాల్గు ఆశ్రమాల వారికి మంచిది అని బోధించబడిందట. నేను శూద్ర స్త్రీ జాతులకు చెప్పి వారిని ఉద్ధరించాలని తలంచుతున్నాను,

తమరు మహా మహేశ్వరులకు మహా ప్రభువులు ఈశ్వరులకు - ఈశ్వరులు. నేను తమపద కమల పూజారతుడను. ప్రేమమూర్తివైన నిన్ను ప్రేమించువాడను. నాకు కర్మబంధం తొలిగించు క్రియా యోగం గూర్చి విధి విధానాలు వివరంగా బోధించండి-

శ్రీ కృష్ణ భగవానుడు ప్రసన్న చిత్తంతో క్రియాయోగం వివరించసాగాడు -

ఉద్ధవా! కర్మకాండం బహు విస్తారమైపోయింది. కనుక దానిని సంక్షిప్తంగా పూర్వాపరక్రమంలో విధివిధాలు వివరిస్తాను. నా పూజ విధానాలు మూడు రకాలు. 1. వైదికం 2. తాంత్రికం 3. మిశ్రితం. ఈ మూడు విధానాలలో భక్తులు తమ తమ అనుకూలాలను బట్టి నన్ను ఆరాధిస్తుంటారు.

మొదటిది వైదికం. మనుష్యుడు తన అధికారాన్ని అనుసరించి శాస్త్రోక్త ప్రకారగా ఉపనయన సంస్కారం పొంది ద్విజుత్వం పొందుతాడు. ఆపైన భక్తి శ్రద్ధలు కలిగి పూజా క్రమం తెలుసు కోవాలి. ఆ పూజా విధానం చెప్తాను విను.

భక్తి భావంతో నిష్కపట హృదయంతో తండ్రిని గురుదేవుని నన్నుగా భావనచేసి పరమాత్మకు నమస్కరించాలి. పూజాసామాగ్రితో నన్ను మూర్తిలోకిగానీ వేదికపై ప్రతిమలోకి గానీ అగ్నిలోకిగానీ సూర్యులపైకి గానీ జలంలోనికిగానీ లేక తన హృదయ పీఠంపైకి గానీ లేక బ్రాహ్మణునిపై గానీ ఆవాహనం చేసిధ్యానించాలి. అర్పించాలి.

ఉపాసకులు దైవ స్మరణతో నిద్రమేల్కొని, ముఖశుద్ధికై దంతధావనం చేసి శరీర శుద్ధికై స్నానం చేయాలి. ఆ తరువాత వైదిక తాంత్రిక విధానాల ననుసరించి తిలకధారణం మృత్తికగానీ భస్మంకానీ గంధ కుంకుమాదులు ధరించాలి. మరల సాన్నం చేయుట మంచిది. ఆపైన వేదోక్త సంధ్యా వందనాది నిత్యకర్మలు నెరవేర్చాలి. అవి అయిన తరువాత దృఢమనస్కుడై సత్ సంకల్పంతో నిశ్చలమైన నిర్మల భక్తి భావంతో వైదిక తాంత్రిక మంత్ర విధానంతో కర్మ బంధ విముక్తికై నన్ను ఆరాధించాలి.

పూజా ప్రతిమలు

ఉద్ధవా! నా పూజా ప్రతిమలు ఎనిమిది విధాలుగా ఉన్నాయి. శిలా ప్రతిమ, కాష్ఠ ప్రతిమ, ధాతు ప్రతిమ, మృత్తికాప్రతిమ, మణిప్రతిమ, చంద్రన ప్రతిమ, చిత్రపటం, సైకత ప్రతిమ, మనో మయ ప్రతిమ మృత్తిక చందనాదులు ఒకే ప్రతిమలు. కాష్ఠం అంటే కొయ్యతో చెక్కబడినవి. చలాలు అచలాలు అని ప్రతిమల ప్రతిష్ఠలలో రెండురకాలు.

ప్రతిమలు భగవంతుని నివాస స్థానాలు. అచల ప్రతిమార్చనంలో ప్రతి దినం విసర్జనం ఉండదు. ఆహ్వానం ఉండదు. అలా చేయనవసరంలేదు. ప్రాణప్రతిష్ట విగ్రహానికి ఒక్కసారే జరుగుతుంది. నిత్యపూజలు జరుగుతుంటాయి.

చల ప్రతిమలకు ఇష్టమైనపుడు ఇష్టమైనచోట పూజలు జరుగుతుంటాయి. సైకత మూర్తులకు ప్రతి తడవ ఆహ్వాన విసర్జనలు చేయాలి. మట్టి బొమ్మలు గంధపు బొమ్మలు చిత్రపటాలకు స్నానం చేయించరాదు. మంత్రంతో మార్జనం చేస్తేచాలు. మిగిలిన ప్రతిమలకు స్నానం చేయించవచ్చు. ప్రసిద్ధిమైన కొన్ని పదార్థాలను నా స్వరూపంగా భావనచేసి పూజలు చేస్తారు. కానీ నిష్కామ భక్తులు అనాయాసంగా ప్రాప్తించిన వస్తువులతో భావనామాత్రంగా నన్ను తలంచి హృదయ పద్మాసనంపై నన్ను పూజిస్తుంటారు.

ఉద్ధవా! స్నాన వస్త్ర ఆ భూషణాద్యలంకారాలు శిలా ధాతు దారు ప్రతిమలకు శోభిస్తాయి. సైకత మృత్తికా ప్రతిమా పూజాదులు మంత్ర మాత్రంగా యథాస్థానాలలో జరగాలి. అగ్ని ఆరాధనంలో ఘృతంతో కలిసిన హవన సామాగ్రితో ఆహుతులు అర్పించాలి. సూర్యారాధన అర్ఘ్యపాద్యాదులు తర్పణాలు అర్పించి నన్ను సూర్యునిగా పూజించాలి. ఉపాసించాలి. భక్తులు శ్రద్ధా భక్తులతో జలం అర్పణ చేస్తుంటారు.అది నాకు అత్యంత ప్రియమైన పూజ. భక్తిలేని వారు ఎంతో ఆడంబరంగా వస్తు వాహనా ప్రసాదాలు అర్పించినా నాకు ఇష్టం ఉండదు. భక్తితో ఇచ్చిన జలం నాకు తృప్తి కలిగిస్తుంది. భక్తితోచేసే సకలోపచారాలు నాకు స్వీకారయోగ్యాలు.

ఉద్ధవా! ఉపాసకులు ముందుగా పూజా ద్రవ్యాలు సమకూర్చుకోవాలి. ఉత్తరంగానీ తూర్పుముఖంగా పీఠం ఏర్పాటు చేసుకొని దర్భలు పరచుకోవాలి. పవిత్ర ఆసనంపై కూర్చోవాలి. పూజా మందిరంలో విగ్రహం ముందు కూర్చోవాలి. పూజప్రారంభించాలి.

అంగన్యాస కరన్యాస అనంతరం మూర్తిలో మంత్రన్యాసం చేస్తూ నిర్మాల్యం విసర్జించాలి. ఆపైన సుగంధ జలాభిషేకం లేక మంత్రంతో ప్రోక్షణం చేయాలి. త్రిపాత్రలతో ప్రోక్షణ చేసిన జల బిందువులతో ఆత్మశుద్ధి పూజాద్రవ్యశుద్ధి, స్థల శుద్ధి చేయాలి. ఆ తరువాత మరల ఆచమనం చేసి అర్ఘ్య పాద్యాదులతో విధి ప్రకారం పూజించాలి. త్రిపాత్రలతో క్రమంగా హృదయమంత్రం శిరోమంత్రం, శిఖామంత్రం చెప్పి గాయత్రీ మంతంతో మూడూ కలిపి ఉంచాలి. ఆ తరువాత ప్రాణాయామం ద్వారా ప్రాణవాయువును భావనా పూర్వకంగా శరీరమంతా వ్యాప్తి చేసి శరీరాగ్నిని శుద్ధి చేసుకోవాలి. తదనంతరం హృదయ కమలంలో పరమ సూక్ష్మమైన దీపశిఖ వంటి నా జీవకళను ధ్యానించాలి. మహర్షులు ఓంకారంలోని అకార, ఉకార, మకార, బిందు, నాదం అనే పంచ కళలతో జీవకళా రూపాన్ని ధ్యానం చేస్తారు.

ఆ జీవకళ అత్మస్వరూపిణి. దాని తేజస్సు చేత అంతః కరణం శరీరం ప్రకాశవంతమై జ్ఞానవంతమై దివ్య చైతన్యంలో నిండిపోతుంది. అపుడు మానసికంగా ప్రణావాన్ని అర్పించాలి. తదనంతరం తన్మయ భావంతో నన్ను ఆవాహనం చేసికొని నా ప్రతిమను స్థాపించి అంగన్యాన కరన్యాసాలతో నా ఆరాధనం కావించాలి.

ఉద్ధవా! నా ఆసనం ఈ విధంగా భావనం చేసి ఏర్పరచు. ధర్మాదిగుణాలు విమలాది శక్తులు నా ఆసనానికి ఉంటాయి. ఆసనం యొక్క నాల్గు మూలల ధర్మం, జ్ఞానం, వైరాగ్యం ఐశ్వర్యం, కోళ్ళుగా ఉంటాయి. అధర్మం అజ్ఞానం అవైరాగ్యం అనైశ్వర్యం నాలుగు నాల్గుదిశలలో స్తంభాలు. సత్వం రజస్సు తమస్సు మూడూ మూడు పట్టీలుగల ఆసనం ఇది. ఈ పీఠంపైన విమల, ఉత్కర్షిణీ, జ్ఞానం, క్రియ, యోగం, ప్రహ్వి, సత్యం, ఈశానం అనుగ్రహం అనే నవ శక్తులు శోభిస్తుంటాయి. ఈ ఆసనం మధ్య అష్ట దళ పద్మం ఉంటుంది. దీని కర్ణిక అతికాంతి వంతం. పసిమి కేసరాల కాంతులు విలక్షణంగా విరాజిల్లుతుంటాయి. ఈ విధంగా ఆసనం భావనంచేసి అర్ఘ్య పాద్య ఆచమనీయాలిచ్చి అర్పించాలి. తదనంతరం భోగయోగ మోక్ష సిద్ధులకుగాను వైదిక తాంత్రిక పద్ధతుల ద్వారా నన్ను పూజించవలసియున్నది. సుదర్శన చక్రం, పాంజన్య శంఖం, కౌమోదకీ గద, ఖడ్గం, బాణం, ధనుస్సు, హలం, మూసలం ఈ అష్టాయుధాలు అష్టదిశలయందు నిలచి కాపాడుతుంటాయి. కనుక ఈ ఆయుధపూజ చేయాలి. కౌస్తుభమణి - వైజయంతిమాల - శ్రీవత్స చిహ్నం నా వక్ష స్థలంపై యుండి పూజలందుకొంటుంటాయి. నంద - సునంద, ప్రచండ - చండ, , మహాబల - బల, కుముద - కుముదేక్షణ ఈ ఎనిమిది మంది పార్షదులు ఎనిమిది దిక్కులలో ఉంటారు. గరుడ దుర్గ వినాయక వ్యాస విష్వక్సేన గురు బృహస్పతి సురపతి దేవేంద్రాదులు నాల్గు దిశలలో నిలబడి పూజలందుకొంటూంటారు. ఎడమవైపు అష్టదిక్పాలకులు నిలిచి ప్రోక్షణార్ఘ్య పాద్యాదులు అందుకొంటూంటారు. ఉపాసకులు ఈ అందరినీ అర్చిస్తుండాలి.

ఉద్ధవా ! విభవం గల నా భక్తులు ప్రతిదినం చందనం ఉసిరిక కర్పూరం కేసర అగరు సుగంధ మిశ్రిత పుష్పజలంతో నన్ను అభిషేకం చేస్తుంటారు ఆ అభిషేక సమయంలో 'స్వర్ణఘర్మాది.'అనువాకాలతోనూ 'జితంతే పుండరీకాక్ష.' అది మహా పురుష విద్యత్ 'సహస్ర శీర్షాది పురుష సూక్తంతో 'ఇంద్రంనరో నేమధియా హవంత' వంటి మంత్ర రాజాలతో రాజనాది సామగాయనకాది పాఠాలు వల్లిస్తూ నాకు ఆనందం కల్గిస్తుంటారు.

నా ఉపాసకులు భక్తులు ఇలా సకలోపచారాలతో స్నానాదులు చేయించి వస్త్రాలు యజ్ఞోపవీతాలు ధరింపజేస్తారు. ఆ భూషణాలు అలంకారం చేస్తారు. పత్రాలతో

పుష్పాలతో పెద్ద పెద్ద పూల మాలలు వేస్తారు. సుగంధం అద్దుతారు. చందనం పూస్తారు. ప్రేమతో సూక్తాలు వల్లిస్తూ నన్ను వర్ణిస్తూ స్తోత్రపాఠాలు పలుకుతారు.

ఆపైన అర్ఘ్య పాద్య ఆచమన చందన పుష్పాక్షతలతో అర్పించి ధూప దీప ఉపచార పూజలు చేస్తారు. వారు యథా శక్తి వండితెచ్చిన గుణపాయస ఘృత అపూపహల్వాది పిండి వంటలతో మహానైవేద్యం ఆరగింపు చేస్తారు. ఆ తరువాత స్వామి మూర్తికి దంతధావనాదులు చేసి మరల పంచామృత స్నానంతో శుద్ధిచేసి సుగంధ లేపనం చేస్తారు. దర్పణ దర్శనం గీత వాద్య గోష్ఠి గావించి ఛత్ర చామర వీచికలతో మహాభోగాలు జరపించి పవళింపు సేవ చేస్తారు.

ఉద్ధవా! శాస్త్రోక్త ప్రకారంగా నిర్మించిన కుండంలో అగ్నిని ప్రతిష్ఠచేయాలి. ఆ అగ్నికుండం మేఖలా వర్తులాకారంలో గర్తం కలిగి వేదికాలంకార శోభితమై సుందరంగా ఉండాలి. ఆ గుండంలో చేతి విసిన కర్రతో విసిరిన గాలితో అగ్ని ప్రజ్వలితమై ఒకచోట జ్వాల రావాలి. వేదిక నాలుగువైపుల కుశఖండాలు ఇరవై చొప్పున పరచి మంత్ర పఠనంతో జలాలు ప్రోక్షణ చేయాలి. తదుపరి విధి ప్రకారం సమిధలు ఆధానం చేసి అన్వాధాన కర్మచేసి అగ్నికి ఉత్తరభాగంలో హోమ ద్రవ్యాలు జేర్చి ప్రోక్షణీయ మంత్రాలతో శుద్ధి చేయాలి. ఆటుపై నన్ను అగ్నిలో ఉన్నట్లుగా ఇట్లు ధ్యానించాలి.

"స్వామీ! నీ మూర్తి తప్త కాంచన సన్నిభంగా ఉంది. సువర్ణ తేజస్సుతో మెరిసిపోతూంది. నీ మూర్తి మహోజ్వలం మనోహరం. నీ రోమ రోమం నుండి శాంతి సుధలు వర్షిస్తున్నాయి. నా నాల్గు ఆజానుబాహువులు మిక్కిలి అందంగా ఉండి ఆనందం కల్గిస్తున్నాయి. ఆ బాహువులలో శంఖ చక్ర గదా పద్మాలు శోభిస్తున్నాయి. కమల కేసర కాంతి పుంజాలతో నీ పీతాంబరం విలసిల్ల సాగింది.

నీ శిరస్సుపై రత్న కిరీటం, కరములకు కంకణాలు కటిపై మేఖల బహు దండముల అంగదాలు భుజకీర్తులు శోభ వెలయిస్తున్నాయి. నీ వక్ష స్థలంపై శ్రీవత్స చిహ్నం. కంఠంలో కౌస్తుభం. మోకాళ్ళ వరకు వ్రేలాడే వనమాల దేదీప్య మానంగా ప్రకాశిస్తున్నాయి.' అని అగ్నిదేవుని నా రూపంగా భావించి పూజించాలి.

అగ్నిలో నన్నే దర్శించి అగ్నిని జ్వలనం చేయాలి. ఎండు సమిధలను నేతిలో ముంచి అగ్నిలో వేయాలి. ఆజ్య భాగం రెండు వేరు వేరు పాత్రలో ఉంచి ఆహుతులిస్తూ హవనం చేయాలి. తదుపరి నేతితో బాగా తడిసిన హవన సామాగ్రిని ఆహుతి చేయాలి. ఆటు తరువాత ఇష్ట మంత్రాలతో కానీ లేక 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షర

మంత్రంతోను పురుష సూక్తం యొక్క షోడశ మంత్రాలతోనూ హోమం చేయాలి. ధర్మాది దేవతలకు విధి పూర్వక మంత్రాలతో హోమం చేస్తూ స్విష్టకృత ఆహుతులు అర్పించాలి.

ఉద్ధవా! ఈ విధంగా అగ్ని రూపంలో అంతర్యామియైన స్వామి ఉన్నట్లుగా భావించి పూజించాలి. నంద సునంద ఆది హర్షదులను అష్ట దిక్కులందుంచి హవన కర్మాంగ బలి సమర్పించాలి. తదనంతరం ప్రతిమ ముందు కూర్చొని పరబ్రహ్మ నారాయణ స్మరణం చేయాలి. భగవత్స్వరూపముల మంత్రమైన 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్ర జపం చేయాలి. ఈ జపానంతరం స్వామికి ఆచమనం ఇచ్చి స్వామి ప్రసాదాన్ని విష్వక్సేనునికి నివేదనం చేయాలి. ఆపైన ఇష్టదైవానికి తాంబూలం అర్పించాలి. తరువాత పుష్పాంజలి సమర్పించాలి. ఆ తర్వాత స్వామి సన్నిధిలో నా లీలా విశేషాలు గానం చేయాలి. పౌరాణిక విధానంలో లీలలు వర్ణించాలి. లీలా నాట్యాలు ప్రదర్శించాలి. ప్రేమోన్మత్తులై భక్తులు నృత్యం చేయాలి. నా కథలు వినాలి. వినిపించాలి. ఈ విధంగా దినంలో కొంత భాగం సంసార భ్రమలు మమకారాలు మమతులు మరచి నా భక్తిలో లీనం కావటం భక్తుల విధి.

ప్రాచీన ఋషుల ద్వారా గాని, ఆధునికుల ద్వారాగానీ, కూర్చబడిన స్తో గ్రంధాలు చదివి నన్ను ప్రార్థన చేయాలి. ' హే భగవాన్! నాపై ప్రసన్న దృక్కులు ప్రసరింపజేయండి. నన్ను తమ కృపా ప్రసాదంతో పవిత్రం చేయండి' వంటి ప్రార్థన చేయాలి. ఆ తరువాత భగవత్ప్రతిమ ముందు సాష్టాంగ దండ ప్రమాణాలు చేయాలి.

ఆ నమస్కారం చేయునపుడు శిరస్సు స్వామి పాదాలపై ఆనించి రెండుచేతులు కుడిచేయి ఎడమచేయి వెనుకకు విరిచి పట్టుకొని అట్లే కాళ్ళ మెలికలేసి స్వామిని ఇలా వేడుకోవాలి - ప్రభూ! నేను ఈ సంసార సాగరంలో మునిగిపోతున్నాను. మృత్యు మకరం నన్ను మ్రింగబోతోంది. భయపడి నిన్ను వేడుతున్నాను. నన్ను కాపాడు స్వామీ! అంతర్యామీ! ఈ విధంగా స్తుతించి నా నిర్మాల్య మాలికను శిరస్సుపై ధరించాలి. అది స్వామి స్వయంగా ప్రసాదించినట్లు తలంచాలి. మాలను విడువ వలసినపుడు దైవ ప్రతిమ నుండి ఒక దివ్య జ్యోతి వచ్చినా హృదయజ్యోతిలో కలిసింది అని భావించాలి.

ఉద్ధవా! ప్రతిమాదులపై భక్తి కలిగిందంటే నా పూజలు ఆ ప్రతిమ యందు చేయాలి. నేను సర్వత్ర ఉండి భక్తుల హృదయగతులు తెలుసుకొంటుంటాను. నేను అన్ని రూపాలలో ఉంటాను. నేను సర్వాత్మనా సమస్త చరాచరాలలో ఉంటాను. భక్తుల హృదయాలలో నివాసం నాకు ప్రియం.

ఉద్ధవా! ఈ విధంగా వైదిక తాంత్రిక క్రియో యోగం అనే పూజా విధానం ద్వారా నా పాదార్చన చేయువారు ఈ లోకం పరలోకంలో కూడా స్వామి వలన అభీష్టసిద్ధి పొందుతున్నారు. ఉపాసకులు తమ తమ శక్తి సామర్థ్యం అనుసరించి స్వామికి సుదృఢమైన పూజా మందిరం కట్టించుకొని నా ప్రతిమ స్థాపించి పూజాదులు నిర్వర్తిస్తుండాలి. దేవాలయంలో పూలతోటలు పెంచి పూవులు పూజకుపయోగించుకోవాలి. పర్వదినాలలో ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుచుండాలి.

దేవాలయాలలో నిత్యోత్స వపక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ, కల్యాణోత్సవ పర్వోత్సవ కైంకర్యాదులు సదా జరుగుటకు మాన్యాలిచ్చు దాతలు, గ్రామాలు అగ్రహారాలు దానలిచ్చు రాజులు మహా ఐశ్వర్యవంతులై పుణ్యలోకాలు పొందుతారు. నా మూర్తిని ప్రతిష్ఠించు ఉదారులు ఏకచ్ఛత్రాధి పత్యం పొందుతారు. దేవాలయ నిర్మాణ దాతలు త్రిలోకాలలోకి అధిపతులౌతారు. పూజాదులకు వ్యవస్థను ఏర్పరుచువారు బ్రహ్మలోకం జేరుకొంటారు. వీరు నాతో సమానభోగాలు అనుభవిస్తారు.

నిష్కామంగా నన్ను అర్చించువారు నా భక్తి యోగం పొంది నన్ను పొందుతారు. భగవదర్పిత సంపత్తులు భక్తుల సంపదలు అక్రమంగా హరించువారు మట్టిలో పురుగులై జన్మిస్తారు. ఇట్టి దేవపూజా కార్యాదులకు సహాయపడేవారు ప్రేరణ చేయువారు ఆమోదం తెలిపేవారు మరణించిననూ పుణ్య ధన భాగం పొందుతారు. ఈ దేవ కార్యాలలో తమ చేయి అధికంగా తోడ్పడినచో అధిక ఫలం ప్రాప్తిస్తుంది.

పరమార్థయోగం

శ్రీకృష్ణ పరమాత్మ పరమార్థం బోధిస్తున్నాడు -

ప్రియ ఉద్ధవా! పరమబంధూ! పరమార్థం విను. వ్యావహారిక దృష్టిలో లోకంలో పురురుషుడు ప్రకృతి లేక ద్రష్ట దృశ్యం అని రెండుగా కనిపిస్తుంటాయి. కానీ పరమార్థ దృష్టితో చూచిన ఇదంతా ఒకటే అధిష్ఠాన రూపం. కాబట్టి దేనినీ మంచి అని చెడ్డ అని విమర్శించరాదు. శాంతుడు మూఢుడు అని తలంచరాదు. ఆ దృష్టితో ఈపని స్తవనీయం ఈ పని నిందనీయం అనరాదు. సర్వాన్నీ సర్వదా అద్వైత భావంతోనే చూడాలి.

ఇతర స్వభావాలను కర్మలను ప్రశంశించటం నిందించటం చేయువారు యథార్థ పరమార్థ సాధనం నుండి జారిపోయిన వారవుతారు. పరమార్థ సాధనం ద్వైతభావాన్ని సత్యత్వ బుద్ధినుండి నిషేధిస్తుంది. ప్రశంస కానీ నిందగానీ భ్రమను బలపరుస్తుంది. ఉద్ధవా! ఇంద్రియాలన్నీ రాజస అహంకారం కలవే. ఇంద్రియాలు నిద్రావస్థలో ఉన్నపుడు

శరీర అభిమాన జీవుడు చైతన్య శూన్యుడౌతాడు. అంటే అతనికి బాహ్య శరీర స్మృతి ఉండదు. అపుడు మనసు ఒక్కటే పనిచేస్తుంటుంది. అది కలలు కంటుంది. కలలు కల్లలే కదా! కలలులేని గాఢ నిద్రలో ఉన్నాడంటే మృత్యు సమానుడే. అదే సుషుప్తి. అలానే జీవుడు తన అద్వితీయ ఆత్మ స్వరూపాన్ని మరచి లౌకిక వస్తు దర్శనం చేస్తున్నాడు. మేలుకొని కలలు కంటున్నట్లు ఊహా పోహల్లో విహరిస్తుంటాడు. లేక అజ్ఞానంలో మృత్యు సమాన తమోదశలో లీనమవుతాడు.

యథార్థంగా ద్వైతం అనే వస్తువే లేదు. ద్వైతభావం లేనపుడు ఇది మంచిది ఇది చెడ్డది అనే ప్రశ్నే ఉదయించదు. విశ్వంలో వస్తువులన్నీ వాక్కుతో చెప్పబడుతున్నాయి. మనస్సుతో ఆలోచించబడుతున్నాయి. కనుక దృశ్యం అనిత్యం. మిథ్యత్వంతో కనిపిస్తుంది.

ఉద్ధవా! ప్రతిబింబంలోనూ ప్రతిధ్వనిలోనూ, ముత్యపు చిప్పలలోనూ మిథ్యా రజతం భాసిస్తుంటుంది. అది పూర్తిగా మిథ్యయే. కానీ వాని వలన మనుష్య హృదయంలో భయకంపనాదులు సంచారం చేస్తాయి. అలానే శారీరక వస్తువులన్నీ మిథ్యా భూతాలే. కానీ వాటిని జ్ఞానం ద్వారా అసత్య మిథ్యలని భోధకానంత వరకూ అజ్ఞానులను భయ భ్రమలు కలిగిస్తునే ఉంటాయి. ఉద్ధవా! ఏదైతే ప్రత్యక్ష లేక పరోక్ష వస్తువో అది ఆత్మయే. అట్టి ఆత్మ సర్వశక్తి యుక్తమైనది. విశ్వసృష్టిగా ప్రతీకమైనది. నిమిత్త కారణమైనది అదే. ఉపాదాన కారణం కూడా ఇదే. ఇదే విశ్వం అవుతుంది. ఇదే విశ్వాన్ని తయారుచేస్తుంది. ఇదే రక్షకం. ఇదే రక్షితం. సర్వాత్మ భగవంతుడే. సృష్టి కర్తలయకర్త. సృష్టి ఆయనే. విశ్వమే ఆయన. ఆయనే విశ్వం. వ్యవహార దృష్టికి ఆత్మ విశ్వంకంటే భిన్నమైనది అనిపిస్తుంది. ఆత్మదృష్టితో చూచిన ఆత్మకు భిన్నం మరొకటి లేదు. ఆత్మకు అన్యంగా కనిపించే దానికి నిర్వచనం లేదు. ఆత్మ అనిర్వచనీయమైనది. కనుక ఆత్మలో సృష్టి స్థితి లయాలు ఆధ్యాత్మిక ఆధిదైవిక ఆధి భౌతికం అనే త్రివిధాలుగా భాసించేవి సర్వథా నిర్మూలాలే. ఇవి లేకపోయినా ఉన్నట్లుగా అనిపిస్తాయి. ఈ సత్త్వ రజస్తమాలుగా భాసించే ద్రవ్య దర్శన దృశ్యాలు త్రైగుణ్య మాయా నాటకాలు.

ఉద్ధవా! నీకు జ్ఞాన విజ్ఞాన స్థితి వర్ణించి చెప్పాను. నా యీ తత్త్వజ్ఞాన రహస్యం తెలుసుకొన్నవాడు ఉత్తమయోగియై ఎవరినీ నిందించడు. ప్రశంసించడు. అతడు సూర్యుని వలె సర్వ సాక్షియై సమభావంతో విశ్వంలో విహరిస్తాడు. ప్రత్య అనుమాన శాస్త్ర ఆత్మానుభూతి గల సిద్ధుడై ప్రకాశిస్తాడు. జగత్తు ఉత్పత్తి వినాశ శీలం కనుక అనిత్యం అసత్యం. ఈ విషయం తెలుసుకొని జగత్తులో అసంగ భావంతో మనీషి అద్వైత అఖండ మూర్తిగా జీవనం పావనం చేసుకోవాలి.

ఉద్ధవుడు ఇలా అడిగాడు - స్వామీ! ! ఆత్మ ద్రష్ట. దేహం దృశ్యం. ఆత్మ స్వయంప్రకాశ జ్యోతి . దేహం జడపదార్ధం. కాబట్టి ఈ జనన మరణ చక్ర సంసారం శరీరానికీ కాదు ఆత్మకీ కాదు. ఇది దేనికో ఒక దానికి చెందవలసియున్నది కాదా! దేనికి అంటారు?

ఆత్మ అవినాశి. ప్రాకృత అప్రాకృత గుణ రహితం. అది శుద్ధ నిర్మల స్వరూపం స్వయం ప్రకాశ భాసురం. ఆవరణ రహితం. దేహం వినాశ సహితం. అశుద్ధం అప్రకాశం. ఆవరణయుతం. త్రిగుణ కలితం. ఆత్మ అగ్ని వంటిది. దేహం కట్టె వంటిది. ఆత్మ చేతనం. దేహం అచేతనం. కనుక ఈ జనన మరణ సంసారం దేనిది?

కృష్ణ భగవానుడు ఆత్మానాత్మలను గూర్చి వివరిస్తున్నాడు - ఉద్ధవా ! ఈ ప్రపంచానికి అస్తిత్వం లేదు. దేహేంద్రియ ప్రాణాలతో ఆత్మ సంబంధం ఒక భ్రాంతి. ఇది అజ్ఞానులకు యధార్ధం అన్నట్లు తోస్తుంది. స్వప్నంలో విపత్తులు కలిగినట్లు అనిపిస్తుంది. కలకరిగిపోగానే ఆ విపత్తులే ఉండవు. వాస్తవంగా ఏ విపత్తి లేదు. స్వప్నం ఉన్నంత వరకే ఆ భాధలు. అట్లే సంసారం ఒక స్వప్న వంటిది. వాస్తవంగా స్వప్నం లేనట్లే సంసారమూలేదు. బాధలు పడుతున్నట్లు అనిపిస్తుంది.

ఇది జననమరణ సంసార నివృత్తి కానంతవరకే ఈ వ్యధలు బాధలు. స్వప్నంలో నిద్ర మెలకువ రానంతవరకువిపత్తులుంటాయి.మెలకువ వచ్చినంతనే అవి విడిపోతాయి. స్వప్నావస్థలోని బాధలు దుఃఖాలు మోహాలు విపత్తులు ఎగిరిపోతాయి. ఉద్ధవా! శోక హర్ష భయ క్రోధ లోభమోహాలు అహంకారం యొక్క ప్రతిరూపాలే సుమా! ఆత్మకు వీనితో సంబంధం లేదు. జనన మరణాదులు అనాత్మ అవస్థలు.

ఉద్ధవా! జాగ్రత్తగా అవగాహనం చేసుకో.దేహేంద్రియ ప్రాణ మానసాల్లో ఉన్నది ఆత్మయే. ఆత్మ ఈ దేహేంద్రియాలపై అభిమానం వహించి ఉన్నపుడు లేక అవే తనరూపం అని తలంచినపుడు ఆత్మయే జీవుడు' అని పేరు వహిస్తుంది. ఆ సూక్ష్మాతి సూక్ష్మ ఆత్మయే గుణకర్మలతో కూడిన లింగ శరీరం. దానినే సూత్రాత్మ' లేకీ మహత్తత్వం' అంటారు. దానికింకా అనేక నామాలున్నాయి. అదే కాలరూపం వహించి ఈశ్వరాధీనమై జనన మరణాత్మక సంసారంలో అటు ఇటూ తిరుగుతూంటుంది.

వాస్తవానికి ఈ పనులు ఆత్మవికావు. ఈ పనులు మనోవాక్ప్రాణ శరీర అహంకారాలవి. ఆత్మ నిర్మూలం. అయితే దేవమానవ ఆది అనేక రూపాలలో ఆత్మ ఉన్నట్లు అనిపిస్తుంది. మననశీలుడైన మానవుడు ఉపాసన అనే శానం మీద జ్ఞానం అనే కత్తిని

నూరి నూరి బాగా పదునుపెట్టి పరిశీలన చేస్తాడు. ఆ జ్ఞాన ఖడ్గంద్వారా దేహాభిమానం అహంకారం నిర్మూలనం గావించుకొని ద్వంద్వ రహితుడై ప్రకాశిస్తాడు. అట్టి మహోజ్జ్వల మానవాత్మలో మరల ఏవిధమైన ఆశాపాశాలు తృష్ణాది వికారాలు ప్రవేశించలేవు.

ఉద్ధవా! ఆత్మ అనాత్మ స్వరూప స్వభావాలు వేరువేరుగా గుర్తించటమే జ్ఞానం. వివేకం మిక్కిలిగా కలిగితే ద్వైతభావం నశిస్తుంది. తపస్సుద్వారా హృదయ శుద్ధిగావించుకొని వేదాదులు శ్రవణం చేసి ఆచరణలో పెట్టుటే సాధనం. ఇవేకాక సూక్తులు ఉపదేశాలకు అనుకూలంగా స్వానుభూతి దీనికి ప్రమాణం. వీటి మొత్తంయొక్కసారం యేమనగా ఈ సంసారానికి ఆదిలో ఉన్నది అంతంలో ఉండేది దీని మూలకారణం. ప్రకాశ జ్యోతి అద్వితీయం. అది ఉపాధిశూన్యం అయిన పరమాత్మ వీటి మధ్య ఉన్నాడు. పరమాత్మకాక మరొక వస్తువే లేదు.

ఉద్ధవా! లోకంలో బంగారంతో మురుగులు గొలుసులు సొమ్ములు రకరకాలు చేయించి అలంకరించుకొంటారు. ఈ ఆ భూషణాలు చేయించక ముందున్నది బంగారమే. ఎప్పుడుండేది బంగారమే. కనుక మధ్యలో ఆ భూషణాల ఆకారం ధరించింది. కొన్నాళ్ళుండి భూషణాకారాలు పోయాయి. బంగారం బంగారమే. అట్లే జగత్తు ఆదిలో మధ్యలో అంతంలో నేను నేనుగా ఉన్నాను.జగన్నాటకంలో రూపాలు మార్చుతూ వస్తుంటాను.కనుక వాస్తవంగా నేనే సత్య తత్త్వ స్వరూపాన్ని. శాశ్వత నిత్య విరాజిత సత్యవస్తువును.

మనస్సుకు మూడు దశలున్నాయి. జాగ్రత్ స్వప్న సుషుప్తి. ఈ త్రిదశల కారణంగా త్రిగుణాలు సత్త్వ రజస్తమస్సులు. జాగృదావస్థలో మూడు భేదాలున్నాయి. ఒకటి అధ్యాత్మం ఇంద్రియాలు అధిభూతం పంచభూతాలు అధిదైవం కర్త. ఈ అన్నీ త్రివిధాలు. ఇవి సత్యంవలె భాసిస్తాయి. సమాధులయందు త్రివిధాలు లేకపోయినా వాటి సత్తా ఉంటూనే ఉంటుంది. తురీయ తత్త్వం ఈ త్రివిధాలుకు అతీతంగా ఉంటుంది. ఈ నాల్గింటిలో లీననమై అంతర్భూతంగా ఉండే నాల్గవ తత్త్వమే బ్రహ్మతత్త్వం. అదేసత్యం.

ఉద్ధవా! ఉత్పత్తి కంటెముందులేదు. ప్రళయం తర్వాత లేదు. మధ్యలో మాత్రం ఉన్నది లేదు. అదికేవలం కల్పనామాత్ర. నామమాత్రం. పదార్థం దేనితో తయారవుతుందో దేనిద్వారా ప్రకాశితమవుతుందో అదే వాస్తవిక సత్య స్వరూపం. అదే పరమార్థ సత్తా. ఇది నా దృఢ నిశ్చయం.

ఇది వికారయుత రాజసనృష్టి. ఇది లేకపోయినా కనిపిస్తుంది. ఇది స్వయం ప్రకాశబ్రహ్మం. కనుక ఇంద్రియాలు విషయాలు మనస్సు పంచభూతాలు మొదలైనవి

చిత్రవిచిత్ర నామరూపాలు అన్నిటి రూపంలో బ్రహ్మమే ప్రతిబింబిస్తుంటాడు. శ్రవణ మనన నిది ధ్యాసన స్వానుభూతులే బ్రహ్మ విచార సాధనలు. సహాయకాలు. వీటిద్వారా సాధనలు సాగించి స్పష్టంగా దేహాది అనాత్మ పదార్థాలను నిషేధించాలి. ఈ నిషేధం ద్వారా ఆత్మవిషయక సందేహాలను ఛిన్నాభిన్నం చేసి తన ఆనంద స్వరూప ఆత్మలో మగ్నం కావాలి. అన్ని విధాలా విషయ వాసనలను తుడిచి వేసుకోవాలి.

అనాత్మ నిరోధానికిగాను విచారణ ఇలా చేయాలి. పృధ్వీవికార సహితమైనదీ శరీరం. అంటే మృణ్మయం కనుక ఇది ఆత్మకాదు. ఇంద్రియాలు వీటికి అధిష్టాన దేవతలు అయిన ప్రాణ జల అగ్ని మనస్సు కూడా ఆత్మకావు. వీటి పోషణ శరీరంతో సమానంగానే జరుగుతున్నాయి. అన్నంద్వారానే ఇవి పని చేస్తున్నాయి కనుక ఇవి ఆత్మలు కావు. బుద్ధి చిత్తం అహంకారం ప్రకృతి ఆకాశాది శబ్దాది విషయాలు గుణసామ్యం గలవి కనుక ఇవి కూడా ఆత్మ కావు. ఇవి అన్నీ దృశ్యాలు జడాలు. అని భావన చేస్తుండాలి.

నా స్వరూప స్వభావాలు పూర్తిగా తెలిసిన జ్ఞానం ఉన్నపుడు ఇంద్రియాలు వృత్తులు సమాహితమైపోతాయి అపుడువాటివల్ల లాభమూలేదు లేక విక్షిప్తమై పోతాయి వాటి వలన నష్టమూ లేదు. అంతః కరణం బాహ్యకరణం రెండూ గుణమయాలే. ఆత్మతో వీటికి సంబంధంలేదు. ఆకాశంలో మేఘాలు గాఢంగా క్రమ్మినా లేక విడివిడిగా పోయినా సూర్య భగవానునికి వచ్చే లాభం ఏమిటి? నష్టం ఏమిటి?

ఆకాశాన్ని వాయువు ఎండించలేదు. నిప్పు కాల్చలేదు. జలం తడపలేదు. ధూళి మురికి చేయలేదు. ఋతువులు తమ తమ గుణాలను చూపలేవు ఇవి అన్నీ వస్తూపోతూండే క్షణికాలు. భావావేశాలు. ఆకాశం ఈ అన్నిటికి అధిష్టాన దైవం ఏకైక పతి. ఆ విధంగానే సత్త్వ రజస్తమోగుణ వృత్తులు కర్మలు గుణాలు అవినాశి ఆకాశాన్ని స్పర్శించలేవు. ఆకాశం వీటి అన్నిటికి అతీతమైనది. వీటి ద్వారా కేవలం ప్రపంచంలో ఉంటుంది. వీటికి అహంకార బలం కలుగజేస్తుంది.

కాబట్టి ఈ మాయానిర్మిత గుణాలతో కార్యాలతో సంబంధం వదులుకోవాలి.నా భక్తి ద్వారా కూడా ఒక్కసారిగా మనస్సు కంటిన రజోగుణ మలం పోదు. క్రమక్రమంగా అభ్యాసం ద్వారా విచారణ ద్వారా భక్తి యోగబలం వల్లనే ఆ మలం పోగలదు.

ఉద్ధవా! రోగానికి చికిత్స పూర్తిగా చేయక పోతే రోగం సమూలంగా నాశనం కాక మాటిమాటికి సెలవేసి నానా బాధలు పెడుతుంది. అలానే మనోవాసనలు కర్మసంస్కారాలు యోగికి మరలమరల అడ్డుతగులుతుంటాయి. భార్యా పుత్రాదులపై ఆపేక్షలు సిద్ధి పొందని యోగిని యోగభ్రష్టుని చేస్తుంటాయి.

దేవతాదుల ద్వారా ప్రేరితులై శిష్యులు పుత్రులు మొదలైన వారిచేత చేయబడిన విఘ్నాలవలన ఒకవేళ యోగి సగంలోనే యోగమార్గచ్యుతుడైనచో మరల అతడు యోగం అభ్యాసం చేసి సఫలుడవుతాడు. ఆ యోగికి కర్మాదులపై మనస్సు పోదు. జీవ సంస్కారాదుల వలన ప్రేరితుడై జన్మనుంచి మృత్యువు వరకు కర్మకలాపంలోనే ఉంటే వారికి ఇష్టాలు అనిష్టాలు వికారాలు హర్షాలు విషాదాలు బుద్ధిననుసరించి కలుగుతుంటాయి. కానీ తత్త్వ సాక్షాత్కారం పొందిన యోగి ప్రపంచ ప్రకృతిలో ఉన్నప్పటికీ, సంస్కారానుసారం కర్మలు చేస్తున్నప్పటికీ, అతనిలో ఇష్ట అనిష్ట బుద్ధి హర్ష శోకాలతో కూడిన వికార యుక్తంకాదు. అతనికి పూర్వమే సంసార సంబంధమైన ఆశాపాశాలు తృష్ణాదులు నశించి పోతాయి. ఆనందస్వరూప ఆత్మసాక్షాత్కార ఫలంగా అతడు నిర్మలుడై యుంటాడు.

తన ఆత్మస్వరూపంలో సుస్థితుడై యున్న యోగికి శరీరం నిలబడిందా! కూర్చుందా! నడుస్తోందా! నిద్రిస్తోందా! మలమూత్ర విసర్జన చేస్తోందా! భోజనం చేస్తోందా! లేక మరోపనిలో నిమగ్నమై ఉందా! అనే ధ్యాసే ఉండదు. అతని ప్రవృత్తి ఆత్మ స్వరూపంలో సుస్థితమై బ్రహ్మాకారంలో నిమగ్నమై ఉంది.

ఉద్ధవా! జ్ఞాని దృష్టిలో ఇంద్రియాది వివిధ బాహ్య విషయాలు అసత్ పదార్థాలైనా వస్తుంటాయి. జ్ఞాని వాటిని కూడా ఆత్మకు భిన్నంగా అనుకోడు. అవి యుక్తులకు ప్రమాణాలకు స్వానుభూతులకు సిద్ధంగా ఉండవు. నిద్ర విడిపోయిన మీదట స్వప్నంలో చూచిన వాటికి, మేల్కొన్న తదుపరి తిరోహిత పదార్థాలకు సత్యత్వం సిద్ధించదు. అట్లే జ్ఞాని తనకు భిన్నంగా కనిపించే పదార్థాలను సత్యం అనుకోడు.

ఉద్ధవా! అజ్ఞాని ఆత్మను త్యాగం చేస్తాడు. జ్ఞాని దానిని గ్రహిస్తాడు. ఇంతే దీని తాత్పర్యం అనుకొంటారేమో! అట్లు కాదు. అనేక గుణాలతోనూ కర్మలతోనూ కూడిన దేహేంద్రియాది పదార్థాలు మొదట అజ్ఞానం కారణంగా, ఆత్మతో అభిన్న పదార్థాలుగా భావించటం జరిగింది. వాటికి వివేకమే లేదు కదా! ఇపుడు ఆత్మ దృష్టి కలిగిన తదుపరి అజ్ఞానం అజ్ఞాన కార్యాలు నివృత్తి అయినాయి. కనుక అజ్ఞాన నివృత్తియే అభీష్టం. వృత్తులద్వారా ఆత్మను పొందనూ లేము. త్యజించనూలేము.

సూర్యుడు ఉదయించగానే మానవుల కళ్ళెదుట అంధకారం తెర తొలిగి పోతుంది. అంతే క్రొత్తది ఏదీ ఆవిర్భవించదు ఆ విధంగానే నా స్వరూపం యొక్క అపరోక్ష జ్ఞానంగల పురుషుల బుద్ధి గత అజ్ఞానఆవరణం అంతరించి పోతుంది. అపరోక్ష జ్ఞానం ఈ రూపం కంటే మరో వస్తువును గూర్చిన అనుభవం పొందటంలేదు.

ఉద్ధవా! ఆత్మ నిత్యం అపరోక్షం. అది ఎక్కడినుంచో వచ్చి ఎదుట పడటం లేదు. అది స్వయంప్రకాశం. దానిలో అజ్ఞానాది వికార భావాలు లేవు. అది జన్మరహితం. అంటే అది ఏవిధవమైన వృత్తి లోనుండి రావటంలేదు. కనుక అది అప్రమేయం. జ్ఞానాదులద్వారా అది ఏమీ సంస్కరింపబడలేదు. ఆత్మలో దేశకాల వస్తుకృత పరిచ్ఛేదాలు లేవు. ఈ కారణంగా అది నిష్కలంకం నిరంజనం. దీనికి అస్తిత్వం, వృద్ధి, పరివర్తనం, తరిగిపోవుట, నాశనమగుట, అనే గుణాలు లేనేలేవు. ఇవి ఆ ఆత్మను స్పర్శించనైనా స్పర్శించజాలవు. అన్నిటి అనుభూతులు ఆత్మస్వరూపాలే. మనోవాక్కులు ఆత్మకు తనది అవిషయం అనుకొని నివృత్తి అయినపుడు అది సజాతీయ విజాతీయ స్వగత భేదాలు లేక ఒక అద్వితీయ పదార్థమై ఉండిపోతుంది. వ్యవహారిక దృష్టిలో ఆత్మ స్వరూప స్వభావాలను వాణి నిరూపణ చేస్తుంది. ప్రాణాదులు అందుకై స్పందిస్తుంటాయి.

ఉద్ధవా! అద్వితీయ ఆత్మతత్త్వంలో అర్థహీన నామాలద్వారా అనేక విధాలని తలంచటం భ్రమ. లేక అజ్ఞానం. నిజంగా ఇదిపెద్ద మోహం. తన ఆత్మకాకఅన్యంగా భ్రమకు కూడా మరొక అధిష్ఠానం లేదు. అధిష్ఠాన సత్తాలో అభ్యస్త సత్తాయే లేదు. కనుక అంతా ఆత్మయే.

ఉద్ధవా! కొందరు పాండిత్యాభిమానులు ఈ ఆత్మ పాంచభౌతిక ద్వైతం . ఇది విభిన్న రూపాలు నామాలు గలది. రూప రూపాలను ఇంద్రియాలు ద్వారా తెలిసికోవచ్చు. మేము చెప్పే ఇది సత్యం.' అని భావిస్తారు. కాని అది అర్థహీన వాదం. వాగాడంబర వికారమే. తత్త్వత: ఇంద్రియాలకు పృథక్ అస్తిత్వమే లేదు కదా. అలాంటపుడు వారు దేనిని ప్రమాణంగా స్వీకరిస్తారు.

ఉద్ధవా! ఒక విషయం. యోగాభ్యాసం పూర్తి కాకముందే ఒకవేళ శరీర రుగ్మతులు కలిగినట్లైతే కొన్ని ఉపాయాలున్నాయి. వాటి ద్వారా వ్యాధులు నివారణ చేసుకోవచ్చు - అవి ఇవి శరీరం శీతోష్ణాలకు గురియై రుగ్మత కలిగినచో సూర్యచంద్ర ధారణం ద్వారానూ, వాతరోగాలకు వాయుధారణంతో కూడిన ఆసనాల ద్వారానూ, గ్రహాలు సోకిన సర్పం మొదలైన విష జంతువులు కరిచిన మంత్ర ఔషధుల ద్వారానూ, విఘ్నాలను విషప్రయోగాలను నివారణ చేసుకోవాలి. కామక్రోధాదులను నా చింతనం చేయటం - నామ సంకీర్తనం చేయటం ద్వారా శాంతి పరచుకోవాలి. పతనావస్థకు దారితీస్తే గర్వ మద దంభాలను మహా పురుషుల ఉపదేశాల ద్వారానూ విసర్జించాలి. మరికొందరు యోగులు వివిధ ఉపాయాల ద్వారా శరీర దృఢత్వానికి యవ్వనం స్థిరంగా ఉండటానికి అణిమాది సిద్ధులకై యోగ సాధనలు చేస్తుంటారు. కానీ వివేకం కలిగిన పెద్దలు వీనిని సమర్థించరు. ఇవి వ్యర్థ ప్రయాసలు మాత్రమే. చెట్టుపై పండిన ఫలాలు రాలకుంటాయా! అట్లే శరీరాలు.

చాలా రోజులు యోగసాధనలు చేసి శరీరాన్ని బలిష్టం చేసి సాధనలు వీడి అంతటితో తృప్తి పడాలి. నిరంతరం నా ప్రాప్తికై సాదన చేస్తుండాలి. నా ఆశ్రయం పొంది చెప్పిన యోగసాధన చేస్తుండే యోగికి విఘ్న బాధలు కలుగనే కలుగవు. అతనికి వాంఛలే దూరమైపోతాయి. అతడు ఆత్మానంద సాంద్ర అనుభూతి సముద్రంలో మగ్న మానసుడై యుంటాడు.

భాగవత ధర్మాలు

ఉద్ధవుడు అరవిందాక్షుని ఇలా ప్రార్థించాడు -

"అచ్యుతా! యోగసాధనలు చక్కగా వివరించారు. కానీ అవి మనస్సు వశంలో ఉంచుకో కలిగిన వారికి కదా ఉపయోగం. మనస్సును స్వాధీన పరచుకోలేని వారికీ యోగాలు మిక్కిలి కష్టం అని నా అభిప్రాయం. కనుక తమరేదైనా సరళమూ సులభమూ సుగమమూ అయిన సాధనం చెప్పండి. నేటి మానవులకు అనాయాసంగా పరమపదం ప్రాప్తించాలి. నేటి వారు కడుసుకుమారులు. అల్పులు.

ఓ కమలాయతలోచనా! అధికాంశయోగులు మనస్సును , ఏకాగ్రంగా నిలబెట్ట ప్రయత్నించియునూ సఫలత్వం పొందలేక ఓడిపోతున్నారు. మనోవశం కాని కారణంగా ఓటమి పొంది విలపించ సాగినారు.

పుండరీకాక్షా! తమరు విశ్వేశ్వరులు. తమ ద్వారా నకల ప్రపంచం నియమానుసారంగా నడవ కల్గుతోంది. ఇందువలన వివేక వంతులైన మానవ ప్రముఖులు తమ ఆనంద దాయక అంఘ్రి పద్మాలను శరణు జొచ్చుతున్నారు. అట్టి శరణం పొందిన వారు అనాయాసంగా సిద్ధిపొందుతున్నారు. మాయ భక్తులైన మానవులను ఏమీ చేయలేకున్నది. వారిక యోగసాధనలు సిద్ధులు కర్మ అనుష్ఠానాలు అభిమాన ఆడంబరాలు మొదలైన గర్వాతిశయాలు లేవు. కానీ తమ పాద సేవా తత్పరులు కానివారు యోగులైనా కర్మిష్ఠులైనా గర్వ అంధకారంలో పడి పతనమై పోతున్నారు. తమ చేతిలోని మాయ ఆ మతి మంతుల మతిని మట్టి గరపిస్తున్నది.

ప్రభూ ! సర్వ జన హితైషులు. సుహృదులు. మహోదారులు. తమరు తమ శరణాగతి పొందిన బలిచక్రవర్తి మొదలైన సేవకుల ఇంటిముందు కాపలాగా పనిచేసారు. ఇంతేకాదు రామావతారంలో నరులకంటె అల్పులైన వానరులతో మైత్రి చేసి నిరాడంబరత చూపారు. వస్తుతః తమ పాద పద్మాలపై ప్రణమిల్లుటకు బ్రహ్మ మహేశ్వరాదులు వరుసలలో నిలిచి అవకాశం కొరకు తహతహ లాడు తుంటారు.

లక్ష్మీ రమణా! జగన్నాథా! తమరు ప్రాణికోటికి పరమ ఆప్తులు. అధిపతులు. ఆత్మ స్వరూపులు. తమరు తమనిజ భక్తవర్యులుకు సర్వమూ ఇస్తుంటారు. బలి ప్రహ్లాదాది భక్తులకు ప్రసాదించిన మహత్వ పదాన్ని ఎరిగిన అల్పులైనను తమరిని ఎవరు విడిచిపెట్టి ఉండగలరు? విచారణ శీలురైన కొందరు ఏలకో విస్మృతిలోపడి తుచ్ఛ విషయ వాసనల చిక్కుకొని భోగాలు కోరుతుంటారు. ఇది బుద్ధి కందని విషయం. స్వామీ! సర్వాంతర్యామీ! మేము తమ పాద పద్మ రజోలేశ ఉపాసకులము. మాకు దుర్లభం ఏమి ఉన్నది. మా స్వామి కరుణ మాకు పుష్కలంగా ఉన్నది. ఇంకేమి కావాలి.

స్వామీ! తమరు సమస్త ప్రాణుల అంతః కరణంలో అంతర్యామివై బాహ్యంలో పరమదేశికాచార్యుడవై వారి పాపాలను పటాపంచలు చేస్తున్నారు. తమ వాస్తవిక రూపాలను భక్తులకు సాక్షాత్కరింపజేసి తరింప జేస్తుంటారు. గొప్ప గొప్ప బ్రహ్మజ్ఞానులు బ్రహ్మదేవుని నుండి బ్రహ్మాయువు పొంది కూడా తమరు చేసే ఉపకారాలకు తగినంతగా సేవలు కృతజ్ఞతలు ప్రకటింప జాలకున్నారు. ఇందువలన వారు తమ ఉపకారాలు స్మరించి స్మరించి క్షణ క్షణం అధికాధిక ఆనందం అనుభవిస్తున్నారు.

శ్రీ శుక మహర్షి ప్రవచనం చేస్తున్నాడు - పరీక్షిద్రాజా! భగవాన్ శ్రీ కృష్ణదేవుడు బ్రహ్మాదులుకు ఈశ్వరేశ్వరుడు. ఆయనే సత్త్వ రజస్తమగుణాల ద్వారా బ్రహ్మ విష్ణు రుద్ర రూపాలు దరించి జగదుత్పత్తి స్థితిలయ క్రీడలు సలుపుతున్నాడు. ఉద్ధవుడు ప్రేమతో అనురాగంతో అడుగగా కృష్ణదేవుడు మందహాసం చేసి మహా ప్రేమతో ఇలా పలుక సాగాడు.

ఓ ప్రియమైన బాంధవా! ఉద్ధవా! ఇపుడు నీ మనోగత భావాలకు అనుకూలంగా మానవులకు మంగళం కలిగించు భాగవత ధర్మాలు చెప్తాను. వాటిని మనుష్యులు శ్రద్ధగా ఆచరిస్తూంటే సంసార మృత్యువును అనాయాసంగా జయించకల్గుతారు. ఇందు సందేహం లేదు. విను.

ఉద్ధవా! నా భక్తులు ప్రతి కార్యాన్ని నా కొరకే చేస్తుంటారు. అన్నీ నాకే అర్పిస్తుంటారు. అలా అభ్యాసం చేసుకొని ఆ పనులు చేసేటపుడు నా స్మరణాన్ని అధికం చేస్తారు. మరికొంత కాలానికి వారి మనస్సు చిత్తం నాలో సమర్పితమవుతాయి. మనస్సు ఆత్మ నా ధర్మ కార్యాలలో రమిస్తుంటాయి. నా భక్త వరేణ్యులు నివసించే చోట గల దేవ అసుర మనుష్య జాతులు నా అనన్య భక్తుల కార్యాచరణం వలన వారు కూడా ప్రభావితులై భక్తులట్లే నిత్య కార్య మాలను అనుసరించి పునీతులవుతారు.

మహా పర్వ దినాలలో అందరితో పాటుగానీ విడి విడిగా గానీ నా నృత్యగాన వాద్యాది గోష్ఠులలో మహారాజుల వలె పాల్గొని మహోత్సవాలు నిర్వహిస్తారు. శుద్ధాంతః

కరణ పురుషులు ఆకాశం వలె సమస్త ప్రాణి కోటులలో దర్శించి తన్మయులవుతారు. ఈ సమస్త ప్రపంచాన్ని తన హృదయంలో వసించునట్లుగా భావనచేసి దర్శించి అనుభవించి ఆనందం పొందుతారు.

ఉత్తమ భక్తా! ఉద్ధవా! ఉత్తమ సాధకుడు ఈ జ్ఞాన దృష్టి గలవాడై ప్రాణులందరిలోనూ పదార్థాలలోనూ నాయొక్క దర్శనం చేసుకొనీ ఆనందిస్తాడు. సమస్త ప్రాణులను సర్వ పదార్థాలను నా రూపాలుగా తలంచి మిక్కిలి గౌరవిస్తుంటాడు. అభిమానంతో ఆదరంతో గౌరవంతో పూజ్య భావంతో నమస్కరిస్తుంటాడు. అతని దృష్టిలో బ్రాహ్మణులు చండాలురును పూజనీయులే. చోరులు వీరులు ఆదరణీయులే. సూర్యుడు మిణుగురు పురుగు వారికి స్తవనీయులే. కృపాళువు క్రూరుడు సమాన గౌరవం పొందుతారు. అట్టి సమదృష్టి గల భక్తుడే ఉత్తమోత్తమ జ్ఞాని అని తలంచుము.

నిరంతరం నరనారీమణులందరిలోనూ నన్నే భావన చేయగా అతనికి కొంత కాలంలోనే సమదృష్టి అలవడి అతని మనసులో నుండి ఈర్ష్యాద్వేషాలు అహంకార తిరస్కారాలు క్రోధ అసూయలు మొదలైన దుర్గుణాలు దూరమైపోతాయి. ఉద్ధవా! నా ప్రియ భక్తులు సమదృష్టి అలవడినవారు ఎవరు నవ్వి పరిహసించినా లెక్కచేయడు. నవ్వితే నవ్వనీ అనుకొంటాడు.' నేను బాగా ఉన్నాను. నేను మొరటుగాయున్నాను' అనే దేహ సంబంధమైన అందచందాలకు, లోకులు చేసే పరిహాసాలకు గౌరవాలకు విలువనీయడు. కుక్కకానీ, చండాలుడు కానీ, ఆవుకానీ గాడిద కానీ కనిపిస్తే ఈ జీవిలో కూడా దేవుడే ఉన్నాడని తలంచి తలవంచి ప్రణమిల్లుతాడు. భక్తులు సమస్త ప్రాణులలో నాభావం, అంటే భగవద్భావం గుర్తించి వర్తించే వరకూ మనో వాక్కాయ సంకల్ప కర్మల ద్వారా నా ఉపాసననుగావిస్తుండాలి.

ఉద్ధవా! ఈ ప్రకారమైన ఆత్మబుద్ధి - 'సర్వం బ్రహ్మాత్మక అనే బ్రహ్మబుద్ధిని అభ్యాసం చేస్తుంటాడో అపుడు ఇక కొద్ది దినాలలోనే అతనికి జ్ఞానం కలిగి సర్వత్ర బ్రహ్మ సాక్షాత్కారం కల్గుతుంది. అది కల్గిన తర్వాత సర్వ సందేహాలు సంశయాలు సమసిపోతాయి. అట్టి భక్త శిఖామణి నా దర్శనం పొంది సంసార దృష్టి నుండి విశ్రాంతి పొందుతాడు.

నా ప్రాప్తికి ఎన్ని సాధనలున్నాయో! ఆ అన్నిటిలో సమస్త ప్రాణులు మరి పదార్థాలు మనోవాక్కాయ వృత్తులలో నా భావనం చేస్తూ నన్నే స్మరించుట యొక్కటే సర్వ శ్రేష్ఠమైన సాధనమని నా నిశ్చితాభిప్రాయం ఉద్ధవా!

ఇదే నా భాగవత ధర్మం. ఈ ధర్మం ప్రారంభించిన తదుపరి ఇసుమంత కూడా తేడా లేకుండా ధర్మ నిర్వహణ చేయాలి. ఇది విశిష్ట ధర్మం. నిష్కమం. నిర్గుణం. ఇది స్వయంగా నాచేత ప్రబోధించబడింది. కనుక ఇది సర్వోత్తమం. ఇదే నా భాగవత ధర్మంలో ఏదైనా ఒక లోపం జరిగితే ఈ ధర్మ సాధకుడు భయపడటం శోకించటం బాధ పడటం కూడా నా ప్రాప్తి కోసం నిష్కామ భావంతో నాకే సమర్పించాలి. ఆ లోపాలు ఆవేదనలు పశ్చాత్తాపాలు కూడా నా ప్రసన్న కరుణా కటాక్షం వలన భాగవత ధర్మాలై పరిగణింపబడతాయి.

వివేకవంతులు తమ వివేకంతో చతురులు తమ చాతుర్యంతో ' ఈ శరీరం వినాశ శీలమైనది అసత్యమైనది' అని గుర్తించి ఈ శరీరం ఉన్నప్పుడే ఈ శరీరం ద్వారానే అవినాశి సత్య తత్త్వ పరంజ్యోతినైన నన్ను పొందుటకు ప్రయత్నం చేసి కృతార్థులు కావాలి. ఉద్ధవా! ఈ సంపూర్ణ బ్రహ్మ విద్యా రహస్యం నేను నీకు సంక్షేపంగానూ, విస్తారంగాను వినిపించాను. ఈ రహస్య విద్యను తెలుసుకొనటానికి ఋషులకు ఎవరు చెప్పారు? ఎవరూ చెప్పలేదు. దేవతలకు కూడా ఈ విద్య అత్యంత కష్టం. దుర్లభం దుర్గమం. నేను అది నీకే చెప్పాను.

నేను సుస్పష్టంగా యుక్తియుక్తంగా జ్ఞాన భరితంగా వర్ణించి చెప్పాను కదా! దీని మర్మాన్ని తెలుసుకొన్నవాడు తన హృదయంలో సంశయ గ్రంథులను నాశనం చేసుకో గల్గుతాడు. శీఘ్రంగా ముక్తి పొందుతాడు. నేను నీ ప్రశ్నలకు విస్తారంగా వివరంగా సమాధానం చెప్పాను. ఈ మన ప్రశ్న సమాధానాలను చదివి తాత్పర్యం ఎవడు గ్రహిస్తాడో అతడు వేద పరమ తత్త్వ రహస్యాన్నీ తెలుసుకొని పరబ్రహ్మ మూర్తిని పొందకల్గుతాడు. ఎవరైతే నా భక్తులకు దీనిని విస్పష్టంగా సులభంగా తెలియచెపుతారో ఆ జ్ఞాన దాతను నేను సుప్రసన్న హృదయంతో స్వరూపం చూపి హృదయంలో స్థానమిస్తాను. అతనికి ఆత్మజ్ఞానం అనుగ్రహిస్తాను.

ఉద్ధవా! ఈ నాడీ సంవాదం పరమ పవిత్రమైనది. ఇతరులను కూడా పవిత్ర భూతులను చేయునది. దీనిని ప్రతి దినం పఠించువాడు ఇతరులకు వినుపించువాడు. ఈ జ్ఞాన దీపంతో నన్ను ఇతరులకు చూపుతున్నాడు కనుక అతడు కూడా పవిత్రీ భూతుడవుతున్నాడు.

దీనిని శ్రద్ధగా ఏకాగ్ర చిత్తంతో వినువాడు నా పరా భక్తి పొంది కర్మ బంధాలు త్రెంచుకొని ముక్తుడవుతాడు. ఉద్ధవా! ప్రియసఖా! నీవు బ్రహ్మ స్వరూపం చక్కగా తెలుసుకొన్నావు కదా! నీ చిత్త మోహ శోకాలు పోయాయి కదా! ఉద్ధవా! ఈ బ్రహ్మ విద్యను నీవు డాంబికులకు, నాస్తికులకు, శఠులకు, శ్రద్ధలేని వారికీ, భక్తిలేని వారికీ ఉద్ధతులకు ఎప్పుడు చెప్పకు.

ఈపై చెప్పిన దోషాలు లేని వారికీ, బ్రాహ్మణ భక్తులకు, ప్రేమగల వారికి, సాధు పురుషులకు, పవిత్ర చరిత్రులకు, ఈ ప్రసంగాలు వినిపించు స్త్రీ శూద్రులు నా యెడల శ్రద్ధా భక్తి కలిగినవారైతే వారికి ఈ ఉపదేశాలు చెప్పు

దివ్యామృత పానం చేసేవాడు అడుగున కొంచం కూడా విడిచి పెట్టనట్లు ఈ జ్ఞానమృతం గ్రోలే జిజ్ఞాసువుకు తెలుసుకోవలసింది మరొకటి ఏదీ లేదు. ప్రియ సఖా! మనుష్యలకు జ్ఞానం వలన మోక్షం, కర్మ వలన ధర్మం, యోగం వలన కాంక్షలు వాణిజ్యం వలన అర్థం రాజ దండం వలన అధికారం ప్రాప్తిస్తుంటాయి కానీ నీ బోటి అనన్య భక్తవర్యులకు ఆ నాల్గువిధాల ఫలం కేవలం నేనే

సమస్త కర్మలు మనుష్యుడెపుడు త్యజిస్తాడో, సర్వం నాకు సమర్పణ గావిస్తాడో, అపుడు అట్టి ఉత్తముడు నాకు అత్యంత ఆత్మీయ మాననీయ భక్త తల్లజుడవుతాడు. అతనిని జీవత్వం నుండి విడిపించి అమృతత్వం అయిన మోక్ష పదవి లభిస్తుంది. అతడు నన్ను జేరి నా స్వరూపం ధరిస్తాడు.

శ్రీ శుకదేవుడిలా చెప్పసాగాడు-

రాజా! ఇపుడు ఉద్ధవుడు యోగ మార్గాన్ని పూర్తిగా తెలుసుకొన్నాడు. శ్రీ కృష్ణదేవుని మాటలు విని అతని కనుల నీరు నిండాయి ప్రేమ ప్రవాహం వలన కంఠం అవరుద్ధమయింది. చేతులు జోడించి నిశ్శబ్దంగా పలుకులురాక నిలబడిపోయాడు. అతని చిత్తం ప్రేమావేశంతో విహ్వలించింది ఎట్లో ధైర్యం తెచ్చుకొని అత్యంత సౌమ్యంగా సౌజన్యంగా తలవంచి యదు వంశ శిరోమణి పాదపద్మాలు స్పర్శించి ఉద్ధవుడు ఇలా ప్రార్థించసాగాడు.

ప్రభూ! భగవాన్! నీవు మాయకూ, బ్రహ్మానికీ అధిపతివి ఈ రెంటికీ మూల కారణ భూతుడవు. నేను మోహాంధకారంలో పడి కొట్టు మిట్టాడుతున్నాను నీ సత్సంగంచే ఆ మాయ దూరంగా పారిపోయింది. అంధకారం విచ్చిపోయింది. అగ్నిహోత్రం ముందుజేరి కూర్చుంటే శీత అంధకారాలు దగ్గరికి జేరకల్గుతాయా! అవి వస్తాయనే భయముంటుందా!

హే కృష్ణ భగవాన్! నీ మోహినీ మాయ నా జ్ఞాన దీపాన్ని లాగి పారేసింది. కానీ నీ కరుణా కటాక్ష కారణంగా నీ సేవకునికి మరల జ్ఞాన జ్యోతి కాంతి వర్షం కురిసింది. ఇట్టి నీ కృపా ప్రసాదం అనుభవించి నీ చరణ కమలాలలను వదిలి పెట్టే మూర్ఖుడు ఉంటాడా! పరుల ఆశ్రయించే అవివేకి ఉంటాడా?

నీ మాయాజాలం చేత సృష్టి వృద్ధిసేయుటకు దాశార్హ, వృష్ణి, అంధక, సాత్యవత వంశీయాదవులతో పాటు నన్ను కూడా స్నేహ పాశంతో బంధించావు. నేడు నీవు ఆత్మ బోధం అనే పదునైన ఖడ్గంతో ఆ బంధనాలను అనాయాసంగా త్రెంచివేశావు.

ఓ మహా యోగేశ్వరా! నీకు నా శత కోటి ప్రణతులు. ఇపుడు నీవు కృపవహించి ఈ శరణాగతునికి నీ చరణారవిందాలపై సదా నిలుచు అనన్య భక్తి కలుగునట్లు వరం ప్రసాదించు.

ఉద్ధవ బదరి కాశ్రమ ప్రయాణం

శ్రీ కృష్ణభగవానుడు ఈ విధంగా ఓదార్చి చెప్పాడు -

ఉద్ధవా! ఇపుడు నీవు నా ఆజ్ఞను అనుసరించి బదరికావనం వెళ్లు. ఉద్ధవా! అది నా ఆశ్రమమే. అక్కడ నా చరణ కమలాలు కడిగిన గంగా జలంతో స్నానపానాదులు చేస్తూ నీవు పవిత్రుడవై చరించు. అలకానందను దర్శించి నంతమాత్రం చేత నీ పాపా తాపాలు అన్నీ హతమైపోతాయి. నీవు అక్కడ వృక్ష చర్మాలు ధరించు. వనంలోని కందమూలాలు తిను. ఏమీ భోగాలు ఆపేక్షించకు. నిస్పృహ వృత్తిలో నీలో నీవు ఆనందమగ్నుడవై యుండు. శీతోష్ణాలు సుఖ దుఃఖాలు ఏవి వచ్చినా సమదృష్టి సమభావంతో సమచిత్తుడవై సహించు. నీ స్వభావం సదా సౌమ్యంగా ఉండాలి. ఇంద్రియాలు వశంలో ఉంచుకో. చిత్తం శాంతంగా ఉంచు. బుద్ధి సమాహితంగా ఉండాలి. నీవు నా స్వరూప జ్ఞానం అనుభవిస్తూ ఆనందంలో మునిగిపో. నేను నీకు ఏ శిక్షణ ఇచ్చానో దానిని ఏకాంతంలో విచారణ పూర్వకంగా యోచించి అనుభవానందం పొందు. నీ వాక్కు చిత్తం నాలో కలుపు. నే చెప్పిన భాగవత ధర్మంలో నిలిచి ప్రేమలోరమిస్తూపో. చివరకు నీవు త్రిగుణాలు గుణ బంధ గతి విధులు త్యాగంచేసి వాటికి దూరంగా ఉండే నాపరమార్థ స్వరూపంలో లీనమైపో.

శుక మహర్షి ఇలా పురాణ ప్రవచనం చేయసాగాడు -

పరీక్షిద్రాజా! భగవాన్ శ్రీ కృష్ణ పరమాత్మ స్వరూప జ్ఞానం సంసార భేద భ్రమను మటుమాయం చేస్తుంది. శ్రీ కృష్ణుడు ఉద్ధవునకుపదేశం చేసిన తదుపరి ఉద్ధవుడు కృష్ణ భగవానుకి ప్రదక్షిణించి నమస్కారం చేసుకొన్నాడు.

ఉద్ధవుడు ఇపుడు పూర్తిగా సంయోగ వియోగాలు సుఖదుఃఖాలు శీతోష్ణాలు ఈ మొదలైన భయమోహాల నుండి దూరమైనాడు. కృష్ణపాదాశ్రయంలో తన్మయుడైనాడు.

అచటి నుండి ప్రయాణమై వెళ్ళ బోతుండగా ఉద్ధవ అంతరాత్మ ప్రేమావేశంతో పెల్లుబికింది. అశ్రుధారలతో శ్రీ కృష్ణ దివ్య పాద పద్మాలతో అభిషేకించాడు. పరీక్షిన్మహా నృపా! ఉద్ధవా హృదయస్థితి అనిర్వచనీయం. కృష్ణదేవుని వియోగం అతడు సహింప జాలకున్నాడు. వియోగం అనుకుంటేనే ఆతడు వణికి పోతున్నాడు. కృష్ణుని విడిచి వెళ్ళటం అసంభం అనిపిస్తోంది. ఈ తలంపునకు శరీరం మూర్ఛపోతోంది. అయినా భగవదాజ్ఞ. అణువంత కూడా అతిక్రమించరానిది. కృష్ణ పాదులకు ప్రణామాలు చేసి మరల మరల స్వామికి సాష్టాంగ దండ నమస్కారాలు చేస్తూ వెళ్ళ లేక వెళ్ళ లేక అతి కష్టం మీద కన్నీరు తుడుచుకొంటూ వెళ్ళాడు.

దారి పొడుగునా కృష్ణ దేవుని తలుస్తూ హృదయంలో కృష్ణదేవుని దివ్యకాంతిని అనుభూతం చేసుకొంటూ బదరికాశ్రమం చేరుకొన్నాడు. అక్కడ తపోమయ దివ్య జీవనం గడిపి భగవానుని ఉపదేశానుసారంగా పరమగతి పొందాడు.

శంకరాది యోగేశ్వరులు శ్రీకృష్ణ చరణార విందాలను పూజించారు. వారు కృష్ణ చరణార విందాలను పూజించారు. వారు కృష్ణ ఉపదేశామృతాన్ని ఉద్ధవుని ద్వారా విని భక్తులకు ప్రబోధం చేయసాగారు. ఈ ఉపదేశం ఆనంద సాగర సారం. శ్రద్ధగా ఇది పానం చేసిన వాడు ముక్తుడవుతాడు. ఈ భక్తుల ఉపదేశంతో జగత్తు పవిత్రీ భూతమవుతుంది.

భ్రమరాలు వివిధ పుష్పాల నుండి మధువు తెచ్చి తేనెను తయారు చేసినట్లు భగవానుడు వేదసారం తీసి సంసార ముక్తికై ఈ జ్ఞానామృతం సిద్ధం చేశాడు. స్వామి జరారోగ భయనివృత్తికై క్షీర సాగరం నుండి అమృతం గొనివచ్చాడు. దానిని క్రమంగా తన యొక్క ప్రియ భక్తులలో నివృత్తి మార్గీయులకు ప్రవృత్తి మార్గీయులకు తనివితీరా త్రాగించాడు.

ఆ శ్రీ కృష్ణ పరబ్రహ్మ. పురుషోత్తమ స్వామి. ఆ భగవంతుడు. సర్వ జగత్తునకు మూల పురుషుడు. మూల కారణ భూతుడు. అట్టి స్వామి సర్వాంతర్యామి పాద పద్మ ద్వయానికి సాష్టాంగ వందనాలు శ్రద్ధా భక్తులతో ఆచరిస్తున్నాను.



సర్వం శ్రీ కృష్ణ పరబ్రహ్మార్పణమస్తు !!!

శ్రీ సత్యసాయీశ్వరాష్టకము

"శాంతిశ్రీ"

ఈశ్వరాంబా సుతం సత్యం నిత్య మంగళ కారిణమ్
వేంకావధూత సంప్రీతం వందే సాయిం జగద్గురుమ్ !

తులసీదళ సంకాశం యోగి మానస పూజితమ్
సర్వమానవ సందేశం వందే సాయిం జగద్గురుమ్ !

హరినీల జటాజూటం పూర్ణచంద్ర నిభాననమ్
భక్తలోక చిదాభాసం వందే సాయిం జగద్గురుమ్ !

ఆర్తత్రాణ వ్రతాధారం వ్యోమకేశ విరాజితమ్
యశశ్చంద్ర ప్రభావ్యోమం వందే సాయిం జగద్గురుమ్ !

రత్నాకర సముద్భూతం కాషాయాంబర ధారిణమ్
ఆనందకోశ సంచారం వందే సాయిం జగద్గురుమ్ !

ప్రేమామృత పయోరాశిం విశ్వకల్యాణ కారిణమ్
శాంతి సత్య సమాహారం వందే సాయిం జగద్గురుమ్ !

ప్రశాంతి నిలయావాసం బాలభాస్కర సన్నిభమ్
ఆశ్రిత జనమందారం వందే సాయి జగద్గురుమ్!

విశ్వ విద్యాలయ వ్యాప్తం నిగమాగమ సేవితమ్
సత్యం శివం చ సౌందర్యం వందే సాయిం జగద్గురుమ్ !

సాయీశ్వరాష్టకం పుణ్యం నిత్యం మనసి యః పఠేత్
జన్మాంతరకృతం పాపం వినశ్యతి న సంశయః !

UDDHAVA GEETA

❁ శాంతిశ్రీ రచనలు ❁

జ్యోతిర్మయి
త్యాగమయి
ఉదాహరణత్రయి
హాసు ముష్మండలి
సుందర మందారం
నారదభక్తి దర్పణం
తియ్యనిపాటల తిరుప్పావై
అర్చన
శ్రీ శివానందలహరి
విశ్వ సౌందర్యలహరి
భాగవత సప్తమ స్కంధ వ్యాఖ్య
శ్రీ విష్ణు సహస్ర కమలము
శ్రీ సనత్సు జాతీయము
శ్రీ సత్యసాయి సుధావాక్కులు
మయూర క్రేంకృతి
అష్టావక్ర సంహిత
శాంతి బాల
ఈశ్వర విశ్వరూపము
రామ సూర్యారాధన
భక్తిరసాయనము
హృదయ పుష్పాలు
శ్రీ సత్యసాయి సమర్చన
త్వరలో..........
తపోవనం (శ్రీ సత్యసాయి విశ్వపారాయణ గ్రంథం)
శ్రీ సత్యసాయి పురాణము

❁ డా॥ జంధ్యాల సుమన్‌బాబు రచనలు ❁

ఆంధ్ర సాహిత్యంలో జంటకవులు
గర్గ భాగవతము - శ్రీ కృష్ణ కథామృతము
కరుణశ్రీ కవితా సౌరభము
శ్రీ కృష్ణుడు శ్రీ సత్యసాయి
నామస్మరణ విశిష్టత
మాతృశ్రీ ఈశ్వరమ్మ
త్వరలో ....
ఆఫ్రికాలో శ్రీ సత్యసాయి